ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 7-8-2025 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 359 | రూ. 6-50 పేజీలు 14 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



వైకాపా నిర్బంధాల నుంచి

'మల్లవల్లి'కి విముక్తి

ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

150 మంది పారిశ్రామికవేత్తలకు అందిన ప్లాట్లు

ఈనాడు, అమరావతి: జగన్ జమానాలో భూకేటాయింపుల రద్దు నోటీసులు.. ధర ఐదు రెట్లు పెంపు వంటి నిర్బంధాలను ఎదుర్కొన్న చిన్న పారిశ్రామికవేత్తలకు ఊరట లభించింది. కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామిక పార్కులో ప్లాట్లు పొందేందుకు 8 ఏళ్లుగా నిరీక్షించిన 377 మంది చిన్న పారిశ్రామికవేత్తలకు విక్రయ ఒప్పందాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం మొదలుపెట్టింది. ఇప్పటికే 150 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఈ నెల 15లోగా మిగిలిన వారికీ పూర్తి చేయనున్నారు. వారికి పాత ధర ప్రకారమే (ఎకరా రూ.16.5 లక్షల చొప్పున) అధికారులు (మిగతా 2లో)

15 నుంచి స్త్రీశక్తి పథకం

నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్

- త్వరలో నేతన్నలకు రూ.25వేలు
- సెలూన్లకు ఉచిత విద్యుత్ మరో 50 యూనిట్ల పెంపు
- నూతన బార్ పాలసీ.. లాటరీ ద్వారా బార్ల కేటాయింపు
- మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పాల్గొన్న మంత్రులు, సీఎస్

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం.. 'స్త్రీశక్తి'ని ఈ నెల 15 నుంచి ఆరంభించడానికి, నేత కార్మికులకు మేలుచేసేలా మూడు పథకాలు గురువారం నుంచే అమలుచేసేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి పెద్దఎత్తున ఐటీ సంస్థలు వచ్చేలా ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్ పాలసీ (4.0)కి ఆమోదం తెలపగా.. దీనికింద ప్రముఖ ఐటీ సంస్థలకు ఎకరా 99 పైసలకే భూములు కేటాయించేలా నిర్ణయించింది. నూతన బార్‌పాలసీ, రోడ్లపై బహిరంగంగా మద్యం తాగకుండా.. మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతివ్వడం వంటి పలు నిర్ణయాలను మంత్రివర్గం తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అవి..

కుటుంబానికి నెలకు రూ.వెయ్యి మిగులు

మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి 'స్త్రీశక్తి' అనే పేరుకు ఆమోదం. మంత్రి లోకేశ్ చొరవతోనే రాష్ట్రస్థాయిలో ఐదురకాల బస్సుల్లో అమలుకానుంది. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.వెయ్యి మిగులు. ఆటోడ్రైవర్లకు సాయం చేయడంపై.. సంబంధిత సంఘాలతో చర్చించాలని సీఎం సూచించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నుంచి మూడు పథకాల అమలుకు నిర్ణయం. నేతమగ్గాలకు 200 యూనిట్లు, (మిగతా 2లో)

అపరిచితులతో ఫొటోలు దిగేటప్పుడు జాగ్రత్త

మంత్రులకు సీఎం దిశానిర్దేశం 12లో

జిల్లాలు, మండలాల్లో మార్పుచేర్పుల ప్రక్రియ అక్టోబరుకల్లా పూర్తవ్వాలని ఆదేశం



భారత్‌పై సుంకాల బండ

50 శాతానికి పెంచిన ట్రంప్

'రష్యా చమురు'పై ప్రతీకారం

పాత 25% సుంకాలు నేటి నుంచి అమల్లోకి..

అదనపు 25% ఈ నెల 27 నుంచి.. ● అన్యాయమన్న భారత్

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొనొద్దన్న తన హెచ్చరికలను పట్టించుకోని భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగించారు. భారత్ దిగుమతులపై ఇప్పటికే 25% సుంకాలను విధించిన ఆయన. . దానిని 50 శాతానికి పెంచారు. అదనంగా జరిమానా, సుంకంగా దీనిని పేర్కొంటూ.. బుధవారం కార్యనిర్వాహక ఉత్తర్వుపై ఆయన సంతకం చేశారు. గతంలో ప్రకటించిన 25 శాతం సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వస్తాయి. కొత్తగా విధించిన అదనపు 25% సుంకాలను ఈ నెల 27 నుంచి అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. రష్యా నుంచే చమురును దిగుమతి చేసుకుంటున్న చైనా, తుర్కియేలపై మాత్రం ఎటువంటి అదనపు భారాన్ని మోపలేదు. చైనాపై 30 శాతం, తుర్కియేపై 15 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి.

ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. భారత్ నుంచి ఎగుమతయ్యే అతి కొద్ది వస్తువులకే ఈ అధిక సుంకాల నుంచి మినహాయింపు ఉంది. కొత్తగా విధించిన 25 శాతం సుంకం.. ఇప్పటికే ఉన్న డ్యూటీలు, పన్నులు, ఫీజులు, ఛార్జీలకు అదనమని (మిగతా 2లో)

తలొగ్గని భారత్!

అమెరికా బెదిరింపులపై వేచి చూసే ధోరణి 2లో

నగరాలకు సవాల్

"భారతదేశంలో 2020 నాటికి 48 కోట్ల జనాభా నగరాలు, పట్టణాల్లో ఉంటే, 2050 నాటికి 95.1 కోట్లు, 2070 నాటికి 110 కోట్లకు చేరే అవకాశముంది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా పట్టణాలను అభివృద్ధి చేయడానికి పెట్టుబడులను భారీగా పెంచాలి. లేకుంటే తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ప్రపంచ బ్యాంకు సీనియర్ కన్సల్టెంట్ అస్మితా తివారీ అభిప్రాయపడ్డారు. భారతదేశంలోని నగరాలపై వరదలు, తీవ్రమైన ఎండల ప్రభావం ఎక్కువగా ఉందని.. వచ్చే రెండు, మూడు దశాబ్దాల్లో ఈ రెండు సమస్యలు మరింత తీవ్ర రూపం దాల్చడమే కాదు నగరాలకు పెద్ద సవాళ్లుగా మారనున్నాయన్నారు. ప్రపంచ బ్యాంకులో సీనియర్ అర్బన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్టుగా పని చేస్తున్న అస్మిత ఈ అంశాలపై 'ఈనాడు'కు ఇంటర్వ్యూ ఇచ్చారు.



అస్మితా తివారీ

ముఖాముఖిలోని ముఖ్యాంశాలు.. 12లో

భారత్‌లో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని నగరాలు అభివృద్ధి చెందడానికి ఏం చేయాలని ప్రపంచ బ్యాంకు ఓ నివేదికను రూపొందించింది. 2022 నుంచి 2025 మే వరకు ఈ అధ్యయనం జరిగింది. అస్మితా, నాట్సుకో కికటకేలు ఈ నివేదికను రూపొందించారు.



ప్రతికూల వాతావరణంలో గాలింపు

ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న అన్వేషణ

రెండు మృతదేహాల వెలికితీత

గల్లంతైనవారిలో 11 మంది సైనిక సిబ్బంది 2లో

వరదల కారణంగా ఉత్తరాఖండ్‌లోని ధరాలీ గ్రామంలో పేరుకుపోయిన బురద



ఆ విషయాలు అందరికీ తెలియనక్కర్లేదు

పనిలో మీ తదుపరి ప్రణాళికలేంటి.. సెలవుల్లో ఎక్కడికి వెళ్లబోతున్నారు.. మీరు ఎవరెవరితో స్నేహబంధం కొనసాగిస్తున్నారు.. ఇలాంటివి అందరికీ తెలియనక్కర్లేదు. కొన్ని విషయాలు గోప్యంగా ఉంటేనే బాగుంటుంది. వాట్సాప్ గ్రూపుల్లో, ఇతర సామాజిక మాధ్యమాల్లో అన్నీ పంచుకుంటూ మీ ప్రశాంతతను కోల్పోకండి. వ్యక్తిగత విషయాలను బయటకు చెప్పకపోవడమంటే మీరు దాక్కుంటున్నట్లేమీ కాదు.. మిమ్మల్ని మీరు కాపాడుకుంటున్నట్లు!

– జయ్ శెట్టి, పాడ్‌కాస్టర్

వైకాపా నిర్బంధాల నుంచి 'మల్లవల్లి'కి విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇక్కడ వందల చిన్న పరిశ్రమల ఏర్పాటుతో రెండేళ్లలో రూ.800 కోట్ల పెట్టుబడులు, 7 వేల మందికి ఉపాధి లభించనుంది.

విధ్వంసం నుంచి.. పారిశ్రామిక వికాసం దిశగా

2017లో తెదేపా ప్రభుత్వం కృష్ణా జిల్లా మల్లవల్లిలో 1,400 ఎకరాల్లో భారీ పారిశ్రామిక పార్కును ప్రతిపాదించింది. పారిశ్రామికవేత్తలకు ఎకరా రూ.16.5 లక్షల చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. భూసేకరణ, ఇతర ప్రక్రియలు పూర్తయ్యేసరికి సాధారణ ఎన్నికలు రావడంతో ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ నిలిచింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా భూముల ధరలు పెంచి చిన్న పారిశ్రామికవేత్తలను ఇబ్బందులు పెట్టింది. 2020లో ఎకరా రూ.65 లక్షలుగా కొత్త ధర నిర్ణయించింది. ఆ తర్వాత దాన్ని రూ.89 లక్షలకు పెంచింది. పెంచిన ధరల ప్రకారం చెల్లించాలంటూ గత తెదేపా ప్రభుత్వంలో కేటాయింపులు పొందిన సుమారు 377 మంది పారిశ్రామికవేత్తలను ఇబ్బందులు పెట్టింది. 56 మందికి కేటాయింపులు రద్దు చేస్తున్నట్లు నోటీసులు పంపింది. దీనిపై 40 మంది పారిశ్రామికవేత్తలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు కేసుల ఉపసంహరణ తర్వాత వారికి రిజిస్ట్రేషన్ చేస్తామని అధికారులు తెలిపారు.

బ్యాంకు రుణాలకూ ఇబ్బందే

రిజిస్ట్రేషన్ పూర్తయినప్పటి నుంచి ఆరు నెలల్లోగా నిర్మాణ పనులు ప్రారంభించి, రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ నిబంధన. ఆ మేరకే విక్రయ ఒప్పందం రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పారిశ్రామికవేత్తల పేరిట భూములు బదిలీ కాకపోవడంతో బ్యాంకులు రుణాలివ్వడం లేదు. రిజిస్ట్రేషన్ పూర్తయినందున ఎన్వోసీ ఇస్తే దాని ఆధారంగా రుణాలు తీసుకోవాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.

● సుమారు 32 మందికి కేటాయించిన ప్లాట్లలో భారీ గుంతలు ఉన్నాయి. వాటికి ప్రత్యామ్నాయంగా మరోచోట ప్లాట్లు కేటాయించాలని లబ్ధిదారులు విన్నవిస్తున్నారు.

● సేల్ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ సమాచారాన్ని ముందు రోజు రాత్రి కాకుండా కనీసం రెండు రోజులు ముందుగా అందించాలని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పగలే పూర్తి చేయాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.

పైకా భవనాలు నిర్మిస్తామని మోసం

కాన్సెంటిన్ పూర్తి చేసిన శ్రేష్ఠ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్

ఈనాడు, అమరావతి: అన్ని వసతులతో పైకా (పంచాయత్ యువ క్రీడా ఔర్ ఖేల్ అభియాన్) కింద భవనాలు నిర్మిస్తామని ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని.. ఆ తర్వాత కాన్సెంటిన్ పూర్తిచేసిన తర్వాత కనిపించకుండా పోయిన శ్రేష్ఠ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓపై కేసు నమోదైంది. నిధులిచ్చినా గుత్త సంస్థ పనులు పూర్తిచేయలేదని, మిగిలిన నిధులు తిరిగివ్వలేదని శాప్ అధికారి ఎస్వీ రమణ ఫిర్యాదుపై విజయవాడలోని మాచవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇదే ఫిర్యాదును 2023 మార్చిలో హైదరాబాద్ సీసీఎస్‌లోని ఆర్థిక నేరాల విభాగంలోనూ దాఖలుచేశారు. ఇది తాజాగా.. హైదరాబాద్ సీసీఎస్ నుంచి ఏపీకి బదిలీ అయింది. కేసు వివరాలివీ..

రూ.3.36 కోట్లు ఇవ్వకుండా.. పత్తా లేకుండా..

మండల కేంద్రాలు, పంచాయతీల్లో క్రీడాభివృద్ధికి పైకా పథకంలో యూపీఏ హయాంలో భవనాలు నిర్మించారు. దీని కోసం పంచాయతీల్లో రూ.లక్ష, మండలకేంద్రాల్లో రూ.5లక్షలతో టెండర్లు పిలిచారు. ఇవి ఖరారయ్యేసరికి రాష్ట్ర విభజన జరిగింది. టెండర్లలో నెగ్గిన శ్రేష్ఠ ఇండస్ట్రీస్ శాప్‌తో ఒప్పందం చేసుకుంది. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, విజయనగరం జిల్లాల్లో 889 భవనాల నిర్మాణానికి రూ.10.46 కోట్లు ఖర్చుచేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.8.30 కోట్లు విడుదల చేసింది. గుత్త సంస్థ రూ.4.94 కోట్ల విలువైన భవనాలనే పూర్తిచేసింది. మిగిలిన పనులు చేయడంలో విఫలమైంది. మిగిలిన నిధులు తిరిగివ్వలేదు, శాప్‌కు లెక్కలు కూడా అందించలేదు. అప్పటి నుంచి సంస్థ సీఈఓ ఆచూకీ లభించకపోవడంతో అధికారులు ఫిర్యాదుచేశారు.

అమృతం పంచుతారిక్కడ!

● ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల తన చిన్నారికి అవసరమైన పాలు ఇవ్వగా.. మిగిలిపోయిన పాలు వృథా అవుతున్నాయి. తల్లిపాల దానం గురించి తెలుసుకున్న ఆమె వెంటనే సంబంధిత ప్రతినిధులను సంప్రదించారు. తన చిన్నారికి తాగించిన తర్వాత మిగిలిన పాలను సేకరించి ఆసుపత్రులకు అందించేవారు. ఇలా కొన్ని నెలల్లో ఆమె 30 లీటర్ల వరకు దానం చేసి తన అమ్మతనాన్ని చాటుకున్నారు.

● హైదరాబాద్‌కు చెందిన కీర్తికసరే తన చిన్నారికి పాలు పట్టగా.. ఇంకా మిగిలేవి. దీంతో తన పాలను ఇతర శిశువులకు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. గత ఏడాది కాలంలో దాదాపు 252 లీటర్లు నిలోఫర్, గాంధీ ఆసుపత్రులకు అందించారు.



వివిధ కారణాలతో చనుబాలు అందని శిశువులకు తల్లిపాల బ్యాంకులు వరంగా మారుతున్నాయి. కొందరు తల్లులు తమ పిల్లలకు సరిపోగా.. మిగిలిన పాలను ఇక్కడ దానం చేస్తున్నారు. అయితే ఎక్కడ ఇవ్వాలి..? ఎలా ఇవ్వాలి..? అనే విషయాలు చాలామందికి తెలియవు. ఇవిగో ఆ సందేహాలకు సమాధానాలు...

● నెలలు నిండకుండా, తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ), స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్సీయూ)లలో చికిత్స అందిస్తారు. వారికి సురక్షితమైన, పాశ్చరైజ్ చేసిన దాతల పాలను అందుబాటులో ఉంచడానికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర చనుబాల నిర్వహణ కేంద్రాలు (సీఎల్ఎంసీ), లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎల్ఎంయూ)లను ఏర్పాటుచేస్తోంది.

● రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ప్రతిపాదనలు పంపిస్తే జాతీయ ఆరోగ్య మిషన్ కింద సీఎల్ఎంసీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, అనంతపురం, భీమవరం, తెలంగాణలోని ఖమ్మం, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మదర్ మిల్క్ బ్యాంకులు నడుస్తున్నాయి.

● హైదరాబాద్‌లోని నిలోఫర్, గాంధీ, ఈఎస్ఐ లాంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ధాత్రి మదర్స్ మిల్క్ సంస్థ ఈ బ్యాంకులను నిర్వహిస్తోంది. సీఎస్ఆర్‌తోపాటు ఇతర దాతల నుంచి అందించిన సాయంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీటిని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 9,840 మంది తల్లులు తమ పాలను ఈ బ్యాంకులకు అందించారు. మొత్తం 3,800 లీటర్లు సేకరించి అవసరమైన చిన్నారులకు అందించినట్లు ధాత్రి సంస్థ ప్రతినిధి డాక్టర్ సంతోష్ తెలిపారు. ఇప్పటికే కొందరు సెలబ్రిటీలు.. ఉన్నతోద్యోగులు సైతం పెద్ద మనసుతో పాలను దానం చేస్తున్నారని చెప్పారు.

● విశాఖలోని కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకు సుషేన హెల్త్ ఫౌండేషన్ చొరవచూపింది. ఎంపిక చేసిన వైద్య కళాశాలల్లో సీఎల్ఎంసీ ఏర్పాటుకు ఇటీవల ఆ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

ఇవీ మార్గదర్శకాలు..

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అనారోగ్యంతో చేరిన నవజాత శిశువుల కోసం హ్యూమన్ మిల్క్ అందుబాటులో ఉండేలా.. సీఎల్ఎంసీ ఏర్పాటుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దాని ప్రకారం...

- నవజాత శిశువులకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలి.
- నెలలు నిండకుండా పుట్టిన, నీరసంగా ఉన్న శిశువులకు తల్లి సొంత పాలను సేకరించి, నిల్వ చేసి, అందించాలి. ఒకవేళ అమ్మపాలు అందుబాటులో లేకుంటే దాత పాలను పట్టించాలి. వైద్యుల ప్రిస్క్రిప్షన్ మేరకే ఇదంతా జరగాలి.
- వాణిజ్య అవసరాలకు తల్లిపాలను సేకరించకూడదు.

● విజయవాడలోని ఆంధ్ర ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సహకారంతో తల్లిపాల బ్యాంకు ఏర్పాటుచేశారు. ఇక్కడ మాతృమూర్తులు అందించిన పాలను పాశ్చరైజేషన్, కల్చర్ టెస్ట్ చేసిన తర్వాతే పిల్లలకు అందిస్తారు.

● దానం చేయాలనుకుంటే సమీపంలోని మిల్క్ బ్యాంకును సంప్రదించాలి. కొన్ని ప్రాంతాల్లో కేంద్రాల్లోనే సేకరిస్తుండగా.. మరికొన్ని మిల్క్ బ్యాంకుల నిర్వాహకులు ఇంటికే వచ్చి తీసుకుంటున్నారు.

- ఈనాడు, హైదరాబాద్, విశాఖపట్నం

పాలదానంతో రికార్డులు...

ఏకంగా 300 లీటర్ల తల్లిపాలను దానం చేసి ఇండియా, ఆసియా బుక్ ఆఫ్ రికార్డులకెక్కారు తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ఎం.సెల్వ బృంద. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

మాది తమిళనాడులోని తిరుచ్చి. పాప పుట్టిన సమయంలో నాకు పాలు బాగా పడటంతో 'ఆసుపత్రిలో చాలామంది శిశువులకు తల్లిపాలు అందడంలేదు. మీరేమైనా సాయం చేయగలరా?' అని అక్కడి వైద్యులు అడిగారు. వెంటనే ఒప్పేసుకున్నా. ఇంటికొచ్చాక కూడా ఆ పిల్లల పరిస్థితి గుర్తొస్తూ ఉండేది. ఇలాంటి పిల్లలకు పాలు అందించాలనిపించింది. 'అమృతం బ్రెస్ట్ మిల్క్ డొనేషన్ సంస్థ' సాయంతో నవజాత శిశువులకు పాలను అందించడం ప్రారంభించాను. ప్రభుత్వ ఆసుపత్రికి నేనిచ్చిన పాలను 1000 మందికి పైగా పిల్లలకు అందించినట్లుగా వైద్యులు సమాచారమిచ్చారు. ప్రతినెలా నేను ఎన్నిలీటర్ల పాలు ఆసుపత్రికిచ్చాననేది అక్కడి సిబ్బంది రిసీట్ ఇచ్చేవారు. 22 నెలల్లో మొత్తం 300 లీటర్ల పాలు దానమిచ్చానని తెలిసింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డులూ దక్కాయి. పాలిచ్చే సమయంలో రోజూ 3, 4 లీటర్ల నీళ్లు, గుడ్లు, ఓట్స్, పండ్లు, కూరగాయలు బాగా తీసుకునేదాన్ని. ఈ జాగ్రత్తల వల్లే ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పాలను దానం చేయగలిగా.

- ఈనాడు, చెన్నై

తలొగ్గని భారత్!

● అమెరికా బెదిరింపులపై వేచి చూసే ధోరణి ● రష్యా చమురు కొనుగోలును ఆపకపోవచ్చు!

ఈనాడు ప్రత్యేక విభాగం: రష్యా నుంచి చమురు కొనకుండా అనేక రకాలుగా అమెరికా ఒత్తిడి తెస్తున్నా భారత్ ఆవేశానికి లోనుకావడం లేదు. వేచిచూసే ధోరణినే అనుసరిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి రష్యా నుంచి వచ్చే చమురును ఇప్పటికిప్పుడు మనదేశం ఆపే అవకాశం లేదు. అలాగని అమెరికాతో కయ్యానికి కాలుదువ్వడానికీ సిద్ధంగా లేదు. ఏదైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని చూస్తోంది. అదే సమయంలో తన హక్కులను కాపాడుకోవడంలో ఏ మాత్రం సందేహించడం లేదు. ట్రంప్ విధిస్తున్న సుంకాలకు భయపడటం లేదు.

ఇప్పటిదాకా సమతూకం

అమెరికా, రష్యాలతో ఇప్పటిదాకా ప్రధాని నరేంద్ర మోదీ సమతూకాన్ని పాటిస్తూ వచ్చారు. తమ దేశం తటస్థంగా ఉంటుందని చాటేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగానే పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించినా.. భారత్ మాత్రం సంబంధాలను కొనసాగిస్తూనే ఉంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు తాను చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో ట్రంప్.. పుతిన్ మిత్ర దేశాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. తద్వారా ఏదో ఒక దేశంవైపు ఉండేలా ప్రధాని మోదీపై ఒత్తిడికి ప్రయత్నిస్తున్నారు.

ట్రంప్ అక్కసుకు కారణమిదేనా..

రష్యా నుంచి ఆయుధాలను, చౌకగా చమురును ఎప్పట్నుంచో భారత్ కొనుగోలు చేస్తోంది. ఉక్రెయిన్‌పై దాడులు చేస్తున్న రష్యాను అడ్డుకోవడానికి భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు చెబుతున్నా.. ట్రంప్ మదిలో మరో ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ఆయుధాలతోపాటు చమురును తమ నుంచి కొనుగోలు చేయాలనేది ఆయన ప్రణాళికగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

భారత్‌కు రష్యా చమురే ఎందుకు?

దేశంలో 140 కోట్లకుపైగా ఉన్న జనాభా అవసరాలను తీర్చడానికి భారత్ ఎప్పటి నుంచో రష్యా ముడి చమురును చౌకగా కొంటోంది. ప్రపంచంలో అత్యధికంగా చమురును వినియోగిస్తున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. 2030 కల్లా చమురు వాడకంలో చైనాను వెనక్కినెట్టే అవకాశముంది. దేశంలో ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతుండటంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. అనేక మంది కార్లు, ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్రో ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతోంది.

రష్యా అతి పెద్ద సరఫరాదారు

భారత్ చమురు దిగుమతుల్లో 36 శాతం రష్యా నుంచే వస్తోంది. ఈ కారణంగా ఆ దేశం భారత్‌కు అతి పెద్ద సరఫరాదారుగా ఉంది. భారత్‌కు చమురులో రష్యా భారీ రాయితీలు ఇస్తోంది. ఇతర దేశాలు ఈ స్థాయిలో ఇవ్వలేవు. తాము కేవలం వాణిజ్య, ఆర్థిక కోణంలోనే రష్యా చమురును చూస్తున్నామని భారత్ అంటోంది. ఇప్పటికిప్పుడు రష్యా నుంచి చమురు దిగుమతులను ఆపేస్తే భారత్‌లోని అవసరాలను తీర్చడం చాలా కష్టం.

80 శాతం దిగుమతులే..

భారత్ తన 80 శాతం చమురు అవసరాలను దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. ఒకవేళ ఒపెక్ దేశాలు.. తాము చమురును సరఫరా చేస్తామని హామీ ఇచ్చినా.. రాత్రికి రాత్రి 3.4 మిలియన్ బ్యారెళ్ల చమురును సరఫరా చేయడం కష్టమే.

● అందుకే అమెరికా ఒత్తిళ్లు తెచ్చినా రష్యా, ఇరాన్, వెనెజువెలాల నుంచి చమురు దిగుమతులను ఆపడానికి భారత్ సంశయిస్తోంది. ప్రస్తుతానికి ఇరాన్ నుంచి చమురు దిగుమతులను భారత్ చాలావరకు ఆపేసింది. అది తక్కువే కావడంతో పెద్దగా ఇబ్బంది లేదు.

సంప్రదాయ మార్గంలోనే..

ట్రంప్ డిమాండ్లకు భారత్ తలొగ్గే అవకాశం కనిపించడం లేదు. బదులుగా సంప్రదాయ మార్గంలో చర్చల ద్వారా ఆ దేశంతో సంబంధాలను కొనసాగించాలని చూస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతులను ఆపేస్తే వాటి ధరలు ఒక్కసారిగా పెరుగుతాయని భారత్ వాదిస్తోంది.



ఏ దేశంపై ఎంత సుంకం?

భారత్‌పై సుంకాలను పెంచుతూ ట్రంప్ బుధవారం కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశాక.. బ్రెజిల్‌తో కలిసి మన దేశంపైనే అత్యధిక సుంకాలను విధించినట్లయింది. ప్రస్తుతం ఏ దేశంపై ఎంత సుంకం ఉందంటే..

భారత్	50	కజికిస్థాన్	25
బ్రెజిల్	50	మాల్దోవా	25
సిరియా	41	బంగ్లాదేశ్	20
లావోస్	40	శ్రీలంక	20
మయన్మార్	40	తైవాన్	20
స్విట్జర్లాండ్	39	వియత్నాం	20
ఇరాక్	35	కంబోడియా	19
కెనడా	35	ఇండోనేసియా	19
సెర్బియా	35	మలేసియా	19
బోస్నియా అండ్ హెర్జ్‌గోవినా	30	పాకిస్థాన్	19
		ఫిలిప్పీన్స్	19
లిబియా	30	థాయ్‌లాండ్	19
దక్షిణాఫ్రికా	30	అఫ్గానిస్థాన్	15
మెక్సికో	25	సుంకాలు (శాతాల్లో)	

భారత్‌పై సుంకాల బండ

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులో పేర్కొన్నారు.

■ కొత్త సుంకాలను కలుపుకొంటే.. అత్యధిక సుంకాల బాధిత దేశాలైన బ్రెజిల్ సరసన భారత్ చేరనుంది. సుంకాల వల్ల భారత్ చేసే 86 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం పడనుంది.

50 శాతం సుంకాలు వీటిపైనే..: దుస్తులు, జెమ్స్, ఆభరణాలు, రొయ్యలు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, జంతు సంబంధ ఉత్పత్తులు, రసాయనాలు, విద్యుత్తు పరికరాలు, యంత్ర సామగ్రి.

ప్రస్తుతానికి ఉపశమనం వీటికే..

ఔషధాలు, ఇంధన ఉత్పత్తులు (క్రూడాయిల్, రిఫైన్డ్ ఇంధనం, సహజ వాయువు, బొగ్గు, విద్యుత్తు, కీలక ఖనిజాలు, సెమీ కండక్టర్లు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు, డ్రైవ్‌లు, ప్యానల్ బోర్డులు, సర్క్యూట్లు.

సహేతుకం కాదు: భారత్

అమెరికా అదనపు సుంకాలు సహేతుకం కాదని భారత్ అభిప్రాయపడింది. 'ఇది అనుచితం, అన్యాయం, అహేతుకం' అని స్పష్టంచేసింది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలకు కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని బుధవారం విదేశీ వ్యవహారాలశాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

■ అమెరికా సుంకాల విధింపు ఆర్థిక బ్లాక్ మెయిలేనని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. అనుచిత వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేలా భారత్‌పై ఒత్తిడి తేవడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రతికూల వాతావరణంలో గాలింపు

● ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న అన్వేషణ

ఉత్తర కాశీ: భారీ వర్షాలు, విరిగిపడుతున్న కొండచరియలు ఉత్తరాఖండ్‌లో సహాయక చర్యలకు సవాల్‌గా మారాయి. ధరాలీకి వెళ్లే రోడ్లన్నీ మూసుకుపోయాయి. డజన్ల మంది పర్యాటకులు పలుచోట్ల చిక్కుకుపోయారు. ఇళ్లు, హోటళ్లు, రోడ్లు కొట్టుకుపోవడంతోపాటు హర్సిల్ సైనిక స్థావరానికి చెందిన 11 మంది సైనిక సిబ్బంది సహా పలువురి ఆచూకీ తెలియడం లేదు. బుధవారం ధరాలీలో రెండు మృతదేహాలను వెలికితీయగలిగారు. మంగళవారం ఉదయం ఉత్తర కాశీ నుంచి గంగోత్రికి బయల్దేరిన 28 మంది కేరళ పర్యాటకుల బృందం ఆచూకీ తెలియకపోవడం తీవ్ర కలవరానికి కారణమైనా బుధవారం సాయంత్రం వారి ఆచూకీ తెలిసింది. బస్సుతో పాటు మార్గమధ్యంలో చిక్కుకుపోయి, ప్రాణాలతో సురక్షితంగానే వారు ఉన్నారని తెలిశాక యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. మూడు బృందాలను ధరాలీకి పంపామని, రోడ్లు మొత్తం ధ్వంసం కావడంతో వారు అక్కడికి చేరుకోలేకపోయారని ఎన్‌డీఆర్ఎఫ్ తెలిపింది. మంగళవారం 27 మి.మీ. వర్షపాతమే నమోదైందని, మేఘ విస్ఫోటానికి, మెరుపు వరదలకు దారితీసేంత తీవ్రత దీనికి లేదని నిపుణులు చెబుతున్నారు.

హిమాచల్‌లోనూ: హిమాచల్ ప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. కిన్నార్ కైలాశ్ యాత్ర నిలిచిపోయింది. వరదలకు వంతెనలు కొట్టుకుపోవడంతో 413 మంది యాత్రికులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు చేర్చారు.




ఉత్తరాఖండ్‌లోని ధరాలీలో సహాయక చర్యల్లో పాల్గొన్న సైనికులు ● వరద ప్రభావిత ప్రాంతం నుంచి స్థానికుడిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సైనికులు

15 నుంచి స్త్రీశక్తి పథకం

(మొదటి పేజీ తరువాయి)

మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్. సొసైటీల నుంచి ఆప్కో కొనేవాటికి జీఎస్టీపై 5% రాయితీ అమలు. చేనేత సహకార పరపతిసంఘాల థ్రిఫ్ట్‌ఫండ్ ఏర్పాటు. నేతన్నల అన్ని పథకాలకు ప్రభుత్వం రూ.648.59 కోట్లు కేటాయించింది. నేతన్న భరోసా కింద రూ.25వేల సాయం.

● హెయిర్ కటింగ్ సెలూన్లు నిర్వహించే నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ నెలకు 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచుతూ నిర్ణయం. 40,808 సెలూన్ల నిర్వాహకులకు లబ్ధి.

ఐటీ సంస్థలను రప్పించేలా..: రాష్ట్రానికి పెద్దఎత్తున ఐటీ సంస్థలు తరలివచ్చేలా ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్‌హబ్ పాలసీ (4.0) 2024-29కి ఆమోదం. ఫార్చ్యూన్-500 యూరప్, గ్లోబల్, ఫోర్బ్స్ గ్లోబల్ జాబితాలో ఉన్న ప్రముఖ ఐటీ సంస్థలు.. ఐటీ, ఐటీఈఎస్, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు ఏర్పాటుచేసేందుకు ఎకరా 99 పైసలతో భూములు కేటాయింపు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి.. ఇలా ఎక్కడైనా భూములు.

లాటరీ విధానంలో బార్ల కేటాయింపు: 2025-28 బార్ పాలసీకి ఆమోదం. 840 బార్లను లాటరీ విధానంలో కేటాయిస్తారు. ఒక్కో బార్‌కి కనీసం నాలుగు దరఖాస్తులు రావాలి. బార్లలో 10% కల్లుగీత కులాల వారికి కేటాయింపు. 50వేల వరకు జనాభా ఉన్నచోట్ల రూ.35లక్షలు, 50వేల నుంచి 5 లక్షలలోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉంటే రూ.75లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయం. గీతకులాలకు కేటాయించే బార్లకు 50 శాతమే ఫీజు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహణకు అనుమతి.

● బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తి, 2.7లక్షల కేసులు నమోదయ్యాయి. వీటిని నియంత్రించేందుకు పర్మిట్ రూమ్‌లకు అనుమతిచ్చేలా నిర్ణయం.

పాఠశాలలు, ఉపాధ్యాయుల పోస్టుల హేతుబద్ధీకరణ

● గత ప్రభుత్వం జీఓ 117 ద్వారా.. 4,731 బడులను రీస్ట్రక్చర్ చేసి, 3-5 తరగతుల విద్యార్థులను సమీప హైస్కూళ్లలో కలిపేసింది. దీనివల్ల 2.5 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడింది. జీవో 117ను రద్దుచేసి, పిల్లలను వెనక్కి తీసుకొచ్చాం. పాఠశాలలు, టీచర్ పోస్టులను హేతుబద్ధీకరించి పదోన్నతులు కల్పించాం. 9రకాల పాఠశాలల విధానాన్ని ప్రవేశపెట్టాం. వీటిపై ఇచ్చిన జీవోలను మంత్రివర్గం ర్యాటిఫై చేసింది.

● పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన 22 హోటళ్లు, రిసార్టుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన అప్పగించాలని నిర్ణయం. కనీసం మూడు నగరాల్లో రిసార్ట్స్, స్టార్‌హోటళ్లు నిర్వహిస్తున్నవాళ్లు, త్రీ స్టార్, అంతకంటే ఎక్కువ రేటింగ్ ఉన్న హోటళ్ల నిర్వాహకులకే అవకాశం కల్పిస్తాం.

వై.రామవరం మండలం రెండుగా: అల్లూరి సీతారామరాజు జిల్లాలో వై.రామవరం మండలాన్ని ఎగువ వై.రామవరం, దిగువ రామవరం మండలాలుగా విభజించేలా ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి అనుమతి.

120 డిగ్రీలు చేసిన విద్యావేత్త సుధాకర్ కన్నుమూత




పెందుర్తి(విశాఖపట్నం), న్యూస్‌టుడే: 120 డిగ్రీలు చేసి గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న విద్యావేత్త పట్నాల జాన్ సుధాకర్ (68) బుధవారం అస్తమించారు. పెందుర్తి మండలం పెదగాడి గ్రామానికి చెందిన సుధాకర్ మొదట్లో సీబీఐలో చిన్నస్థాయి ఉద్యోగిగా చేరారు. అనంతరం పలు డిగ్రీలు చేస్తూ సివిల్స్‌కు ఎంపికయ్యారు. దిల్లీలో సమాచార, ప్రసార శాఖ అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు చదువు కొనసాగించి 120 డిగ్రీలు పూర్తి చేశారు. సుధాకర్‌కు పెళ్లి కాకపోవడంతో విశాఖపట్నంలో సోదరుడు ప్రసాద్‌తో కలిసి నివాసం ఉంటున్నారు.

24న గ్రామ సర్వేయర్లకు పరీక్షలు

ఈనాడు, అమరావతి: గ్రామ సర్వేయర్లకు శాఖాపరమైన పరీక్షలు ఈ నెల 24న తిరుపతి, విశాఖ, గుంటూరు నగరాల్లో జరగనున్నాయి. వ్యాస రూప విధానంలో ఆఫ్‌లైన్ ద్వారా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీపీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. హాల్ టికెట్లను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

ఇదీ సంగతి!



అరచేతిలో ఈపీఎఫ్‌వో సేవలు

- యాజమాన్యాలు, ఈపీఎఫ్‌వో ప్రమేయం లేకుండా యూఏఎన్ పొందవచ్చు
- క్లెయిమ్ దరఖాస్తు సహా ఇతర సదుపాయాలూ అందుబాటులోకి



ఉమాంగ్ యాప్ ఆధార్ ఫేస్‌ఆర్‌డీ యాప్

ఈనాడు, హైదరాబాద్: భవిష్య నిధి చందాదారులకు యూనివర్సల్ ఎకౌంట్ నంబరు (యూఏఎన్) కేటాయింపు, యాక్టివేషన్ ప్రక్రియను ఈపీఎఫ్‌వో మరింత సులభం చేసింది. కొత్తగా ఈపీఎఫ్ చందాదారులుగా చేరేవారు, గతంలో ఉద్యోగం చేసినా ఇప్పటికీ యూఏఎన్ పొందని వారు, యాక్టివేషన్‌లో లేని యూఏఎన్‌ని తిరిగి చెల్లుబాటులోకి తెచ్చుకోవాలనుకునే వారు ఇకపై యాజమాన్యాలపై లేదా ఈపీఎఫ్‌వోపై ఆధారపడాల్సిన అవసరం లేదు. స్మార్ట్ ఫోన్‌లో ఈ సేవలను పొందవచ్చు. రెండు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. భారత్‌లో పనిచేసే అంతర్జాతీయ ఉద్యోగులు, నేపాల్, భూటాన్ పౌరులకు సంబంధించిన యూఏఎన్‌ల కేటాయింపు, చెల్లుబాటు సేవలను మాత్రం యాజమాన్యాలు నిర్వహించనున్నాయి.

ఏ యాప్‌లు అవసరం...

★ మొబైల్ ఫోన్‌లో ఉమాంగ్ (యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ-ఏజ్ గవర్నెన్స్) యాప్, యూఐడీఏఐ ఆధార్‌ఫేస్‌ఆర్‌డీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ★ ఆధార్ నంబరు, ఓటీపీ కోసం ఆధార్‌కు అనుసంధానించిన మొబైల్ నంబరు ఉండాలి.

నేడు మంగళగిరిలో జాతీయ చేనేత దినోత్సవం

ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరి వేదికగా ప్రభుత్వం గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించనుంది. దీనికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరుకానున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత వెల్లడించారు. ఈ సభా వేదిక నుంచి చేనేతలకు ఇచ్చిన మూడు కీలకమైన హామీలు ఉచిత విద్యుత్తు, జీఎస్టీ అమలు, థ్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని సీఎం అమల్లోకి తీసుకురానున్నారని పేర్కొన్నారు.

విశాఖలో థీమ్ పార్కును ఏర్పాటు చేస్తాం

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: యూరప్, హాంకాంగ్, తదితర ప్రాంతాల్లో ఉన్న థీమ్ పార్కులను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం సచివాలయంలో ఆయన పలువురు పెట్టుబడిదారులతో సమావేశమై ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌తో కలిసి వారి ప్రతిపాదనల్ని పరిశీలించారు. తొలుత పాంజియా ప్రతినిధి ప్రదీప్ మోచర్లతో భేటీ అయ్యారు. ఖేలో ఇండియా తరహా ఆటలు ఆడుకునేలా దేశంలోనే మొదటి థీమ్ పార్కును 5 ఎకరాల్లో రూ.35 కోట్ల పెట్టుబడితో విశాఖలో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. అనంతరం ఫిన్లాండ్‌కు చెందిన ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తర్వాత తెలంగాణకు చెందిన ఎకో ఫ్రెండ్లీ పార్క్ ఎక్స్‌పీరియం ఛైర్మన్ రామ్‌దేవ్‌రావు మంత్రిని కలిశారు. హైదరాబాద్‌లోని ఎక్స్‌పీరియం బొటానికల్ గార్డెన్ తరహా పార్కును అమరావతి లేదా బీచ్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు.

ఏఐతో స్టాక్ మార్కెట్ అంచనాలంటూ రూ.5 కోట్ల మోసం

ఇద్దరిపై సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో కేసు

ఈనాడు, హైదరాబాద్: కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సాఫ్ట్‌వేర్ ద్వారా స్టాక్ మార్కెట్ పరిణామాలను ముందే తెలుసుకుంటామని ఓ సంస్థ రూ.5 కోట్ల మేర మోసగించింది. బాధితుల ఫిర్యాదుతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్ శివారు నెక్నాంపూర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగికి పరిచయస్థుల ద్వారా మాదాపూర్‌లోని ఐవీటీ క్యాపిటల్ టెక్నాలజీస్ సంస్థ గురించి తెలిసింది. సంస్థ డైరెక్టర్‌గా పరిచయం చేసుకున్న గడ్డం వెంకటరావు... తాము ఏఐ ఆధారిత వ్యవస్థతో స్టాక్ మార్కెట్‌లో జరిగే పరిణామాలను ముందే అంచనా వేస్తామని.. తద్వారా అధిక లాభాలు వస్తాయని చెప్పాడు. విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో సమావేశాలు పెట్టి తమ దగ్గర కొత్త సాఫ్ట్‌వేర్ ఉందంటూ జనాలను నమ్మించారు. దీని ద్వారా నెలకు 7 శాతం, వార్షికంగా 84 శాతం వరకు లాభాలు వస్తాయన్నారు. విశ్వసించిన సదరు ప్రైవేటు ఉద్యోగి రూ.23 లక్షలు పెట్టుబడి పెట్టాడు. రూ.3 లక్షలు తిరిగివ్వడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు.. తనలాగే మరో 17 మంది నుంచి గడ్డం వెంకటరావు, అతడి సోదరుడు వేణుగోపాల్‌లు రూ.5 కోట్లు వసూలు చేసినట్లు తెలుసుకున్నాడు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వీరి బాధితులు వందల సంఖ్యలో ఉంటారని గుర్తించిన బాధితుడు ఫిర్యాదు చేయగా.. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు బుధవారం తెలిపారు.

హరిత ఇంధన రంగంలో మహిళలకు ఉపాధి అవకాశాలు

- కాలానుగుణంగా యువత నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి: మంత్రి లోకేశ్



గ్రీన్ ఎనర్జీ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో రిత్వికా భట్టాచార్య, కమలాకర బాబు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, బూరుగుపల్లి శేషారావు

ఈనాడు, అమరావతి: హరిత ఇంధన (గ్రీన్ ఎనర్జీ) రంగంలో మహిళలకు వారి గ్రామాల్లోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా అద్భుతమైన ఉపాధి అవకాశాలను పొందవచ్చని సూచించారు. విజయవాడలో బుధవారం జరిగిన 'సౌర, పవన విద్యుత్తు టాలెంట్ హబ్‌గా ఏపీ' అనే అంశంపై జరిగిన సదస్సులో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్ర సమయంలో అనంతపురం జిల్లాలో కియా విడి భాగాల యూనిట్‌లో మహిళలు పని చేయడం చూశాను. సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40 వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని ఒకామె గర్వంగా చెప్పారు. హరిత ఇంధన రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉంటాయి. కూటమి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. దీనిపై సీఎం చంద్రబాబు చాలా పట్టుదలతో ఉన్నారు. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్‌తో కలిసి పని చేస్తాం. ప్రతి వంద కిలోమీటర్లకు క్లస్టర్ ఏర్పాటు చేసి, ఆయా రంగాల్లో టాప్-20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తాం. సెప్టెంబరు 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తాం. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలున్నాయి' అని తెలిపారు.

2.5 లక్షలమందికి ఉపాధి అవకాశాలు: మంత్రి గొట్టిపాటి

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ద్వారా 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. 'హరిత ఇంధనానికి సంబంధించి ఇప్పటి వరకు అనేక కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నాం. అవన్నీ త్వరలో కార్యరూపం దాల్చేందుకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టులన్నీ 2029 నాటికి పూర్తయి వినియోగంలోకి వస్తాయి. పునరుత్పాదక విద్యుత్తు రంగాన్ని బలోపేతం చేసేందుకు 160 గిగావాట్ల లక్ష్యంతో హరిత ఇంధన పాలసీ అమలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ సదస్సులో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శేషారావు, నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్‌బాబు, స్వనితీ సీఈఓ రిత్వికా భట్టాచార్య పాల్గొన్నారు.

పేదలు కడుపు నిండా తినడం కూడా తట్టుకోలేని జగన్: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: పేదవారు కడుపు నిండా భోజనం చేయడం చూసి తట్టుకోలేని రాక్షస మనస్తత్వం వైకాపా అధినేత జగన్‌ది అని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. తెనాలి బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌లో అపరిశుభ్రంగా ఉన్న నీటిలో కంచాలు శుభ్రం చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వైకాపా వాళ్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని బుధవారం ఎక్స్ వేదికగా ఖండించారు. శుభ్రమైన నీటిలో మూడంచెల్లో భోజనం పళ్లాల్ని కడుగుతున్న వీడియోను పోస్టు చేశారు. 'అధికారం వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లు మూసేసి పేదవారి నోటి దగ్గర కూడు లాగేసిన జగన్.. ఇంకా తన తీరు మార్చుకోలేదు. మీ ఏడుపులే అన్న క్యాంటీన్లకు దీవెనలు' అని లోకేశ్ పేర్కొన్నారు.



నూతన పారిశ్రామిక విధానంలోనే లులుకు భూమి

- హైకోర్టుకు వివరించిన అడ్వొకేట్ జనరల్

ఈనాడు, అమరావతి: నూతన పారిశ్రామిక విధానంలో భాగంగానే లులు సంస్థకు భూమి కేటాయించామని రాష్ట్రప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. అత్యంత భారీ, భారీ, మధ్యతరహా పరిశ్రమల విషయంలో గతేడాది డిసెంబర్లో తీసుకొచ్చిన పారిశ్రామిక విధానానికి అనుగుణంగా లులుకు భూ కేటాయింపు జరిగిందని తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కోరారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. లులు సంస్థ యాజమాన్యానికి, రాష్ట్రప్రభుత్వానికి నోటీసులు ఇచ్చి కౌంటర్ వేయాలని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. టెండర్ ప్రక్రియ పాటించకుండా విశాఖ, విజయవాడలలో లులు సంస్థకు భూమి కేటాయిస్తున్నారని పేర్కొంటూ పాకా సత్యనారాయణ, విజయవాడలో లులు సంస్థకు ఆర్టీసీ స్థలాన్ని ఇస్తున్నారంటూ న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా ప్రజాహిత వ్యాజ్యాలు వేయగా, బుధవారం వాటిపై విచారణ జరిగింది.

గ్రహం అనుగ్రహం

7-8-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్లపక్షం
త్రయోదశి: మ. 1-27 తదుపరి చతుర్దశి
పూర్వాషాఢ: మ. 2-08 తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: రా. 10-27 నుంచి 12-06 వరకు
అమృత ఘడియలు: ఉ.9-02 నుంచి 10-44 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-58 నుంచి 10-49 వరకు తిరిగి మ. 3-04 నుంచి 3-55 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.44; **సూర్యాస్తమయం:** సా.6.28

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	40.5	28.5
తాడేపల్లిగూడెం	38.2	27.9
నెల్లూరు	37.1	28.1
ఒంగోలు	36.9	28.5
ఖమ్మం	36.6	25.6
తిరుపతి	36.4	26.0
విజయవాడ	35.7	27.6
విశాఖపట్నం	35.6	27.2
నరసాపురం	35.4	28.0
గుంటూరు	35.0	28.0
విజయనగరం	35.0	27.0
కడప	35.0	26.0
కర్నూలు	34.5	24.7
శ్రీకాకుళం	34.0	28.0
హైదరాబాద్	33.2	22.8
అనంతపురం	33.1	24.4

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అక్షయపాత్ర భోజనం

ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.110 చొప్పున చెల్లింపు

ఈనాడు, అమరావతి: రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) ఆధ్వర్యంలోని ట్రిపుల్ ఐటీల్లో మెస్‌ల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం 'అక్షయపాత్ర'కు అప్పగించింది. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్‌ల్లో ఆ సంస్థ ద్వారా విద్యార్థులకు భోజనం అందించనున్నారు. ట్రిపుల్‌ఐటీ మెస్‌ల్లో భోజనం సరిగా పెట్టడం లేదని, నిర్వహణ సక్రమంగా ఉండటం లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో నూజివీడు క్యాంపస్‌లో భోజనం బాగోలేదని విద్యార్థులు నిరసనలు తెలిపిన సమయంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. నాణ్యమైన భోజనం అందించేందుకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.116.67 చొప్పున చెల్లించాలని ఆ కమిటీ సూచించింది. దీని ప్రకారం.. అక్షయపాత్ర టిఫిన్, రెండు పూటలా శాకాహార భోజనం, స్నాక్స్ అందించేందుకు ఒక్కో విద్యార్థికి రూ.110 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. దీని కోసం క్యాంపస్‌ల్లో రూ.3 కోట్లతో అక్షయపాత్ర వంట పరికరాలను ఏర్పాటు చేసుకుంటుంది. ఆ సంస్థ శాకాహార భోజనమే అందిస్తున్నందున విద్యార్థికి రోజుకు రూ.6.67తో వారానికి ఐదు కోడిగుడ్లు, ఒక రోజు మాంసాహారాన్ని ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేకంగా వండిస్తారు. భోజనం సరఫరాపై గురువారం ఆర్జీయూకేటీతో అక్షయపాత్ర ఒప్పందం కుదుర్చుకోనుంది. మరోవైపు టెండర్లు లేకుండా ఈ బాధ్యతలను అక్షయపాత్రకు అప్పగించడంపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

11 నుంచి ఫార్మెటివ్-1 పరీక్షలు

ఈనాడు, అమరావతి: ఫార్మెటివ్-1 పరీక్షలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. 1-5 తరగతులకు 11 నుంచి 13, 6-10 తరగతుల విద్యార్థులకు 11 నుంచి 14 వరకు పరీక్షలు జరగనున్నాయి. 6,7,8 తరగతులకు ఉదయం 9.30 నుంచి 10.45 వరకు, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 వరకు పరీక్షలు ఉంటాయి. 9, 10 తరగతులకు ఉదయం 11 నుంచి 12.15, మధ్యాహ్నం 2.45 నుంచి 4 వరకు జరుగుతాయి.






ఈనాడు

మానవ తప్పిదాలే పెనువిపత్తులై...

ప్రాణికోటికి ఆధారభూతమైన ప్రకృతితో చెలగాటమాడితే ఎలాంటి పర్యవసానాలు చవిచూడాల్సి వస్తుందో ఉత్తరకాశీ వైపరీత్యం మరోసారి కళ్లకు కట్టింది. ఆకాశానికి చిల్లులు పడినట్లు కురిసిన వర్షానికి రాళ్లు, మట్టితో కూడిన వరద పోటెత్తి గంగోత్రికి సమీపంలోని ధరాలీ గ్రామం సర్వనాశనమైంది. నిరుడు కేరళలోని వయనాడ్‌లో ఇలాంటి మహోత్పాతమే వందల మందిని బలితీసుకుంది. పుష్కర కాలం క్రితం ఉత్తరాఖండ్‌లోనే సంభవించిన ఆకస్మిక వరదలు విపరీతమైన నష్టాలకు కారణమయ్యాయి. వాతావరణ మార్పులతో కొన్నేళ్లుగా కుండపోత వానలు కొరడాస్తున్నాయి. దానికితోడు గతితప్పిన పట్టణీకరణ, పర్యాటకాభివృద్ధి కార్యకలాపాల మూలంగా పర్వత ప్రాంతాల్లో విచ్చలవిడిగా హోటళ్లు, రిసార్టులు పుట్టుకొస్తున్నాయి. గనుల తవ్వకాలూ యథేచ్ఛగా సాగుతున్నాయి. వరద జలాల సహజ ప్రవాహ మార్గాలు, నదీ తీరాలు ఆక్రమణల బారిన పడుతున్నాయి. పచ్చటి అడవులు కనుమరుగవుతున్నాయి. హిమాలయాల్లో చేపడుతున్న జలవిద్యుత్‌, రహదారి ప్రాజెక్టులు అసలే సున్నితమైన ఆ ప్రాంతాలను ఇంకా దెబ్బతీస్తున్నాయి. సుప్రీంకోర్టు తాజాగా సూచించినట్లు పర్యావరణ పరిరక్షణ, ప్రగతి పనుల మధ్య సమతౌల్యం తప్పనిసరి. దాన్ని అశ్రద్ధ చేస్తే- విపత్తులు దండెత్తి పెను విధ్వంసం సృష్టిస్తూనే ఉంటాయి!

సెంటర్‌ ఫర్‌ సైన్స్‌ అండ్‌ ఎన్విరాన్‌మెంట్‌ నివేదిక ప్రకారం, 2023లో 208 రోజుల పాటు భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ఉత్పాతాలను ఇండియా చవిచూసింది. తొమ్మిది రోజుల మేర కుంభవృష్టుల తాకిడిని ఎదుర్కొంది. రోజురోజుకూ ఈ వైపరీత్యాలు మరింత తీవ్రమవుతూ స్థానిక జనజీవనాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇటీవల హిమాచల్‌, ఉత్తరాఖండ్‌, జమ్మూకశ్మీర్‌, ఈశాన్య రాష్ట్రాల్లో భీకర వానలు, జారిపడిన కొండచరియలు అభాగ్యులెందరినో పొట్టన పెట్టుకున్నాయి. ఒక్క 2023లోనే ఉత్తరాఖండ్‌లో వెయ్యి సార్లకు పైగా కొండరాళ్లు విరిగిపడ్డాయి. హిమాలయాల్లో ఇష్టారీతిగా రహదారులను విస్తరిస్తుండటం వల్ల ఉపద్రవాల ముప్పు అధికమవుతుందని, అక్కడి జీవావరణానికి కోలుకోలేని నష్టం జరుగుతుందని చార్‌ధామ్‌ రహదారి ప్రాజెక్టుపై ఏర్పాటైన రవి చోప్రా కమిటీ హెచ్చరించింది. పశ్చిమ కనుమల సంరక్షణకు సంబంధించి మాధవ్‌ గాడ్గిల్‌, కస్తూరి రంగన్‌ సంఘాలూ కీలక సిఫార్సులు చేశాయి. అవన్నీ బుట్టదాఖలైన పర్యవసానంగానే జీవవైవిధ్యానికి పుట్టిళ్ల వంటి పర్వత ప్రాంతాలు క్రమంగా కదలబారుతూ భయానక కల్లోలాలకు నెలవులవుతున్నాయి!

సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్‌ మేర పెరిగేకొద్దీ, వాతావరణం తేమను ఏడు శాతం అధికంగా పట్టి ఉంచుతుంది. అంతిమంగా అది ఎడతెగని వర్షపాతానికి దారితీస్తుంది. అంతటి వానలకు తట్టుకునేలా మన పట్టణాలు, నగరాల్లో వరదనీటి పారుదల వ్యవస్థలు ఆధునికీకరణకు నోచుకోలేదు. దానివల్లే చెన్నై, హైదరాబాద్‌, దిల్లీ, ముంబై తదితరాలు చినుకుపడిందంటే చాలు మునుగుతున్నాయి. జలవనరులు ఆక్రమణల బారిన పడుతుండటమూ ముంపు సమస్యను పెంచుతోంది. జనజీవనం నరకప్రాయం కాకూడదంటే- కబ్జాలను అరికట్టి, విపత్తు నిర్వహణ వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలి. నిప్పుల కొలిమిలాంటి భూతాపం నుంచి భూమిని బయటపడేయాలంటే- పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. పర్వత ప్రాంతాలు సుస్థిరతకు ఆలవాలాలు కావాలంటే- అభివృద్ధి ముసుగులో సాగుతున్న అడ్డగోలు నిర్మాణాలను కట్టడి చేసితీరాలి!



సాంకేతికత పంట దిగుబడినీ, ఉత్పాదకతనీ పెంచగలదు. రైతుల ఆదాయం పెరగాలంటే ప్రభుత్వ విధానాలు మాత్రమే తోడ్పడగలవు. సాంకేతికతకు ప్రభుత్వ విధానాలకు మధ్య సమన్వయాన్ని సాధించడం నేటి అవసరం.

– ఎం.ఎస్‌.స్వామినాథన్‌

నారద భక్తితత్వం

ప్రాచీన భక్తిశాస్త్ర గ్రంథాల్లో 'నారద భక్తిసూత్రం' ఉత్కృష్టమైనది. ఇందులో నారదుడు భక్తి సాధన గురించి విస్తారంగా చెబుతాడు. 'ఈశ్వరుడి పట్ల చూపించే పరమ ప్రేమే భక్తి. ఆయన స్తుతి ప్రత్యక్షంగా ఉన్నట్లే, పరోక్షంలోనూ ఉంటుంది. సిద్ధత్వం సాధించటం అంటే ప్రాపంచిక వికారాలకు తావులేని స్థితికి చేరడం. మనిషికి ఏ వస్తువు దక్కితే ఇక మరి దేనినీ కోరడో, దేనికోసం శోకించడో, ఎవరినీ ద్వేషించడో, ఇంకే వస్తువు దొరికినా అంతటి ఆనందం కలగదో, మరో దానికి పాకులాడడో... అదే భక్తి' అంటాడు నారదుడు.

భక్తిని సాధించినవాడు లౌకిక విషయాలను పట్టించుకోడు. అతడి హృదయం ఈశ్వరుడికే అంకితం. కేవలం పూజాదులే భక్తి ప్రకటనకు మార్గం కాదు. అసలైన భక్తి అన్ని గుణాలకు అతీతమైనది. భక్తి అంతిమ లక్ష్యాన్ని అత్యంత స్పష్టంగా వివరించే



అంతర్యామి

క్రమంలో సూక్ష్మాంశాల ప్రస్తావననూ విడిచిపెట్టడు నారదుడు. గుణాలను అనుసరించి సత్వరజో తమో రూపాలుగా, వ్యక్తుల తీరును అనుసరించి ఆర్త, జిజ్ఞాసు, అర్థార్థి రూపాలుగా భక్తి ప్రకాశిస్తుందని ఆయన చెబుతాడు. అర్థాన్ని అర్థించేవాడు ఈశ్వరుణ్ని భోగసుఖాల కోసమే ప్రార్థిస్తాడు. జిజ్ఞాసువు జ్ఞానం కోసం ఆశ్రయిస్తే, ఆర్తుడు గజేంద్రుడిలాగా హృదయపూర్వకంగా ఆహ్వానిస్తాడు. సత్వగుణం కలిగిన భక్తుడు ఏకాంతధ్యానం చేస్తాడు. దోమతెర చాటున నిద్రిస్తున్నా దైవధ్యానంలోనే రాత్రంతా గడుపుతాడు. అలౌకికుడికి అన్నవస్త్రాదుల పట్ల మోజుండదు. భక్తులలోని భేదాలనూ నారదుడు వివరిస్తాడు. రాజసిక భక్తుడి బాహ్య స్వరూపం తిలక ధారణ, రుద్రాక్ష మాలాది అలంకారాలలో ఆడంబరంగా ఉంటుంది. దేవాలయం అంటే అతడికి తన ఇంటి పూజగది మాత్రమే. దైవనామస్మరణతోనే పాపాలు పరిహారమై పోతాయని తామసిక భక్తుడి విశ్వాసం. పొందాలనుకునే వస్తువును 'ఇష్టం' అంటాం. ఈ ఇష్టప్రాప్తికి నారదుడు నిర్దేశించిన మార్గాలు భక్తి, కర్మ, జ్ఞాన, యోగాలు. వీటి మధ్య ఎక్కువ తక్కువల తారతమ్యం లేదు. దేశ, కాల, పాత్రలను అనుసరించి ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కటి ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే ఈ కర్మ, జ్ఞాన, యోగాలకన్నా భక్తే శ్రేష్ఠమని నారదుడు భావిస్తాడు.

సమస్త సాధనల అంతిమ ఫలితం భక్తి. ఇతర సాధనలలోలాగా ఇందులో అహంకారానికి తావుండదు. ఈశ్వరుడు కోరేది వినయం. భక్తి సాధకుడిలో ఈ భావం విప్పారుతుంది. ఆహార పదార్థాలను చూసినంత మాత్రాన ఆకలి తీరనట్లే భక్తిభావం లేని సాధనల వల్ల మోక్షం ప్రాప్తించదు. భక్తి సాధన వల్ల సాధకుడు పరమానందం అనుభవించగలడు. అందువల్ల మోక్షం పొందాలనుకునేవారికి భక్తే శరణ్యం. మహాత్ముల కృప, అవిరామ భగవదారాధన, సుఖదుఃఖాలు, లాభనష్టాల పట్ల నిరాపేక్ష, నిశ్చింత హృదయంతో చేసే ఈశ్వరుడి భజనలు స్వచ్ఛమైన భక్తి సాధనకు ముఖ్య ఉపాయాలు. భక్తిశాస్త్రాలను మననం చేసుకుంటూ కూడా భగవంతుడితో భక్తుడు అనుసంధానం కావచ్చునని నారదుడు ఉద్బోధిస్తాడు.

– కర్లపాలెం హనుమంతరావు

వియత్నాం విజయయాత్ర: నేర్పే పాఠాలెన్నో!

ఎలక్ట్రానిక్స్‌ రంగంలో పదివేల కోట్ల డాలర్ల పెట్టుబడులను ఆకర్షించాలని ఆంధ్రప్రదేశ్‌ తలపెట్టగా, 2047కల్లా మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలవాలని తెలంగాణ లక్షిస్తోంది. వియత్నాం అనుభవాల నుంచి పాఠాలను నేర్చుకోవడం ద్వారా తెలుగు రాష్ట్రాలు తమ ఆశయాలను వేగంగా అందుకోవచ్చు. ముఖ్యంగా వ్యవస్థాగత సంస్కరణలను పకడ్బందీగా అమలు చేయడం, పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు, పెట్టుబడిదారులను ప్రోత్సహించడం కీలకం.

ప్రగతి సాధనకు తిరుగులేని నిబద్ధతను ప్రదర్శించడం ద్వారా వియత్నాం శరవేగంగా పురోగమించింది. ఫ్రాన్స్‌, అమెరికాలతో సుదీర్ఘ యుద్ధాల తరవాత పారిశ్రామిక ఉత్పత్తి మీద దృష్టి కేంద్రీకరించి మధ్యశ్రేణి ఆర్థిక వ్యవస్థగా వియత్నాం ఎదిగిన తీరు ప్రశంసనీయం. 1993లో అక్కడ జనాభాలో 80శాతంగా ఉన్న పేదలు 2023 నాటికి అయిదు శాతానికి తగ్గిపోయారు. 1986లో డోయిమోయి(పునరుద్ధరణ, నవీకరణ) పేరిట చేపట్టిన సంస్కరణలు వియత్నాంను కమ్యూనిస్టు తరహా కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ నుంచి మార్కెట్‌ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందించాయి. 1994లో వియత్నాంపై అమెరికా వాణిజ్య నిషేధాన్ని ఎత్తివేసి, 2001లో వర్తక ఒప్పందం కుదుర్చుకుంది. అప్పటినుంచి వియత్నాంలోకి విదేశీ పెట్టుబడులు పోటెత్తాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధంతో అనేక బహుళజాతి కంపెనీలు బీజింగ్‌ను వీడి తమ ఉత్పత్తి కార్యకలాపాలను వియత్నాంకు తరలించాయి. తక్కువ వేతనాలకు కార్మికులు లభించడం, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, వాణిజ్య ఒప్పందాల వల్ల వియత్నాం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానమైంది.

వియత్నాంలోని బాక్‌నిన్‌ రాష్ట్రంలో దక్షిణ కొరియా కంపెనీ శాంసంగ్‌ 2,240 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టడం అక్కడ అభివృద్ధికి బాగా తోడ్పడింది. శాంసంగ్‌ సెల్‌ఫోన్లలో సగం అక్కడే తయారవుతున్నాయి. ఇప్పుడు అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్‌ ఉత్పత్తి-సరఫరా గొలుసులో వియత్నాం కీలకంగా మారింది. ఆ దేశం నుంచి నేర్చే పాఠాలు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీకి, రామాయపట్నం రేవు ప్రాంతానికి స్ఫూర్తినిస్తాయి. చైనా, జపాన్‌, ఐరోపా సమాఖ్య, 'ఆసియాన్‌' దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా వియత్నాం అంతర్జాతీయ వ్యాపార సంస్థలను ఆకర్షించింది. దాంతో ఎగుమతులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. 2023లో వియత్నాం ఎగుమతుల విలువ 35,500 కోట్ల డాలర్లు. అందులో 40శాతం ఎలక్ట్రానిక్స్‌ ఉత్పత్తులే. ఆ రంగం 13లక్షల ఉద్యోగాలను సృష్టించింది. వియత్నాం జీడీపీలో 90శాతం ఎగుమతుల ద్వారానే లభిస్తోంది. నిరుడు అమెరికాకు వస్తుసేవల ఎగుమతులు విజృంభించడంతో వియత్నాంకు 12,300కోట్ల డాలర్ల మిగులు ఏర్పడింది!



ఒక బృహత్తర కంపెనీ ఎక్కడ కార్యకలాపాలు సాగించినా, ఆ ప్రాంతం అనుబంధ సంస్థలకూ, ఉపాధికీ నెలవు అవుతుంది. వియత్నాంలో శాంసంగ్‌ ఈ వాస్తవాన్ని కళ్లకు కట్టింది. 2023లో వియత్నాం 5,200కోట్ల డాలర్ల విలువైన సెల్‌ఫోన్లు, విడిభాగాలను ఎగుమతి చేసింది. నైకి, అడీడాస్‌, ప్యూమా పాదరక్షల విక్రయాల్లో ఎక్కువశాతం అక్కడ తయారైనవే ఉంటున్నాయి. బెల్జియం కంపెనీ డీప్‌సి వియత్నాంలో పెట్టిన పెట్టుబడులు ఏడేళ్లలో వంద కోట్ల డాలర్ల నుంచి 800కోట్ల డాలర్లకు పెరిగాయి. నిరుడు ఒక్క సెమీకండక్టర్‌ రంగమే 1,870కోట్ల డాలర్లను ఆర్జించి పెట్టింది. నేడు అంతర్జాతీయ నవీకరణ సూచీలో వియత్నాం 44వ స్థానాన్ని ఆక్రమిస్తోంది.


తలసరి ఆదాయం పెరగాలంటే...

ఇండియా 2047కల్లా వికసిత భారతంగా అభివృద్ధి చెందడానికి వియత్నాం అనుభవం ఉపకరిస్తుంది. 2008లో రెండు దేశాల తలసరి ఆదాయం దాదాపు వెయ్యి డాలర్లుగా ఉండేది. ఇప్పుడు వియత్నాం తలసరి ఆదాయం 4,400డాలర్లకు చేరితే భారత్‌ 2,880 డాలర్ల వద్దే తచ్చాడుతోంది. మనం కూడా ఎలక్ట్రానిక్స్‌, సెమీకండక్టర్లు, మొబైల్‌ ఫోన్ల ఎగుమతులను భారీగా పెంచుకోవాలి. ఆ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలు వాస్తవ కార్యాచరణకు దిగాలి. విదేశీ పెట్టుబడులు, నైపుణ్యాలు, కర్మాగారాలను ఆకర్షించడానికి వియత్నాం చేపట్టిన విధానాలను అధ్యయనం చేయాలి. ఆ దేశం సాధించిన విజయాల నుంచి స్ఫూర్తి పొందాలి.

ఇదీ మార్గం!

ఏపీ, తెలంగాణలు పారిశ్రామిక ఉత్పత్తి రంగంలో వియత్నాంను ఆదర్శంగా తీసుకోవాలి. ఇందుకోసం అయిదు కార్యాచరణ ప్రణాళికలను చేపట్టాలి.

- **పారిశ్రామిక మండలాలు:** విద్యుత్‌, నీరు వంటి మౌలిక వసతులు, భూమిని సరళమైన పద్ధతిలో లీజుకివ్వడం, సానుకూల నిబంధనలతో ఏర్పాటుచేసిన పారిశ్రామిక మండలాలు వియత్నాం ఆర్థికానికి పట్టుగొమ్మలయ్యాయి. తెలుగు రాష్ట్రాలూ ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాలు, రేవుల దగ్గర ఇలాంటి పారిశ్రామిక మండలాలను నెలకొల్పడానికి అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించాలి.
- **శీఘ్ర అనుమతులు:** పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులివ్వడానికి వియత్నాం చేపట్టిన ఏకగవాక్ష విధానం ఫలించింది. అంతర్‌ మంత్రిత్వశాఖలతో ఏర్పాటైన కమిటీలు, నెలవారీ సమావేశాలు మదుపరుల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నాయి.
- **రేవులు, రవాణా సౌకర్యాల అభివృద్ధి:** వియత్నాం 2010-24 మధ్య ప్రతి టన్ను అదనపు ఎగుమతి వృద్ధికి మూడు వేల డాలర్ల చొప్పున పెట్టుబడి పెట్టింది. 11,700 కోట్ల డాలర్లతో మౌలిక వసతుల విస్తరణ-అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టింది. తెలుగు రాష్ట్రాలూ రేవులు, విమానాశ్రయాలు, రోడ్ల విస్తరణ, ఎగుమతుల శీఘ్ర రవాణాకు ఏర్పాట్లు చేయాలి.
- **విధానాల్లో స్థిరత్వం, ఎగుమతులకు ప్రోత్సాహం:** దిగుమతి చేసుకునే ముడి సరకులకు వియత్నాం నాలుగేళ్లపాటు పన్ను విరామం, సుంకాల్లో రాయితీలు ఇస్తుంది. తెలుగు రాష్ట్రాలు అటువంటి విధానాలను అవలంబించాలి.
- **నిపుణ మానవ వనరులు:** వియత్నాం ఎప్పటికప్పుడు అర్హులైన సిబ్బందిని అందించడానికి అనేక చర్యలు తీసుకుంది. అక్కడ మహిళా ఉద్యోగులూ ఎక్కువే. దీనివల్ల సమ్మిళిత వృద్ధి సుసాధ్యమవుతోంది. మన దగ్గరా ఆధునిక పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలను నేర్పే వృత్తివిద్యా కోర్సులను చేపట్టాలి.



కొట్నాన రమేష్‌
సీనియర్‌ మేనేజర్‌, సెంటర్‌ ఫర్‌ బిజినెస్‌ ఇన్నొవేషన్‌, ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌, హైదరాబాద్‌



50 రాష్ట్రాలు 50 రోజులు

సోషల్‌ మీడియాను మెజారిటీ ప్రజలు కాలక్షేపానికి వాడుకుంటే కొందరు మాత్రమే దానినుంచి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తారు. యూట్యూబర్‌ రయాన్‌ ట్రెహాన్‌ లాంటివాళ్లు మాత్రం సామాజిక ప్రయోజనానికీ దాన్ని వాడుకోవచ్చని రుజువు చేస్తున్నారు. లక్షల్లో ఫాలోవర్లు ఉన్న రయాన్‌ వారికి ఉపయోగపడే సమాచారం ఇవ్వడానికి ఈ మధ్య చెప్పుకోదగ్గ సాహసయాత్రే చేశాడు.

చిన్న పిల్లలకు వచ్చే క్యాన్సర్‌, ఇతర ప్రాణాంతక వ్యాధులకు ఉచితంగా చికిత్స అందిస్తోన్న సెయింట్‌ జూడ్‌ చిల్డ్రన్స్‌ రీసెర్చ్‌ హాస్పిటల్‌ గురించి తెలిసింది రయాన్‌కి. ఆ ఆస్పత్రికి తనవంతుగా మిలియన్‌ డాలర్లు విరాళాలు సేకరించి ఇవ్వాలనుకున్నాడు. అందుకు గాను రయాన్‌ అమెరికాలోని 50 రాష్ట్రాలను 50 రోజుల్లో రోడ్డు మార్గం ద్వారా పర్యటించాలని ప్లాన్‌ వేసుకున్నాడు. విభిన్న వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ ఆ సువిశాల దేశాన్ని అనుకున్నట్లుగా 50 రోజుల్లో చుట్టేశాడు. రచయిత్రి అయిన భార్య హాల్‌ ఫామ్‌తో కలిసి టెక్సాస్‌లోని తమ ఇంటి నుంచి జూన్‌ 10న ప్రయాణం ప్రారంభించాడు రయాన్‌. రోజుకో రాష్ట్రానికి వెళ్లి అక్కడి ఆహార వ్యవహారాలు, సంస్కృతి, ఆ రాష్ట్ర ప్రత్యేకతలు లాంటివన్నీ వీడియోలు తీసి పోస్ట్‌ చేసేవాళ్లు. ఎయిర్‌ బీఎన్‌బీలో బస చేసేవాళ్లు. ప్రయాణిస్తూనే వీడియో షూటింగ్‌, ఎడిటింగ్‌, అప్‌లోడింగ్‌ పనులను సమర్థంగా చేశారు. ఆ వీడియోలకు విపరీతమైన ఆదరణ లభించింది. వాళ్లు పెట్టుకున్న మిలియన్‌ డాలర్ల లక్ష్యం తొలి రెండు వారాల్లోనే పూర్తవడంతో దాన్ని పెంచుకుంటూ వెళ్లారు. చివరికి జులై 29న హవాయిలో పర్యటన ముగింపు నాటికి విరాళాలు 11 మిలియన్‌ డాలర్లు దాటాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. సగటున రోజుకు 450 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన వీరి ట్రిప్‌లో కేవలం విరాళాల సేకరణే కాక ఇంకా చాలా అంశాలున్నాయి. వినోదం, విద్య, హాస్యం, ప్రయాణానుభూతి, సర్దుకుపోవడం, సాయపడే గుణం... ఇలాంటివన్నీ ఉన్నాయి. లెక్ట్రిక్‌ ఈ బైక్స్‌, టీ మొబైల్‌, డాలర్‌ షేవ్‌ క్లబ్‌, కియా కార్ల కంపెనీ తదితర 115 ప్రముఖ బ్రాండ్లు వీళ్లకు విరాళాలు ఇచ్చాయి. '50 స్టేట్స్‌, 50 డేస్‌' పేరుతో ఈ కార్యక్రమం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో సెయింట్‌ జూడ్‌ ఆస్పత్రి గురించి మారుమూల ప్రజలకు కూడా తెలిసింది.

ఒక మంచి పనికి ఎంత ఆదరణ లభిస్తుందో, తలో చేయీ వేసి ప్రజలు దాన్ని ఎలా విజయవంతం చేస్తారో రయాన్‌ నిరూపించాడు. గతంలో కూడా అతడు ప్రారంభించిన 'పెన్నీ ఛాలెంజ్‌' ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. దాని ద్వారా 1.38మిలియన్‌ డాలర్ల విరాళాలు సేకరించి పేదలకు ఆహారాన్ని అందించే ఫీడింగ్‌ అమెరికా అనే స్వచ్ఛంద సంస్థకు ఇచ్చాడు. తలచుకోవాలే కానీ మనిషి ఎన్నయినా మంచి పనులు చేయవచ్చు కదా!

– మొలకలపల్లి కోటేశ్వరరావు



జబ్బు చేస్తే జేబు గుల్లే!

ఒక దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే అక్కడి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి. అప్పుడే వారు పనిపాటల్లో ఉత్సాహంగా నిమగ్నం కాగలుగుతారు. కాబట్టి ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించడానికి చాలా దేశాలు పెద్దమొత్తం ఖర్చు చేస్తున్నాయి. కొన్ని దేశాలు అరకొరగా విదిలిస్తున్నాయి. అదే సమయంలో జనాలు సొంతంగా చేస్తున్న వ్యయాలు సైతం అధికంగానే ఉంటున్నాయి. 2021లో పలు ఆసియా దేశాల్లో ప్రభుత్వపరంగా, సొంతంగా ఒక్కో వ్యక్తి వైద్య వ్యయం... (డాలర్లలో)

దేశం	ప్రభుత్వ వైద్యవ్యయం	ప్రైవేటు/సొంతంగా వెచ్చించింది
జపాన్‌	3961	714
మాల్దీవులు	1479	321
చైనా	558	473
మంగోలియా	580	302
శ్రీలంక	283	300
ఇండియా	81	150
నేపాల్‌	76	123
పాకిస్థాన్‌	48	101
బంగ్లాదేశ్‌	25	115

(ఆధారం: ప్రపంచ బ్యాంకు గణాంకాలు-2025)

కావాల్సింది... దీర్ఘకాలిక వ్యూహం!

మానవ నాగరికత ప్రయాణంలో చేనేత ప్రముఖ పాత్ర పోషించింది. సింధు నాగరికత కాలంలోనే మన దేశం నుంచి రోమ్‌, ఈజిప్ట్‌, చైనాలకు చేనేత వస్త్రాలు ఎగుమతయ్యాయి. భారతీయ పల్లెల్లో ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆ తర్వాత అత్యధికులు చేనేత పరిశ్రమను నమ్ముకుని బతుకుతున్నారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా....

స్థానిక వస్తూత్పత్తులకు జీవంపోయాలన్న సంకల్పంతో 1905 ఆగస్టు ఏడో తేదీన స్వదేశీ ఉద్యమం ఆరంభమైంది. ఆ స్ఫూర్తితో ఏటా అదే రోజు చేనేత సంరంభం నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది. అయితే, ఇక్కడ ఒక ముఖ్య విషయం గమనంలోకి తీసుకోవాలి. మానవ శ్రమను వీలైనంత తగ్గించడంలో భాగంగా ఆధునికత రంగ ప్రవేశం చేసింది. కానీ, క్రమంగా అన్ని రంగాల్లోకి యంత్రాలు చొచ్చుకురావడంతో కుటీర పరిశ్రమలను నమ్ముకున్న జీవితాలు దెబ్బతిన్నాయి. మానవ ఉన్నతికోసం... మెరుగైన సమాజం కోసం ప్రారంభమైన యాంత్రీకరణ దీర్ఘకాలంలో ఆయా వృత్తులమీద ఆధారపడిన జీవితాలను కకావికలం చేసింది.

వలస బతుకుల వెతలు

ప్రస్తుతం తెలంగాణలో సుమారు 35 వేల వరకు మరమగ్గాలు నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 15 వేల వరకు పవర్‌లూమ్స్‌ పనిచేస్తున్నాయి. తెలంగాణలో ప్రధానంగా సిరిసిల్ల పట్టణ కేంద్రంలో చేనేత కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నాయి. పెట్టుబడి ఎక్కడ కేంద్రీకృతమైతే వలసలు అక్కడికి నిరంతరంగా కొనసాగుతాయి. దానికి తగినట్లుగానే చేనేత కార్మికుల వలసలు సాగాయి. వరంగల్‌, జనగామ, హుస్నాబాద్‌, హుజూరాబాద్‌ తదితర చోట్ల మెల్లమెల్లగా చేనేత కుటీర పరిశ్రమ కునారిల్లిపోయింది. దాంతో ఆ రంగంలోని కార్మికులు బతుకుదెరువును వెతుక్కుంటూ సిరిసిల్లకు వలసవచ్చారు. మరోవైపు పుండు మీద కారం చల్లినట్టు నిజాం ఏలుబడిలో రజాకార్ల నిర్బంధాలు పెరిగాయి. ఆ అణచివేతల నుంచి తప్పించుకోవడానికి తెలంగాణ పల్లెల్లోని చేనేత కార్మికులతో పాటు వివిధ వర్గాల ప్రజలు కూలీలుగా సిరిసిల్లతో పాటు బొంబాయి, షోలాపూర్‌, అహ్మద్‌నగర్‌, భీవండిలకు అత్యధిక సంఖ్యలో వలసవెళ్లారు.

మన్నికైన మిల్లు వస్త్రం దేశమంతా విస్తరించడంతో, మగ్గంపై నేసిన బట్టకు క్రమక్రమంగా గిరాకీ తగ్గిపోయింది. 1990ల్లోకి వచ్చేసరికి చేనేత




పరిశ్రమ సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. తత్ఫలితంగా సిరిసిల్ల పట్టణంలో ఎందరో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పట్లో సిరిసిల్ల పట్టణాన్ని సందర్శించారు. 'కుటీర పరిశ్రమ' నిర్వచనాన్ని విస్తరించడంతో పాటు పవర్‌లూమ్స్‌ వినియోగించుకునే విద్యుత్తులో 50శాతం రాయితీని ప్రకటించారు. చేనేత కార్మికులకు అన్నపూర్ణ రేషన్‌ కార్డులను జారీ చేశారు. దాంతో సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమ కొద్దిగా ఊపిరి తీసుకోగలిగింది. పరిణామ క్రమంలో సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమ అభివృద్ధి చెందింది. కానీ చేనేత కార్మిక కుటుంబాలలో చాపకిందనీరులా సంక్షోభం కొనసాగింది. దీనికి విరుగుడుగా తెలంగాణ ప్రభుత్వం 2017 నుంచి ఆ తర్వాత ఏడేళ్లలో బతుకమ్మ చీరల పేరిట ఏడాదికి సగటున మూడొందల కోట్ల రూపాయల విలువైన ఆర్డర్లు ఇచ్చింది. దీని వల్ల నేత కార్మికులకు ఏడాదిలో సుమారు ఆర్నెల్లు పని దొరికింది. నేత పరిశ్రమలోని మూడంచెల వ్యవస్థ స్థానంలో కార్మికులతో కూడిన 127 మ్యాక్స్‌ సొసైటీలు స్వయం సహాయకంగా అభివృద్ధి చెందేందుకూ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే ఈ సొసైటీలకు తగిన ఆర్థిక వనరులు లేకపోవడం వల్ల నేత పరిశ్రమ పాక్షికంగా తిరిగి మాస్టర్‌ వీవర్స్‌ చేతుల్లోకే వెళ్లింది. మరోవైపు, విద్యుత్తు రాయితీలను ఎత్తివేయడమూ ఇబ్బందికరమైంది. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ చీరలకు ఆర్డర్లను ఇచ్చి పరిశ్రమకు పునరుత్తేజం కల్పించే ప్రయత్నం చేస్తోంది. దాంతోపాటు కుటీర పరిశ్రమ గుర్తింపును మరింత విస్తరించింది. సంబంధిత ఉత్తర్వులు పూర్తి స్థాయిలో అమలు కావాల్సి ఉంది.

శాశ్వత పరిష్కారం కోసం...

మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించడానికి ఏపీ ప్రభుత్వం నిశ్చయించింది. చేనేత పరిశ్రమపై ఆధారపడిన ఎన్నో కుటుంబాలకు ఇది మేలు చేస్తుంది. అయితే, ఈ పరిశ్రమ మొత్తాన్ని ఒకేగాటన కట్టేసి 12శాతం జీఎస్టీ విధించడం వల్ల నేత కార్మిక కుటుంబాలు మళ్లీ సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో చేనేత వస్త్రాలపై జీఎస్టీని భరించడానికి ఏపీ ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయం. చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న మొత్తం సమస్యలను ప్రభుత్వాలు గమనంలోకి తీసుకోవాలి. దాహం అయినప్పుడు బావి తవ్వడం మాదిరిగా కాకుండా కార్మికుల సంక్షేమానికి దీర్ఘకాలిక వ్యూహ రచన చేయాలి. ఇందుకోసం నిపుణులతో ఒక కమిటీ వేసి చేనేత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలి.



జూకంటి జగన్నాథం
ప్రముఖ కవి, రచయిత



నేత్రపర్వంగా కృష్ణమ్మకు నవ హారతులు



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో దుర్గాఘాట్‌లో కృష్ణమ్మ నదీ హారతులు బుధవారం నేత్ర పర్వంగా నిర్వహించారు. వేదంపడితుల మంత్రోచ్ఛారణ మధ్య ఓంకారం, నంది, సూర్య, చంద్ర, నక్షత్ర, సింహ, నాగ, పంచ, కర్పూర హారతులను అర్చకులు సమర్పించారు. దేవస్థానం ఈవో శీనానాయక్ కుటుంబ సభ్యులతో కలిసి తిలకించారు. అనంతరం ఈవో దేవస్థానం బస్సులో ఘాట్ రోడ్డు మీదుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. బస్సులో భక్తుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

పెరిగిన వరద ప్రవాహం

బ్యారేజీ 35 గేట్ల ఎత్తివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం వరద ప్రవాహం పెరిగింది. ఉదయం 9 గంటల నుంచి వరద ప్రభావం కన్పించగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి పెరిగింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిలకడగా ఉంది. ఈక్రమంలో సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 43,921 క్యూసెక్కుల నీరు రాగా, 35 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 25,375 క్యూసెక్కులు, కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు 18,546 క్యూసెక్కులను విడుదల చేశారు. రాత్రి 8 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ✦ కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 10,342, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 8,004, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 5,017, బందరు కాల్వకు 1,982, కేఈబీ కాల్వకు 1,832, ఏలూరు కాల్వకు 1,511 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

తూకంలో కోత.. లాభాలే మేత..!

☛ **తాడిగడపలో** ఓ ప్రైవేటు ఉద్యోగి స్థానికంగా ఓ మాంసం దుకాణంలో రూ.700 చెల్లించి కిలో మటన్ కొన్నారు. తూకంలో వేసినప్పుడు కిలో పైన 10 గ్రాములు ఎక్కువ ఉంది. అనుమానం వచ్చి మరో దుకాణంలో తూకం వేస్తే 890 గ్రాములే ఉంది. రెండు జిల్లాల్లోని 50శాతం పైగా మాంసం, చేపలు, రొయ్యల దుకాణాల్లో యథేచ్ఛగా ఈ తరహా అక్రమాలు జరుగుతున్నాయి. కొందరు వ్యాపారులు తెలివిగా ఎలక్ట్రికల్ కాటాల్లో కేజీల మోడ్‌ను లీటర్ల మోడ్‌గా మార్చి ఏమారుస్తున్నారు.

☛ **కిరాణా, ఫ్యాన్సీ దుకాణాల్లో** ముద్రిత ధరల కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారు. గొల్లపూడి పరిధిలోని ఓ శీతల పానీయాల దుకాణంలో ఓ విద్యార్థిని రూ.20 ముద్రిత ధర ఉన్న శీతల పానీయం కొనుగోలు చేసింది. రూ.20 ఇస్తే దుకాణదారులు మరో రూ.5 ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీ రూ.20 కదా అని ప్రశ్నించగా కూలింగ్ చేయడానికి అదనం అని జవాబిచ్చారు. ఇలా తాగునీరు, పాలు, పెరుగు వంటి చాలా పదార్థాల విషయంలో ఎమ్మార్పీకి అదనంగా వసూలు చేస్తున్నారు.

అధికారుల తనిఖీలు 'తూచ్'!

ఈనాడు, అమరావతి

కిరాణా కొట్టు నుంచి పెట్రోల్ బంకు వరకు.. కూరగాయల అంగడి నుంచి మాంసం దుకాణం దాకా ఇలా ఏ వస్తువు కొన్నా తప్పుడు కాటాలతో మాయ చేసేస్తున్నారు. వినియోగదారులు ఎలా నష్టపోయారో తమకే తెలియకుండా దోచేస్తున్నారు. నిరంతర తనిఖీలు చేస్తూ అక్రమాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన తూనికలు కొలతల శాఖ అరకొర తనిఖీలతో మమ అనిపిస్తోంది. దీంతో వ్యాపారులది ఇష్టారాజ్యమైంది

2023-24 నుంచి..

జిల్లా	కేసులు	జరిమానా (రూ.లక్షల్లో)
ఎన్టీఆర్	831	58.7
కృష్ణా	749	35.6



మాంసం దుకాణంలో తరాజు తనిఖీ

తనిఖీలకు తిలోదకాలు.. తూకాల్లో తేడాలు, అధిక ఎమ్మార్పీలు, ఇతర సమస్యలపై మీకోసంతో పాటు, నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫిర్యాదులు.. వినియోగదారులు నేరుగా ఇచ్చిన ఫిర్యాదులపైన మాత్రమే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వినియోగదారులు అత్యధికంగా నష్టపోయే బంగారం దుకాణాలు, పెట్రోలు బంకుల్లో తనిఖీలు చేయడం మర్చిపోయారు. ఉమ్మడి జిల్లాలో వేల దుకాణాల్లో అక్రమాలు జరుగుతుంటే అధికారులు మాత్రం గత రెండున్నరేళ్లలో 1580 మందిపై కేసులు నమోదు చేశారు. రూ.94.3లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు.

అవగాహన ఏది.. ఉమ్మడి జిల్లాలో వేల దుకాణాలు ఉన్నాయి. తూనికలు, కొలతల శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేయాలి. తూకాల్లో చేస్తున్న మోసాలపైనా, వాటిని ఎలా గుర్తించాలో ప్రజల్లో అవగాహన కల్పించాలి. మోసం జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలో చెప్పాలి. దీనికి సిబ్బంది కొరత సైతం ఓ కారణం. ఉమ్మడి జిల్లాలో తూనికలు కొలతల శాఖలో మొత్తం 28 మంది సిబ్బందికి 12 మందే ఉన్నారు. కొలతల్లో తేడాలు, ఇతర మోసాలపై వినియోగదారులు 1917 నంబరుకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా తూనికలు కొలతలశాఖ ఇన్‌ఛార్జి ఉప నియంత్రికులు హరిప్రసాద్ తెలిపారు.

ఇదేం మర్యాద.. ఎన్నాళ్లీ బాధ?



★ ప్రొటోకాల్‌పై జనసేన ఎమ్మెల్యే ఫిర్యాదు.. సిబ్బందిపై చర్యలు
★ దుర్గగుడిలో లోపాలు సరిదిద్దకుంటే పరిస్థితి మారదు

ఈనాడు, అమరావతి

జనసేన పార్టీకి చెందిన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దుర్గగుడికి మంగళవారం ఉదయం దర్శనానికి వచ్చారు. ఎమ్మెల్యేకు ఉన్న ప్రొటోకాల్ ప్రకారం కొండపై ఉన్న సమాచార కేంద్రం వరకూ కారును అనుమతిస్తారు. కానీ ఓం టర్నింగ్ వద్దే ఎమ్మెల్యే కారును సిబ్బంది ఆపేశారు. ఎమ్మెల్యేకు అమ్మవారి దర్శనం చేయించే విషయంలోనూ ప్రొటోకాల్ పాటించలేదు. మనస్తాపానికి గురైన ఆయన ఈవోకు ఫిర్యాదు చేశారు. సీఎంవోకు సైతం ఫిర్యాదు చేస్తానంటూ తెలిపారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికీ వెళ్లడంతో తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది. దీంతో ప్రొటోకాల్ విధుల్లో ఉన్న ఐదుగురు సిబ్బందిని ఆ బాధ్యతల నుంచి తప్పించి మెమోలు జారీ చేశారు.

ఇంద్రకీలాద్రిపై ప్రొటోకాల్ విషయంలో గతంలోనూ ప్రముఖులు వచ్చే సమయంలో అనేక వివాదాలు తలెత్తాయి. కొన్నాళ్ల కిందట ఓ మంత్రి దర్శనానికి వస్తే సరిగా స్పందించలేదంటూ ఈవోపై వేటు వేశారు. ఆ తర్వాత కూడా ప్రొటోకాల్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఏఈవో స్థాయి నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకూ అనేక మందిపై వేటు పడింది. అయినా పరిస్థితి మారలేదు. ఈ ఏడాది జనవరిలోనూ టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ కుటుంబంతో దర్శనానికి వస్తే సరిగా పట్టించుకోలేదంటూ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి ఫిర్యాదు చేయడంతో ప్రొటోకాల్ విధుల్లో ఉన్న ఐదుగురు సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. మంత్రి స్వయంగా వచ్చి పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.

దిద్దుబాటు చర్యలు చేపట్టాలి..

దుర్గగుడిలో దర్శనాల విషయంలో జవాబుదారీతనం పెంచాలి. నిత్యం ఆలయానికి వచ్చే ప్రముఖులెవరు? వారిని ఎవరు దర్శనాలకు తీసుకెళ్లాలి? అనేది పక్కాగా రికార్డు ఉండాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు, న్యాయమూర్తులు ఇలాంటి వాళ్ల సమాచారం ఈవో కార్యాలయం దృష్టికి ఎప్పటికప్పుడు తెలియజేసే వ్యవస్థ పక్కాగా ఉండాలి. ★ అమరావతి రాజధాని నేపథ్యంలో దుర్గగుడికి వచ్చే ప్రముఖుల సంఖ్య పెరగబోతోంది. వీఐపీ, వీవీఐపీలు ఎవరొచ్చినా దుర్గమ్మను దర్శించుకోకుండా వెళ్లరు. దీనికి తగ్గట్టుగా ప్రొటోకాల్ వ్యవస్థ పక్కాగా సిద్ధం చేయాలి. ★ గుడి తెరిచే సమయం నుంచి మూసే వరకూ వీఐపీల తాకిడి ఉంటోంది. మూడు షిఫ్టుల్లో ప్రొటోకాల్ విధులు నిర్వహించేలా సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. ★ ప్రముఖుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లెటర్లను తీసుకొని వచ్చే వారి వివరాలు నమోదు చేసుకుని, ఫాలోఅప్ చేసేందుకు ఒక ప్రత్యేక విభాగం ఉండాలి. ★ ప్రముఖులు ముందే సమాచారమివ్వాలి: ప్రముఖులు నేరుగా దర్శనాలకు వచ్చే సమయంలో ఆ విషయం స్పష్టంగా ముందుగానే ఆలయానికి వాహన నంబర్లతో సహా సమాచారం ఇస్తే సిబ్బంది అప్రమత్తంగా ఉంటారు. లేదంటే ప్రజాప్రతినిధుల పీఏలు ఫోన్లు చేసి సదరు ఎమ్మెల్యే పేర్లతో ప్రొటోకాల్ దర్శనాలను నమోదు చేయడం పరిపాటిగా మారింది. ఎమ్మెల్యేలు నేరుగా వచ్చినా సిఫార్సుల దర్శనాల కిందే ప్రొటోకాల్ సిబ్బంది పరిగణిస్తున్నారు.

సీఎం మాట.. అక్కాచెల్లెళ్ల బాట..







రాఖీ అంటే ఏదో మొక్కుబడిగా కట్టడం కాదని, భవిష్యత్తు తరాలకు గుర్తుండిపోయేలా, ఆంధ్రప్రదేశ్ మొత్తం స్వచ్ఛాంధ్రగా, పచ్చని చెట్లతో ఆరోగ్యకరమైన వాతారణం ఉండేలా తయారు కావాలంటే ఈ రాఖీపౌర్ణమి నుంచే శ్రీకారం చుట్టాలని సీఎం ఇటీవల పిలుపునిచ్చారు. ఏ సోదరి అన్నయ్యకు రాఖీ కట్టాలన్నా వారి జన్మ నక్షత్రం తెలుసుకుని దానికి తగ్గట్లు విత్తనాలు ఎంచుకుని వాటితో రాఖీలు తయారు చేసి కట్టాలని, ఈ ఏడాది నుంచే ఈ సరికొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని అక్కా చెల్లెమ్మలకు ఇటీవల జరిగిన స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. సీఎం ఆదేశాలతో అక్కచెల్లెళ్లు వారి సోదరుల జన్మ నక్షత్రాలకు సరిపడా విత్తనాలతో రాఖీలు తయారు చేయడం మొదలుపెట్టారు. విజయవాడ రామవరప్పాడుకు చెందిన నాగలక్ష్మి విత్తనాలతో రాఖీలు తయారు చేశారు. స్థానికులందరి నక్షత్రాలు తెలుసుకుని వారికి సరిపడా విత్తనాలతో రాఖీలు తయారు చేసి అవగాహన కల్పిస్తున్నారు. —ఈనాడు, అమరావతి

నగర వనం.. వెళ్లలేరు జనం..







మందుబాబులకు అడ్డాగా మారిపోయిన సుందర ప్రదేశం

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు 2015లో కొత్తూరు తాడేపల్లిలో అప్పటి తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన నగర వనం పార్కు ఇది. చిన్నారులు ఆడుకునేందుకు పార్కు, ఉదయపు నడక, సైక్లింగ్ చేస్తూ సుమారు కి.మీ మేర చెట్ల మధ్య నడుచుకుంటూ వెళ్లేలా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం ఈ నగర వనాన్ని పట్టించుకోకపోవడంతో కొండ శివారున పడవ ఆకారంలో ఉన్న వీక్షణ ప్రదేశం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇటీవల ప్రధాన ద్వారం వద్ద కొంత బాగు చేసినా, శివారున ఉన్న వీక్షణ ప్రదేశం, చెట్ల కొమ్మలతో చేసిన నిచ్చెన, పుట్టగొడుగు, సైకిల్ తొక్కే మార్గం చుట్టూ కంప చెట్లు భారీగా పెరిగి అక్కడి వరకు వెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదు. అధికారులు స్పందించి శివారుపై దృష్టి సారించి కంపచెట్లు తొలగిస్తే సందర్శకులకు అనువుగా ఉంటుంది. - ఈనాడు, అమరావతి

రక్షిత నీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ రక్షిత తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గుత్తేదారునికి చెల్లింపులు, ఉద్యోగులకు జీతాలు రాకపోవడంతో 104 నివాస ప్రాంతాలకు తాగునీరు అందించే మైలవరం సమగ్ర రక్షిత మంచినీటి పథకం(సీపీడబ్ల్యూ) కొద్ది రోజులపాటు నిలిచిపోయింది. తిరిగి పునరుద్ధరించిన క్రమంలో.. జిల్లా పరిషత్తు, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించి సమీక్షించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 19 సీపీడబ్ల్యూ పథకాలు ఉన్నాయని, తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బిల్లుల చెల్లింపులు, మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు అరికట్టడం, పంపు హౌస్, మోటార్లు సక్రమంగా పనిచేసేలా చూడడం వంటి వాటిపై క్షేత్రస్థాయిలో నిరంతర సమీక్షలు అవసరమన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, డీఈఈ వి.రవికుమార్, ఏఈఈ దయానంద్, సీపీడబ్ల్యూ గుత్తేదారు వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతుల పంపిణీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు

మంగళగిరి, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు చేపట్టింది. ఈ ఏడాది అక్టోబరు 13 నుంచి 17 వరకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో 'మంగళకరం 2025'పేరుతో జమ్ ఎంకే- 1 ప్రోస్థటిక్ కృత్రిమ చేతులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షుడు ప్రగడ రాజశేఖర్ తెలిపారు.

అక్టోబర్ 13 నుంచి 17 వరకు

ఈ మేరకు రోటరీ డిస్ట్రిక్ట్ 5130 గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్, పీడీజీ అన్నె రత్నప్రభాకర్ రోటరీ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌చక్రవర్తి ఇసునూరి, పూర్వ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ చనుమోలు గోపాల్‌తో కలిసి బుధవారం దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలుగు రాష్ట్రాల్లో చేతులు కోల్పోయి దివ్యాంగులుగా ఉన్న వారికి అత్యాధునిక సాంకేతికతతో జర్మనీలో తయారైన జమ్ ఎంకే -1 కృత్రిమ చేతులు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. శరీర ఆకృతికి తగ్గట్లుగా వీటిని అప్పటికప్పుడు తయారుచేసి అమర్చనున్నట్లు చెప్పారు. దివ్యాంగులు హెల్ప్‌లైన్ నంబర్ 720 740 3150కు ఫోన్‌చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

బకాయి చెల్లించకుండా మోసం

కేసు నమోదు చేసిన పోలీసులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: వ్యాపారికి బకాయి చెల్లించకుండా మోసం చేసిన ఎస్ఆర్‌వీ సీ పుడ్స్‌పై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కె.ఆర్.వి. సీ పుడ్స్‌కు విజయవాడకు చెందిన బండి పాండురంగ విఠల్ సముద్ర ఉత్పత్తులు సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో విఠల్‌కు సదరు సంస్థ రూ.1.54 కోట్ల బకాయి పడింది. బకాయి సొమ్ము చెల్లించాలని సంస్థ యజమానులు కర్రా వెంకటరమణారెడ్డి, కర్రా లక్ష్మి, కర్రా విజయ సింహారెడ్డిలను విఠల్ పలుమార్లు అడిగారు. వారిచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో సొమ్ము చెల్లించాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. లీగల్ నోటీసులు పంపించారు. అయినప్పటికీ బకాయి చెల్లించకపోగా.. వెంకటరమణారెడ్డి, అతని భార్య లక్ష్మిలు బెదిరింపులకు దిగారు. దీంతో విఠల్ సూర్యారావుపేట పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా, వారు మోసం కేసు నమోదు చేశారు.

పాలుపోని జన్మ.. ప్రాణమిచ్చెనమ్మా!

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

ప్రస్తుతం నెలలు నిండకుండా, తక్కువ బరువుతో శిశువులకు జన్మనిచ్చే తల్లులకు పాలు రావడం లేదు. సాధారణంగా ప్రసవించినా కొందరికి పాలు ఉండడం లేదు. ఫలితంగా పిల్లలకు తల్లి పాలు లేకుండా పోతున్నాయి. పసి ప్రాయంలోనే తల్లి పాలు ఇస్తే ఎదుగుదల బాగుంటుంది. రోగనిరోధకశక్తి పెరుగుతుంది. భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటారు. ప్రస్తుతం తమ బిడ్డకు పెట్టగా మిగిలిన పాలను వేరొకరికి ఇచ్చేందుకు కొంతమంది తల్లులు ఆసక్తి చూపుతున్నారు. ఆస్పత్రులు కూడా మిల్క్ బ్యాంకులు నిర్వహిస్తున్నాయి. తల్లిపాల విశిష్టత తెలుసుకున్న మాతృమూర్తులు కొంత మంది శిశువుల ప్రాణాలైనా కాపాడాలనే ఉద్దేశంతో పాలు భద్రపరిచి ఆసుపత్రులకు అందజేస్తున్నారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

మరికొందరికి ఉపయోగపడతాయని..



కాన్పు సమయంలో చాలా సమస్యలు ఎదుర్కొన్నా. పాలు రాలేదు. ఎన్నో అవస్థలు పడ్డాను. ఫార్ములా మిల్క్ పట్టాం. నాలుగు నెలల తర్వాత బిడ్డకు సరిపోగా పాలు మిగిలేవి. మరి కొందరికి ఉపయోగపడతాయని పాలు భద్రపరచాలనే ఆలోచన వచ్చింది. రోజుకు 200 నుంచి 300 ఎంఎల్ నిల్వ చేశాను. విషయాన్ని ఆస్పత్రి వైద్యులకు చెబితే సిబ్బంది వచ్చి తీసుకెళ్లారు. - మోహన ప్రియ, బెంజి సర్కిల్



మరో తల్లి ఆవేదన పడకూడదని..

కాన్పు సమయంలో అధిక రక్తపోటు, డెంగీ వచ్చింది. సిజేరియన్ చేసి బిడ్డను తీయాల్సివచ్చింది. శిశువు బరువున్నా పాలు ఉండేవి కావు. ఫార్ములా పాలు ఇవ్వడానికి మనసు ఒప్పుకోలేదు. ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఆ బాధ ఏ తల్లీ పడకూడదని ఈ ఏడాది ఫిబ్రవరి 16 నుంచి జూన్ 17 వరకు రోజుకు 200 నుంచి 500 ఎంఎల్ వరకు భద్రపరిచాను. ఇప్పటివరకు 52.5 లీటర్ల పాలను బ్యాంక్‌కు ఇచ్చా. - మేడా హారిక, విజయవాడ వన్‌టౌన్

స్నేహితురాలి బాధ నుంచి ఆలోచన



నా స్నేహితురాలు ఆరో నెలలోనే ప్రసవించింది. పాలు రాక ఐసీయూలో ఆమె ఇబ్బందులు కళ్లారా చూసి చలించిపోయా. ఈ ఏడాది జనవరిలో నాకు బాబు పుట్టాడు. స్నేహితురాలి బాధ నుంచి పాలు భద్రపరచాలనే ఆలోచన చిగురించింది. వైద్యుల సలహా తీసుకొని ఏప్రిల్ నుంచి పాలు సేకరించి ఇప్పటివరకు దాదాపు 6 లీటర్లు ఇచ్చా. - మానస చౌదరి, ఉయ్యూరు

ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి



ధ్రువపత్రాలు అందజేస్తున్న మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న సీఎం చంద్రబాబు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం మహాత్మాగాంధీరోడ్డులోని అమరావతి కన్వెన్షన్ హాలులో మెప్మా ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు 'లీప్'పై ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తేజ్‌భరత్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ మహిళల వ్యాపారాలు స్థానిక స్థాయి నుంచి గ్లోబల్ స్థాయికి పెంచడమే తమ లక్ష్యమన్నారు. ఇందుకు అవసరమైన నైపుణ్యాలు, మార్గదర్శకత్వం, సాంకేతిక సాయం, ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం పలువురు మహిళలు తాము సాధారణ స్వయం సహాయక సంఘాల నుంచి స్టార్ పెర్ఫార్మర్లుగా మారిన అనుభవాలను వివరించారు. వ్యాపార ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలు, మెప్మా సాయంతో వచ్చిన మార్పులు తెలిపారు. ఇండియా ఎస్ఎంఈ ఫోరం ప్రతినిధులు వ్యాపారాభివృద్ధికి ఉన్న అవకాశాలు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధులు, నగరపాలకసంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైలు

గుంటూరు రైల్వే: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు మీదుగా ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు మండల రైల్వే అధికారి బుధవారం తెలిపారు. చర్లపల్లి నుంచి కాకినాడ వెళ్లే ప్రత్యేక రైలు(07031) ఈనెల 8న చర్లపల్లిలో 19.30 గంటలకు బయలుదేరి సత్తెనపల్లి 22.58, గుంటూరు 00.05, విజయవాడ 01.30, కాకినాడ 09.00 గంటలకు వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు(07032) 10న కాకినాడలో 20.10 గంటలకు ప్రారంభమై విజయవాడ 00.50, గుంటూరు 01.40, సత్తెనపల్లి 02.23, చర్లపల్లి 08.30 గంటలకు చేరుతుంది.

బడిలో మత్తు.. బుడతలు చిత్తు!

పాఠశాలలకు విస్తరించిన గంజాయి



"గంజాయి మత్తు పాఠశాలకూ విస్తరిస్తోంది. నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో నిత్యం గంజాయి పట్టుబడుతూనే ఉంది. విజయవాడ పరిధిలోని విద్యా సంస్థలే లక్ష్యంగా గంజాయి ముఠాలు విక్రయాలు కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకూ కళాశాలలకే పాకిన మత్తు.. ప్రస్తుతం పాఠశాలలనూ ముంచెత్తుతోంది. ఇది అదుపు చేయలేని పరిస్థితికి చేరింది. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఎక్కడో ఒకచోట మత్తులో జోగే విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తిస్తూనే ఉన్నారు."

"ప్రధానంగా ఎనిమిదో తరగతి నుంచి పది వరకూ ఉండే విద్యార్థులే ఈ మత్తులో జోగుతున్నారు. చెడు స్నేహాల ప్రభావంతో.. పాఠశాల ప్రాంగణాలు, వెలుపల గంజాయి, మత్తుపదార్థాలను విచ్చలవిడిగా సేవిస్తున్నారు. గంజాయి విక్రయ ముఠాలు కావాలనే విద్యార్థులకు మత్తును అలవాటు చేస్తున్నాయి. తొలుత ఉచితంగా ఇవ్వడం అలవాటు పడ్డాక.. డబ్బులు పిండుతున్నారు."

– ఈనాడు, అమరావతి

హేమంత్ అరెస్టుతో దిగ్భ్రాంతికర వాస్తవాలు

ఇటీవల గంజాయి కేసులో అరెస్టయిన రౌడీషీటర్ హేమంత్ అలియాస్ నాని అలియాస్ సముద్రపు దొంగ విచారణలో పలు దిగ్భ్రాంతికర విషయాలు తేలాయి. ముగ్గురు సభ్యులతో ముఠాను పెట్టి.. గత రెండేళ్లుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఎక్కువగా విద్యార్థులే ఉన్నట్లు తేలింది. వీరు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్డర్లు తీసుకుని, ఆటోలో తిరుగుతూ గంజాయి పొట్లాలు అందజేసేవారు. ఈ ముఠా మత్తు.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు తరచూ అందించేవారు. సుమారు 50 మంది వరకు విద్యార్థులు గంజాయి కొనేవారని తెలిసింది. వీరిలో బాలికలు కూడా ఉన్నారని గుర్తించారు. విద్యార్థుల్లో చాలా మందిని తన వెంట తిప్పుకొనేవాడు. వారంతా హేమంత్‌ను డాన్‌గా కీర్తించే వాళ్లు. పేరు మోసిన రౌడీషీటర్‌గా ఎదగాలనే తాపత్రయంతో పలువురు విద్యార్థుల జీవితాలను నాశనం చేసినట్లు బయటపడింది.

వ్యసనం బారిన భావితరం...

రౌడీషీటర్లకు ఆదాయ వనరు...

విజయవాడ నగరంలో రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నాయి. నగర బహిష్కరణ విధిస్తున్నా.. కార్యకలాపాలు మాత్రం ఆగడం లేదు. వీరిలో పలువురు గంజాయి, దందాలను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. గంజాయిని తెప్పించి, నగరంలో అమ్మకాలు సాగిస్తున్నారు. తద్వారా వచ్చే ఆదాయంతో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నారు. దందాల ద్వారా కూడా ఆర్జిస్తూ తమ గ్యాంగులను పోషిస్తున్నారు. రౌడీషీటర్లు, వారి అనుచరుల్లో చాలా మంది ఖరీదైన బైకులపై తిరుగుతున్నారు. వీటిని ఏజెన్సీ నుంచి గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్నారు. చదువు మధ్యలో మానేసిన మైనర్లను కూడా రౌడీలు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. వీరి ద్వారా పాఠశాలల విద్యార్థులకు మత్తుకు బానిసలను చేస్తున్నారు.

గంజాయి దొరక్కపోతే వైట్నర్.. గంజాయి దొరక్కపోయినా.. కొనేందుకు డబ్బులు లేకపోయినా ఆ సమయానికి మత్తు ఇచ్చే ఏది దొరికితే దానిని పీలుస్తున్నారు. ప్రధానంగా రంగుల్లో వినియోగించే తిన్నర్, వైట్నర్, గమ్ ట్యూబ్స్, గోళ్ల రంగులు వంటి వాటిని వినియోగిస్తున్నారు. వీటిని పాలిథిన్ కవర్లు, గొట్టాలలో వేసి పీలుస్తూ టీచర్లకు దొరికిపోతున్నారు. చాలా మంది విద్యార్థుల బ్యాగుల్లో ఇవి విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. ఇలాంటి విద్యార్థుల విషయంలో ఎలా స్పందించాలో కూడా తెలియని పరిస్థితి ఉపాధ్యాయుల్లో నెలకొంది.

గుర్తింపు లేని శ్రమ.. భరోసా ఇవ్వదు బీమా

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణ రంగం ఊపందుకుంది. రాజధాని అమరావతితో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలో అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, గృహ నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు ఆరు లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉమ్మడి కృష్ణాలో ఉపాధి పొందుతున్నారు. కార్మిక శాఖలో మాత్రం కేవలం 2,37,606 మంది మాత్రమే తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అవగాహన లేక కొంత మంది, పరిహారం రావడం లేదని మరికొంతమంది తమ వివరాలు కార్మిక శాఖలో నమోదు చేసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికులకు అండగా నిలుస్తామని ప్రకటించింది. పథకాలు పునరుద్ధరిస్తామని ఇటీవల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. వైకాపా ప్రభుత్వంలో రద్దు చేసిన కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సేవలు ప్రారంభమైతే ఉమ్మడి కృష్ణాలో మృతి చెందిన 788 మంది కార్మికుల కుటుంబాలకు పరిహారం అందుతుంది. అనుకోకుండా ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులకు బీమా భరోసాగా నిలుస్తుంది.



రూ.110 చెల్లించి..

భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు చేసుకుంటేనే ప్రమాదంలో మృతి చెందినా, గాయపడినా పరిహారం అందుతుంది. కార్మిక శాఖకు రూ.110 చెల్లించి కార్మికుడిగా తమ పేరు నమోదు చేసుకోవాలి. ఐదేళ్ల తర్వాత రూ.60 చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. పని ప్రదేశంలో చనిపోతే రూ.5 లక్షలు, గాయపడితే అంగ వైకల్యం శాతానికి అనుగుణంగా పరిహారం చెల్లిస్తారు. శాశ్వత అంగ వైకల్యం పొందితే రూ.5 లక్షలు, సాధారణ మరణమైతే రూ.60 వేల ఆర్థిక సాయం చేస్తారు. మహిళా కార్మికులకు ఒక్కొక్క కాన్పునకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు.

పేర్లు నమోదు చేసుకుంటే మేలు

రూ.110 చెల్లించి భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు కావాలి. ఫలితంగా ప్రమాదం జరిగినప్పుడు బీమా వర్తిస్తుంది. అందులోని సౌకర్యాలన్నీ అమలవుతాయి. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, గత సంక్షేమ పథకాల పునరుద్ధరణపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది. వాటిని అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. **- సీహెచ్ ఆశారాణి, ఉమ్మడి కృష్ణా జిల్లా ఉప కార్మిక శాఖాధికారిణి**

రూ.1.90 కోట్లతో లింగాల కాజ్‌వే సిద్ధం

నేడు అధికారికంగా ప్రారంభోత్సవం

వత్సవాయి, న్యూస్‌టుడే

ఆంధ్రా- తెలంగాణకు అనుసంధానంగా ఉన్న లింగాల కాజ్‌వేపై ఇక వాహనాలు రైమంటూ తిరగనున్నాయి. రూ.1.90 కోట్లతో చేపట్టిన శాశ్వత మరమ్మతు పనులు పూర్తవడంతో గురువారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్య తీరనుండడంతో వాహనదారులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు కథనాలకు స్పందన



ప్రచురితమైన కథనం



పూర్తయిన కల్వర్టు

తెలుగు రాష్ట్రాల అనుసంధానానికి కీలక మార్గం

గత ఏడాది సెప్టెంబరులో మునేరుకు వచ్చిన భారీ వరదలకు లింగాల కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల నడుమ కీలకమైన రహదారి కావడంతో రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. సాధారణ రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. జగ్గయ్యపేట ప్రాంతంలో ఉన్న సిమెంటు పరిశ్రమలకు ముడి సరకు రవాణాకు ఈ మార్గమే కీలకం కావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. వత్సవాయి మండలంలోని సగం గ్రామాల ప్రజలు జగ్గయ్యపేటకు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చొరవ తీసుకొని సిమెంటు పరిశ్రమల యజమాన్యం సహకారంతో తాత్కాలిక మరమ్మతులు చేయించి చిన్నపాటి వాహనాల రాకపోకలకు అనువుగా రోడ్డు నిర్మాణం చేశారు. అది కూడా కొంతకాలానికే గోతులమయంగా మారడంతో శాశ్వత మరమ్మతులకు ప్రతిపాదించారు.

కదిలించిన వరుస కథనాలు..

ఒకవైపు సిమెంటు పరిశ్రమల ముడిసరకు రవాణా, మరోవైపు మండలంలోని సగం గ్రామాల వారు రాకపోకలకు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించడం జరిగింది. స్పందించిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఆర్అండ్‌బీ అధికారులు శాశ్వత మరమ్మతులకు రూ.1.90 కోట్లు మంజూరు చేయించారు. జూన్‌లో పనులు చేపట్టిన గుత్తేదారు జులై నాటికి 80 శాతం పనులు పూర్తిచేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. కొంతమేర చేపట్టిన స్లాబు కల్వర్టుల నిర్మాణం సైతం పూర్తి కావడంతో గురువారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

దేశ చరిత్రలో గ్రంథాలయాలకు విశిష్ట స్థానం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: దేశ చరిత్ర, సంస్కృతిలో గ్రంథాలయాలకు విశిష్ట ప్రాధాన్యం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. ప్రతి ఊరిలో ఒక గుడి, బడి, గ్రంథాలయం ఉండాలని సూచించారు. బుధవారం సాయంత్రం విజయవాడ రామ్మోహన గ్రంథాలయంలో అభిమానుల కలయిక జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకయ్యనాయుడు గ్రంథాలయాల విశిష్టతను వివరించారు. సామాజిక ఉద్యమాల్లో చైతన్యం కలిగించింది గ్రంథాలయాలే అన్నారు. ఈనెల 12న గ్రంథాలయ దినోత్సవం ఉందని, ప్రతి ఒక్కరూ దీన్ని వేడుకగా చేయాలని సూచించారు. రాజారామ్మోహన్‌రాయ్ ఒక సంఘ సంస్కర్త అని, ఆయన పేరుతో ఈ గ్రంథాలయం ఏర్పడడాన్ని కొనియాడారు. గ్రంథాలయాల నిర్వహణలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పుస్తకాన్ని మస్తకంలో(బుర్ర) ఎక్కించుకుంటేనే విజ్ఞానం అబ్బుతుందని, దానికి కులమతాలు లేవన్నారు. గూగుల్ వచ్చినా గ్రంథాలయానికి విలువ తగ్గలేదని, వీటిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజలు కూడా మన చుట్టూ జరిగే అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు రామ్మోహన గ్రంథాలయం ఒక చిహ్నమన్నారు. గ్రంథాలయ ఉద్యమాన్ని మలుపు తిప్పింది ఇదేనని, దీన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మహాత్మాగాంధీ విజయవాడకు వచ్చినప్పుడు ప్రజలతో మాట్లాడిన వేదిక ఇదేనని గుర్తు చేశారు. తెలుగు వారికి జ్ఞానభిక్షను అందించిన ఈ గ్రంథాలయం అందరికీ స్ఫూర్తినిస్తోందని ప్రశంసించారు. నాటి చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన ఈ వేదిక మళ్లీ కళకళలాడాలని ఆకాంక్షించారు. దీనికి ముందు డాక్టర్ జి.వి.పూర్ణచంద్ గ్రంథాలయ చరిత్రను సభికులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, గ్రంథాలయం అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును సన్మానిస్తున్న చింతలపూడి కోటేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు

బంగారు కుటుంబాలపై చల్లని చూపు



కలెక్టర్ లక్ష్మీశకు అంగీకారపత్రాన్ని అందిస్తున్న డాక్టర్ శైలజ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీ-4 విధానంలో భాగంగా పేదరిక నిర్మూలన కోసం, బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శిగా నగరంలోని అమరావతి ఐ ఆసుపత్రి వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కేతినేని శైలజ దత్తత ప్రతిజ్ఞా పత్రాన్ని, కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు బుధవారం అందజేశారు. ఆసుపత్రి బ్రాంచి హెడ్ పి.కోటిరత్నం పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




సదస్సులో ప్రసంగిస్తున్న పద్మావతి

కానూరు, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమష్టి కృషి, పటిష్ఠ భాగస్వామ్యంతో ఎన్టీఆర్ జిల్లాను బాలల స్నేహపూరిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి అన్నారు. బుధవారం కానూరులోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎన్టీఆర్ జిల్లా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో ప్రహరీ, ఈగల్ క్లబ్‌లు, చిల్డ్రన్స్ యాంటీ ర్యాగింగ్, శక్తి కమిటీలు, ఫిర్యాదు బాక్సులు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. అనాథలు, తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి.. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా విద్యాధికారి యూవీ సుబ్బారావు, ఏపీపీ కె.వెంకటేశ్వరరావు, ఆర్ఐవో ప్రభాకర్, డీసీపీవో ఎం.రాజేశ్వరరావు, సాంఘిక సంక్షేమ అధికారి అబ్దుల్‌రబ్బానీ, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆశారాణి, సీడీపీవోలు, ఎంఈవోలు, పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

కమనీయం.. నవనీత కృష్ణుడి పవిత్రోత్సవం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు తిరునగరి గోపాలాచార్యుల ఆధ్వర్యంలో రుత్విక్ బృందం స్వామివారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాత సేవ, విశేషార్చన నిర్వహించి పవిత్రమాలలతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీకృష్ణపరమాత్మకు అష్టకలశ స్నపన, వస్త్రసమర్పణ చేశారు. తదుపరి యాగశాలలో పలు హోమాలు జరిపించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, తెదేపా నాయకులు బెల్లం మధుసూదనరావు, పాలక వర్గ సభ్యులు దాతలు, భక్తులు పాల్గొన్నారు. గురువారం నిర్వహించే ప్రధానహోమం, పూర్ణాహుతి, దాతలకు పవిత్రాల బహూకరణతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ అధికారులు తెలిపారు.



పవిత్రమాలలతో అలంకరించిన నెమలి వేణుగోపాలస్వామి

రెయిన్ బో ఆసుపత్రిలో మిల్క్ బ్యాంక్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నెలలు నిండని నవజాత శిశువులకు తల్లి పాలు చాలా అవసరమని, ఆ దిశగా మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీపీ సరిత అన్నారు. విజయవాడ రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో తల్లి పాల బ్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలు అందుబాటులో లేని పసి పిల్లలకు ఈ బ్యాంక్ ద్వారా పాలు అందించి ప్రాణాలు కాపాడవచ్చని, ఫలితంగా శిశు మరణాలను తగ్గించవచ్చని అన్నారు. తల్లి పాల బ్యాంక్ ఆవశ్యకతను వైద్యుడు రాం ప్రసాద్ వివరించారు. మిల్క్ బ్యాంక్‌లో 500 లీటర్ల పాలు నిల్వ చేసే సామర్థ్యం ఉందని ఆయన తెలిపారు. ఎవరైనా తల్లులు తమ బిడ్డకు పట్టగా మిగిలిన పాలను ఇక్కడ దానం చేయవచ్చని, నిల్వ చేసి అవసరమైన వారికి అందిస్తామని వైద్యుడు వంశీశివరామరాజు అన్నారు. వైద్యులు బీఎస్‌సీసీ రాజు, ఎడర్, బ్రజిష్ణ పాల్గొన్నారు. మిల్క్ బ్యాంక్ టోల్ ఫ్రీ నంబర్ 97037 71222 కు ఫోన్ చేసి సలహాలు పొందవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న డీసీపీ సరిత

కవయిత్రి భానుమతి కన్నుమూత



తాడేపల్లి, న్యూస్‌టుడే: కవయిత్రి శ్రీమతి పాలపర్తి భానుమతి (67) మంగళగిరి మండలం ఎర్రబాలెం అంబటినగర్‌లోని స్వగృహంలో ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఆకస్మికంగా కన్నుమూశారు. గుంటూరు జిల్లా పొన్నూరులో 1958లో జన్మించారు. అచ్చ తెలుగు అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌తో 1980లో ఆమెకు వివాహం జరిగింది. నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆమె పొన్నూరులోని భావనారాయణ స్వామి సంస్కృత కళాశాలలో భాషాప్రవీణ శిక్షణ పూర్తి చేశారు. అనంతరం సాహిత్య రంగంలో అనేక అవధాన ప్రక్రియలు, ఆల్ఇండియా రేడియోలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గత పదేళ్లుగా మంగళగిరిలో నివాసం ఉంటున్నారు. ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. భానుమతి భర్త శ్యామలానందప్రసాద్ విజయవాడలోని సిద్ధార్థ అప్పలస్వామి కళాశాలలో లెక్చరర్, ప్రిన్సిపల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కూడా ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో అచ్చతెలుగు అవధాన ప్రక్రియలు చేశారు. పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాల నిరోధానికి, వీటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్, నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలపై నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ..డ్రగ్స్ అంటే ఏమిటి..ఇవి ఏ రూపాల్లో చొచ్చుకు వస్తున్నాయి.. వీటిని ఉపయోగిస్తున్న వారిని గుర్తించడం ఎలా..సున్నితంగా ఈ సమస్యలను ఎలా పరిష్కరించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హాట్ స్పాట్లను గుర్తించి, ప్రత్యేక అవగాహన సమావేశాలను నిర్వహించాలన్నారు. ఈగల్ క్లబ్బులతోపాటు క్యాంపస్ అంబాసిడర్లు కీలక పాత్ర పోషించేలా చూడాలని, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలన్నారు. దేశం, రాష్ట్రం, జిల్లాను మాదక ద్రవ్య రహితంగా మార్చడానికి ఈనెల 13న విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిజ్ఞ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వద్దు.. స్కిల్స్ ముద్దు..ఈగల్ టోల్‌ఫ్రీ నంబరు 1972 తదితరాలతో కూడిన ఈగల్ క్లబ్బుల ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఏసీపీలు కె.వెంకటేశ్వరరావు, లతాకుమారి, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి వాడ్రేవు కామరాజు, ఈగల్ ఎస్సై ఎం.వీరాంజనేయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు (కిలో ఱ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -99 రిటైల్ ధర 121 చికెన్ విత్ స్కిన్ - 175, చికెన్ స్కిన్‌లెస్ - 200. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ట్విఫ్టింగ్ ధర - 105, 113, 124 చికెన్ విత్ స్కిన్ - 200 చికెన్ స్కిన్‌లెస్ - 210.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 490 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.92/-.

‘క్రీడాకారులకే అవకాశం కల్పించాలి’

గాంధీనగర్: డీఎస్సీలో క్రీడాకారుల కంటే వాటి మీద అవగాహన లేని వారే ఎక్కువగా ఉద్యోగాలు సాధిస్తున్నారని, దీనివల్ల క్రీడాకారుల ఉనికికే ప్రమాదం పొంచి ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.దేవేంద్రగౌడ్ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి క్రీడల్లో అనుభవం ఉన్నట్లు సర్టిఫికెట్లు సంపాదించి డీఎస్సీకి దరఖాస్తు చేశారని, అలాంటి వారిని గుర్తించి అనర్హులుగా ప్రకటించాలని కోరారు.

ముంచెత్తిన సాగునీరు

పాత వేమవరంవాసుల ఆందోళన



ఇంట్లోకి చేరి ఇలా..

వత్సవాయి, న్యూస్‌టుడే: మండలంలోని పాత వేమవరంలో పొలాల్లో పారాల్సిన సాగునీరు గ్రామాన్ని ముంచెత్తడంతో స్థానికులు లబోదిబోమంటున్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న పోలంపల్లి డ్యాం ప్రధాన కాల్వ నుంచి కొన్నేళ్ల కిందట రైతులు అనధికారికంగా తూము ఏర్పాటు చేసి దిగువకు సాగునీరు తరలిస్తున్నారు. ఈ క్రమంలో తూము నుంచి ఒక క్రమపద్ధతి లేకుండా నీటిని విడుదల చేయడంతో బుధవారం నీరంతా పక్కనే ఉన్న గ్రామంలోని పల్లపు ప్రాంతాల్లో ఉన్న సుమారు 15 గృహాలను నీరు చుట్టుముట్టింది. ఇళ్లల్లోకి మోకాలి లోతులో నీరు చేరడంతో ధాన్యం, బియ్యం బస్తాలు తడిసిపోయాయి. ఇంట్లోని సామగ్రి బురద కొట్టుకుంది. ఇళ్ల వద్ద ఉన్న వృద్ధులు ప్రాణ భయంతో బయటకు వెళ్లిపోయారు. వారంతా ఉదయాన్నే పనులకు వెళ్లి సాయంత్రం వచ్చేసరికి ఇళ్లల్లోకి చేరిన నీటిని చూసి ఆవేదనకు చెందారు. తమకు తీరని నష్టం జరిగిందని బాధితులు ఆందోళనకు దిగారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను ప్రాజెక్టు జేఈ ప్రశాంతి వద్ద ప్రస్తావించగా కొన్నేళ్ల కిందట స్థానిక రైతులు తూమును అనధికారికంగా ఏర్పాటు చేసినట్లు తెలిసిందన్నారు. సాగునీటి అవసరాల మేరకు తూమును నిర్వహణ చేయకపోవడం వల్ల నీరు గ్రామంలోకి చేరిందన్నారు. గురువారం గ్రామాన్ని సందర్శించి రైతులు, స్థానికులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తల్లి మందలించిందని అక్కాచెల్లెళ్లు అదృశ్యం

భవానీపురం, న్యూస్‌టుడే: అక్కాచెల్లెళ్ల అదృశ్యంపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు మేరకు.. భవానీపురం అవుట్ ఏజెన్సీ వద్ద నివాసం ఉండే ఓ మహిళకు ఇద్దరు కుమార్తెలు. భర్త ఐదేళ్ల కిందట మృతిచెందాడు. పెద్ద కుమార్తె(15), చిన్న కుమార్తె(14) స్థానికంగా ఉన్న పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇద్దరూ తల్లి ఫోన్ వినియోగిస్తుంటారు. వీరికి ఇన్‌స్టాగ్రామ్‌లో నెల్లూరుకు చెందిన చందు, కృష్ణలతో పరిచయం ఏర్పడింది. వారితో ఛాటింగ్ చేస్తుండగా తల్లి గుర్తించి మందలించింది. దీంతో ఈనెల 6న ఉదయం టిఫిన్ చేసి వస్తామని చెప్పి బయటకు వెళ్లిన కుమార్తెలు తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి భవానీపురం పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవజాత శిశువు మృతి

ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



ఆసుపత్రి సిబ్బందితో శిశువు బంధువుల వాగ్వాదం

కొండపల్లి, న్యూస్‌టుడే: నవజాత శిశువు మృతిపై బంధువులు ఆందోళనకు దిగిన సంఘటన కొండపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం రాత్రి చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి సేకరించిన వివరాలు ప్రకారం..మండలంలోని మూలపాడుకు చెందిన మస్కట్ల రాజేష్, శ్రావణికి గతేడాది వివాహమైంది. ఇద్దరూ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నారు. శ్రావణి గర్భం దాల్చడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. నెలలు నిండే క్రమంలో కొండపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డెలివరీ చేయించుకుందామని భావించి ఇటీవల మూలపాడుకు చేరుకున్నారు. అక్కడే కొద్ది రోజుల నుంచి వైద్యం పొందుతున్నారు. ఈ క్రమంలో స్థానిక ఆసుపత్రిలోని మహిళా వైద్యురాలు బుధవారం మధ్యాహ్నం 3.30 నిముషాలకు ప్రసవం చేశారు. మగ శిశువు అని తల్లి శ్రావణికి తెలిపారు. ఇదిలా ఉంటే 5 గంటల సమయంలో బిడ్డ చనిపోయాడని అక్కడి సిబ్బంది వారికి తెలుపగా కారణం తమకు తెలియాలని బంధువులు సిబ్బందిని నిలదీశారు. ఈ విషయం వాగ్వావాదానికి దారితీసి తోపులాట జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని వారిని నిలువరించారు. శిశువు మృతికి గల కారణాన్ని వైద్య సిబ్బందిని అడగ్గా..శిశువుకు డౌన్ సింద్రోమ్(ఒక కణం తక్కువగా) ఉందని ముందే చెప్పామని వివరణ ఇచ్చారు. అయితే అది వాస్తవం కాదని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందాడని ఆరోపిస్తూ ఆందోళనను కొనసాగించారు. చేసేది లేక ఆసుపత్రి వద్దే బుధవారం రాత్రి పోలీసులు విధులు నిర్వహించారు.

నీట్ యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ పొడిగింపు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: ప్రస్తుత విద్యా సంవత్సరానికి దేశంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల ఆల్ ఇండియా, డీమ్డ్, సెంట్రల్, స్టేట్ కోటా ప్రవేశాలకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ షెడ్యూల్ పొడిగించింది. మొదటి విడత కౌన్సెలింగ్ జులై 21 నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు నిర్వహించాలని, ఆగస్టు 18 తేదీలోగా కళాశాలల్లో చేరాలని నిర్ణయించింది. రెండో విడత కౌన్సెలింగ్ ఆగస్టు 21వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించి, సీట్లు పొందిన వారు సెప్టెంబరు 5వ తేదీ లోగా ఆయా వైద్య కళాశాలల్లో చేరాలి. మూడో విడత కౌన్సెలింగ్ సెప్టెంబరు 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించి, సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబరు 25వ తేదీ లోగా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. మిగులు విడత (స్ట్రే) కౌన్సెలింగ్ సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు నిర్వహించి అక్టోబరు 10వ తేదీలోగా విద్యార్థులు ఆయా కళాశాలల్లో చేరాలి. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రవేశాలకు సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ ఆగస్టు 24, రెండో విడత కౌన్సెలింగ్ సెప్టెంబరు 11, మూడో విడత కౌన్సెలింగ్ సెప్టెంబరు 30, మాప్ అప్ రౌండు అక్టోబరు 10వ తేదీలోగా పూర్తి చేయాలి. సెప్టెంబరు 5వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ★ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు 57 మంది అభ్యర్థులు, మెడికల్ బోర్డు ఎదుట వైకల్య పరీక్షలకు 28 మంది దివ్యాంగులు హాజరయ్యారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

సీహెచ్‌సీలో వైద్యసేవలపై ఆరా


తిరువూరు సీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌సీ అధికారిణి మాధవిదేవి

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అధికారిణి (డీసీహెచ్‌సీ) మాధవిదేవి బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. అందుబాటులో ఉన్న రోగులకు పంపిణీ చేసే మందుల నిల్వను తనిఖీ చేశారు. డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి మూత్రపిండాల వ్యాధి బాధితులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. సీహెచ్‌సీ ఇన్‌ఛార్జి పర్యవేక్షణాధికారి డాక్టర్ పి.భానుతేజ పాల్గొన్నారు.

పీ-4 స్ఫూర్తితో ఆర్థిక సాయం

గొల్లపూడి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం స్ఫూర్తితో రెండు కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని గొల్లపూడికి చెందిన కొమ్మినేని రామారావు మనవరాలు మిహిక అందించారు. గొల్లపూడికి చెందిన బొడ్డు రమేష్‌కు రూ.30వేలు, షేక్.వలీకి రూ.10వేల సాయాన్ని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సమక్షంలో బుధవారం అందజేశారు.

యూటీఎఫ్ సభ్యత్వాల నమోదు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 72 పాఠశాలల నుంచి 110 మంది ఉపాధ్యాయులు సభ్యత్వాలు స్వీకరించినట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఏసుకొండలు, జి.కోటేశ్వరరావు, నాయకులు కె.శ్రీనివాసరావు, రాధాకృష్ణ, సుధాకర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762

? లీలావతి పాఠశాల సమీప ప్రాంతానికి రెండ్రోజులుగా కృష్ణానీటి సరఫరా జరగడంలేదు. **- రాజేశ్వరి, మైలవరం**

✔ సాంకేతిక ఇబ్బందులతో అంతటా సరఫరా ఆగింది. పునరుద్ధరిస్తున్నాం **- ఎండి రఫీ, కార్యదర్శి**

? మైలవరం నారాయణనగర్‌లో తాగునీటి సమస్య ఉంది. కుళాయిలలో నీరొచ్చినా దుర్వాసన వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. **- బడే హజరత్, మైలవరం**

✔ పరిశీలించి, మెరుగైన సరఫరాకు చర్యలు తీసుకుంటాం. **- ఎండి రఫీ, కార్యదర్శి – న్యూస్‌టుడే, మైలవరం**

? చెవుటూరు రామాలయం వీధిలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయింది. తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలి. **- సుబ్బారావు గ్రామస్థుడు**

✔ సిబ్బందితో బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు చర్యలు చేపడతాం. **- మురళీ, పంచాయతీ కార్యదర్శి,** – న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి కొత్తగేటు ప్రాంతంలో కొన్ని రోజులుగా కుళాయిల్లో నీరు రావడం లేదు. తీవ్ర ఇబ్బందిగా ఉంది. **- రాజారావు, కొండపల్లి**

✔ కొండపల్లి కొత్తగేటు ప్రాంతంలో కొన్ని ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం నుంచి మరి కొన్ని ఎన్టీటీపీఎస్ పంప్ హౌస్ నుంచి కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. కార్మికుల సమ్మె నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం నుంచి నీటిని విడుదల చేయలేదు. **- వాసు, తాగునీటి సరఫరా పర్యవేక్షకుడు** – న్యూస్‌టుడే, కొండపల్లి

ఎంఈవో-1గా బండి రాజు


రాజును అభినందిస్తున్న ఎస్టీయూ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారి-1 గా ఎంపికైన బండి రాజు కార్యాలయంలో బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఇందిర, పి.రవిబాబు, కోశాధికారి వరప్రసాద్ తదితరులు ఆయనను కలిసి అభినందించారు.

సొసైటీ అధ్యక్షుల నియామకం

జి.కొండూరు, న్యూస్‌టుడే: మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు చెవుటూరు గ్రామ సొసైటీ అధ్యక్షుడిగా ఈమని మురళీ, వెల్లటూరు సొసైటీ అధ్యక్షుడిగా చింతపల్లి సుధాకర్‌లు ఎన్నికైనట్లు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక తెదేపా నాయకులు వారికి అభినందనలు తెలిపారు.

అందొచ్చిన నీరు.. అన్నదాత హుషారు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

సాగునీటి వనరులకు జలకళ.. ముమ్మరంగా వరినాట్లు


తిరువూరు మండలంలో వరినాట్లు

నియోజకవర్గంలో సాగు నీటి వనరుల్లో జలకళ సంతరించుకుంది. మాగాణి భూముల్లో పక్షం రోజులుగా వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జులై 27 నాటికి తిరువూరు సబ్‌డివిజన్‌లో సాధారణ వర్షపాతం 140 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 100 మి.మీ నమోదైంది. ఫలితంగా మాగాణి సాగుకు ప్రధాన వనరుగా ఉన్న చెరువులు నీటితో తొణికిసలాడుతున్నాయి. పలు గ్రామాల్లో తటాకాలు, అలుగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మాగాణి సాగులో నిమగ్నమైన రైతులు, కూలీలతో పల్లెల్లో సందడి నెలకొంది. జులై మొదటి పక్షంలో వర్షాలు అంతంత మాత్రంగా కురవడం, చెరువుల్లో నీరులేక రైతులు ఆందోళన చెందారు. నారుమడులు సిద్ధం చేసుకుంటున్న కర్షకులు కూడా వర్షాలు వెనుకడుగు వేశాయని, పంట ఆలస్యంగా సాగు చేయాలని భావించారు. అయితే జులై రెండో పక్షంలో విరామం లేకుండా కురిసిన భారీ వర్షాలకు చెరువులకు పుష్కలంగా నీరు చేరింది. వాగులు నిండుగా ప్రవహించి ఎత్తిపోతలకు నీటిని సరఫరా చేస్తున్నాయి. భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెంది బోర్లు, బావులు, చెక్‌డ్యామ్‌ల వద్ద నీరు చేరింది. ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యామ్‌లకు నీరు చేరడంతో సాగర్ కాల్వల ఆయకట్టు రైతులు ముమ్మరంగా వరినాట్లు వేయడంలో లీనమయ్యారు.

ఇప్పటికే 13వేల ఎకరాల్లో.. తిరువూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వరి సాగు విస్తీర్ణం 17వేల హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 13,000 హెక్టార్లలో సాగైంది. ఆగస్టు నెలాఖరుకు సుమారు 40 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేస్తారు. ప్రస్తుతం మాగాణి భూముల్లో ట్రాక్టర్లతో దుక్కులు దున్ని దమ్ము చేస్తున్నారు. ఎదజల్లే పద్ధతిలో సాగు చేసి పొలాల్లో వరి మొక్కలు కూడా మొలిచాయి. ప్రస్తుతం చెరువులకు జలకళ కనిపించడంతో వరి పంటకు సాగు నీరు ఢోకాలేదని హాలికులు భరోసాగా ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



వర్షాలు కురవడంతో వరినాట్లకు సమృద్ధిగా నీరు లభించింది. భూమిని రెండు మూడు దఫాలు దున్నాక అడ్డతో చదును చేసిన మొక్క నాటాలి. ముదురు ఆకు నాటితే దిగుబడి తగ్గుతుంది. 4 లేదా 6 ఆకులు ఉన్న మొక్కలు పైపైన నాటాలి. ప్రతి రెండు మీటర్లకు మధ్య 20 సెం.మీ బాటలు తీయడం మేలు. ఎరువులు, పురుగు మందులు వేయడానికి, పైరు పరిస్థితిని గమనించేందుకు, గాలి వెలుతురు అందేందుకు ఉపయుక్తంగా ఉంటుంది.

- పద్మ, తిరువూరు మండల వ్యవసాయాధికారిణి

ప్రయోగశాలల సందర్శనతో విజ్ఞానం


రసాయన ప్రయోగశాలలో విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులు కళాశాలల్లోని ప్రయోగశాలలను సందర్శించడం ద్వారా ఎంతో ప్రయోజనం, విజ్ఞానం లభిస్తుందని లకిరెడ్డి హనిమిరెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇల్లా రవి పేర్కొన్నారు. స్కూల్ టు ల్యాబ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కళాశాల సందర్శనకు వెళ్లారు. అందులో భాగంగా వృక్ష శాస్త్ర, రసాయన, భౌతికశాస్త్ర ప్రయోగశాలలను, కంప్యూటర్, త్రీడీ ప్రింటింగ్, ఆంగ్ల భాష ల్యాబ్‌లను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను కళాశాల అధ్యాపకులు జె.రాముడు, వి.ఫణికుమార్, వి.ఉమాలక్ష్మి, ఎన్.వెంకటాద్రి తదితరులు తెలియజేశారు.

గృహ నిర్మాణాలపై క్షేత్రస్థాయి పరిశీలన


ప్రభుత్వ భూముల్లోని ఇళ్ల వద్ద తిరువూరు ఆర్డీవో మాధురి, అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చేపట్టిన గృహాల నిర్మాణాలను తిరువూరు ఆర్డీవో మాధురి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రుద్రవరం, నరుకుళ్లపాడు, మద్దులపర్వ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో గృహాలు నిర్మించుకుని ఉంటున్న లబ్ధిదారులు తమకు పట్టాలు ఇప్పించాలని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోగా.. సిబ్బంది పరిశీలించి ఉన్నతాధికారులకు దస్త్రాలు పంపారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిస్థితుల పరిశీలన నిమిత్తం వచ్చిన ఆర్డీవో... ఎన్నేళ్లనుంచి ఉంటున్నారు..ఆ భూమి మీకెలా వచ్చింది తదితర వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎం.సతీష్ కుమార్, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్వోలు నాగజ్యోతి, ఇమ్మానియేలు, లావణ్య, సర్వేయర్‌లు హరి, ప్రభుకుమార్‌లు పాల్గొన్నారు.

250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట వారి ఆధ్వర్యంలో కూనపరాజుపర్వ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, గౌతమ్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు, కెరియర్స్ గైడెన్స్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 28 మందికి దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించామని తెలిపారు. వారికి కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. అనంతరం పాఠశాలకు లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ ఎన్.టి.వెంకటేశ్వరరావు ఫ్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఎం.వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రాయల అయోధ్యరావు, కార్యదర్శి బి.జగన్మోహనరెడ్డి, కోశాధికారి బి.రవిమోహన్, వై.గాంధీ, జాన్ బాబు, కె.రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వైద్యసేవలందిస్తున్న నిపుణులు

తోటివారితో స్నేహభావంతో మెలగాలి



మాట్లాడుతున్న ఏసీపీ వై.ప్రసాదరావు

మైలవరం, న్యూస్‌టుడే: కొత్తగా కళాశాలల్లో చేరే వారితో సీనియర్ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని ఏసీపీ వై.ప్రసాదరావు సూచించారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల వాడక నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మెలగాలని, ర్యాగింగ్ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎంచుకున్న విభాగంలో కష్టపడి ఉన్నత స్థానాలకు ఎదగాలని, చెడు ప్రవర్తనతో జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ..ర్యాగింగుతో ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యువత చెడు మార్గాల వైపు మరలకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ కె.అప్పారావు సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఏవీ కృష్ణారెడ్డి, దుర్గాభవాని, కోఆర్డినేటర్లు శివహరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈడీ పేరుతో బెదిరింపు కేసులో ముమ్మర దర్యాప్తు

మేడికొండూరు, న్యూస్‌టుడే: పోలీసుల వేషంలో వచ్చి ఈడీ అధికారులమని చెప్పి గుర్తుతెలియని దుండగులు విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న బంగారం, వెండి వస్తువులు నాణ్యత పరీక్షలు చేసే వ్యాపారి మాణి జగదీష్, కాకినాడకు చెందిన ప్రవీణ్‌ల నుంచి రూ.70 లక్షలు నగదు, ముడి బంగారం(మట్టి) ఎత్తుకెళ్లిన కేసులో మేడికొండూరు పోలీసులు ముమ్మరంగా విచారణ చేపట్టారు. ఈ కేసులో మధ్యవర్తిగా వ్యవహరించిన రాజమహేంద్రవరానికి చెందిన రంజిత్ మారుతీ పేట్ ఆచూకీ దొరకలేదు. ఈ ఘటనలో దుండగులు మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన రెండు కారులు ఉపయోగించారని గుర్తించారు. ఆయా కారులు అటుగా వెళ్లడం పల్నాడు జిల్లా కొండమోడు వద్ద గల సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యిందని పోలీసులు కనిపెట్టారు. నిందితులను పట్టుకునేందుకు పిడుగురాళ్ల, సత్తెనపల్లి ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు.

15,190 కిలోల చౌక బియ్యం స్వాధీనం

రాజానగరం, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.7 లక్షల విలువైన 15,190 కిలోల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ ఎంఎస్‌వో గొలుగూరి బాపిరాజు బుధవారం తెలిపారు. రాజానగరం మండలంలోని ఆటోనగర్ సమీపంలో జాతీయ రహదారిపై కొవ్వూరు వైపు నుంచి దివాన్‌చెరువు వైపు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీలో 83 ప్లాస్టిక్ సంచుల్లో 3,140 కిలోలు, 241 పౌరసరఫరాల శాఖ సంచుల్లో 12,050 కిలోల బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. బియ్యం, లారీ స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహన డ్రైవర్ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన తంగిరాల ఏడుకొండలను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. తనను విజయవాడ బెంజి సర్కిల్‌లో కారు ఎక్కించుకుని, దేవరపల్లి తీసుకొచ్చి లారీ అప్పగించారని, వాహనంలో మొక్కజొన్న లోడు ఉన్నట్లు అతను చెప్పాడన్నారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తి వివరాలు తెలియలేదన్నారు.

గుంపులుగా తిరిగేస్తాం..గదిమితే కరిచేస్తాం



కొండపల్లి పురపాలికలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దాదాపుగా 2 వేల శునకాలు ఉన్నట్లు పారిశుద్ధ్య సిబ్బంది అంచనా వేస్తున్నారు. అయితే వీటిని అరికట్టడంలో పురపాలిక అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. రోజుకో చోట ప్రజలపై, పిల్లలపై దాడి జరుగుతున్నా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతేడాది ఓ సారి శునకాలను పట్టేవారితో పట్టించారు.. అదికూడా రెండు ప్రాంతాల్లోనే. అయితే కుక్కలు, ఆవులు, కోతుల బెడదతో చిన్నారులు, మహిళలు బయటకు రాలేని పరిస్థితి తలెత్తింది. ఏదైనా అనర్థం జరగక ముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

పూర్తి చేయాలి..పేదల కడుపు నింపాలి

కొండపల్లిలో పునాది దశలోనే నిల్చిపోయిన అన్నక్యాంటీన్ భవన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రారంభంలో క్యాంటీన్ నిర్వాహకులు భోజనాన్ని ఇతర ప్రాంతాల్లో తయారు చేసి గ్రామ కూడళ్లకు తీసుకువచ్చి వడ్డించే వారు. అనంతరం వీటికి శాశ్వత భవనాలను నిర్మించాలని అప్పటి తెదేపా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొండపల్లి ఎన్టీఆర్ కూడలిలో రూ.30 లక్షల వ్యయంతో శాశ్వత భవనం నిర్మాణానికి అంచనాలు రూపొందించగా నాటి జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు భూమిపూజ కూడా చేశారు. గుత్తేదారుడు నిర్మాణం ప్రారంభించి బీములు కూడా కట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో నేడు ఆ ప్రాంతం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**


పునాది దశలోనే నిల్చిపోయిన అన్నక్యాంటీన్ భవనం

నాచునీరే.. తాగునీరుగా



కొండపల్లి పురపాలికలో తాగునీరుగా బూడిద, బురద నీరు రావడం వారికి అలవాటుగా మారింది.. ఇప్పుడు కొత్తగా నాచుపట్టిన నీరు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఇదేంటా అని ఆరా తీస్తే తమ సమస్య పరిష్కరించాలని కార్మికులు సమ్మెచేస్తూ కుళాయిలకు నీటి సరఫరాను ఐదురోజుల పాటు నిలిపేయడమే ఇందుకు కారణంగా తెలిసింది. ఈ నేపథ్యంలో తిరిగి విధుల్లోకి హాజరైన కార్మికులు బుధవారం సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కుళాయిలను విడుదల చేశారు. ఆ సమయంలో నాచుపట్టి పచ్చగా ఉన్న నీరు వచ్చాయి. పంప్‌హౌస్‌లో ప్రాసెసింగ్ చేసిన నీటిని విడుదల చేయాల్సిన సిబ్బంది నేరుగా నిల్వ ఉన్న నీటినే విడుదల చేయడంతో ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి


మైలవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మైలవరం: ప్రభుత్వం పెంచిన విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ఐలు నాయకుడు రావూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఛార్జీల పెంపునకు నిరసనగా బుధవారం స్థానిక నూజివీడు రోడ్డులోని సీపీఎం కార్యాలయం వద్ద ప్రదర్శన చేశారు. వివిధ సంఘాల నాయకులు శ్రీనివాసరావు, సురేష్‌బాబు, ఇసాక్, కోట సురేష్, విజయ్, రావుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: పెరిగిన విద్యుత్తు ఛార్జీలు, గృహాలు, వ్యాపార సముదాయాలకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను తొలగించాలని ప్రజా సంఘాల జిల్లా సమన్వయకర్త పగడాల వీరాంజనేయులు కోరారు. జి.కొండూరు ఉప విద్యుత్తు కేంద్రం ఆవరణలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని విద్యుత్ శాఖ సహాయక ఇంజినీర్ షఫీకి వినతిపత్రం అందజేశారు.

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల ప్రకటన


మోర్ల రోశాలు, చంద్రగూడెం


వజ్రాల సురేష్ రెడ్డి, పుల్లూరు


పురమా సతీష్, వెల్వడం


సత్యబాలకుమారి, చంద్రాల


చెన్న కేశవరావు (శ్రీరాంపురం)


సాంబశివరావు (రుద్రవరం)


వెంకటేశ్వరరావు, తోలుకోడు

మైలవరం, న్యూస్‌టుడే: ఏడాది కాలంగా ఊరిస్తూ వచ్చిన సహకార సంఘాలకు పాలకవర్గాలకు త్రిసభ్య కమిటీల ప్రకటన ఎట్టకేలకు బుధవారం జారీ అయ్యింది. మండలంలో మొత్తం 7 సహకార సంఘాలు ఉండగా ఇప్పటికే మైలవరం, మొర్సుమిల్లి సంఘాలకు కమిటీలను ప్రకటించగా, బాధ్యతలు స్వీకరించారు. చంద్రగూడెం సంఘానికి మోర్ల రోశాలు, పుల్లూరు సొసైటీకి వజ్రాల సురేష్‌రెడ్డి, వెల్వడం సొసైటీకి పురమా సతీష్ (జనసేన), చంద్రాలకు రాయల సత్యబాలకుమారి, తోలుకోడుకు కోటగిరి వెంకటేశ్వరరావులను ఛైర్మన్లుగా ప్రకటించారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన నూతలపాటి శ్రీనివాసరావు గొల్లపూడిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్‌ను బుధవారం కలవగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు, గ్రామ తెదేపా అధ్యక్షుడు నారదా, పద్మశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దాసూళ్లపాలేనికి చెందిన సాయికుమార్‌కు రూ.2లక్షలు, గొల్లపూడి వాసి యేసయ్యకు రూ.61వేలు, ఆలపాటి రాధాకృష్ణమూర్తికి రూ.లక్ష విలువైన ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్యే అందించారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీరాంపురం, రుద్రవరం పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీ సభ్యులను నియామకం చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు విస్సన్నపేట కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మీప్రసాద్ బుధవారం తెలిపారు. శ్రీరాంపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా నాదెళ్ల చెన్నకేశవరావు(కేసీబాబు), సభ్యులుగా గోదా మహేశ్వరరావు, విస్సంపల్లి రజనిలు, రుద్రవరం పీఏసీఎస్ ఛైర్మన్‌గా మాదల సాంబశివరావు, సభ్యులుగా మోదుపరపు రామారావు, పాటిబండ్ల సత్యనారాయణలను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు వివరించారు.

వరిపైరులో సూక్ష్మపోషక లోపాలు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రస్తుతం వరి పైరులో సూక్ష్మపోషక లోపాలు ఎక్కువగా ఉన్నట్లు రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కుదప, రుద్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వరిపొలాల్లో అగ్రోమీన్ మ్యాక్స్ ఎకరానికి 350 గ్రాములు చొప్పున పిచికారి చేసి సూక్ష్మ పోషకాలను సవరించుకోవచ్చని సూచించారు. ఈ-పంటలో సాగు వివరాలు వ్యవసాయ, ఉద్యాన సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. కుదప జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

నగదు జమకాని రైతులు అర్జీలు ఇవ్వండి

వావిలాల, పెద్దవరం(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని వావిలాల, పెద్దవరం గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారిణి పి.పద్మ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు, విద్యార్థులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలో వరి పంటను పరిశీలించారు. అన్నదాత సుఖీభవ పథకం వర్తించని అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రంలో అర్జీ ఇవ్వచ్చన్నారు. పెద్దవరంలో సర్పంచి జి.అప్పారావు, తెదేపా గ్రామశాఖ అధ్యక్షులు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గర్భిణులకు సీమంతం


సామగ్రి అందజేస్తున్న ఏఎంసీ ఛైర్‌పర్సన్ లక్ష్మీఅనిత, సర్పంచి పుల్లమ్మ, సీడీపీవో కృష్ణకుమారి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో 30 మంది గర్భిణులకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సీమంతం వేడుకలను బుధవారం నిర్వహించారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను సీడీపీవో పి.కృష్ణకుమారి వివరించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత, సర్పంచి కె.పుల్లమ్మ పాల్గొని గర్భిణులకు పూలు, పండ్లు, గాజులు, చీరెలు, జాకెట్లు అందించి ఆశీర్వదించారు. తెదేపా నాయకులు ఆర్.వీరారెడ్డి, కె.రవికుమార్, సూపర్‌వైజర్ వై.మునిలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విస్సన్నపేట ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బిడ్డలకు తల్లిపాలతో అనారోగ్యాలు దూరమవుతాయని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు బి శివకుమారి, ఎస్‌కె బాజి, ఎ చైతన్య భవాని, ఆశా, అంగన్‌వాడీ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి బాగు చేయండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని కొండపర్వ గ్రామంలో ప్రధాన రహదారి గుంతలతో అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు మాట్లాడుతూ..చాట్రాయి మండలంలోని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారస్థులు వివిధ రకాల పనుల నిమిత్తం విస్సన్నపేట రావడానికి కొండపర్వ నుంచే వెళ్తారని అలాంటి మార్గానికి మరమ్మతులు చేయించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో శివ సత్యనారాయణ, ఆడిమిల్లి కిషోర్, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు కరెడ్ల ధనలక్ష్మి, గ్రామస్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్య తీరినట్లేనా..?

ఓవర్ హెడ్ ట్యాంకుల్లోకి నీరు వెళ్లేందుకు మోటార్లను ఆన్ చేసిన కార్మికులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలికతో పాటు మైలవరం నియోజకవర్గానికి తాగునీటిని సరఫరా చేసే పంప్‌హౌస్ సిబ్బంది వేతనాల సమస్యకు ఉన్నతాధికారి హామీతో తాత్కాలిక పరిష్కారం లభించింది. తమకు మూడు నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయంటూ అక్కడి కార్మికులు విధులను బహిష్కరించడంతో మూడు రోజుల పాటు కొండపల్లి పురపాలిక, మైలవరం నియోజకవర్గంలో తాగునీటి సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాటర్ వర్క్స్ సిబ్బంది బుధవారం గొల్లపూడిలోని జిల్లా కార్యాలయంలో సంబంధిత అధికార్లను కలిశారు. గుత్తేదారుడికి ఏమైనా సమస్యలు ఉంటే అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని, తమ వేతనాలను మాత్రం వెంటనే చెల్లించాలని అధికారులను ప్రశ్నించారు. అనంతరం పంప్‌హౌస్‌కు చేరుకుని నిరసన తెలిపారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో

అయితే ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ చీఫ్ హెడ్ గాయత్రీదేవి మధ్యాహ్నం అక్కడికి చేరుకుని కార్మికులతో మాట్లాడారు. అదే సందర్భంలో వైకాపా, ఏఐటీయూసీ, తెదేపా కౌన్సిలర్లు, నాయకులు అక్కడికి చేరుకొని కార్మికుల పక్షాన అధికారులతో మాట్లాడారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సమయంలో తాగునీటి సరఫరా పనుల గుత్తేదారుడు రామారావు సైతం అక్కడికి చేరుకొని తన సమస్యను ఉన్నతాధికారికి వివరించాడు. ముందుగా కార్మికులు విధుల్లోకి చేరి మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేయాలని ఆమె సూచించారు. గురువారం కార్మికుల ఖాతాల్లోకి వేతనాలు వేయాలని గుత్తేదారునికి, అధికారులకు తెలియజేశారు. దీంతో కార్మికులు తాగునీటిని విడుదల చేశారు. అయితే సమస్య పునరావృతం అయ్యే అవకాశం ఉందని, అప్పుడైనా విధులను బహిష్కరిస్తామని కార్మికులు చెప్పడం గమనార్హం.


అధికారులతో మాట్లాడుతున్న కార్మిక సంఘ, అధికార, ప్రతిపక్ష నాయకులు



కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న తెదేపా ఎంపీల బృందం

ఏపీని వ్యూహాత్మక అంతరిక్ష హబ్‌గా ప్రకటించండి

కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌కు తెదేపా ఎంపీల వినతి

ఈనాడు, దిల్లీ: ఏపీని దేశ వ్యూహాత్మక అంతరిక్ష హబ్‌గా ప్రకటించాలని తెలుగుదేశం ఎంపీలు కేంద్ర శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్‌ను కోరారు. పార్టీ పార్లమెంట్ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, అంబికా లక్ష్మీనారాయణ, సానా సతీష్, బీద మస్తాన్‌రావులు కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో శాస్త్ర పరిశోధనలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు డాప్లర్ వెదర్ రాడార్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఖజానాకు రూ.443 కోట్ల కన్నం!

వైకాపా హయాంలో 1.55 లక్షల ఇళ్లకు ఆస్తిపన్ను తగ్గించి దోచేశారు

1.06 లక్షల ఇళ్లకు అసలు పన్నే వేయలేదు

పుర, నగరపాలక సంస్థల్లో ప్రత్యేక డ్రైవ్‌తో వెలుగులోకి అక్రమాలు



ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలోని ప్రధాన కూడలిలో ఒక వాణిజ్య భవనానికి ఏడాదికి రూ.1.35 లక్షల ఆస్తి పన్ను విధించాల్సిన నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది భవన నిర్మాణ ప్రాంతం, కొలతలు తగ్గించి, పాక్షిక వినియోగంగా (సెమీ కమర్షియల్) రికార్డుల్లో చూపించి రూ.75 వేల ఆస్తి పన్ను వేసి గత మూడేళ్లుగా వసూలు చేస్తున్నారు. అదే భవనాన్ని ఇటీవల తనిఖీ చేసిన అధికారులు లోపాలు గుర్తించి ఆస్తి పన్నును రూ.1.35 లక్షలకు పెంచారు. విశాఖలోనే కాదు.. వైకాపా హయాంలో రాష్ట్రంలోని అనేక నగరాలు, పట్టణాల్లో ఆస్తి పన్ను విధింపులో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం వాటిని గుర్తించి సరిచేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌తో గత 13 నెలల వ్యవధిలో పట్టణ స్థానిక సంస్థల ఆస్తి పన్ను ఆదాయం రూ.443.59 కోట్ల మేర పెరిగింది. వేయాల్సిన దాని కంటే తక్కువ పన్ను విధించినవి గుర్తించి సరి చేయడం, పన్ను పరిధిలోకి రానివి గుర్తించి కొత్తగా ఆస్తి పన్ను వేయడం ద్వారా అదనపు ఆదాయం రాబట్టారు.

వచ్చి కలిస్తేనే ఆస్తి పన్ను విధింపు..

ఇళ్లు, భవనాలకు ఆస్తి పన్ను విధించే విషయంలో పుర, నగరపాలక సంస్థల్లో రెవెన్యూ విభాగంలో కొందరు అధికారుల నుంచి సిబ్బంది వరకు అవినీతి, అక్రమాలకు అంతే ఉండటం లేదు. కొత్తగా పన్ను విధించాలంటే కార్యాలయానికి వెళ్లి ప్రజలు కలిస్తేనే దస్త్రాలు ముందుకు కదులుతున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా వెళ్లి కలిసే వరకు ప్రాసెస్ చేయడం లేదు. ఇందుకోసం ఏదో ఒక కొర్రీ వేస్తున్నారు. దరఖాస్తుదారులు కలిశాక లంచం డిమాండ్ చేస్తున్నారు. లేదంటే దస్త్రాలు పక్కన పెట్టేస్తున్నారు. గత 13 నెలల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆస్తి పన్ను విధించకుండా వదిలేసిన 10 వేలకుపైగా దరఖాస్తులను అధికారులు గుర్తించారు. వాటికి ఆస్తి పన్ను విధించి కొత్త ఎసెస్‌మెంట్ నంబర్లు కేటాయించారు.

■ ఇళ్లు, భవనాలకు ఆస్తి పన్ను విధింపులో లోపాలు సరి చేయడంతో గత 13 నెలల్లో పెరిగిన ఆదాయం ఇలా..

ఏడాది	తక్కువ పన్ను విధించిన ఇళ్లు, భవనాలు	పన్ను వేయని ఇళ్లు, భవనాలు	పెరిగిన ఆదాయం (రూ.కోట్లలో)
2024-25	1,06,000	68,000	297.28
2025-26 (జులై వరకు)	49,000	38,396	146.31
మొత్తం	1,55,000	1,06,396	443.59

టీచర్ పోస్టులకు ఇంజినీరింగ్ అభ్యర్థుల పోటీ

- మెగా డీఎస్సీలో 7 వేలకు పైగా బీటెక్ అభ్యర్థులు
- పీజీలు చదివిన వారు 2.94 లక్షలు

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థులు కూడా ఉపాధ్యాయ పోస్టులకు పోటీ పడుతున్నారు. సాంకేతిక విద్యను అభ్యసించి.. ప్రభుత్వ టీచర్ పోస్టు కోసం డీఎస్సీ రాశారు. మెగా డీఎస్సీ-2025 రాసిన వారిలో 7,378 మంది బీటెక్ చేసిన వారు ఉన్నారు. బీటెక్‌తోపాటు బీఈడీ ఉన్న వారికి టీచర్ పోస్టులకు అర్హత కల్పించడంతో ఉపాధ్యాయ కొలువు సాధించేందుకు పోటీ పడుతున్నారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు చదివిన 248 మంది డీఎస్సీ రాశారు. బీటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్సు చదివినా మంచి ఉద్యోగాలు లభించకపోవడంతో ప్రభుత్వ కొలువులు సాధించేందుకు పోటీ పరీక్షలు రాస్తున్నారు. సొంత జిల్లాలో పని చేసే అవకాశం, మంచి జీతం ఉండడంతో ప్రొఫెషనల్ కోర్సులు చదివిన వారు సైతం ఈ ఉద్యోగాలకు ఆకర్షితులవుతున్నారు. కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించిన విషయం తెలిసిందే. పరీక్షలకు సంబంధించిన 'కీ'ని ఇప్పటికే విడుదల చేసింది. త్వరలో పూర్తి ఫలితాలు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. డీఎస్సీ రాసిన వారిలో పీజీలు చేసినవారే 2,94,115 మంది ఉన్నారు. అత్యధికంగా ఎంఏ చేసినవారు 1.61 లక్షలు ఉండగా.. ఎమ్మెస్సీ చదివిన వారు 1.09 లక్షలు మంది, రెండేళ్ల, మూడేళ్ల సమీకృత పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులు చేసిన వారు 2,342 మంది ఉన్నారు.

మ్యుటేషన్ అమలులో సాంకేతిక సమస్యలు

- 17 కార్పొరేషన్లలోనూ ఇదే పరిస్థితి
- 20-30% రిజిస్ట్రేషన్లకు మాత్రమే పేర్ల మార్పు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 17 కార్పొరేషన్ల పరిధిలో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆస్తి యాజమాన్య హక్కు బదలాయింపు (మ్యుటేషన్) విధానం అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నెల 1 నుంచి 17 నగరపాలక సంస్థల పరిధిలోని 53 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆటోమ్యుటేషన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కార్పొరేషన్ల వద్ద ఉన్న వివరాల్లో డోర్, వార్డు, బ్లాక్ నంబర్ల పరంగా చాలాచోట్ల అనుసంధానం కాలేదు. ఆటోమ్యుటేషన్‌కు ఇది ప్రధాన అవరోధంగా మారింది. ఫలితంగా మొత్తం రిజిస్ట్రేషన్లలో 20-30% లావాదేవీలకు మాత్రమే పేర్లు మారుతున్నాయి. మిగిలిన డాక్యుమెంట్లలో పేర్లు మారడం లేదు. ఎసెస్‌మెంట్ నంబరు కలిగి, రిజిస్ట్రేషన్ (సేల్, గిఫ్ట్, పార్టిషన్) జరిగిన ఇళ్లు, కొత్త ప్లాట్లకు ఆస్తి పన్ను చెల్లింపు రసీదులో కొనుగోలు చేసిన వ్యక్తి పేరు వచ్చేలా ప్రభుత్వం మార్పులు చేపట్టింది.

ఇంటి నంబర్లలో ఏకత్వం లేని ఫలితం..

రిజిస్ట్రేషన్ల శాఖ ఆటోమేటిక్ మ్యుటేషన్ విధానాన్ని మే నెలలో విజయవాడలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. అక్కడి అమలు తీరును పరిశీలించాక ఆగస్టు 1 నుంచి 17 నగరాలకు విస్తరించింది. ఈ కొత్త విధానంలో సదరు ఆస్తికి సంబంధించిన అన్ని బకాయిలు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. డోర్ నంబర్లకు అనుగుణంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది మార్కెట్ విలువను ఖరారు చేస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల వద్ద కూడా వివరాలు ఇంతే కచ్చితంగా ఉంటాయని భావించారు. అయితే, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు డోర్ నంబర్ల కేటాయింపులో అనుసరించిన విధానం ఒక్కోచోట ఒక్కో రకంగా ఉంది. వార్డు, బ్లాక్, డోర్ నంబరు కలిపి ఒక నంబరు కింద ఇస్తున్నారు. అంకెల మధ్య ఫుల్‌స్టాప్, నిలువుగీత లేదా అడ్డగీతలు వంటివి ఉన్నాయి. ఈ నంబర్ల నమోదులోనూ ఒకే కార్పొరేషన్ పరిధిలో రకరకాల పద్ధతులు అవలంబించారు. విశాఖలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా, సాంకేతిక సమస్యలతో ఆటో మ్యుటేషన్ కావడం లేదు. కొత్త యజమాని పేరు రికార్డుల్లోకి చేరడంలేదు. ఫలితంగా వీరు పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇచ్చే డాక్యుమెంట్లతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శిస్తున్నారు.

చేతులు మారిన శిశువులు 80 మంది

- 'సృష్టి' కేసులో డాక్టర్ నమ్రత నుంచి కీలక వివరాలు సేకరించిన పోలీసులు



డాక్టర్ నమ్రత

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో పెద్దఎత్తున శిశు విక్రయాలు జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతను ఐదురోజుల కస్టడీకి తీసుకొని వారు కీలక ఆధారాలు సేకరించారు. కస్టడీ బుధవారం ముగిసింది. ఆమె నుంచి సేకరించిన వివరాల ఆధారంగా హైదరాబాద్ కేంద్రంగా సుమారు 80 మంది శిశువులు చేతులు మారినట్లు పోలీసులు గుర్తించారని తెలిసింది. శిశు విక్రయాలు నిర్వహించానని విచారణలో డాక్టర్ నమ్రత అంగీకరించినట్లు సమాచారం. గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలికి ఇచ్చిన బిడ్డను కొన్నట్లు నమ్రత అంగీకరించారని తెలిసింది. ఎప్పుడో చేసిన ఒక్క తప్పును తనపై రుద్దుతున్నారంటూ వాదనకు దిగినట్లు సమాచారం. డబ్బు ఇచ్చిన దంపతులకు పిల్లల్ని అప్పగిస్తానని డాక్టర్ నమ్రత జైలు నుంచే వర్తమానం పంపారని తెలిసింది.

ఆమె చెప్పినట్లు చేశామంతే..

విశాఖలోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మేనేజర్ కల్యాణి, ల్యాబ్ టెక్నీషియన్ ధనశ్రీ మోక్షితల కస్టడీ గడువు బుధవారం ముగిసింది. డాక్టర్ నమ్రత ఇచ్చే కమీషన్‌కు ఆశపడి ముఠాలు, ఏజెంట్ల నుంచి శిశువులను సేకరించినట్లు అంగీకరించారు. గర్భిణులకు డబ్బు ఆశచూపి విశాఖ, సికింద్రాబాద్ క్లినిక్‌లలో ప్రసవం చేసేవారని, కొన్నిసార్లు నెలల నిండక ముందే ఆపరేషన్ చేసి పిల్లల్ని బయటకు తీసి సరోగసీ బిడ్డలంటూ అప్పగించారని సమాచారం.

✦ మహిళలకు ఐవీఎఫ్, అండం ఎదుగుదలకు హార్మోన్ ఇంజెక్షన్లను ఇష్టానుసారం ఇచ్చారు. సికింద్రాబాద్‌లోని రీసెర్చ్ ఫెర్టిలిటీ సెంటర్‌లోని గైనకాలజిస్టు లెటర్‌హెడ్‌పై ఇంజెక్షన్లు, మాత్రలు రాసిచ్చినట్లు బయటపడింది. బుధవారం ఆమె ఫిర్యాదుతో గోపాలపురం పోలీసులు కేసు నమోదుచేయగా మరో నలుగురు గైనకాలజిస్టుల పేర్లను ఉపయోగించుకున్నట్లు గుర్తించారు.

నమ్రత ఆస్తులపై గురి..

డాక్టర్ నమ్రత ఆస్తులపై పోలీసులు దృష్టి సారించారు. ఒక్కో శిశువును రూ.4లక్షల నుంచి రూ.5లక్షలకు కొని సరోగసీ పేరిట రూ.30లక్షల నుంచి రూ.50 లక్షలకు విక్రయించినట్లు ఆధారాలు బయటపడ్డాయి. ఆమె 8 బ్యాంకు ఖాతాలను ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిర్వహించనున్నారు. ఆమె ఆస్తుల వివరాలు కోరుతూ స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాశారు.

రూ.20 కోట్లు వసూలు?

యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం మోసాలకు సంబంధించి 27 మంది నిందితులపై కేసు నమోదైంది. 26 మంది అరెస్టయ్యారు. డాక్టర్ నమ్రత సరోగసీ ముసుగులో 40-50 మంది నుంచి సుమారు రూ.20కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. ఎల్లారెడ్డిగూడకు చెందిన సంతోషి ఏజెంట్ల నుంచి 18 మంది శిశువులను సేకరించినట్లు గుర్తించారు. ఆమె ఇంట్లోని రికార్డుల ఆధారంగా శిశువులను విక్రయించిన కొందరు తల్లుల చిరునామాలను గుర్తించే పనిలో పడ్డారు. ఇప్పటికే అరెస్టయిన నిందితురాలు(ఏ16) డాక్టర్ విద్యుల్లతకు బుధవారం బెయిల్ మంజూరైంది. పోలీసులు విశాఖ, విజయవాడల్లోని సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాలను మళ్లీ తనిఖీ చేయనున్నారు.

ముఖ్యమంత్రుల పేర్లతో పథకాలు దేశమంతటా ఉన్నాయి కదా!

- మద్రాసు హైకోర్టు ఆదేశాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య
- ఏఐఏడీఎంకే నేతకు రూ.10 లక్షల జరిమానా



దిల్లీ: సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రులు, పార్టీ అగ్రనాయకుల పేర్లు, చిత్రాలు వినియోగించరాదంటూ ఇటీవల మద్రాసు హైకోర్టు వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. ప్రభుత్వ పథకాల్లో సీఎంలు, ప్రధాన మంత్రి చిత్రాలను వినియోగించడాన్ని దేశమంతా అనుసరిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. రాజకీయ పోరాటాలకు న్యాయస్థానాలను వేదికలుగా ఉపయోగించుకోరాదని హితవు పలికింది. తమిళనాడు ప్రభుత్వం, డీఎంకే పార్టీకి వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేసిన ఏఐఏడీఎంకే నేత షణ్ముగంను మందలించింది. న్యాయప్రక్రియను దుర్వినియోగ పరిచారంటూ రూ.10లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని వారం రోజుల్లో తమిళనాడు ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించింది. అలా చేయని పక్షంలో కోర్టు ధిక్కరణ చర్యలుంటాయని హెచ్చరించింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియా సభ్యులుగా ఉన్నారు. తమిళనాడు ప్రభుత్వం 'విత్ యు స్టాలిన్' పేరుతో నిర్వహిస్తోన్న ప్రచార కార్యక్రమాన్ని మద్రాస్ హైకోర్టులో ఏఐడీఎంకే నేత షణ్ముగం సవాల్ చేశారు. 'కొత్తగా తీసుకువచ్చే ప్రజా సంక్షేమ పథకాల్లో జీవించి ఉన్న నేతల పేర్లు వాడొద్దు. వాటి గురించి ప్రచారం చేసేటప్పుడు మాజీ సీఎంల ఫొటోలు, పార్టీ గుర్తులు, జెండాను ఉపయోగించవద్దు' అంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో వ్యాజ్యం వేసిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. పిటిషనర్‌కు నిజంగా అంత ఆందోళన ఉంటే.. అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నేతలతో ఉన్న పథకాలను ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించింది. "పలు ప్రభుత్వ పథకాలకు ప్రధాని, రాష్ట్రపతి, గవర్నర్లు, మంత్రుల ఫొటోలు ఉపయోగించుకోవచ్చని సుప్రీంకోర్టు గతంలో అనుమతినిచ్చింది. దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

భారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: రాయలసీమ ప్రాంతం, ఉత్తర తమిళనాడు తీరం, కర్ణాటక పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న మూడు ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చని పేర్కొంది. గురువారం ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

ప్రైవేట్ సంస్థలకు 22 హోటళ్లు, రిసార్ట్‌ల నిర్వహణ

త్వరలో టెండర్లు పిలవనున్న ఏపీటీడీసీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కు చెందిన హోటళ్లు, రిసార్టుల్లో పర్యాటకులకు మెరుగైన సేవలు అందించేందుకు వాటి నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను మంత్రివర్గం బుధవారం ఆమోదించడంతో ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లు ఆహ్వానించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యాటక హోటళ్లు, రిసార్ట్‌ల్లో వసతుల లేమి, నైపుణ్యం కలిగిన చెఫ్‌లు లేకపోవడం వంటి కారణాలతో పర్యాటకుల నుంచి ఆదరణ తగ్గుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి ఏపీటీడీసీకి చెందిన 22 హోటళ్లు, రిసార్ట్‌ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. పర్యాటకులు అత్యధికంగా సందర్శించే కేరళలో సైతం ఇదే విధానాన్ని అనుసరిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు అందుతున్నాయనిఅంటున్నారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన హోటళ్ల ద్వారా ఏటా రూ.10 నుంచి రూ.15 కోట్ల ఆదాయం వస్తోంది. తాజా విధానంలో ఏటా రూ.20 కోట్ల వరకు వచ్చేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం వీటిలో పని చేస్తున్న సిబ్బంది ఉపాధికి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఆర్టీజీఎస్‌లో ప్రక్షాళన మొదలు

వైకాపా విధేయులకు 'సెలవు'

ఈనాడు, అమరావతి: రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో ప్రక్షాళన మొదలైంది. ఈ సంస్థలో పనిచేస్తున్న వారిలో వైకాపా విధేయులుగా గుర్తించిన కంటెంట్ రైటర్ సత్యనాగబాగి శ్రీకృష్ణ, సమాచార, పౌరసంబంధాల సమన్వయకర్త గాజుల అబ్దుల్ సత్తార్‌లతో పాటు మరో ఉద్యోగిని ఉన్నతాధికారులు సెలవుపై పంపారు. 'వైకాపా' గుప్పిట్లోకి ఆర్టీజీఎస్ శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనం సంచలనమైంది. ఇటీవల చేపట్టిన నియామకాల్లో వివిధ కేడర్లలో పోస్టింగులు పొందిన 33 మంది సిబ్బందిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ సమాచారానికి కీలక కేంద్రమైన ఆర్టీజీఎస్‌లోని నియామకాల్లో చోటుచేసుకున్న నిర్లక్ష్యంపై సీఎంవో అప్రమత్తమైంది. నియామకాలు పొందిన వారి వివరాలు.. ఎవరు సిఫార్సు చేశారు? వంటి వివరాలను పంపాలని సంస్థ సీఈవోను ఆదేశించింది.

జగన్‌కు రాజ్ కెసిరెడ్డి బంధువు కాదా?

- చెవిరెడ్డి కోసం వెంకటేశ్‌నాయుడు ఎందుకు నామినేషన్ వేశారు?
- మద్యం కుంభకోణం జరిగిందని విజయసాయిరెడ్డే చెప్పారు కదా
- తెదేపా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆనం వెంకటరమణారెడ్డి

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంతో వైకాపా వాళ్లకు సంబంధం లేకపోతే మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, విజయసాయిరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, ముప్పిడి అవినాష్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు.. వీరంతా ఎవరో చెప్పాలని వైకాపా అధినేత జగన్‌కు తెదేపా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి సవాల్ విసిరారు. మంగళగిరిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైఎస్ రాజారెడ్డి సోదరుడి మనవరాలు వైఎస్ సుజాతారెడ్డి. ఆమె కుమార్తెను రాజ్ కెసిరెడ్డి పెళ్లి చేసుకున్నారు. అదాన్ డిస్టిలరీస్‌కు చెందిన అవినాష్‌రెడ్డికి రాజ్ కెసిరెడ్డి బంధువు. గత ఎన్నికల్లో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి తరఫున ఒంగోలు లోక్‌సభ స్థానానికి డమ్మీ అభ్యర్థిగా వెంకటేశ్ నాయుడు నామినేషన్ వేశారు' అని తెలిపారు. 'జగన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన విజయసాయిరెడ్డి.. వైకాపా ప్రభుత్వంలో మద్యం కుంభకోణం జరిగింది కానీ.. తనకు మాత్రం సంబంధం లేదని అనలేదా?' అని ప్రశ్నించారు. 'మద్యంలో డబ్బు సంపాదించామని సాయిరెడ్డే చెప్పాక మీకు సంబంధం లేకుండా ఎలా ఉంటుంది' అని జగన్‌పై వెంకటరమణారెడ్డి మండిపడ్డారు.

ప్రభుత్వ దుకాణాలు పెట్టింది అందుకే

అసలు ఇలాంటి కుంభకోణం చేయడానికే ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాలు తెరిచారని ఆయన విమర్శించారు. 'మద్యం కుంభకోణం గురించి వైకాపా మీడియాలో పిచ్చిరాతలు రాయిస్తున్నారు. ప్రభుత్వ దుకాణాలలో అవినీతి ఎలా జరుగుతుందని అంటున్నారు. తమిళనాడులో 25 ఏళ్లుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. వాటి కేంద్రంగా రూ.వెయ్యి కోట్ల అక్రమ లావాదేవీలు జరగడంతో ఈడీ దర్యాప్తు చేస్తోంది' అని పేర్కొన్నారు.

షేర్ రాలేదనే వైకాపా వాళ్ల బాధ

'మన ప్రభుత్వంలో ఇంతపెద్ద కుంభకోణం జరిగింది. నోట్ల కట్టలు గుట్టలుగా దొరుకుతున్నాయి. అయినా మనకు షేర్ రాలేదే అనే వైకాపా వాళ్ల బాధంతా' అని ఆనం ఎద్దేవా చేశారు. చేసిన దొంగపనుల నుంచి బయటపడటానికే వైకాపా లీగల్ సెల్‌ను పటిష్ఠం చేయాలని జగన్ అంటున్నారని పేర్కొన్నారు. 'మాజీమంత్రి రోజా నోటికొచ్చినట్టు మాట్లాడితే.. మేమూ అదే రీతిలో సమాధానం చెబుతాం' అని హెచ్చరించారు.

అదాన్‌కు రూ.250 కోట్ల ఆర్డర్లా?

రూ.లక్ష పెట్టుబడితో పెట్టిన అదాన్ డిస్టిలరీస్‌కు ఆరు నెలల్లో రూ.250 కోట్ల విలువైన ఆర్డర్లు ఎలా ఇస్తారని గతంలోనే తాను ప్రశ్నించానని వెంకటరమణారెడ్డి గుర్తుచేశారు. '2020 నుంచి జగన్ జమానాలో మద్యంలో అవినీతి గురించి చెబుతూనే ఉన్నాం. ఆంధ్రా గోల్డ్, సెవెన్ హార్సెస్ లాంటి జే బ్రాండ్ నాసిరకం మద్యానికి సంబంధించి రిపోర్టులు ఇచ్చాం. అయినా వినకుండా మద్యం ముసుగులో విషం అమ్మి వేలమందిని పొట్టనపెట్టుకొన్నారు. వారి ఆత్మ ఘోషే ఈ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడించింది' అని వైకాపా నేతలపై ఆనం విరుచుకుపడ్డారు. 'కట్టలుగా నోట్లు దొరికితే అందులో రూ.రెండు వేల నోట్లు ఉన్నాయి. అవి మావి కాదు. చంద్రబాబు పెట్టించారంటూ విచిత్ర వాదన చేస్తున్నారు' అని పేర్కొన్నారు.

దిగి రాకుంటే.. దిగిపోవాల్సిందే

- బీసీ బిల్లులకు తక్షణం ఆమోదం తెలపండి
- దిల్లీలో బీసీ రిజర్వేషన్ల ధర్నాలో.. ప్రధాని మోదీపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



ప్రసంగిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ నేత విజయశాంతి తదితరులు

ఈనాడు, దిల్లీ: "మోదీ... మేం గుజరాత్ నుంచి గుంట భూమి కానీ, పోరుబందరు పోర్టు నుంచి చుక్కనీరు కానీ అడగలేదు. మా గడ్డ మీద.. మా బలహీనవర్గాల సోదరులకు 42% రిజర్వేషన్లు ఇచ్చుకుంటామంటే గుజరాత్ వాళ్లకు కడుపుమంట ఎందుకు? తెలంగాణలో 4 కోట్ల ప్రజల అభీష్టం మేరకు శాసనసభలో ఆమోదించి బలహీనవర్గాలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశాం. మా ఆలోచనలు, మా బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకెవరిచ్చారు? మీకున్నది ఒకే మార్గం. 42% రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదించడం.. లేదంటే ప్రధానమంత్రి గద్దె నుంచి దిగిపోవడం" అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. లేకుంటే దీని కోసం ఇక తాము దిల్లీకి రాబోమని, మోదీ గల్లీకి వచ్చినప్పుడు.. అక్కడే నిలదీస్తామని హెచ్చరించారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై అసెంబ్లీలో చేసిన బిల్లులు, ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ బుధవారం దిల్లీలోని జంతర్‌మంతర్‌లో నిర్వహించిన భారీ ధర్నాలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వస్తారని ప్రకటించినా.. వేరే కార్యక్రమాల వల్ల వారు హాజరు కాలేదు. వారితోపాటు, ప్రియాంకాగాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించి మద్దతు పలికారు. తెలంగాణ నుంచి మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులంతా ఈ ధర్నాకు హాజరయ్యారు. ఈ కార్యక్రమం నేపథ్యాన్ని సీఎం తన ప్రసంగంలో వివరించారు.

మద్యం కుంభకోణంలో.. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలది కీలకపాత్ర

- స్పష్టమైన ఆధారాలను సిట్ సేకరించింది
- బెయిల్ పిటిషన్లపై ప్రాసిక్యూషన్స్ జేడీ వాదనలు
- 12న తీర్పు వెలువరించనున్న ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలు కీలకంగా వ్యవహరించారని, వీరి పాత్రపై ఇంకా దర్యాప్తు జరుగుతోందని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. విజయవాడలోని ఏసీబీ కోర్టులో బుధవారం వీరి బెయిల్ పిటిషన్లు విచారణకు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో సీఎంఓలో ఉన్న ధనుంజయరెడ్డి మద్యం పాలసీ, కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించారని జేడీ వాదించారు. కృష్ణమోహన్‌రెడ్డి కూడా కుట్రలో క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. వీరి పాత్రలపై స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఈ దశలో నిందితులకు బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని తెలిపారు. రెండున్నర నెలల నుంచి నిందితులు రిమాండ్‌లోనే ఉన్నారని, వీరు సమాజంలో హోదా కలిగిన వ్యక్తులని పిటిషనర్ల తరఫు న్యాయవాది మాజీ ఏజీ శ్రీరామ్ వాదించారు. బెయిల్ ఇస్తే దర్యాప్తునకు సహకరిస్తారని, ప్రస్తుతం ఏ పదవుల్లో లేరని అన్నారు. ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తుది తీర్పు నిమిత్తం న్యాయాధికారి భాస్కరరావు ఈ నెల 12కు వాయిదా వేశారు.

స్విమ్స్‌లో ఫిజియోథెరపీ పిటిషన్ తిరస్కరణ

తిరుపతిలోని స్విమ్స్‌లో ఫిజియోథెరపీ చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలన్న వైకాపా నేత చెవిరెడ్డి విజ్ఞప్తిని న్యాయాధికారి తిరస్కరించారు. అవసరమైతే విజయవాడలో చికిత్స చేయించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారంలో మూడు రోజుల పాటు ఇంటి నుంచి భోజనం అనుమతించాలన్న పిటిషన్‌ను అనుమతిస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

✦ ఏ1 రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసును ఈ నెల 11కు వాయిదా వేశారు.

రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను రిటర్న్ చేసిన న్యాయాధికారి

హైదరాబాద్‌లో నగదు స్వాధీనం చేసుకున్న ఫామ్ హౌస్, వర్ధమాన్ కాలేజీలోని సీసీ కెమెరాల రెండు వారాల ఫుటేజిని భద్రపర్చేలా ఆదేశాలివ్వాలన్న రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను న్యాయాధికారి రిటర్న్ చేశారు. సాంకేతిక కారణాలతో ఈ పిటిషన్‌ను అనుమతించకుండా వెనక్కి ఇచ్చారు.

✦ వైరల్ ఇన్ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతున్న రాజ్ కెసిరెడ్డిని.. బుధవారం ఉదయం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు తీసిన స్కాన్‌లో కిడ్నీలో ఐదు రాళ్లున్నట్లు బయటపడింది. తిరిగి మరోసారి పరీక్షలు చేయనున్నారు. అనంతరం తిరిగి జైలుకు తీసుకొచ్చారు.


తురకా కిశోర్ అరెస్ట్, రిమాండ్‌లో ఉల్లంఘనలున్నాయి

- విడుదలకు ఆదేశాలిస్తాం
- హైకోర్టు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: వైకాపా నాయకుడు తురకా కిశోర్ అరెస్ట్, రిమాండ్ విధింపులో చట్ట ఉల్లంఘనలు ఉన్నాయని హైకోర్టు పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించినప్పుడు అరెస్టు అయిన వ్యక్తిని ఒక్క క్షణం కూడా జైల్లో ఉంచడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. తురకా కిశోర్ విడుదలకు ఆదేశాలిస్తామని మౌఖికంగా తెలిపింది. అరెస్టు, రిమాండ్ ఉత్తర్వులను సవాలు చేస్తూ.. పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై గురువారం విచారణ చేస్తామని తెలిపింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. కిశోర్‌పై పలు హత్యాయత్నం కేసులున్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. 'ఈ రోజుల్లో ఎవరిపైనైనా హత్యాయత్నం కేసు పెట్టడం సులభం. మాపైనా నమోదు చేయొచ్చు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎప్పుడో జరిగిన ఘటనలకు ఇప్పుడు కిశోర్‌పై కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని ఆక్షేపించింది. ఏం చేసినా చట్ట నిబంధనలు అనుసరించాలని తేల్చిచెప్పింది. గుంటూరు జైలు నుంచి విడుదలైన తన భర్త కిశోర్‌ను పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు వెంటనే అరెస్టు చేశారని పేర్కొంటూ తురకా సురేఖ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

పారితోషికం ఎంత.. ఎలా తీసుకున్నారు?

- సినీ నటుడు విజయ్ దేవరకొండను ప్రశ్నించిన ఈడీ
- గేమింగ్ యాప్‌కే ప్రచారం చేశానన్న నటుడు



ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ముందుకు సినీనటులు వరుస కడుతున్నారు. ఇటీవలే ప్రకాశ్‌రాజ్ విచారణకు రాగా, బుధవారం విజయ్ దేవరకొండ వంతయింది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఉదయం 10.40 గంటల సమయంలో వచ్చిన విజయ్‌ను ఈడీ బృందం సుదీర్ఘంగా విచారించింది. ఏ యాప్ కోసం ప్రచారం నిర్వహించారు, అందుకు నిర్వాహకులు ఎంత పారితోషికం చెల్లించారు? ఏ రూపంలో ఆ సొమ్ము తీసుకున్నారు, అందుకు సంబంధించిన ఒప్పందం వివరాలేమిటి.. తదితర ప్రశ్నలను సంధించింది. 'నేను 'ఎ23' యాప్ కోసం ప్రచారం చేశా. అది బెట్టింగ్ యాప్ కాదు. కేవలం గేమింగ్ యాప్ కావడంతోనే ప్రచారం చేసేందుకు అంగీకరించా. గేమింగ్ యాప్‌లు ఐపీఎల్, కబడ్డీ, వాలీబాల్ లాంటి క్రీడలకు స్పాన్సర్ చేస్తున్నాయి. నేను చట్టబద్ధంగానే గేమింగ్ యాప్ కోసం ప్రచారం చేశాని' విజయ్ బదులిచ్చినట్లు, సంబంధిత ఒప్పంద పత్రాన్ని ఈడీ బృందానికి చూపించినట్లు సమాచారం. విచారణ అనంతరం విజయ్ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'గేమింగ్ యాప్‌లకు దేశంలోని చాలా రాష్ట్రాల్లో చట్టబద్ధత ఉండటం వల్లనే ప్రచారం చేశానని విచారణ అధికారులకు చెప్పా. నేను ప్రచారం చేసిన యాప్ తెలంగాణలో ఓపెన్ కాదని కూడా చెప్పా. నా బ్యాంకు లావాదేవీల వివరాలను సమర్పించా' అని వెల్లడించారు. ఇదే కేసులో ఈ నెల 11న నటుడు రాణా, 13న మంచు లక్ష్మి విచారణకు రానున్నారు.

ఉన్నది ఒకటే జీవితం... ఏం సాధించినా అందులోనే! ఈ ప్రయాణంలో నచ్చని చదువు, తగ్గిన మార్కులు, ప్రేమ వైఫల్యం... వంటివెన్నో బాధపెడతాయి. అంత మాత్రాన అర్ధాంతరంగా బతుకు చాలిస్తే... మీ సమస్య పరిష్కారమవుతుందా? జీవితానికి మరణానికి మధ్య ఉన్న ఒక్క క్షణాన్నీ అధిగమించి చూడండి... అందమైన భవిష్యత్తు మీ కళ్లముందే ఉంటుంది.

ఒక్క క్షణం ఆలోచించండి..!



- హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో బడిలో బాగా చదవమని మందలించారని... 13 ఏళ్ల బాలిక 17వ అంతస్తు నుంచి దూకి చనిపోయింది.
- హనుమకొండలో 16 ఏళ్ల ఇంటర్ విద్యార్థిని... ఇష్టంలేని చదువులో రాణించలేనంటూ... ఆత్మహత్య చేసుకుంది.
- విశాఖలో 15 ఏళ్ల అమ్మాయి... ప్రేమిస్తున్న అబ్బాయితో మాట్లాడొద్దన్నారని పురుగుల మందు తాగేసింది...

వీళ్లంతా పట్టుమని రెండు పదులు కూడా నిండనివారే. జీవితాన్ని సగం కూడా చూడకుండానే... బాధల్ని మోయలేమంటూ తనువు చాలిస్తున్నారు. కానీ, ఇవన్నీ చనిపోయేంత పెద్ద కష్టాలేనా? అయినా ఎంతటి కష్టం వచ్చినా ఎల్లకాలం ఉంటుందా?

కారణాలేవైతేనేం... నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు గత రెండు దశాబ్దాలుగా విద్యార్థుల బలవన్మరణాలు పెరిగాయని చెబుతున్నాయి. కోటా నుంచి మన హైదరాబాద్ వరకూ ఇందుకు ఉదాహరణలెన్నో.

తాజాగా సుప్రీంకోర్టు కూడా ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడాలనీ, బలవన్మరణాలను అడ్డుకోవాలనీ ఆదేశించింది. 100 మంది విద్యార్థులున్న ప్రతి విద్యాసంస్థ తప్పనిసరిగా క్వాలిఫైడ్ కౌన్సెలర్, సైకాలజిస్ట్ లేదా సామాజిక కార్యకర్తను నియమించుకోవాలని సూచించింది. ఇప్పటికే రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల మానసిక స్థితిని గుర్తించేందుకు అధికారులు దర్వాజే పే దస్తక్ (తలుపు కొట్టండి) అనే నినాదాన్ని తీసుకొచ్చారు.

స్ఫూర్తిని అందుకోండి..!

కళ్లు లేని లూయీ బ్రెయిలీ, కాలు పోగొట్టుకున్న సుధాచంద్రన్, అరుణిమ సిన్హాలు... తమ జీవితాన్ని ఎలా నిలబెట్టుకున్నారో తెలిసిందే. యాసిడ్ దాడికి గురైన లక్ష్మి, ప్రజ్ఞా సింగ్‌లు చావుతో పోరాడి బతికి చూపించారు. ఇప్పుడు మరికొంతమందికీ జీవితాన్ని ఇస్తున్నారు. వేళ్లు మాత్రమే కదపగలిగే మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితురాలు మైత్రి... చక్రాల కుర్చీలో నుంచే తన లాంటి బాధితులకు చేయూతనిస్తోంది.

ఇంతకు మించి గొప్పగా బతకాలన్న స్ఫూర్తిని ఎవరిస్తారు? అసలు వాళ్లెందుకు ఇవ్వాలి? మనమే తీసుకోవాలి. మనకు కనిపించని కష్టాలు, చెప్పుకోలేని బాధల్ని పంటి బిగువున భరిస్తున్న వారి కథలు మనకు తెలియకపోవచ్చు. కానీ వారెవరూ చావే పరిష్కారం అనుకోవడం లేదు. బతుకుపోరాటం చేస్తున్నారు.

మీరూ వినాలి...

ఈ రోజుల్లో పిల్లలందరి మీదా చదువుల పోటీ, స్నేహితుల ప్రభావం, పీర్ ప్రెజర్, సొసైటీ అంచనాలు... వంటి ఒత్తిళ్లెన్నో ఉంటున్నాయి. అయితే, కొందరు మాత్రమే ఆత్మహత్య దిశగా ఆలోచించడానికి వారు సున్నితమైన వ్యక్తిత్వం కలిగి ఉండటం కూడా కారణం కావొచ్చు. అలానే, గతంలో సూసైడ్‌కి ప్రయత్నించినా, కుటుంబ చరిత్ర ఉన్నా, మానసిక వ్యాధులున్నా, డ్రగ్స్‌కి అలవాటు పడినా... ఈ రిస్క్ కాస్త ఎక్కువ. తల్లిదండ్రులైన మీతో ఏ జంకూ లేకుండా తమ బాధను చెప్పుకోగలిగే కమ్యూనికేషన్ మీ మధ్య ఉండాలి. మీరూ ఓపిగ్గా వినాలి. అలానే, మీ పిల్లల సామర్థ్యాన్ని తెలుసుకోకుండా పక్కవాళ్లు చేస్తున్నారనో, ఫ్యూచర్ బాగుంటుందనో బలవంతం చేయొద్దు. అంతేకాదు, చాలామంది దేనికీ నో చెప్పకుండా బిడ్డల్ని పెంచుతున్నారు. దాంతో ఎప్పుడైనా కాదంటే తట్టుకోలేకపోతున్నారు. వాళ్లకి కొంచెం క్రమశిక్షణ అవసరం, అడిగిందల్లా సులువుగా అన్నిసార్లూ ఇచ్చేయొద్దు. ఒకవేళ పిల్లల్లో మానసిక అనారోగ్యం అంటే, తీవ్ర నిరాశ, ఒత్తిడి, ఆందోళన వంటివి కనిపిస్తే సమాజం ఏమనుకుంటుందో అని ఆలోచించకుండా చికిత్స చేయించాలి. అప్పుడే ఆత్మహత్యలు తగ్గుతాయి



– డాక్టర్. పింగళి శ్రీలక్ష్మి, సైకియాట్రిస్ట్

కాల్ చేయండి...

తీవ్రమైన ఒత్తిడి, ఆత్మహత్య ఆలోచనలతో సతమతం అవుతుంటే... ఒంటరివాళ్లమని బాధపడకండి. సాయమందించే సేవాసంస్థలెన్నో ఉన్నాయి. వారితో మాట్లాడండి. మీకు సాంత్వన కల్పిస్తారు. మీ వివరాలు గోప్యంగానూ ఉంచుతారు.

టెలిమానస్: మానసిక ఆరోగ్య సేవలందించడానికి కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ (14416, 18008914416) నంబర్లకు ఫోన్ చేస్తే ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తారు. ఇంగ్లిష్‌తో పాటు 20 ప్రాంతీయ భాషల్లో ఈ సౌకర్యం ఉంది.

రోషిణి: తీవ్ర ఒత్తిడిలో ఉన్నా, ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నా... 8142020033, 8142020044 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయొచ్చు. ఈ సంస్థ తెలుగు రాష్ట్రాల్లోనూ పనిచేస్తోంది.

1లైఫ్: ఒత్తిడి, చెడు అలవాట్లు, కెరియర్ ఇబ్బందులు, ప్రేమ వైఫల్యం... ఇలా ఏ కారణంతో కుంగుబాటుకి గురైనా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోన్న 1లైఫ్ సంస్థ సాంత్వన కలిగిస్తుంది. 7893078930 నంబర్‌కి కాల్ చేస్తే సాయం చేస్తారు.

వసుంధర

vasundhara@eenadu.in

అయితే... ఏంటి?



బస్సు వెళ్లిపోతుందని హడావుడిగా బయటికి వచ్చేస్తాం. అలా బస్సు ఎక్కి హమ్మయ్యా అనుకునేలోపే ఐడీ కార్డు మర్చిపోయామని గుర్తొస్తుంది.

ఇంటికి స్నేహితులను భోజనానికి పిలిచాం. పని సులువవుతుందని క్యాటరింగ్‌కి ఇచ్చాం. కానీ ఆర్డర్ పూర్తవలేదన్నారు.

ఇలా చివరి నిమిషంలో మనల్ని ఆందోళనకు గురిచేసే అంశాలకు కొదవే ఉండదు. కానీ సమస్యల్లా ఆ సమయంలో బుర్రే సరిగా పనిచేయదు. దీంతో ఇతర పనులూ మర్చిపోతాం. ఆందోళన మరింత పెరుగుతుంది. తగ్గించుకోవాలంటే 'సో వాట్'... 'అయితే ఏంటి' మంత్రాన్ని పఠించమంటున్నారు నిపుణులు. అంటే ఏమీలేదు. ఇప్పుడు ఐడీ కార్డు మర్చిపోయారు. 'అయితే ఏంటి' అనుకోండి. పంచ్ ఇబ్బంది అవుతుంది. మీటింగ్ రూమ్, ఇతర డిపార్ట్‌మెంట్లకు వెళ్లాలంటే వేరే వాళ్లని డోర్ యాక్సెస్ అడగాలి. అయితే ఏంటి? అలా అడగడం ఇబ్బందిగా అనిపిస్తుంది. సమయానికి ఎవరైనా లేకపోతే అక్కడే ఆగిపోవాలి. అయితే ఏంటి? హెచ్ ఆర్ వాళ్లకి ఫోన్ చేస్తే... ఇంకోసారి మర్చిపోవద్దు అంటారు. కానీ టెంపరరీ కార్డు ఇస్తారు. కాస్త ఇబ్బంది పడితేనేం? సమస్య అయితే తీరింది కదా! కానీ ఇదంతా ఆలోచించం. మొదట్లోనే ఆగిపోతాం. ఇలాంటి సమస్య ఎప్పుడు ఎదురైనా 'సో వాట్' అనుకోండి. ఇదేమీ నిర్లక్ష్య ధోరణి కాదు. భయం, ఆందోళన దాటి ముందుకు ఎలా సాగాలో ఆలోచించుకోవడం. భలేగుంది కదూ! ఈసారి ప్రయత్నించి చూడండి.

పట్టు చీరలకు కాంతి 'రేఖ'

చేనేత కూడా ఓ కళ. దానిపై మన నేతకారులు చేసే ప్రయోగాలెన్నో! అలా జరీ బుటాల్లో తెలంగాణ చరిత్ర ఆనవాళ్లను తీర్చిదిద్ది అందరినీ మెప్పించడమే కాదు, కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డునీ అందుకున్నారు వెల్ది రేఖ.



రేఖ

రేఖది రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం. చదివింది పదో తరగతే. తాత, తండ్రుల కారణంగా నేతపై ఆసక్తిని పెంచుకున్నారు. భర్త వెల్ది హరిప్రసాద్ కూడా నేతకారుడే. పదిహేనేళ్లుగా ఆయనకు సాయపడుతూ తన దగ్గరే నేతలో శిక్షణ తీసుకున్నారామె. చీరలను నేయడమే కాదు, మార్కెటింగ్‌పైనా అవగాహన పెంచుకున్నారు. తాజాగా చేనేత మగ్గంపై రాజన్న సిరిపట్టు పీతాంబరం చీరను నేశారు. దానిమీద కాకతీయులు, వేములవాడ రాజన్న చిత్రాలకు చోటిచ్చి చూపరులను ఆకర్షించారు. ఆ ప్రతిభకు గుర్తుగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికయ్యారు. '48 అంగుళాల వెడల్పు, అయిదు మీటర్ల పొడవుతో ఈ చీరను తీర్చిదిద్దా. బరువు 600 గ్రాములే. చీర అంచుల్లో కాకతీయుల శౌర్యానికి గుర్తు అయిన కళాతోరణం, కొంగు మీద వేములవాడ రాజన్న గోడ మొక్కుల చిత్రాలకు చోటిచ్చా. చీరంతా బుటాలుగా నూలు వడుకుతున్న మహిళల చిత్రాలుంటాయి. నేయడానికి 45 రోజులే పట్టినా డిజైనింగ్‌కి రెండేళ్లు కేటాయించా'నసే రేఖ... భర్తతో కలిసి చేనేత రంగంలో చాలా అద్భుతాలే సృష్టించారు. రాష్ట్రపతి, ప్రధానుల ప్రశంసలూ పొందారు. మిస్ వరల్డ్ పోటీల్లో అగ్గిపెట్టెలో ఇమిడే 30 పట్టుచీరలు, పట్టు పీతాంబరాలను రాష్ట్ర పర్యాటక శాఖకు అందించారు. ఈ చీరలను ధరించి పోటీదారులు అందాల పోటీల్లో ర్యాంప్ వాక్‌నీ చేశారు. 'తాజా అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. నైపుణ్యాలను మరింత పెంచుకోవాలన్న ఆశను కలిగించింది. గొల్లభామ చీరల్లా సిరిపట్టు పీతాంబరానికీ ఆదరణ పెరగాలని కోరుకుంటున్నా' అంటారు రేఖ.



– శ్రీనివాస్ నలిగేటి, రాజన్న సిరిసిల్ల జిల్లా
(జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా...)

పెరుగు తినొచ్చా..?

? నాకు డెలివరీ అయ్యి మూడు నెలలు అవుతోంది. నేను పెరుగు, పండ్లు తినొచ్చా? బిడ్డకు మంచిది కాదని ఇంట్లో వాళ్లు వద్దంటున్నారు. – రమ్య, నెల్లూరు

డియర్ వసుంధర



డాక్టర్ లతాశశి, పోషకాహార నిపుణులు

కొత్తగా అమ్మ అయిన వాళ్లకు ఎదురయ్యే అనుభవాల్లో ఇదీ ఒకటి. పెరుగు, పండ్లు లాంటివి తినడం వల్ల బిడ్డకు జలుబు, దగ్గు వస్తాయని పెద్దవాళ్లు చెబుతూ ఉంటారు. వాళ్లని కొన్ని నెలల వరకూ పథ్యం పేరుతో ఇవేవీ తిననివ్వరు. కొందరైతే సంవత్సరం వరకూ వీటికి దూరంగా ఉంటారు. అయితే ఇవన్నీ అపోహలే. వీటికి శాస్త్రీయ ఆధారాలేమీ లేవు. మీరు తినే పదార్థాలు చల్లనివైనా, వేడివైనా అవి నేరుగా బిడ్డకు అందవు. మీ శరీరం ముందు జీర్ణించుకుంటుంది. తర్వాత వాటిలోని పోషకాలు మాత్రమే పాల ద్వారా బిడ్డకు చేరతాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, యూనిసెఫ్ సూచనల ప్రకారం... పాలిచ్చే తల్లులు అన్ని పోషకాలూ ఉన్న సమతులాహారాన్ని తీసుకోవాలి. ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిది. నారింజ, బత్తాయి, ఉసిరి లాంటి వాటిల్లో విటమిన్-సి సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పెరుగులోని కాల్షియం, ప్రొ బయాటిక్స్ ఎముకల ఆరోగ్యానికి మంచిది. ఆకుకూరలూ, గింజ ధాన్యాల్లో పీచు, యాంటీఆక్సిడెంట్లు శక్తిని అందిస్తాయి. తల్లి తొందరగా కోలుకునేందుకు సహకరిస్తాయి. బిడ్డ ఎదుగుదలకూ తోడ్పడతాయి. పథ్యమని మీరు వీటన్నింటికీ దూరమైతే ఆ ప్రభావం పడేది మీ ఇద్దరి ఆరోగ్యం మీదే. అందుకే తాజా ఆహారాన్ని మితంగా, మూడుగంటలకోసారి తినేలా ప్రణాళికలు వేసుకోండి. దీనివల్ల పాలు బాగా పడతాయి. అయితే మీకు ముందు నుంచే వీటికి సంబంధించిన ఆహారపదార్థాలతో అలర్జీలు ఏమైనా ఉంటే... తినకపోవడమే మంచిది.

మాంసం మానేస్తే... మధుమేహం తగ్గుతుందా?

? నా వయసు 45 ఏళ్లు. నేను మాంసాహారిని. డయాబీటీస్ ఉంది. నాన్‌వెజ్ మానేస్తే బరువుతోపాటూ మధుమేహం తగ్గుతుందా? – శకుంతల, నంద్యాల

మాంసాహారంలో పోషకాలు, కెలోరీలు, కొవ్వు శాతం అధికంగా ఉంటుంది. కాకపోతే వీటిని తినే పరిమాణం ముఖ్యం. బరువు, డయాబీటీస్ తగ్గాలనే ఆలోచనతో మీరు ఒక్కసారిగా మాంసాహారానికి దూరమైతే... దాని ప్రభావం మీ ఆహారపు అలవాట్ల మీద పడుతుంది. నాన్‌వెజ్‌లో మీ శరీరానికి కావాల్సిన మేలైన ప్రొటీన్లు ఉంటాయి. డయాబీటీస్ ఉన్న వాళ్లు కూడా చికెన్, చేప, గుడ్డు(పౌల్ట్రీ ఉత్పత్తులు) లాంటివి వాళ్ల డైట్‌లో భాగం చేసుకోవచ్చు. అయితే రోజువారీ తీసుకోవాల్సిన పోషకాల శాతానికి మించకుండా తినాలి. వారానికి ఒకటి రెండు సార్లు 50గ్రా. మించకుండా చూసుకోవాలి. దీంతోపాటు నాన్‌వెజ్ తినేటప్పుడు కూరగాయలు కూడా భోజనంలో ఉండాలి. వీటిల్లో పీచు ఎక్కువగా ఉంటుంది. అది మీ ఆహారాన్ని సమతౌల్యం చేస్తుంది. అయితే శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ అధికంగా ఉండే రెడ్ మీట్ మాత్రం తినకూడదు.

బంగారం - వెండి



6న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,790	94,200	1,17,124
విజయవాడ	1,00,645	93,800	1,16,900
ప్రొద్దుటూరు	1,00,300	92,280	1,17,000
రాజమహేంద్రవరం	1,02,330	93,800	1,26,000
విశాఖపట్నం	1,01,960	93,500	1,25,000
తమిళనాడు	-----	93,800	1,26,000

మీకు తెలుసా?



లిడా డి.న్యూమన్... అమెరికాకు చెందిన ఈమె హెయిర్ బ్రష్ కనిపెట్టారు. ఎక్కువరోజులు మన్నేలా, దాని విడి భాగాలు తీసి శుభ్రపరచుకునేందుకు వీలుగా డిజైన్ చేశారు.

> ఇండియాలో మేం పెట్టుబడి పెట్టిన ఓ అంకుర సంస్థ... అందుబాటు ధరల్లోని గృహాలకు రుణాలిస్తుంది. వాళ్లకి ఒక్కటే నియమం పెట్టాం. రుణాలు ఇచ్చే ఇళ్లు మహిళల పేరుమీద రిజిస్టర్ అవ్వాలని. ఇంటికి ఆమె అసలైన యజమాని అవుతుంది. దుర్బల జీవితం గడిపే మహిళలకు ఇల్లు తనదన్న విషయం పెద్ద ఉపశమనం. దీన్ని ష్యూరిటీగా పెట్టి ఆమె రుణం పొంది వ్యాపారంలోకీ అడుగు పెట్టొచ్చు.
>
> - మేరీ ఎలెన్ ఇస్కెండెరియన్, ప్రెసిడెంట్, సీఈఓ, విమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్



ఇంటి తోట

కళ తెచ్చే కలువలు..!













నీళ్ల మధ్య తేలియాడుతూ అందంగా విచ్చుకునే రంగు రంగుల కలువ పూలను చూస్తే మనసెంత పులకిస్తుందో కదా! ఆధ్యాత్మిక ప్రాధాన్యం, ఔషధ విలువలూ కలిగిన వీటిని చెరువులూ, కాలువల్లోనే కాదు... మన ఇంట్లోనూ పెంచుకోవచ్చని తెలుసా? అదెలాగో చదివేయండి.

లక్ష్మికి ప్రతిరూపంగా భావించే కలువ పూల అందాన్ని ఎంత వర్ణించినా తక్కువే. హిందూ, బౌద్ధ మతాల్లో వీటిది ప్రత్యేక స్థానం. మృదువైన రేకలతో ఆకర్షణీయమైన రంగుల్లో కనువిందు చేస్తాయివి. దేవతా పుష్పాలుగా ప్రాచుర్యం పొందిన వీటినే ఆంగ్లంలో వాటర్‌లిల్లీగానూ పిలుస్తారు. కలువ విత్తనం, కాండం, పుష్పం... ఇలా అన్నింటికీ బోలెడు ఉపయోగాలున్నాయి. దీని శాస్త్రీయనామం నింఫియేసి. ఇవి చంద్రకాంతికి వికసిస్తాయి.

నాచు పట్టకుండా...

కలువల్ని ఇంట్లో పెంచుకోవాలనుకుంటే లోతు, వెడల్పు ఎక్కువగా ఉండే పెద్ద తొట్టెను ఎంచుకోవాలి. దీన్ని ఆరేడు గంటలైనా ఎండ సోకే ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలి. మొదట అడుగున సారవంతమైన బంకమట్టిని వేసి ఆపై 6-8 ఇంచుల వరకూ మట్టి పోసి దుంపల్ని నాటుకోవాలి. తర్వాత నీళ్లు పోయాలి. అయితే ఒకేసారి ఎక్కువగా నింపేయకూడదు. నీళ్లు నాచు పట్టకుండా చిన్న బొగ్గు ముక్క, గప్పీ చేపలు... వేస్తే నీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరిచి వాసన రాకుండా చేస్తాయి. అయితే, శుభ్రమైన, క్లోరిన్ వాటర్‌ని మాత్రమే ఇందు కోసం వాడాలి. పూలు ఆరోగ్యంగా, ఎక్కువగా రావాలంటే... నీటిలో కరిగే ఎరువుని అందించాలి. ఆకులు రంగు మారినా, ఎండిపోయినా వాటిని ఎప్పటికప్పుడు తీసేయాలి. కుండీలో నీటిమట్టం తగ్గకుండా చూసుకోవాలి. పేనుబంక సమస్య వచ్చినా, ఇతర కీటకాలు దాడి చేస్తున్నా వేపనూనె వాడండి.

పడనిద్దాం... నేర్చుకోనిద్దాం!

డిజిటల్ యుగంలో పుట్టిన జెన్ జీ, ఆల్ఫా కిడ్స్ పెంపకం సవాళ్లతో కూడుకున్నది. మరి వీటిని అధిగమించడం ఎలా?



- పిల్లల స్క్రీన్‌టైమ్ పెరుగుతుండటం పెద్ద తలనొప్పి. ఫోన్‌కు అతుక్కుపోవడంద్వారా వాళ్లు దేన్ని కోల్పోతున్నారో తెలుసుకోండి. చదువు, ఆటలు, ఆహారం, వినోదం, మీ సావాసం... వీటిలో ఏదో ఒకటి కావొచ్చు. ఫోన్ చూస్తున్నావంటూ నిందించకుండా, వాళ్లు కోల్పోతున్న అంశం దిశగా తీసుకువెళ్లే ప్రయత్నం చేయండి.
- ఈ జనరేషన్ పిల్లల్లో ఆందోళన ఎక్కువగా కనిపిస్తుంది. అది లోపం కాదు... వాళ్లకు ఈ విషయంలో మార్గనిర్దేశం చేసేముందు అసలు కారణాన్ని గమనించాలి. ఉదాహరణకు వీళ్లు కచ్చితత్వం కోసం ప్రయత్నిస్తుంటారు. ప్రతి దాంట్లో కచ్చితత్వం చూడాల్సిన పనిలేదన్న విషయాన్ని అర్థమయ్యేలా చెప్పండి. మీరూ కోపంలో ఏదో ఒకటి అనేయొచ్చు. తర్వాత 'అలా చేసి ఉండాల్సింది కాద'నిపిస్తే, మాట కలిపి సర్దుబాటు చేసుకోండి.
- 'నేనెవరు' అనే కోణంలో ఈ పిల్లలు ఆలోచిస్తున్నారు. విభిన్న కోణాల్లో పరిసరాల్ని పరిచయంచేయడంద్వారా వాళ్లెంటో తెలుసుకునే అవకాశం కల్పించండి.
- అతి భద్రత వాళ్లను బలహీనుల్ని చేస్తుంది. అడగక ముందే కొని ఇవ్వడం, సమస్యల్ని పరిష్కరించడం... కాకుండా కాస్త వెనక్కి తగ్గి గమనిస్తుంటే వాళ్లు ముందుకొచ్చి సమస్యని పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తారు. వాళ్లని ఫెయిల్ కానివ్వండి, కిందపడనివ్వండి... తమ నిర్ణయాలవల్ల కలిగిన ఫలితాలను తెలుసుకోనీయండి. ఆ క్రమంలో వచ్చేవి కష్టాలు, ఇబ్బందులు కావు, అనుభవ పాఠాలు.
- ఈ జనరేషన్ పిల్లలు వేచి చూడటం, గమనించడం అంటే ఇబ్బంది పడుతున్నారు. ఈ వేగవంతమైన ప్రపంచం వాళ్లనలా తయారుచేసింది. నిదానంలో ఉన్న ప్రయోజనాల్నీ వాళ్లకి చెప్పాలి.

శోధిత

ముందే కనిపెట్టొచ్చు...



పెద్దలనేకాదు, పిల్లలనూ ఇప్పుడు ఊబకాయం చుట్టుముడుతోంది. మరి, ఆ సమస్య రాకముందే మనం కనిపెట్టగలిగితే బావుంటుంది కదా! అందుకోసం శాస్త్రవేత్తలు ఓ టెస్ట్‌ని క్రియేట్ చేశారు. అదే... పాలీజెనిక్ రిస్క్ స్కోర్... దీనికోసం 50లక్షలమందికి పైగా జెనెటిక్ డేటాను పరిశీలించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో పరీక్ష చేసి, ఈ స్కోర్ ఆధారంగా భవిష్యత్తులో ఒబేసిటీ వచ్చే ప్రమాదాన్ని అంచనా వేయొచ్చట. ఈ టెస్ట్... అంతకుముందు ఉన్న వాటికంటే రెట్టు మెరుగ్గా ఫలితాలను ఇస్తున్నట్లు చెబుతున్నారు. తద్వారా ముందు నుంచే పిల్లల జీవనశైలిలో మార్పులు చేయొచ్చు. అధిక బరువు బారిన పడకుండా చూసే అవకాశమూ ఉందంటున్నారు పరిశోధకులు.

తేమ వాసన తగ్గించే... నిమ్మ!



వర్షాకాలం... వాతావరణంలో తేమ పెరగడం, ఎండ తక్కువగా ఉండటం వంటి కారణాలతో ఇల్లు కాస్త ముక్క వాసన వస్తుంది. దీనికి తడి దుస్తులు కూడా తోడైతే... మరింత ఇబ్బంది. ఇలాంటప్పుడు ఎయిర్‌ఫ్రెషనర్ వాడితే సరిపోతుంది కదా అంటారు చాలామంది. ఇవే కాదు... సెంటెడ్ క్యాండిల్స్, పర్‌ఫ్యూమ్స్.. వంటివి ఇచ్చే సువాసనల సంగతేమో కానీ, ఇంట్లో గాలిని మాత్రం కలుషితం చేస్తాయట. ముఖ్యంగా బెంజీన్, ఫార్మాల్డిహైడ్, థాలేట్లు, టోలున్... వంటి హానికారక రసాయనాలెన్నింటినో ఇవి విడుదల చేస్తాయి. ఫలితంగా మహిళల్లో పునరుత్పత్తి వ్యవస్థకు నష్టం కలిగించడంతో పాటు... పుట్టే శిశువుల్లో అనేక లోపాలకూ కారణం అవుతాయి. క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పుని తెచ్చిపెడతాయి. అందుకే, వీలైనంతవరకూ వీటిని వాడకపోవడమే మేలు. ఇవి గాలి నాణ్యతను ఏ మాత్రం మెరుగుపరచవు. కేవలం కృత్రిమంగా సువాసనల్నే అందిస్తాయి. అలాకాకుండా ఇల్లు సహజంగా పరిమళాలు వెదజల్లాలంటే... ఇంట్లోకి తాజా గాలి ప్రసరించేలా తలుపులు తెరవండి. ఇంట్లోని దుర్వాసన పోగొట్టడానికి ఓ గిన్నెలో కాస్త బేకింగ్ సోడా వేసి మూలల్లో పెట్టండి. స్నానాల గదిలోని తేమ వాసన పోవడానికి రాతి ఉప్పులో కాస్త టీట్రీ ఆయిల్ చేర్చి లోపల ఉంచండి. ఇక, నిమ్మ, నారింజ తొక్కలు, రోజ్‌మెరీ, థైమ్, తులసి వంటి హెర్బ్స్‌ను నీళ్లల్లో వేసి మరిగిస్తే సరి. ఆ సువాసనలు ఇల్లంతా వ్యాపిస్తాయి. అంతేకాదు, నచ్చిన పరిమళం గల ఎసెన్షియల్ ఆయిల్స్‌ని ఎంచుకుని డిఫ్యూజర్‌లో వేసినా ఫలితం ఉంటుంది. ఇవేకాదు, పీస్ లిల్లీ, మనీప్లాంట్, ఇంగ్లిష్‌ఐవీ... వంటి ఇండోర్ మొక్కలు గాలినీ శుద్ధి చేస్తాయి. లిల్లీ, గులాబీ, సంపెంగ, మల్లె... పూలను అలంకరణ కోసం వాడినా అందంతో పాటూ హాయినీ ఇస్తాయి.

అడ్మిషన్ దక్కినా అందని ద్రాక్షే!

అమెరికా వీసాల్లో జాప్యంతో విద్యార్థులకు ఇక్కట్లు





ఇంటర్నెట్ డెస్క్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని చందంగా ఉంది.. అమెరికా వెళ్లే విద్యార్థుల పరిస్థితి. విశ్వవిద్యాలయాలు అడ్మిషన్లు ఇచ్చినా వీసాల్లో జాప్యంతో వారు కళాశాలల్లో చేరలేకపోతున్నారు. ఇప్పటికే తరగతులు ప్రారంభంకాగా ఇంకా వారు స్వదేశాల్లోనే ఉండిపోవాల్సి వస్తోంది. అమెరికాలోని ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు వీసాలు సకాలంలో రాలేదు. దీంతో విశ్వవిద్యాలయానికి మిలియన్ల డాలర్ల మేర నష్టం జరగనుంది. దక్షిణ కరోలినాలోని ఫుర్మన్ యూనివర్సిటీలో ఈ ఏడాది 562 మంది కొత్త విద్యార్థులే చేరారు. గతేడాది ఆ సంఖ్య 613. ఈ తగ్గుదలకు వీసా ఇబ్బందులే కారణంగా గుర్తించారు. సామాజిక మాధ్యమ ఖాతాల వెట్టింగ్ కారణంగా నిలిపేసిన వీసా ఇంటర్వ్యూలను జూన్‌లో తిరిగి ప్రారంభించినా.. ఆ ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. భారత్, చైనా విద్యార్థులకు వీసాల మంజూరులో గతంలోకంటే 7 రెట్ల వ్యత్యాసం కనిపిస్తోంది. కొత్తగా వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య ఈసారి 30శాతం వరకు తగ్గొచ్చని అంచనా. షోర్‌లైట్ అంచనా ప్రకారం.. అమెరికా వర్సిటీలు 2.6 బిలియన్ డాలర్ల (రూ.22 వేల కోట్లకుపైగా) ఆదాయం కోల్పోవచ్చు.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

అమెరికా వీసా లభించక తరగతులకు హాజరుకాలేని వారి కోసం కొన్ని సంస్థలు ప్రత్యామ్నాయాలను ఎంచుకున్నాయి. ఇలాంటి వారి కోసం అరిజోనా వర్సిటీ లండన్‌లో క్యాంపస్ నిర్వహిస్తోంది. యూఎస్ నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం.. రిమోట్ లెర్నింగ్ ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతోపాటు టొరంటో, లండన్ క్యాంపస్‌లలో సీట్లను ఆఫర్ చేస్తోంది. హార్వర్డ్ కెన్నడీ స్కూల్ తాత్కాలికంగా తమ విద్యార్థులకు యూనివర్సిటీ ఆఫ్ టొరంటోలోని ముంక్ స్కూల్‌లో అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తోంది.

కార్చిచ్చు..



దక్షిణ ఫ్రాన్స్‌లో భారీ కార్చిచ్చు వ్యాపించింది. అగ్నికీలల్లో దాదాపు 13,000 హెక్టార్ల ప్రాంతం (రాజధాని పారిస్ కన్నా ఎక్కువ విస్తీర్ణం) బుగ్గిగా మారిందని అధికారులు పేర్కొన్నారు


45 పైసలకే రైలు ప్రమాద బీమా



దిల్లీ: ఈ-టికెట్లను కొనుగోలుచేసే ప్రయాణికులు 45 పైసలతోనే ప్రమాద బీమా సదుపాయం పొందొచ్చని, దీనికింద ఐదేళ్లలో 333 క్లెయింలను పరిష్కరించిన బీమా సంస్థలు రూ.27.22 కోట్లను ప్రయాణికులకు.. లేదా వారి కుటుంబ సభ్యులకు చెల్లించాయని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం పార్లమెంటులో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 'ప్రయాణికులు ఆన్‌లైన్ లేదా రిజర్వేషన్ కౌంటర్ నుంచి తీసుకునే టికెట్‌లో 'ఐచ్ఛిక ప్రయాణ బీమా పథకం' (ఓటీఐఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. విడిగా ఎలాంటి దరఖాస్తులు, పత్రాలు అవసరం లేదు. ఆన్‌లైన్లో టికెట్లు కొనుగోలు చేసి.. బెర్తు ఖరారైన, ఆర్ఏసీలో ఉన్న ప్రయాణికులకే ఈ పథకం అందుబాటులో ఉంటుంది. ప్రయాణికుల మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీకి పాలసీ వివరాలు అందుతాయి. బీమాని ఎలా పొందాలనే వివరాలన్నీ ఈ-మెయిల్‌లోనే ఉంటాయి. ప్రయాణికులు నేరుగా క్లెయిం చేసుకోవాలి' అని వైష్ణవ్ తెలిపారు.

ఆ 65 లక్షల మంది వివరాలివ్వండి

బిహార్‌లో తొలగించిన ఓటర్లపై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం



దిల్లీ: బిహార్‌లో ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఈ నెల 9వ తేదీలోగా అందజేయాలని ఎన్నికల సంఘాన్ని (ఈసీ) బుధవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటికే రాజకీయ పార్టీలతో పంచుకున్న ఆ సమాచారాన్ని పిటిషనర్ అయిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థకు కూడా ఇవ్వాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం తెలిపింది. బిహార్‌లో చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)ను సుప్రీంకోర్టులో ఇదివరకే ఏడీఆర్ సవాల్ చేసింది. తాజాగా.. ముసాయిదా ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి పేర్లను, అందుకుగల కారణాలను (మృతి, వలసపోవడం లేదా మరేదైనా) వెల్లడించేలా ఈసీని ఆదేశించాలని విజ్ఞప్తి చేసింది. ఈ నెల ఒకటిన విడుదలైన ముసాయిదా జాబితాలో కనుక తొలగింపు కారణాలను ఆ తర్వాత క్రమంలో వెల్లడిస్తారని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సవరణ ప్రక్రియలో భాగంగా ఓటరు నమోదు పత్రాన్ని పూరించి అందజేసిన 75శాతం మంది తమ ధ్రువీకరణ పత్రాలను జత చేయలేదని, బూత్ స్థాయి అధికారుల సిఫార్సుతో ముసాయిదా జాబితాలో వారి పేర్లను చేర్చారని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. ప్రధాన పిటిషన్లపై ఈ నెల 12న జరిగే విచారణ సమయంలో ఈ విషయాలను తెలియజేయవచ్చని న్యాయవాదికి ధర్మాసనం సూచించింది.

కన్నబిడ్డలపై అత్యాచారాలా?


దిల్లీ: కన్నబిడ్డలపైన తండ్రుల లైంగిక హింసపై సుప్రీంకోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరాలు.. కుటుంబ వ్యవస్థ పునాదులనే దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించింది. కుమార్తెపై అత్యాచారం చేసిన ఓ తండ్రికి శిక్ష వేస్తూ ఇలాంటి కేసుల్లో కఠినంగా వ్యవహరించాలని పేర్కొంది. 'సొంత తండ్రి చేతిలో చిన్నారి క్షోభను అనుభవిస్తే చట్టం దృఢంగా, రాజీలేని స్వరంతో మాట్లాడాలి. కుటుంబం ఓ రక్షణ కవచం అన్న భావనకే తూట్లు పొడిచే ఇలాంటి కేసుల్లో నిందితులకు శిక్ష విషయంలో న్యాయస్థానాలు ఉపేక్షించకూడదు. వావివరసలు మరిచి తండ్రులు చేసే లైంగిక హింస కుటుంబ వ్యవస్థ పునాదులనే కదిలిస్తుంది. ఇల్లు అనేది ఓ సురక్షిత ఆవాసంగా ఉండాలి తప్ప భయానక పరిస్థితులకు నిలయం కాకూడదు' అని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం పేర్కొంది.

పుట్టింటికి మాధురి



ముంబయి: మహారాష్ట్రలోని కొల్హాపుర్ జిల్లా నందనీ జైనమఠం నుంచి జామ్‌నగర్ 'వన్‌తారా' జంతువుల పునరావాస కేంద్రానికి గత వారం తరలించిన ఏనుగు 'మాధురి' (36) అలియాస్ మహాదేవి మళ్లీ పుట్టింటికి రానుంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో తాము వేసిన పిటిషన్‌కు 'వన్‌తారా' సైతం మద్దతు ఇస్తున్నట్లు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ బుధవారం ప్రకటించారు. సుప్రీంకోర్టు కమిటీ సూచనల మేరకు మఠం సమీపంలోనే ఆ ఏనుగు కోసం 'వన్‌తారా' చేయూతతో సహాయకేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మఠంలో మూడు దశాబ్దాల పాటు బందీగా ఉన్న ఈ ఏనుగు ఆరోగ్యం క్షీణించిందన్న ఓ ఎన్జీవో సంస్థ పిర్యాదుతో హైకోర్టు ఆదేశాల మేరకు 'వన్‌తారా'కు తరలించారు. స్థానిక ప్రజలు ఆందోళనలు చేపట్టడంతో మాధురి మళ్లీ వెనక్కు వస్తోంది.

బిహార్‌లో ట్రంప్ నివాసం!



ఈటీవీ భారత్: బిహార్‌లోని సమస్తీపుర్ జిల్లాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో నివాస ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన దరఖాస్తు సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లాలోని మొహియుద్దీన్‌నగర్ బ్లాకు ప్రభుత్వ పోర్టల్‌లో ట్రంప్ పేరు, ఫొటోతో ఈ దరఖాస్తు ప్రత్యక్షమైంది. అధికారులు అప్రమత్తమై అభ్యర్థనను వెంటనే తిరస్కరించారు. ఐటీ చట్టం కింద కేసు నమోదుచేసి, సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బిహార్‌లో గత కొన్నిరోజులుగా ఇటువంటి 'అపహాస్య' దరఖాస్తులతో అధికారుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. మొదట కుక్క పేరుతో దరఖాస్తు రాగా, ఆ తర్వాత ట్రాక్టరు.. ఇప్పుడు ట్రంప్ దొరికారు.

సేవల్లేకుంటే.. టోల్ వసూలు కుదరదు

తిరువనంతపురం: రోడ్ల విషయంలో ప్రయాణికులకు సరైన సేవలు అందించకపోతే టోల్ రుసుం వసూలు చేయజాలరని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), సంబంధిత ఏజెన్సీలకు కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్‌హెచ్-544లో ఎడప్పల్లి-మన్నుతి మార్గంలో టోల్ వసూళ్లను నాలుగు వారాల పాటు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

రాంచీ: కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరటనిస్తూ ఝార్ఖండ్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. 2018లో ఝార్ఖండ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్న రాహుల్ చేసిన వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఆరోపిస్తూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి ఈ కేసు దాఖలు చేశారు.



మీ నైపుణ్యాలను ప్రచారం చేసుకోండి

నేటి ప్రపంచంలో చాలామంది తమకు, తమ ఉత్పత్తులకు సరైన ప్రచారం కల్పించుకోవడంలో తడబడుతున్నారు. స్వీయ నైపుణ్యాలను ప్రచారం చేసుకోవడం తప్పేమీ కాదు. కష్టానికి తగ్గ ప్రతిఫలం కోసం ప్రయత్నించడం పరిధిలోకే వస్తుందది. మీ ఉత్పత్తుల గురించి మీరు మాట్లాడకపోతే.. మీతో సహా ఎవరికీ వాటితో ప్రయోజనం ఉండదు.

– జస్టిన్ వెల్ష్, ప్రొడక్టివిటీ కోచ్

11 ఏళ్లుగా పారదర్శక పాలన: ప్రధాని

దిల్లీ: దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం సమగ్ర దృష్టితో కృషి చేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. గత 11 ఏళ్లుగా పారదర్శకమైన, వేగవంతమైన, పౌరకేంద్రీకృతమైన పాలనను దేశం చూస్తోందని పేర్కొన్నారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా దిల్లీలో నిర్మించిన మొదటి భవనం కర్తవ్య భవన్-03ను మోదీ బుధవారం ప్రారంభించారు. మంత్రిత్వశాఖలతో పాటు వాటి విభాగాలను ఒకే తాటిపైకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా కర్తవ్య పథ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా విజయగాథను లిఖించేందుకు మనమంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.



కర్తవ్య భవన్ ఆవరణలో మొక్కనాటి నీరుపోస్తున్న మోదీ

ఏడేళ్ల తర్వాత చైనాకు మోదీ!

దిల్లీ: ప్రధాని మోదీ ఏడేళ్ల విరామం తర్వాత చైనా పర్యటనకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. టియాంజిన్‌లో ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ఆయన హాజరు కానున్నట్లు సమాచారం. 29న మోదీ జపాన్‌కు బయల్దేరుతారని, అక్కడ పర్యటన తర్వాత టియాంజిన్‌కు వెళ్తారని సమాచారం. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత్, చైనా సైన్యం మధ్య ఘర్షణ చోటుచేసుకున్న తరువాత ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. వీటిని పునరుద్ధరించడానికి రెండు దేశాలూ ప్రయత్నిస్తున్నాయి.

బంకు నెత్తిన మూత!



ఇంటర్నెట్ డెస్క్: మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో ఈ నెల 1 నుంచి బైకర్లకు 'నో హెల్మెట్.. నో పెట్రోల్' నిబంధన అమల్లో ఉండగా.. ఓ ద్విచక్ర వాహనదారు చేసిన పని పెట్రోల్ బంకు మూసివేతకు దారి తీసింది. బైకులో ఇంధనం కోసం వచ్చిన ఓ పాల వ్యాపారి హెల్మెట్ లేనందున నెత్తిన పాల క్యాను మూత పెట్టుకున్నాడు. బంకు సిబ్బంది యథాలాపంగా పెట్రోలు పోసి పంపారు. ఈ వీడియో వైరల్ కావడంతో అధికారులు కన్నెర్ర చేశారు. హెల్మెట్ నిబంధనపై విస్తృతంగా ప్రచారం చేసి, ఉల్లంఘిస్తే ఏడాది జైలుశిక్ష లేదా రూ.5 వేల జరిమానా ఉంటుందని హెచ్చరించినా నిషేధాజ్ఞలను పట్టించుకోనందున పెట్రోల్‌బంకును సీజ్ చేశారు.

సుంకాలపై అమెరికా వితండ వాదన



దిల్లీ: భారత్ భారీగా సుంకాలు విధిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భూతద్దంలో చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. విదేశీ ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సాధారణ సగటు సుంకం 15.98%. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం.. మనం విధిస్తున్న వాణిజ్య ఆధారిత సగటు సుంకం 4.6 శాతమే. సాధారణ సగటు సుంకం ప్రాతిపదికన భారత్‌ను ట్రంప్ విమర్శిస్తున్నట్లు వాణిజ్య వర్గాలు భావిస్తున్నాయి. సాధారణ సగటు సుంకం కింద బంగ్లాదేశ్ 14.1 శాతం, తుర్కియే 16.2%, అర్జెంటీనా 13.4% వసూలు చేస్తున్నాయి. వాణిజ్య ఆధారిత సగటు సుంకం పలు వర్ధమాన దేశాల కంటే మనవద్ద తక్కువగానే ఉంది. వియత్నాం 5.1%, ఇండోనేసియా 5.7%, ఈయూ 5% మేర ఈ సుంకాన్ని వసూలు చేస్తుండటం గమనార్హం. బాగా అభివృద్ధి చెందిన స్విట్జర్లాండ్ (28.5%), నార్వే (31.1%), దక్షిణ కొరియా (57%) కూడా విదేశీ వ్యవసాయ ఉత్పత్తులపై భారత్‌ను మించి సుంకాలు విధిస్తున్నాయి.

■ అమెరికా నుంచి భారత్ భారీగా ఔషధ/ఇంధన ఉత్పత్తులు, యంత్రాలు, రసాయనాలను దిగుమతి చేసుకుంటోంది. వీటిపై 5 నుంచి 8 శాతమే సుంకాలు విధిస్తున్నారు.

ఇతర దేశాల నుంచి తీసుకుంటే మోతే

భారత్ ఒకవేళ ఇతర దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవాలని భావిస్తే.. తలకు మించిన భారంగా పరిణమించడం ఖాయం. ఆయా దేశాలు అధిక ధరలను వసూలు చేస్తాయి. అప్పుడు భారం వినియోగదారులపైకి మళ్లుతుంది. ఇప్పటికే అధికంగా ఉన్న పెట్రో ధరలు మరింత పెరుగుతాయి. రష్యా ముడి చమురువల్లే 2023లో భారత్.. 86.28 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. విచిత్రంగా రష్యా చమురు ఉత్పత్తులను భారత్ నుంచి కొనుగోలు చేసే దేశాల్లో అమెరికా, ఐరోపా దేశాలున్నాయి.

ఎస్ఐఆర్‌పై పార్లమెంటులో చర్చించలేం

- అది సుప్రీంకోర్టులో ఉంది: రిజిజు
- సరే.. ఎన్నికల సంస్కరణలపై చర్చిద్దాం: విపక్షం

దిల్లీ: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్) అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నందువల్ల దానిపై పార్లమెంటులో చర్చించలేమని కేంద్రం తేల్చిచెప్పింది. పెద్దఎత్తున ఓటర్ల తొలగింపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ విపక్షాలు బుధవారం ఉభయసభల్లో నినాదాలిచ్చాయి. దీంతో సభలు వాయిదాపడ్డాయి. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో మాట్లాడుతూ న్యాయస్థానంలో ఉన్న అంశాలపై సభలో చర్చించకూడదన్న నిబంధనల్ని ప్రస్తావించారు. ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధమేనని, అయితే అది రాజ్యాంగ నిబంధనలకు లోబడి ఉండాలని చెప్పారు. ఎన్నికల సంఘం వంటి స్వతంత్ర సంస్థల పనితీరు గురించి పార్లమెంటులో చర్చించలేమన్నారు. విపక్షాలు స్పందిస్తూ.. మధ్యేమార్గంగా ఎన్నికల సంస్కరణలపై చర్చించడానికి ముందుకు రావాలని కోరాయి.



పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న మల్లికార్జున ఖర్గే, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్, సంజయ్ రౌత్, సుప్రియా సూలే తదితరులు

దేనిపైనైనా చర్చించవచ్చు: ఖర్గే

ఎస్ఐఆర్‌పై రాజ్యసభలో, పార్లమెంటు ఆవరణలో విపక్షాలు ఆందోళన నిర్వహించాయి. ఎగువసభలో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. సభాపతి స్థానంవద్దకు సభ్యులు చేరి నినాదాలిచ్చారు. ఇద్దరు ఎంపీలు పోడియంపైకి చేరేందుకు ప్రయత్నించారు. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల విధి నిర్వహణపై మినహా దేనిపైనైనా సభలో చర్చించవచ్చని డిప్యూటీ ఛైర్మన్‌ను ఉద్దేశించి విపక్ష నేత మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. జడ్జి తొలగింపునకు రాష్ట్రపతిని కోరే తీర్మానంపైనైతే చర్చించవచ్చని చెప్పారు. కోర్టులో ఉన్నవాటిపై చర్చించరాదనేది పూర్తి అపోహ అన్నారు. అందువల్ల ఎస్ఐఆర్‌పై చర్చించవచ్చని చెప్పారు.

వివాహిత, ప్రియుడిపై మూకదాడి.. ఊరేగింపు



కటిహార్: బిహార్‌లోని కటిహార్ జిల్లా ఫల్కా పోలీస్‌స్టేషను పరిధిలో ఓ వివాహిత (32) ఆమె ప్రియుడి (40)తో సన్నిహితంగా ఉండగా గ్రామస్థులు పట్టుకొన్నారు. స్థానిక పంచాయతీ ఆదేశాల మేరకు ఆ ఇద్దరికీ గుండు గీయించి, ముఖాలకు నల్లరంగు పూసి, మెడలో చెప్పుల దండలు వేసి బుధవారం ఊరేగించారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో ప్రియుడి భార్య పరుగున పోలీస్‌స్టేషనుకు వెళ్లి సాయం కోరింది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరూ వివాహితులు, పిల్లలు ఉన్నవారని.. దర్యాప్తు అనంతరం తగిన చర్య తీసుకొంటామని జిల్లా ఎస్పీ శిఖర్ చౌధరి తెలిపారు.

అణు విలయాన్ని స్మరించుకున్న హిరోషిమా

హిరోషిమా: అమెరికా తనపై అణుదాడికి పాల్పడి 8 దశాబ్దాలు పూర్తైన సందర్భంగా జపాన్‌లోని హిరోషిమా నగరం నాటి విషాదాన్ని మరోసారి నెమరువేసుకుంది. ఈ సందర్భంగా జపాన్ ప్రధాని షిగేరు ఇషిబా తదితరులు అణు విధ్వంస స్మారకం వద్ద పుష్పమాల ఉంచి నాటి దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అణుబాంబు దాడిలో బతికి బట్టగట్టి వార్ధక్య భారంతో మగ్గుతున్న హిరోషిమా వాసుల్లో అధికులు తమకు ఇదే చివరి విలయ వార్షికం అని చెబుతున్నారు. తమకు జరిగిన అన్యాయం ఇతరులకు జరగకూడదని వారు కోరుకుంటున్నారు. అణ్వస్త్ర వ్యాప్తిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 1945, ఆగస్టు 6న జపాన్‌లోని హిరోషిమా నగరంపై అమెరికా తొలి అణ్వాయుధాన్ని ప్రయోగించి 1.4 లక్షల మంది మరణానికి కారణమైంది. తదనంతరం నాగసాకి నగరంపై జరిగిన అణుబాంబు దాడిలో మరో 70 వేల మంది మరణించారు. ఈ దాడుల పర్యవసానంగా జపాన్ 1945 ఆగస్టు 15న అమెరికా కూటమికి లొంగిపోవడంతో రెండో ప్రపంచ యుద్ధానికి తెరపడింది.



హిరోషిమా అణుదాడి మృతులకు నివాళిగా పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ప్రదర్శన

అమెరికా సైనిక స్థావరంలో కాల్పులు

సవానా: అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో అతిపెద్ద సైనిక స్థావరమైన ఫోర్ట్ స్టెవార్ట్‌లో బుధవారం ఓ ఆగంతుకుడు జరిపిన కాల్పుల్లో ఐదుగురు సైనికులు గాయపడ్డారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని గంటలోపే అదుపులోకి తీసుకున్నట్లు సైన్యం ప్రకటించింది. ఈ కాల్పుల ఘటన ఉదయం 10.56కు చోటుచేసుకుందని ఫోర్ట్ స్టెవార్ట్ సైనిక స్థావరానికి చెందిన సోషల్ మీడియా అకౌంట్ తెలిపింది. కాల్పులు జరిపిన వ్యక్తి రెండో ఆర్మర్డ్ బ్రిగేడ్ కంబాట్ టీమ్ ఉండే ప్రాంతంలో ప్రత్యక్షమయ్యాడని ఆ సోషల్ మీడియా పోస్టు పేర్కొంది. ఈ ఘటనపై జార్జియా రాష్ట్ర గవర్నర్ బ్రియాన్ కెంప్ దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు.

అణుయుద్ధ భయానికి అమెరికా-రష్యా ఉద్రిక్తతల ఆజ్యం

వాషింగ్టన్: అమెరికా-రష్యా మధ్య అణుయుద్ధం జరిగితే సంభవించే విధ్వంస భయం పలు దశాబ్దాలుగా మానవాళిని పీడిస్తోంది. ఇరుదేశాలూ తమ మధ్య ఉద్రిక్తతల్ని సడలించుకునే ప్రయత్నాలను 1970లలోనే ప్రారంభించాయి. ఇందులో భాగంగానే 1987లో మధ్యమ శ్రేణి అణ్వాయుధ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీంతో యుద్ధాల్లో అణ్వాయుధ సామర్థ్యం కలిగిన మధ్యమశ్రేణి క్షిపణుల వాడకానికి తెరపడినట్లైంది. 2019లో అమెరికా ఈ ఒప్పందం నుంచి వైదొలగింది. ఇన్నాళ్లూ కట్టుబడి ఉన్న రష్యా ఇక తానూ ఒడంబడికను పక్కన పెడుతున్నట్లు గత మంగళవారం ప్రకటించింది. దీంతో ఇరుదేశాల మధ్య అణ్వాయుధ నియంత్రణను నిర్దేశించే "న్యూ స్టార్ట్' ఒప్పందం మాత్రమే మిగిలింది. ఈ ఒప్పందానికీ వచ్చే ఫిబ్రవరి నాటికి కాలం చెల్లుతుంది. ఒప్పందం నుంచి వైదొలగినంత మాత్రాన ఇరుదేశాల మధ్య అణుయుద్ధం జరిగే అవకాశాలు పెరిగిపోతాయని నిర్ధారణకు రావాల్సిన పనిలేదని అణ్వాయుధ రంగంలో నిపుణుడైన అలెగ్జాండర్ బోల్‌ఫ్రాస్ అన్నారు. అలాగని యుద్ధానికి ఆస్కారం లేదని భావించడమూ సరికాదన్నారు. అమెరికా-రష్యా మధ్య ద్వైపాక్షిక అణ్వాయుధ నిరోధక ఒప్పందాలేవీ లేకున్నా ఆ రెండు దేశాలూ అనేక బహుళపక్ష అణు నియంత్రణ ఒడంబడికల్లో భాగస్వాములు. అయినప్పటికీ రెండు దేశాల మధ్య సంబంధాల్లో వివిధ కారణాల రీత్యా నెలకొంటున్న ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్నాయి.

భారత్‌తో సంబంధాలు తెంచుకోవద్దు

ట్రంప్‌నకు నిక్కీ హేలీ సూచన



వాషింగ్టన్: భారత్ లాంటి బలమైన మిత్ర దేశంతో సంబంధాలను తెంచుకోవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారత సంతతి రిపబ్లికన్ నాయకురాలు నిక్కీ హేలీ సూచించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయకూడదు కానీ, చైనా చేయొచ్చా అని ఆమె 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. రష్యా నుంచి చైనా అత్యధికంగా ఇంధనం కొనుగోలు చేస్తోందని, అలాంటి దేశానికి మాత్రం సుంకాల నుంచి 90 రోజులు మినహాయింపిచ్చారని ట్రంప్ పరిపాలనను పరోక్షంగా విమర్శించారు. ఈ సందర్భంగా చైనాకు ఇలాంటి అనుమతులు ఇస్తూ.. భారత్ లాంటి బలమైన మిత్ర దేశంతో సంబంధాలను దూరం చేసుకోవద్దని కోరారు.

మహిళా ఎంపీ గొలుసు కొట్టేసిన దొంగ దొరికాడు

దిల్లీ: మహిళా ఎంపీ సుధా రామకృష్ణన్ మెడలోని బంగారు గొలుసును కొట్టేసిన వ్యక్తిని దిల్లీ పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ సుధ సోమవారం ఉదయం పోలండ్ రాయబార కార్యాలయం సమీపంలో ఉదయపు నడక చేస్తుండగా హెల్మెట్ పెట్టుకొని, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని గొలుసును లాక్కెళ్లాడు. ఈ ఘటనలో తనకు స్వల్ప గాయాలయ్యాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని సోహన్ రావత్‌గా గుర్తించారు. రావత్ చైన్ స్నాచింగ్, దొంగతనం సహా దాదాపు 26 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

విద్యాహక్కు పొందలేని అనాథలు ఎంతమంది?

- వివరాలు ఇవ్వాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: విద్యాహక్కుకు ఆవల ఉండిపోయి, చదువుకోలేకపోతున్న అనాథ చిన్నారులు ఎంత మంది ఉన్నారో తెలుసుకునేందుకు సర్వే నిర్వహించాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకూ సుప్రీం కోర్టు సూచించింది. అదే చట్టం కింద పాఠశాలల్లో చదువుతున్న అనాథ చిన్నారులు ఎంత మంది అనేది కూడా ఈ సర్వేలో పొందుపరచాలని ఆదేశించింది. కొందరికి విద్య అందడానికి మరికొందరికి అందకపోవడానికి గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. దేశంలో అనాథ బాలల రక్షణపై దాఖలైన పిటిషన్‌ను బుధవారం విచారించిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో 2.5 కోట్ల మంది అనాథలు ఉన్నారని యునిసెఫ్ చెప్పినప్పటికీ ప్రభుత్వం దగ్గర అధికారిక సమాచారం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2027లో చేపట్టనున్న జనగణనలో అనాథ చిన్నారుల వివరాలనూ నమోదు చేయాలని ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. నాలుగు వారాల్లో రాష్ట్రాలన్నీ అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంటూ సెప్టెంబరు 9కి విచారణను వాయిదా వేసింది.



తోపుడు రిక్షాలు ఇంకానా?

- వారందరికీ ఈ-రిక్షాలివ్వండి
- మహారాష్ట్రను ఆదేశించిన సుప్రీం

దిల్లీ: రెక్కాడితే కాని డొక్కాడని తోపుడు రిక్షా కార్మికుల కష్టాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సత్తువంతా కూడగట్టి రిక్షా లాగుతూ సాటి మనుషులను గమ్యస్థానానికి చేర్చేందుకు చెమటోడ్చుతున్న తీరుపై విస్మయం వ్యక్తం చేసింది. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లవుతున్నా ఆ శ్రమజీవులకు దక్కిన ఆర్థిక, సామాజిక న్యాయం ఇదేనా అంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజరియా ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. నేటి ఆధునిక ప్రపంచంలోనూ అమానవీయ శ్రమకు స్వస్తిపలకలేమా అంటూ మహారాష్ట్రలోని పర్వత ప్రాంత పట్టణం మాథెరాన్‌లో తోపుడు రిక్షా కార్మికుల కష్టాలపై స్పందించింది. పర్యావరణపరంగా సున్నితమైన ఈ పట్టణంలో మోటారు వాహనాలపై నిషేధం ఉంది. దీంతో సరకులు, పర్యాటకుల రవాణాకు తోపుడు రిక్షాలే ఆధారం. రిక్షా కార్మికుల కష్టాలను తీర్చడానికి గాను వారందరికీ కాలుష్య రహిత ఈ-రిక్షాలను పంపిణీ చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. నిధుల కొరతను సాకుగా చూపవద్దని, ఆరు నెలల్లోగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

అమెరికాలో కూలిన విమానం

నలుగురి మృతి

చిన్లే: అమెరికాలోని ఉత్తర అరిజోనాలోని నవాహో నేషన్‌లో ఓ చిన్న మెడికల్ ట్రాన్స్‌పోర్ట్ విమానం మంగళవారం కూలింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో విమానంలో ఉన్న నలుగురు వ్యక్తులు మృతిచెందారు. బీచ్‌క్రాఫ్ట్ కింగ్ 300 విమానం న్యూ మెక్సికోలోని అల్బుకుకి నుంచి బయలుదేరగా చిన్లే సమీపంలోని విమానాశ్రయంలో దిగేందుకు సిద్ధమవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అమెరికా కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:44 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది.

సిరాజ్ @ 15

కెరీర్లో ఉత్తమ ర్యాంకు



హైదరాబాద్ విమానాశ్రయంలో భారత ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌తో సిరాజ్

దుబాయ్: ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో అత్యధిక వికెట్లతో మెరిసిన భారత పేసర్ మహ్మద్ సిరాజ్ కెరీర్ అత్యుత్తమ ర్యాంకు సాధించాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన టెస్టు బౌలింగ్ జాబితాలో 12 ర్యాంకులు మెరుగైన సిరాజ్ 15వ స్థానంలో నిలిచాడు. గతంలో జనవరిలో సిరాజ్ 16వ ర్యాంకు సాధించాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. బ్యాటింగ్‌లో యశస్వి జైస్వాల్ మూడు స్థానాలు మెరుగై అయిదో ర్యాంకు దక్కించుకున్నాడు. రిషబ్ పంత్ 8వ, శుభ్‌మన్ గిల్ 13వ స్థానాల్లో నిలిచారు. జో రూట్ (ఇంగ్లాండ్) నంబర్‌వన్ ర్యాంకింగ్‌తో కొనసాగుతున్నాడు.

హైదరాబాద్‌లో ఘనస్వాగతం: ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో [illegible] ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత పేసర్ మహ్మద్ సిరాజ్ సొంతగడ్డపై అడుగుపెట్టాడు. బుధవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సిరాజ్‌కు అభిమానులు ఘన స్వాగతం పలికారు. సిరాజ్‌తో పాటు ఫీల్డింగ్ కోచ్ దిలీప్ ముందుగా లండన్ నుంచి ముంబయి చేరుకున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. సిరాజ్ ఆటోగ్రాఫ్‌లు, సెల్ఫీల కోసం అభిమానులు ఎగబడగా.. అతను వేగంగా కారెక్కి, ఇంటికి వెళ్లిపోయాడు.

ఛాంపియన్

కోచ్‌గా బాధ్యతలు అందుకున్నాక ఓ పెద్ద జట్టుతో జరిగిన తొలి సిరీస్‌లోనే 0-3తో వైట్‌వాష్.. అది కూడా పుష్కర కాలంగా సిరీస్ ఓటమే లేని సొంతగడ్డపై! ఆ తర్వాత తొలి విదేశీ పర్యటనలోనూ పరాభవం! మరోవైపు అశ్విన్, రోహిత్, కోహ్లి లాంటి దిగ్గజాల నిష్క్రమణకు కారణమయ్యాడంటూ అభిమానుల్లో ఆగ్రహం! ఇలా కోచ్‌గా బాధ్యతలందుకున్న ఏడాదిలోపే గౌతమ్ గంభీర్ చుట్టూ విమర్శలు, వివాదాలు! కానీ ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ తర్వాత అంతా మారిపోయింది. ఈ సిరీస్‌లో తన ప్రయోగాలు, నిర్ణయాలు సత్ఫలితాలను ఇవ్వడంతో కోచ్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి.



గంభీర్

పరీక్షకు నిలిచాడు

ఈనాడు క్రీడావిభాగం

గత ఏడాది ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజేతగా నిలవడంలో మెంటార్‌గా గౌతమ్ గంభీర్ పాత్ర కీలకం అనడంలో సందేహం లేదు. అప్పుడు ఆ జట్టుకు ప్రధాన కోచ్ చంద్రకాంత్ పండిట్ కోచ్ అయినప్పటికీ.. జట్టు కూర్పు, మ్యాచ్ వ్యూహాల్లో గంభీర్ ఎంతో చురుగ్గా వ్యవహరించి ఆ జట్టు ప్రదర్శనలో గొప్ప మార్పు తీసుకొచ్చాడన్నది జట్టు వర్గాల మాట. ఇటు గంభీర్ శిక్షణలో కోల్‌కతా కప్పు గెలవడం.. ఇంకో నెల రోజులకే టీమ్‌ఇండియా కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం ముగియడంతో కొత్త శిక్షకుడు ఎవరన్న ప్రశ్నకు ఈ మాజీ ఓపెనరే ప్రధాన పోటీదారు అయ్యాడు. అనుకున్నట్లే తర్వాత అతనే కోచ్ అయ్యాడు. ఆ బాధ్యతలు అందుకున్న కొత్తలో అంతా బాగానే సాగింది. టీమ్‌ఇండియా వివిధ ఫార్మాట్లలో విజయాలందుకుంది. కానీ న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురి కావడంతో జట్టుతో పాటు కోచ్ మీదా తీవ్ర విమర్శలు తప్పలేదు. తర్వాత భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లింది. అక్కడా ఘోర పరాభవం తప్పలేదు. వన్డే ఫార్మాట్లో టీమ్‌ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినప్పటికీ.. టెస్టుల్లో జట్టు ప్రమాణాలు పడిపోతుండడం పట్ల ఆందోళన వ్యక్తమైంది. ఇంగ్లాండ్‌లో జట్టు ఏమేర రాణిస్తుందో అన్న సందేహాలు నెలకొన్నాయి. ఇంతలో రోహిత్, కోహ్లి ఒకరి తర్వాత ఒకరు టెస్టులకు గుడ్‌బై చెప్పేశారు. అంతకుముందు ఆస్ట్రేలియా పర్యటన మధ్యలో అశ్విన్ రిటైరైపోయాడు. ఈ ముగ్గురు హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడం వెనుక గంభీరే ఉన్నాడనే చర్చ జరిగింది. దిగ్గజ ఆటగాళ్లను పొమ్మనకుండా పొగబెట్టేశాడంటూ గౌతీ మీద విమర్శలు తప్పలేదు. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో టీమ్‌ఇండియా ఓడిపోయి ఉంటే.. కోచ్‌గా గంభీర్ భవితవ్యం ప్రమాదంలో పడేది. అతను తప్పుకోవాలన్న డిమాండ్లు మొదలయ్యేవి. కానీ అంచనాలకు మించి రాణించిన టీమ్‌ఇండియా.. 2-2తో సిరీస్‌ను డ్రా చేయడంతో జట్టుతో పాటు కోచ్‌కూ ప్రశంసలు దక్కుతున్నాయి.

కుర్రాళ్లకే పట్టం: అశ్విన్, రోహిత్, కోహ్లి తప్పుకోవడానికి గంభీర్ కారణమా కాదా అన్నది పక్కన పెడితే.. కుర్రాళ్లకే అతడి ప్రాధాన్యం అన్నది స్పష్టం. జట్టులో స్టార్ సంస్కృతి పోవాలి, అందరికీ నిబంధనలు సమానంగా వర్తించాలి, ప్రదర్శన ఆధారంగానే ఎవ్వరైనా జట్టులో ఉండాలి అన్నది గంభీర్ సిద్ధాంతం! ఈ విషయంలో అతను కఠినంగా వ్యవహరిస్తున్నాడన్నది జట్టు వర్గాల మాట. అతను కోచ్ అయ్యాక కుర్రాళ్లకు అవకాశాలు పెరిగాయి. గత ఏడాది కాలంలో అశ్విన్, కోహ్లి, రోహిత్‌ల ప్రదర్శన అంత గొప్పగా లేదన్నది వాస్తవం. ఈ పరిస్థితుల్లో గంభీర్ ఒత్తిడి తెచ్చాడో లేదో కానీ.. ఈ ముగ్గురూ ఒకరి తర్వాత ఒకరు రిటైర్మెంట్ ప్రకటించారు. గంభీర్ సూచన మేరకే బీసీసీఐ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసింది. అయితే విదేశాల్లో ప్రదర్శన అంత గొప్పగా లేని గిల్ కెప్టెన్ ఏంటి అనే ప్రశ్నలు తలెత్తాయి. ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేసిన జట్టు మీదా కొన్ని విమర్శలు తప్పలేదు. అయితే కెప్టెన్‌గా శుభ్‌మన్ తన తొలి సిరీస్‌లో అదరగొట్టాడు. జట్టు కూడా అంచనాలకు మించి రాణించింది. కూర్పు, మ్యాచ్ వ్యూహాల విషయంలో గిల్, గంభీర్ ఎంతో సమన్వయంతో వ్యవహరించి సత్ఫలితాలను రాబట్టారు. చాలామంది తుది జట్టులోకి కుల్‌దీప్‌ను తీసుకోవాలని అన్నా.. సుందర్‌నే ఆడించడానికే గంభీర్ మొగ్గు చూపాడు. నాలుగో టెస్టులో భారత్ డ్రాతో గట్టెక్కడంలో, చివరి టెస్టులో గెలవడంలో సుందర్ పాత్ర ఎంత కీలకమో తెలిసిందే. ఇక బాజ్‌బాల్ ఆటతో ప్రత్యర్థులను బెదరగొట్టే ఇంగ్లాండ్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేలా ఢీ అంటే ఢీ అన్నట్లు భారత జట్టు ఆడిందంటే అందులో గంభీర్ నేర్పిన దూకుడు మంత్రానిది ముఖ్య పాత్ర. ఎక్కువగా కుర్రాళ్లతో నిండిన జట్టు కావడంతో గౌతీ తన ప్రణాళికలను అమలు చేయడం సులువు అవుతోంది. అనుభవం తక్కువైనప్పటికీ ఆటగాళ్లు ఆత్మవిశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ఆడడంలో.. పోరాటతత్వం పెరగడంలో గంభీర్ శిక్షణ ఉపయోగపడుతోందన్నది జట్టు వర్గాల మాట. జట్టులో ఎవరి పాత్ర ఏంటో స్పష్టంగా నిర్దేశిస్తూ, ఒక ప్రణాళిక ప్రకారం ఆడేలా గంభీర్ చూస్తున్నాడు! పర్యటనల్లో కుటుంబ సభ్యులను అనుమతించకపోవడం, తమ ఇష్ట ప్రకారం మ్యాచ్‌లు ఎంచుకుని ఆడే సౌలభ్యానికి బ్రేక్ వేయడం లాంటి నిర్ణయాలు గంభీర్ సూచన మేరకు తీసుకున్నవే అన్నది స్పష్టం. తద్వారా క్రికెటర్లు ఆట మీదే ఎక్కువ దృష్టిసారించేలా చూడడం, స్టార్ సంస్కృతిని దూరం చేయడం గంభీర్ ఉద్దేశంగా భావించవచ్చు.

వారి భవితవ్యం అతడి చేతుల్లో..

ఇప్పటికే టీ20లు, టెస్టులకు గుడ్‌బై చెప్పిన కోహ్లి, రోహిత్.. వన్డేల్లో ఇంకెంత కాలం కొనసాగుతారన్నది ప్రశ్న. ఇప్పటికే వన్డేల సంఖ్య బాగా తగ్గిపోయిన నేపథ్యంలో 2027 ప్రపంచకప్ వరకు ఫిట్‌నెస్, ఫామ్‌ను కాపాడుకుని జట్టులో కొనసాగడం వారికి సవాలే. అందులోనూ కుర్రాళ్లకు పెద్ద పీట వేస్తాడని పేరున్న గంభీర్.. వీరికి అప్పటిదాకా అవకాశమిస్తాడా అన్నది చూడాలి. మరి కొన్ని నెలల్లో ఆస్ట్రేలియాలో జరిగే వన్డే సిరీస్‌లో ప్రదర్శనను బట్టి వీరి భవితవ్యంపై ఒక అంచనా వస్తుందని భావిస్తున్నారు. అందులో రాణించకపోతే రిటైర్మెంట్ దిశగా నిర్ణయం తీసుకునేలా వీరిపై ఒత్తిడి రావడం ఖాయం.

అండర్-22 ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

ఫైనల్స్‌లో నలుగురు భారత బాక్సర్లు

బ్యాంకాక్: అండర్-22 ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నలుగురు భారత బాక్సర్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. నీరజ్, ఇషాన్ కటారియా, యాత్రి పటేల్, ప్రియ ఫైనల్ పోరుకు అర్హత సాధించారు. సెమీఫైనల్లో నీరజ్ (75కేజీ) 5-0తో క్యొంగ్ బాంగ్ (దక్షిణ కొరియా)పై నెగ్గాడు. చెన్ చెన్ (చైనా)తో పోరులో ఇషాన్ (90+) తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. ఇషాన్ ప్రత్యర్థిపై భారీ పంచ్‌లు విసరడంతో రిఫరీ మూడో రౌండ్లో బౌట్‌ను నిలిపివేశాడు. మహిళల విభాగంలో యాత్రి (57కేజీ) 5-0తో థి హంగ్ క్వాంగ్‌పై నెగ్గగా.. ఐరోపిలీవా (ఉజ్బెకిస్థాన్)ను ప్రియ (60కేజీ) ఓడించింది. ఈ అండర్-22, అండర్-19 ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ నుంచి మొత్తం 40 మంది బాక్సర్లు బరిలోకి దిగారు.

భారత క్రికెట్

ఎవరి కోసం ఆగదు



గంగూలీ

దిల్లీ: భారత క్రికెట్‌లో ఎంతో ప్రతిభ ఉందని.. అది ఎవరి కోసం ఆగదని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. విరాట్ కోహ్లి వెళ్లగానే యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ జట్టు కోసం నిలబడ్డారని తెలిపాడు. "భారత క్రికెట్ ఎవరి కోసం ఆగదు. ఇక్కడ చాలా ప్రతిభ ఉంది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో భారత ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. మనోళ్లు అద్భుతంగా ఆడారు. భారత క్రికెట్ అంటే ఇదే. సునీల్ గావస్కర్ రిటైరవ్వగానే సచిన్ తెందుల్కర్ వచ్చాడు. రాహుల్ ద్రవిడ్, వీరేందర్ సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్ కూడా జతకలిశారు. వారు వెళ్లగానే కోహ్లి వెలుగులోకి వచ్చాడు. కోహ్లి నిష్క్రమించగానే యశస్వి, రిషబ్, గిల్ నిలబడ్డారు. భారత క్రికెట్లో ప్రతిభకు కొదవలేదు. అది పెరుగుతూనే ఉంటుంది. అద్భుతమైన వ్యవస్థతో దేశవాళీ క్రికెట్ బలంగా ఉంది. ఐపీఎల్ అలాంటి వేదికే. ఎ- జట్టు, అండర్-19 జట్టు కూడా ఉన్నాయి. ఇంగ్లాండ్‌లో భారత్ గొప్పగా ఆడింది. గిల్, గౌతమ్ గంభీర్‌కు అభినందనలు. 2002 లేదా 2007 తర్వాత ఇంగ్లాండ్‌లో భారత టాప్-6 బ్యాటర్లు నిలకడగా రాణించడం ఇదే తొలిసారి" అని గంగూలీ పేర్కొన్నాడు.

మళ్లీ క్రికెట్ పాలనలోకి గంగూలీ: టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ తిరిగి క్రికెట్ పరిపాలనలోకి వస్తున్నాడు. త్వరలో జరగబోయే బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) ఎన్నికల్లో అధ్యక్ష పదవికి అతడు నామినేషన్ దాఖలు చేయనున్నాడు. 52 ఏళ్ల గంగూలీ 2019 వరకు క్యాబ్ అధ్యక్షుడిగా పనిచేశాడు. 2019లో బీసీసీఐ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కానీ ఒక్క పర్యాయానికే అక్కడ అతడి ఇన్నింగ్స్ ముగిసింది. క్యాబ్ ప్రస్తుత అధ్యక్షుడు స్నేహాశీష్... గంగూలీ సోదరుడే.

ఆ విజయాలు

కాకతాళీయం



సచిన్

ముంబయి: ఇంగ్లాండ్‌లో బుమ్రా గైర్హాజరీలో టీమ్‌ఇండియా రెండు టెస్టులు నెగ్గడం కాకతాళీయమని బ్యాటింగ్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ అభిప్రాయపడ్డాడు. బుమ్రా బౌలింగ్ నాణ్యత అసాధారణమని, నమ్మశక్యం కానిదని అన్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో బుమ్రా మూడు టెస్టుల్లో మాత్రమే ఆడాడు. భారత్ గెలిచిన రెండు టెస్టుల్లోనూ అతడు లేడు. పని భార నిర్వహణలో భాగంగా ఆ రెండు మ్యాచ్‌ల్లో అతడికి విశ్రాంతినిచ్చారు. అయితే ఆడిన మ్యాచ్‌ల్లో బుమ్రా గొప్పగా రాణించాడని సచిన్ చెప్పాడు. "బుమ్రా సిరీస్‌ను చక్కగా మొదలెట్టాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు పడగొట్టాడు. రెండో టెస్టులో ఆడలేదు. తర్వాతి రెండు టెస్టుల్లో ఆడాడు. మరోసారి అయిదు వికెట్ల ఘనత సాధించాడు. ఆడిన మూడు టెస్టుల్లో రెండుసార్లు 5 వికెట్ల ఘనత సొంతం చేసుకున్నాడు. బుమ్రా లేకున్నా ఆ రెండు టెస్టుల్లో గెలిచామని జనం అనుకుంటున్నారని నాకు తెలుసు. కానీ అలా గెలవడం కేవలం కాకతాళీయం. బుమ్రా బౌలింగ్ నాణ్యత అసాధారణం. ఇప్పటివరకు అతడు చేసిందంతా నమ్మశక్యం కానిది ఎంతో నిలకడగా రాణించాడు'' అని సచిన్ అన్నాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌ను టీమ్‌ఇండియా 2-2తో డ్రాగా ముగించిన సంగతి తెలిసిందే. బుమ్రా గైర్హాజరీలో సిరాజ్ అద్భుతంగా రాణించాడు. సిరీస్‌లో ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా చక్కగా ఆడాడని, అతడి ఆటను ఆస్వాదించానని సచిన్ చెప్పాడు. నాలుగో టెస్టులో ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ డ్రా కోసం చేసిన ప్రతిపాదనను భారత్ తిరస్కరించడాన్ని కూడా సచిన్ సమర్థించాడు. జడేజా, సుందర్‌లకు శతకాలు పూర్తి చేసుకునే హక్కుందని అభిప్రాయపడ్డాడు. ''ఇంగ్లాండ్ ఫీల్డర్లు, బౌలర్లు త్వరగా డ్రెస్సింగ్‌కు రూమ్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకోవడానికి ఎందుకు అవకాశమివ్వాలి. బ్రూక్‌తో బౌలింగ్ చేయించడం లేదా ఇంకెవరితోనైనా చేయించడం స్టోక్స్ ఇష్టం. అది భారత్ సమస్య కాదు'' అని అన్నాడు. బౌలర్లకు విశ్రాంతినివ్వడం కోసమే త్వరగా డ్రా కోరానన్న స్టోక్స్ వివరణపై సచిన్ స్పందించాడు. ''అయిదో టెస్టుకు ఇంగ్లాండ్ బౌలర్లు, ఫీల్డర్లు తాజాగా ఉండడానికి మనమెందుకు సహకరించాలి. దీనికి వాళ్ల వద్ద జవాబుందా? లేదు. ఈ విషయంలో భారత్‌కే నా పూర్తి మద్దతు'' అని చెప్పాడు.

మూడో రౌండ్లో హరీశ్, అరుణ్

చెన్నై: ఆసియా సర్ఫింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత కుర్రాళ్లు హరీశ్ ప్రకాష్, తయిన్ అరుణ్ మూడో రౌండ్లో అడుగుపెట్టారు. అండర్-18 బాలుర విభాగంలో 9.23 పాయింట్లతో మెరిసిన అరుణ్ రెండో స్థానం సాధించాడు. మరో విభాగంలో 11 ఏళ్ల హరీశ్ 7.97 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. ఆరో హీట్స్‌లో మూడో స్థానంలో నిలిచిన ప్రహ్లాద్ శ్రీరామ్ (4.94) రెపిఛేజ్ రెండో రౌండ్లో బరిలో దిగనున్నాడు.

యుఎస్ ఓపెన్ విజేతకు రూ.44 కోట్లు

న్యూయార్క్: యుఎస్ ఓపెన్‌లో క్రీడాకారుల నగదు బహుమతిని 20 శాతం పెంచారు. మహిళల, పురుషుల సింగిల్స్ విజేతలు రికార్డు స్థాయిలో దాదాపు రూ.44 కోట్ల అందుకుంటారు. క్రీడాకారులు అందరికీ కలిపి దాదాపు రూ.751 కోట్ల నగదు బహుమతిని పంచనున్నారు. టెన్నిస్ చరిత్రలో ఓ టోర్నీలో ఇచ్చే అత్యధిక నగదు బహుమతి ఇదే. గత ఏడాదితో పోలిస్తే సింగిల్స్ విజేతలకు ఇచ్చే మొత్తం 39 శాతం పెరిగింది.

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్

ఒక రోజు వాయిదా

టోర్నీ వేదిక వద్ద అగ్నిప్రమాదం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ షెడ్యూలు ప్రకారం బుధవారం ఆరంభం కాలేదు. టోర్నీ వేదిక హయత్ రీజెన్సీ హోటల్‌లో అగ్నిప్రమాదం జరగడంతో గురువారానికి వాయిదా పడింది. మంగళవారం అర్ధరాత్రి 9వ అంతస్తులో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అదే హోటల్‌లో బస చేసిన క్రీడాకారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చి సమీపంలోని మరొక స్టార్ హోటల్‌లో బస కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ముందు అనుకున్నట్లు టోర్నీ ఆగస్టు 15నే ముగుస్తుందని, విశ్రాంతి దినాన్ని షెడ్యూలు నుంచి తొలగించామని నిర్వాహకులు తెలిపారు. భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి తన తొలి రౌండ్లో అమెరికా ఆటగాడు అవోండర్ లియాంగ్‌తో తలపడతాడు.

అమ్మాయిలు ఎంత సాధించినా...



సింధు, సానియా

ముంబయి: అమ్మాయిలు ఆటల్లో ఎంత సాధించినా, అణిగిమణిగే ఉండాలని సమాజం కోరుకుంటుందని దిగ్గజ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా వ్యాఖ్యానించింది. మన దేశంలో అన్ని రంగాల్లో మాదిరే ఆటల్లోనూ పురుషాధిక్యత ఎక్కువని.. మహిళలు ఎంత సాధించినా తగిన గుర్తింపు రాదని ఒక చర్చా వేదికలో ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. "నేను ఎదిగే వయసులో క్రీడల్లో నాకు తెలిసిన ఏకైక మహిళా సూపర్ స్టార్ పీటీ ఉష. అప్పట్లో సామాజిక మాధ్యమాలు, మీడియా ఉండేవి కాదు కాబట్టి క్రీడాకారిణుల గురించి పెద్దగా తెలిసేది కాదు. కానీ ఇప్పుడు మహిళల్లోనే ఎక్కువమంది సూపర్ స్టార్లు ఉన్నారు. కానీ మనం పురుషాధిక్య ప్రపంచంలో ఉన్నామా అంటే ఔననే చెబుతా. క్రీడల్లోనూ అంతే. మహిళలు ప్రపంచ విజేతలుగా నిలిచినా సరే.. ఆ విజయాలను చూపించుకోకూడదు. అలా చేస్తే అహంకారం అంటారు. అణిగిమణిగి ఉంటే మంచి అమ్మాయి అంటారు. అలా అని దూకుడుగా లేకుంటే.. నీలో గెలవాలనే కాంక్ష లేదని అంటారు. అయితే ఎవరేమనుకుంటారన్నది మనం పట్టించుకోకూడదు. మనకు నచ్చినట్లుగా మనల్ని ప్రపంచానికి చూపించుకోవాలి. అదెలాగో నాకు తెలుసు'' అని సానియా పేర్కొంది. ఈ కార్యక్రమంలో పి.వి.సింధు పాల్గొంది.



బ్రూక్

నాకు కాదు..

రూట్‌కు ఇవ్వాల్సింది

'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'పై బ్రూక్

లండన్: భారత్‌తో అయిదు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ తరపున 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'కు తాను అర్హుడిని కాదని అంటున్నాడు ఆ జట్టు బ్యాటర్ హ్యారీ బ్రూక్. ఇంగ్లాండ్‌లో జరిగే టెస్టు సిరీస్‌ల్లో రెండు జట్ల నుంచి వేర్వేరుగా 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డులివ్వడం ఆనవాయితీ. వాటిని ఆయా జట్ల కోచ్‌లే ఎంపిక చేస్తారు. భారత్ తరపున శుభ్‌మన్ గిల్‌ను గంభీర్ ఎంచుకోగా.. ఇంగ్లాండ్ జట్టులో బ్రూక్‌కు మెక్‌కలమ్ అవార్డును కట్టబెట్టాడు. అయితే బ్రూక్ మాత్రం.. తన కంటే జో రూటే ఈ పురస్కారానికి అర్హుడని అభిప్రాయపడ్డాడు. 'నేను రూట్ చేసినన్ని పరుగులు చేయలేదు. రూట్‌కే 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాల్సింది. చాలా ఏళ్ల నుంచి వేసవి సిరీస్‌ల్లో అతనే ఈ అవార్డును అందుకుంటున్నాడు" అని బ్రూక్ పేర్కొన్నాడు. సిరీస్ 2-2తో ముగుస్తుందని తాను ఊహించలేదని, తామే గెలుస్తామని అనుకున్నానని బ్రూక్ చెప్పాడు.

బీసీసీఐకి ఊరట

దిల్లీ: జాతీయ క్రీడలపాలన బిల్లులో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన నిబంధనలను క్రీడల మంత్రిత్వ శాఖ సవరించింది. ప్రభుత్వం నుంచి నిధులు పొందే జాతీయ సమాఖ్యలు మాత్రమే ఆర్‌టీఐ పరిధిలోకి వచ్చేలా మార్పులు చేసింది. దీంతో తమను ఆర్‌టీఐ పరిధిలోకి తేవడాన్ని ముందు నుంచి వ్యతిరేకిస్తున్న బీసీసీఐకి ఊరట లభించినట్లయింది. బోర్డు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకోదు. క్రికెట్ ఒలింపిక్ క్రీడ అవుతున్నందున బీసీసీఐ జాతీయ సమాఖ్యగా గుర్తింపు పొందాల్సివుంది. 2028 ఒలింపిక్స్‌లో టీ20 ఫార్మాట్లో క్రికెట్ టోర్నీ జరగనుంది.



గ్రెగ్ ఛాపెల్

సానుకూల క్రికెట్ అంటే నిర్లక్ష్యంగా ఆడటం కాదు

దిల్లీ: ఇంగ్లాండ్ బాజ్‌బాల్ శైలిపై ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ గ్రెగ్ ఛాపెల్ విమర్శలు గుప్పించాడు. సానుకూల క్రికెట్ అంటే నిర్లక్ష్యంగా ఆడటం కాదన్నాడు. భారత యువ జట్టు నిర్భయంగా ఆడిందంటూ ఛాపెల్ ప్రశంసలు కురిపించాడు. "భారత్‌తో సిరీస్‌లో ఇంగ్లాండ్ ప్రయాణం ఆ జట్టుకు ఒక హెచ్చరిక. ఆఖరి మ్యాచ్‌లో హ్యారీ బ్రూక్ తొందరపాటుగా వ్యవహరించాడు. మంచి టైమింగ్, విశ్వాసం, కష్టపడకుండా బ్యాటింగ్ చేసినట్లుండే శైలి బ్రూక్ సొంతం. టెస్టు క్రికెట్ అంటే షాట్లు ఆడటం కాదు. షాట్ సెలెక్షన్ కూడా. ఎప్పుడు దూకుడుగా ఆడాలి.. ఎప్పుడు సంయమనం పాటించాలో గుర్తించడం కీలకం. ఓవల్‌లో చక్కగా ఆడుతున్న బ్రూక్ ఔటవడం ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ ఎదుర్కొంటున్న సమస్యకు సంకేతం. నిర్భయంగా, దూకుడుగా ఆడాలన్న బాజ్‌బాల్ శైలి ఇంగ్లాండ్ టెస్టు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కానీ కఠినమైన సవాళ్లను అధిగమించడానికి ఈ మార్గం సరికాదు. ఇంగ్లాండ్‌కు కావాల్సిందల్లా ఒక బ్యాటర్ చివరి వరకు నిలబడటం. ఒత్తిడిని తట్టుకోవడం. బ్రూక్ భారీ షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. సానుకూలంగా ఆడటంలో తప్పులేదు. కానీ సానుకూల క్రికెట్ అంటే నిర్లక్ష్యంగా ఆడటం కాదు. ఈ సిరీస్‌లో భారత్ నైతిక విజేతగా ఆవిర్భవించింది'' అని ఛాపెల్ వివరించాడు.



గిల్

ఐసీసీ అవార్డు రేసులో గిల్

దుబాయ్: భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ రేసులో నిలిచాడు. జులై నెలకు గాను గిల్‌తో పాటు ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, దక్షిణాఫ్రికా సారథి వియాన్ ముల్డర్ పేర్లు అవార్డు కోసం సిఫార్సు చేసినట్లు ఐసీసీ పేర్కొంది. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో గిల్ 754 పరుగులతో అదరగొట్టాడు. జులైలో జరిగిన మూడు టెస్టుల్లో గిల్ 94.50 సగటుతో 567 పరుగులు సాధించాడు. స్టోక్స్ 251 పరుగులు.. 12 వికెట్లతో సత్తా చాటాడు. జింబాబ్వేతో మ్యాచ్‌లో ముల్డర్ అజేయ ట్రిపుల్ సెంచరీ (367 నాటౌట్)తో మెరిశాడు. దక్షిణాఫ్రికా టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ముల్డర్.. వెస్టిండీస్ దిగ్గజం బ్రయాన్ లారా మీద గౌరవంతో అతని రికార్డు (400 నాటౌట్) కంటే ముందే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. రెండు టెస్టుల్లో ముల్డర్ 265.50 సగటుతో 531 పరుగులు సాధించాడు.

నగరాలకు సవాల్

- వాతావరణ మార్పులతో తరచూ అతి భారీ వర్షాలు.. అధిక ఎండలు
- ఓ పద్ధతి, ప్రణాళిక లేని పట్టణీకరణతో నగరాలు అతలాకుతలం
- ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా అభివృద్ధికి పెట్టుబడులను భారీగా పెంచాలి

'ఈనాడు' ఇంటర్వ్యూలో ప్రపంచ బ్యాంకు సీనియర్ కన్సల్టెంట్ అస్మితా తివారీ



- 2022-70 మధ్య పట్టణ జనాభాకు 14.4 కోట్ల గృహాలు కొత్తగా అవసరం.
- దేశంలోని నగరాలు 2035 నాటికి 28.5 కోట్ల టన్నుల ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేస్తాయి. 2050 నాటికి 41.5 కోట్ల టన్నులు ఉత్పత్తి అవుతుంది.
- 2030 నాటికి 70% కొత్త ఉద్యోగాలు నగరాలు, పట్టణాల్లోనే వస్తాయి.
- అన్నింటినీ తట్టుకొనేలా మౌలిక వసతులు, గ్రీన్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు, సర్వీసులకు 2050 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లు, 2070 నాటికి 10.9 ట్రిలియన్ డాలర్లు అవసరం.
- దేశంలోని పది పెద్ద నగరాలను పరిశీలిస్తే వేడి తీవ్రత, వడగాడ్పుల కారణంగా పని గంటలు కోల్పోయే వారి సంఖ్య గత 30 ఏళ్లలో పరిశీలిస్తే 71% పెరిగింది. 430 కోట్ల పనిగంటల నుంచి 1,010 కోట్ల పని గంటలు కోల్పోయినట్లు తేలింది. ఎండ తీవ్రత, వడగాడ్పుల వల్ల పెరిగే మరణాల సంఖ్య 2050 నాటికి రెండింతలు అవుతుంది.

ఎం.ఎల్.నరసింహారెడ్డి
ఈనాడు - హైదరాబాద్

? ముఖ్య నగరాలు తరచూ వరద ముంపును ఎదుర్కోవడానికి ప్రధాన కారణమేంటి

వాతావరణ మార్పులతో వర్షాల్లో స్థిరత్వం లేకపోవడం, అతి భారీ వర్షాలు కురవడం ప్రధాన కారణం. వర్షం పడే విధానం మారడంతోపాటు తీవ్రత కూడా పెరిగింది. అధిక ఎండలు, వేడి తీవ్రత కూడా పెరుగుతున్నాయి. ఓ పద్ధతి, ప్రణాళిక లేకుండా పట్టణీకరణ పెరిగే కొద్దీ వరదల కారణంగా గతంలో తక్కువ ప్రభావానికి గురైన ప్రాంతాలు కూడా తీవ్ర సమస్యను ఎదుర్కొంటాయి.

? ఈ ముప్పును ముందు ఏ స్థాయిలో అంచనా వేయవచ్చు

పట్టణాల విస్తరణ చాలా ప్రాంతాల్లో వరదల రిస్క్ ప్రొఫైల్‌ను మార్చేసింది. గతంలో తక్కువ ముంపునకు గురయ్యే ప్రాంతాలు కూడా ఇప్పుడు తరచూ నీట మునగడం చూస్తున్నాం. 2070 నాటికి ఈ రిస్క్ 3.6 రెట్ల నుంచి 7 రెట్లకు పెరుగుతుందని అంచనా.

? వడగాడ్పుల సమస్యపై మీ అధ్యయనంలో ఏం తేలింది

వడగాడ్పులు ఎక్కువ రోజులు కొనసాగడమే కాదు.. రాత్రి వేళల్లోనూ వేడి ఉంటుంది. నగరాలకు, పట్టణాలకు చుట్టుపక్కల కూడా ఏడాది పొడవునా 3-4 డిగ్రీలు ఎక్కువగా ఉంటుంది. నీరు భూమిలోకి ఇంకకుండా సాగిపోతున్న నిర్మాణాలు ఇందుకు ప్రధాన కారణం.

? వరదలు, వడగాడ్పుల ప్రభావాన్ని జీడీపీలో ఎలా చూస్తారు

ప్రస్తుత పరిణామాలపై పరిష్కార దిశగా చర్యలు వేగం పుంజుకోవాలి. లేదంటే భారత్‌లోని నగరాలకు వరదలు, నీటి కొరత, తీవ్రమైన వేడి సమస్యలు ఇంకా పెరిగే ప్రమాదముంది. అతి భారీ వర్షాలు, వరదలు తదితర కారణాలతో నష్టం ప్రస్తుతం జీడీపీలో 0.5 నుంచి 2.5% మధ్య ఉండగా, 2050 నాటికి ఇది రెండింతలయ్యే అవకాశముంది.

? నగరాల అభివృద్ధికి ఆర్థిక సమస్య తీవ్రంగా ఉంది కదా... ఎలా అధిగమించాలి



నగరాలు, పట్టణాలు ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుకోవడం అతి పెద్ద సవాలు. 2050 నాటికి 43% పట్టణీకరణ చెందే అవకాశముంది. వాటిల్లో కొత్తగా మౌలికవసతుల అభివృద్ధికి, వాతావరణ పరిస్థితులను తట్టుకొని కూడా వివిధ సేవలను అందించడానికి 2050 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లు అవసరమని అంచనా. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు ప్రభుత్వ పెట్టుబడులను పెంచుకోవడం, ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు అమలు చేసే సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవాలి. ప్రైవేటు రంగం పెట్టుబడులు ప్రస్తుతం 5% మాత్రమే ఉన్నాయి. ఇవి పెరగాలి. క్లైమెట్ రిస్క్ డేటాను పరిగణనలోకి తీసుకొని వినూత్నంగా ముందుకు సాగాలి. వివిధ ఆర్థిక సంస్థలు, దాతృత్వ సంస్థలు... ఇలా వివిధ మార్గాల్లో నిధులు పొందాలి.

? దేశంలోని నగరాలు, పట్టణాలు ఆదర్శంగా తీసుకోవాల్సిన పనులు, పద్ధతులు మీ దృష్టిలో ఏమున్నాయి.

నిధుల సమీకరణకు జాతీయ, రాష్ట్ర, పురపాలక స్థాయిలో ఓ ప్రణాళిక ఉండటంతోపాటు అమలుకు రోడ్ మ్యాప్ అవసరం. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో అవలంబించిన మెరుగైన పద్ధతులను అనుసరించాలి. ఇందులో అహ్మదాబాద్‌లో సబర్మతి రివర్ డెవలప్‌మెంట్, హీట్ యాక్షన్ ప్లాన్ కూడా ఒకటి. బ్రెజిల్‌లోని నగరాలు వరదను తట్టుకొనేలా చేపట్టిన కార్యాచరణ, సింగపూర్‌లో పట్టణ ప్రణాళిక చర్యల వంటి వాటిని అందిపుచ్చుకోవాలి.

? సమస్యల నుంచి బయట పడటానికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. అవి వీలైనంత ఎక్కువగా ఉండాలి.. వేగంగా సాగాలి. రిస్క్ ఎసెస్‌మెంట్, తగిన పక్కా ప్రణాళిక, ఆచరణ ఎంతో ముఖ్యం. ప్రకృతి వైపరీత్యాలతో ఎక్కువ ఇబ్బందులకు గురయ్యే వారిని పరిగణనలోకి తీసుకోవాలి. విపత్తు నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అభివృద్ధి ప్రణాళికలను వాతావరణ కార్యాచరణతో సమన్వయం చేసుకోవాలి. పచ్చదనాన్ని పెంచడం, ప్రజా రవాణా, విపత్తులను తట్టుకొనేలా ఇళ్ల నిర్మాణం మొదలైన వాటిపై దృష్టి ఉండాలి.

అపరిచితులతో ఫొటోలు దిగేటప్పుడు జాగ్రత్త

- నేర్చుకోవడం అయిపోయింది.. ఇక పనిలో వేగం పెంచండి
- మంత్రులకు సీఎం దిశానిర్దేశం
- ప్రభుత్వ విధానాలపై అధ్యయనానికి సింగపూర్ పంపిస్తానని వెల్లడి
- జిల్లాలు, మండలాల్లో మార్పుచేర్పుల ప్రక్రియ అక్టోబరుకల్లా పూర్తవ్వాలని ఆదేశం

ఈనాడు, అమరావతి: అపరిచితులతో ఫొటోలు దిగేటప్పుడు మంత్రులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. 'ఎవరంటే వాళ్లు వచ్చి ఫొటోలు తీసుకుని దొంగ సాక్ష్యాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరొస్తున్నారో, ఎవరు ఫొటో దిగుతున్నారో తెలియదు కాబట్టి అప్రమత్తంగా ఉండండి' అని ఆయన పేర్కొన్నారు. మద్యం కేసులో నిందితుడు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి సహా వైకాపా నేతలకు అత్యంత సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడు.. కొందరు తెదేపా నేతలతో దిగిన ఫొటోలు బయటకు వచ్చిన నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం క్యాబినెట్ భేటీ ముగిశాక మంత్రులతో కలసి భోజనం చేస్తూ... ఆయన పలు అంశాలపై మాట్లాడారు. 'వెంకటేశ్‌నాయుడు నంద్యాల వాసే కదా, మీకు తెలుసా? మీతోనూ ఫొటోలు దిగాడా?' అని మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలను ముఖ్యమంత్రి అడిగినట్లు తెలిసింది. అతని తండ్రి తనకు తెలుసని, వాళ్లు వేరే పార్టీవారు కావడంతో ఎప్పుడూ తాను చేరనివ్వలేదని ఫరూక్, వాళ్లెవరో తనకు తెలీదని జనార్దన్‌రెడ్డి చెప్పినట్టు తెలిసింది. నేరస్థులు తెలివిగా వ్యవహరిస్తున్నారని, వారి ఆట కట్టించాలంటే పోలీసులు, రాజకీయ నాయకులు ఇంకా తెలివిగా ప్రవర్తించాలని సీఎం సూచించినట్టు తెలిసింది. వైకాపా నాయకులు తప్పుడు వార్తల్ని నిజాలుగా, నిజాల్ని తప్పుగా చిత్రీకరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను మంత్రులు గట్టిగా తిప్పికొట్టాలని ఆదేశించారు.



జగన్‌తో చేదు అనుభవాల్ని మర్చిపోలేకపోతున్న సింగపూర్

పరిపాలనలో మెరుగైన విధానాలు, పబ్లిక్ పాలసీలు, చేపట్టిన భారీ, వినూత్న ప్రాజెక్టులపై అధ్యయనానికి బృందాల వారీగా మంత్రుల్ని సింగపూర్ పర్యటనకు పంపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తన సింగపూర్ పర్యటన విశేషాల్ని మంత్రులకు ఆయన వివరించారు. సింగపూర్‌తో 30 ఏళ్లుగా మనకు సత్సంబంధాలున్నాయని, అలాంటి మిత్ర దేశానికి జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆంధ్రప్రదేశ్ అంటే తీవ్రమైన విముఖత ఏర్పడిందని పేర్కొన్నారు. 'వైకాపా ప్రభుత్వం సింగపూర్‌తో చాలా దుర్మార్గంగా వ్యవహరించింది. సింగపూర్ మంత్రులపై కేసులు పెడతామని బెదిరించింది. అమరావతిలో స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు నుంచి వారిని తరిమేసింది. ఆ చేదు అనుభవాన్ని వాళ్లు మర్చిపోలేకపోతున్నారు. ఆ ప్రతికూల భావనను తొలగించేందుకు మా సింగపూర్ పర్యటన ఉపయోగపడింది' అని తెలిపారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 40 సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. రాజధాని స్టార్టప్ ప్రాజెక్టులో మళ్లీ భాగస్వామి అయ్యేందుకు సింగపూర్ సుముఖంగా లేదన్నారు. ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టే ప్రాజెక్టులకు సాంకేతిక సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు చెప్పారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు సింగపూర్ అంగీకరించిందన్నారు. అంతర్జాతీయ సంబంధాలపై పర్యవేక్షణకు మంత్రుల కమిటీని ఏర్పాటు చేస్తామని సీఎం తెలిపారు. వివిధ దేశాలతో మన వాణిజ్య ప్రయోజనాలు, ప్రాజెక్టులు వంటి అంశాల్ని ఈ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు.

జిల్లాల్లో మార్పుచేర్పులపై నెల రోజుల్లో నివేదిక

జిల్లాలు, మండలాలకు సంబంధించిన మార్పుచేర్పులు, పేర్ల మార్పుపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జనగణనలో తొలి దశ 2026 జనవరి నుంచి ప్రారంభమవనున్న నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబరు 31లోగా జిల్లాల సరిహద్దుల మార్పుచేర్పులు ఉంటే చేసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని సీసీఎల్ఏ జయలక్ష్మి చెప్పారు. 'డిసెంబరు వరకు సమయం ఉంది కదా అని ఆగితే.. చివరి నిమిషంలో సమస్యలు వస్తాయి. అక్టోబరు నెలాఖరులోపే ప్రక్రియ పూర్తి చేయాలి. సరిహద్దు మండలాల విలీన సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు, కొత్త మండలాల ఏర్పాటు, జిల్లా, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల వరకు సరిహద్దుల మార్పులపై ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిష్కరించాలి' అని సీఎం ఆదేశించారు. పరిశ్రమలపై మంత్రులు సమీక్షించాలని, వెనుకబడిన జిల్లాలు, నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తామని సీఎం తెలిపారు.

కొత్త మంత్రులూ బాగా పనిచేశారు

'మంత్రుల్లో చాలా మంది కొత్తవారైనా ఈ ఏడాది కాలంలో బాగా పనిచేశారు. నేర్చుకోవడం అయిపోయింది. ఇక వేగం పెంచాలి' అని సీఎం సూచించారు. మంత్రులు వారి శాఖలకు సంబంధించిన ప్రాజెక్టులపై నివేదికలు సిద్ధం చేసుకోవాలని, వాటిని పూర్తి చేసేందుకు అవసరమైతే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న పనులు, పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే మంత్రివర్గ సమావేశం నుంచి ఇద్దరు, ముగ్గురు మంత్రులతో వారు సాధించిన విజయాలపై మాట్లాడిస్తానని సీఎం తెలిపారు. 'మనం ఎంత బాగా పనిచేసినా చిన్న చిన్న తప్పులతో అప్పటి వరకు చేసిన మంచి అంతా పోతుంది. కాబట్టి జాగ్రత్తగా ఉండండి. ఇప్పటి వరకు 24 మంది ఎమ్మెల్యేలతో ముఖాముఖి మాట్లాడాను. వారి ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను వివరించాను. కొందరు చేసిన తప్పుల గురించి వారికి చెబితే, నిజమేనని అంగీకరించారు. సరిదిద్దుకుంటామని చెప్పారు' అని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, భాజపా అగ్ర నాయకులు కూడా వారి పార్టీ ఎమ్మెల్యేలతో మాట్లాడాలని సీఎం సూచించారు.

నరేగా పెండింగ్ బిల్లులు 25లోపు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న నరేగా బిల్లుల్ని ఈ నెల 25లోపు చెల్లించాలని చంద్రబాబు ఆదేశించారు. మంత్రులు నియోజకవర్గాలవారీగా సమీక్షించి, ఇంకా అప్‌లోడ్ చేయాల్సిన బిల్లులుంటే.. వెంటనే ఆ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. మహిళలపై దాడులు, అసభ్యపదజాలంతో వారిని కించపరచడం వంటి వాటిని అసలు సహించవద్దని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్న నేపథ్యంలో... ఆటో డ్రైవర్లకు ఇబ్బంది లేకుండా వారికి ఏదైనా ప్రయోజనం చేకూర్చాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించగా సీఎం సానుకూలంగా స్పందించారు. ప్రజలు 8 ప్రధాన రోగాలకే 80 శాతం ఖర్చు పెట్టాల్సి వస్తోందని... బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలసి మొదట కుప్పంలో, ఆ తర్వాత చిత్తూరు జిల్లా మొత్తం అమలు చేస్తున్న పైలట్ ప్రాజెక్టును రాష్ట్రమంతా విస్తరిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని చంద్రబాబు అన్నారు. విశాఖ, విజయవాడ, తిరుపతిల్లో మూడు డీ అడిక్షన్ మోడల్ హబ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పీఎం-సూర్యఘర్ పథకం కింద రాష్ట్రంలోని 25 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు సౌర విద్యుదుత్పత్తి ప్యానళ్ల ఏర్పాటు చేసుకునేలా మంత్రులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చ

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ సమావేశాల్ని ఈ నెల మూడో వారంలోగానీ లేదా వచ్చే నెల మొదటి వారంలోగానీ నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సమావేశాల్ని ఎప్పుడు పెట్టాలనే దానిపై బుధవారం మంత్రివర్గ సమావేశానికి ముందు.. విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌తో కొందరు మంత్రులు చర్చించారు. శాసన సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సుమారు 10 పని రోజుల్లో నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: కేంద్రం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. "సర్పంచుల వేతనాలు పెంచాలి. కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వ కేంద్రీకృత విధానాల వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పడకేసింది" అని పేర్కొన్నారు.



ఈ పరీక్షలు తప్పక చేయించుకోండి

మీ వయసు 30 ఏళ్లు దాటిందా? అయితే ఈ ఐదు వైద్య పరీక్షలు కచ్చితంగా చేయించుకోండి.

- హెచ్ఎస్-సీఆర్‌పీ: శరీరంలో నిశ్శబ్దంగా పెరుగుతున్న ఇన్‌ఫ్లమేషన్‌ను గుర్తిస్తుంది.
- హెచ్‌బీఏ1సీ: రక్తంలో చక్కెర స్థాయిల దీర్ఘకాలిక సగటును తెలియజేస్తుంది.
- లిపిడ్ ప్రొఫైల్: రక్తంలో వివిధ రకాల కొవ్వుల స్థాయిలను నిర్ధారిస్తుంది.
- విటమిన్ డీ: రోగనిరోధక శక్తి విషయంలో కీలకం.
- ఫాస్టింగ్ ఇన్సులిన్: మధుమేహం రాకను ముందస్తుగా హెచ్చరిస్తుంది.

– సుమిత్ శర్మ, వైద్యుడు

పులివెందులలో వైకాపా కవ్వింపు చర్యలు

- తెదేపా, వైకాపా పరస్పర దాడులు
- స్టేషన్‌లోనే డీఎస్పీపై వైకాపా నేతల రుబాబు



విలేకర్లతో మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

ఈనాడు, కడప: జడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో వైకాపా కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఫలితంగా వైకాపా, తెదేపా నాయకులు బుధవారం పరస్పరం దాడులకు దిగారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో కర్నూలు నుంచి డీఐజీ కోయప్రవీణ్ పులివెందులకు చేరుకుని ప్రచారానికి నిబంధనలు విధించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం తెదేపా బుధవారం నల్లగొండువారిపల్లెలో, వైకాపాకు కనంపల్లె, ఇ.కొత్తపల్లెల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవాల్సి ఉంది. అయితే ఎమ్మెల్సీ రమేష్, వైకాపా నేత వేల్పుల రామలింగారెడ్డి నల్లగొండువారిపల్లెకు చేరుకుని తెదేపా ప్రచారానికి సహకరించవద్దని ఓటర్లపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. దీంతో తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి తదితరులు వారిని నిలదీశారు. ఈ సమయంలో రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు ఘర్షణకు దిగారు. వాహనాలను ధ్వంసం చేసుకున్నారు. ఈ దాడిలో రామలింగారెడ్డి, రమేష్ గాయపడ్డారు. తెదేపా వైపు ధనంజయపై దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన ధనంజయ తనను రామలింగారెడ్డి కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రెండు పార్టీల నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కర్నూలు నుంచి డీఐజీ వచ్చి.. ప్రత్యేక దళాలను రప్పించారు. పులివెందుల మార్గంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రచారానికి పోలీసు అనుమతి తీసుకుని వెళ్లాలని, ఒకరు వెళ్లిన గ్రామానికి మరొక పార్టీవారు వెళ్లవద్దని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఐజీ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి వైకాపా నేత రామలింగారెడ్డి నల్లగొండువారిపల్లెకు వెళ్లడంతోనే పరిస్థితి ఉద్రిక్తంగా మారిందన్నారు.



వేలు చూపిస్తూ పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌ను హెచ్చరిస్తున్న వైకాపా నాయకుడు సతీష్‌కుమార్‌రెడ్డి.. పక్కన మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ఏం డీఎస్పీ.. ఏం మాట్లాడుతున్నారు?

తమ పార్టీ నాయకులపై తెదేపా వారు దాడి చేశారంటూ వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లారు. పులివెందులను ఏం చేయాలనుకుంటున్నారని, కాపాడాల్సిన బాధ్యత మీకు లేదా అంటూ డీఎస్పీ మురళీనాయక్‌ను ఎంపీ ప్రశ్నించారు. గతం కంటే మిన్నగా పులివెందులలో శాంతిభద్రతలు కాపాడుతున్నామని డీఎస్పీ జవాబిచ్చారు. సతీష్‌కుమార్‌రెడ్డి డీఎస్పీకి వేలు చూపిస్తూ 'ఏం మాట్లాడుతున్నారు? గతం గితం అంటూ మాట్లాడుతున్నారు. మీరు రాజకీయాలు మాట్లాడుతున్నారా' అని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

ఫోన్‌లో జగన్ ఆరా

వైకాపా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మరో నేత వేల్పుల రామలింగారెడ్డిలతో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. గాయపడ్డ వైకాపా నేతలు సైదాపురం సురేష్‌రెడ్డి (చంటి), అమరేష్‌రెడ్డిలనూ పరామర్శించారు.

25 మందితో కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ

- ఛైర్మన్‌గా ఏపీ ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్
- సభ్యులుగా షర్మిల సహా 24 మంది సీనియర్లకు చోటు

ఈనాడు, అమరావతి: కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీని ఆ పార్టీ అధిష్ఠానం బుధవారం నియమించింది. రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జి బి.మాణికం ఠాగూర్ కమిటీ ఛైర్మన్‌గా.. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సహా 24 మందిని సభ్యులుగా నియమించారు. సీనియర్ నేతలు ఎంఎం పల్లంరాజు, జేడీ శీలం, ఎన్.రఘువీరారెడ్డి, కొప్పుల రాజు, గిడుగు రుద్రరాజు, మస్తాన్‌వలీ, కేవీపీ రామచంద్రరావు, చింతా మోహన్, కె.బాపిరాజు, జీవీ హర్షకుమార్, ఎన్.తులసిరెడ్డి, కిల్లి కృపారాణి, లింగంశెట్టి ఈశ్వరరావు, పీఎం కమలమ్మ, కె.సుధాకర్, రకేత ఎలిజా ఉన్నంశెట్టి, కొండేటి చిట్టిబాబు, ఆమంచి కృష్ణమోహన్, సూర్య నాయక్, సిరివెల్ల ప్రసాద్, జి.ఉషానాయుడు, గణేశ్ యాదవ్, పాలక్ వర్మలను కమిటీ సభ్యులుగా నియమించినట్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా జేడీ శీలం, మస్తాన్‌వలీ: కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీని నియమించినట్లు కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలి ప్రతిపాదనలను పార్టీ అధిష్ఠానం ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు.

వైకాపా హయాంలోనే బనకచర్లకు బీజం

విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు. చిత్రంలో లక్ష్మీనారాయణ, బొజ్జా దశరథరామిరెడ్డి తదితరులు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలోనే పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు బీజం పడిందని, అందువల్లే ప్రస్తుతం ఆ పార్టీ నేతలు నోరు మెదపడం లేదని విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. 'ఆలోచనాపరుల వేదిక' ఆధ్వర్యంలో 'రాయలసీమ ప్రాజెక్టుల అధ్యయనం' కార్యక్రమంలో భాగంగా కర్నూలులో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 2019లో ఏపీ సీఎంగా ఉన్న జగన్, అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ గోదావరి జలాల పంపిణీకి సంబంధించి పోలవరం- బనకచర్ల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని చెప్పారు. అప్పట్లోనే ఊహాచిత్రం రూపొందించారని గుర్తుచేశారు. రూ.80,000 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాయలసీమలో జలదోపిడీ జరుగుతోందన్న భావనలో ఉందని, ఇక్కడ అలాంటి పరిస్థితులేమీ లేవని అన్నారు. 44,000 క్యూసెక్కుల వరదనీరు తీసుకోవాల్సిన పోతిరెడ్డిపాడు నుంచి 37,000 క్యూసెక్కులు కూడా తీసుకోవడం లేదని తెలిపారు. నీటి పారుదల రంగ నిపుణులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, ఆలోచనాపరుల వేదిక ప్రతినిధులు చక్రవర్తి, భవానీప్రసాద్, సీపీఐ నాయకులు రామాంజనేయులు, రామచంద్రయ్య తదితరులు ప్రసంగించారు. అంతకుముందు వారు కర్నూలు సీఈ కబీర్‌బాషాను కలిసి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై చర్చించారు.

శ్వేతపత్రం ఆధారంగా పిల్‌పై విచారణ జరపలేం

- కేంద్ర సంస్థల అధికారులతో సిట్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఏముంది?
- దిల్లీ న్యాయవాది మెహక్ మహేశ్వరికి హైకోర్టు సూటి ప్రశ్నలు
- వైకాపా హయాంలో సహజ వనరుల దోపిడీపై సిట్ ఏర్పాటు కోసం పిల్

ఈనాడు, అమరావతి: సహజవనరులను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షల కోట్లు నష్టం చేసిన విషయంలో మాజీ సీఎం జగన్‌పై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణలో సీబీఐ, ఈడీ, ఐటీ, రెవెన్యూ అధికారులతో సిట్‌ను ఏర్పాటుచేసి దర్యాప్తు చేయించాలంటూ పిల్ దాఖలుచేసిన దిల్లీకి చెందిన న్యాయవాది మెహక్ మహేశ్వరిని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. 'ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం సిట్ వేసింది. కేంద్రసంస్థల అధికారులతో సిట్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఏముంది? ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం ఆధారంగా పిల్‌పై విచారణ జరపలేం. ప్రచారం కోసం, స్వప్రయోజనాల కోసం దాఖలయ్యే ప్రజాహిత వ్యాజ్యాలపై జాగ్రత్తగా ఉండాలని సుప్రీంకోర్టు చెప్పింది. మీ పిల్ ఆ కోవలోకి వస్తుందా? లేదా? అని చూడాలి. రాష్ట్రప్రభుత్వ సిట్ మెతకవైఖరి అవలంబిస్తోందని మీరు ఎలా విశ్వసిస్తున్నారు? మాజీ సీఎం పట్ల ఔదార్యం చూపుతున్నారని భావిస్తున్నారా?' అని పిటిషనర్/న్యాయవాది మెహక్ మహేశ్వరిని ప్రశ్నించింది. 'రాష్ట్రప్రభుత్వ సంస్థలకు కేసును దర్యాప్తు చేసే సామర్థ్యం లేదు. వేలకోట్లతో ముడిపడి ఉన్న ఈ కుంభకోణం ఇతర రాష్ట్రాలకు, దేశాలకు విస్తరించి ఉండొచ్చు' అని న్యాయవాది పేర్కొనగా.. ఆ విషయాన్ని మీరెలా చెబుతున్నారు? ఏమైనా ఆధారాలున్నాయా? అని ధర్మాసనం నిలదీసింది. 'పిల్ దాఖలుచేసిన విధానంపై మేము సంతృప్తిగా లేము. ఈ దశలో ప్రతివాదులకు నోటీసులు సైతం ఇవ్వలేం' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. వివరాలు సమర్పించాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతికి సూచించింది. విచారణను వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ అంతకుముందు జరిగిన విచారణలో పిటిషనర్/న్యాయవాది మెహక్ మహేశ్వరి వాదనలు వినిపిస్తూ 'వైకాపా హయాంలో చోటుచేసుకున్న అవినీతిపై కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాలను విడుదల చేసింది. సిట్‌తో విచారణ జరిపించండి' అని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ విషయంపై దర్యాప్తు జరగట్లేదా? అని ప్రశ్నించింది. పిటిషనర్ బదులిస్తూ రాష్ట్రప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసిందని, కేంద్రసంస్థల అధికారులను అందులో చేర్చలేదన్నారు. 'మీలాంటి బిజీ న్యాయవాది ఇలాంటి పిల్ వేయడం, దిల్లీ నుంచి వచ్చి వాదనలు వినిపించడం చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంతో మీకేం సంబంధమని సూటిగా ప్రశ్నించింది. న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'గత ఏడాదికాలంగా మద్యం కుంభకోణం కేసులోనే దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు మాజీ సీఎంను అభియోగపత్రంలో నిందితుడిగా చేర్చలేదు' అన్నారు. ఎస్‌జీపీ ప్రణతి స్పందిస్తూ.. ఇప్పటికే సిట్ ఏర్పాటుచేశామని, పూర్తి వివరాలను కోర్టుముందు ఉంచేందుకు సమయం కావాలని కోరారు. దీంతో విచారణను 2026 ఫిబ్రవరి 11కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

కూటమి ప్రభుత్వ చొరవతో ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సుకు అనుమతులు

ఈనాడు, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో 2020, 2021, 2022లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఐదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సుకు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) గుర్తింపునిచ్చింది. ఈ మేరకు విశ్వవిద్యాలయానికి లేఖ రాసింది. ఈ నెల 4న జరిగిన సీఓఏ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఆర్కిటెక్చర్ డిగ్రీ కోర్సుకూ అనుమతులను పొడిగించింది. 40 సీట్లకు ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, విద్యార్థుల డిగ్రీలకు భరోసా లభించింది. ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి తన తండ్రి వైఎస్సార్ పేరు పెట్టుకున్న జగన్.. అందులో చదివే విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలంటే కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలనే విషయాన్నీ అప్పట్లో పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్ల కోర్సు పూర్తయిన విద్యార్థులు తమ డిగ్రీకి విలువ కల్పించాలని ఇటీవల ఆందోళనలు నిర్వహించారు. వర్సిటీలో అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో వర్సిటీ వీసీ విశ్వనాథ కుమార్ ఈ నెల 4న సీఓఏ కార్యనిర్వాహక కమిటీ ముందు హాజరై ప్రభుత్వం, వర్సిటీ తరఫున లేఖ సమర్పించారు. ఖాళీ పోస్టులను కాంట్రాక్టు అధ్యాపకులతో భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో అనుమతిని పొడిగించినట్లు సీఓఏ పేర్కొంది.

హజ్ యాత్రికుల ఖాతాల్లో రూ.లక్ష జమ

ఎన్నికల హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీని నెరవేర్చింది. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న 72 మంది యాత్రికుల ఖాతాల్లో రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని బుధవారం జమ చేసినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా తెలిపారు. "విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారు ఎక్కువమంది లేకపోవడంతో 2025లో ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్రం రద్దు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకుని కేంద్రానికి లేఖ రాయడంతో దానిని పునరుద్ధరించారు. విజయవాడ నుంచి మక్కా వెళ్లే వారికి అదనంగా రూ.70 వేలు ఖర్చు కానున్న దృష్ట్యా ఆర్థికసాయం రూ.లక్ష చొప్పున ప్రభుత్వమే భరిస్తోంది. దీనిని ఉపయోగించుకుని మక్కా వెళ్లే వారు విజయవాడ నుంచే వెళ్లేందుకు ప్రయత్నించాలి" అని ఆయన సూచించారు. హజ్ యాత్రికులకు ఆర్థికసాయం విడుదలపై మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ షిబ్లీ హర్షం వ్యక్తం చేశారు.

మన పిల్లలు... మరింత బాగా!


నారుతో పాటు నీరు పోసే తీరుపైనే మొక్క ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. పిల్లల పెంపకం కూడా అంతే! చిన్నప్పట్నుంచి వారితో తల్లిదండ్రులు ఎలా ప్రవర్తిస్తామనే దాన్నిబట్టి వారి వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది.

● సోనీ ఏడో తరగతి చదువుతోంది. ఓరోజు హోంవర్క్ చేయకుండా మొబైల్‌లో గేమ్ ఆడుతూ కూర్చుంది. తల్లి సరితకు కోపం వచ్చింది. అయితే ఆమె అరవడమో, తిట్టడమో చేయలేదు. 'సోనీ.. నువ్వు గేమ్ ఆడడం తప్పు కాదు. కానీ, ముందుగా హోంవర్క్ పూర్తి చేయి! తర్వాత నీకు గేమ్ ఆడేందుకు 15నిమిషాల సమయం ఇస్తాను' అని అర్థమయ్యేలా చెప్పారు. తర్వాత నుంచి సోనీ ముందు హోంవర్క్ పూర్తిచేయడం అలవర్చుకుంది!

● రాజేశ్ ఓ సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొన్నాడు కానీ, బహుమతి రాలేదు. నిరాశతో ఉన్న రాజేశ్‌ను దగ్గరకు తీసుకుని.. 'బహుమతి కంటే, నువ్వు ప్రదర్శించిన ధైర్యం నాకు గొప్పగా అనిపించింది. ఈ విషయంలో నీకు అనుభవం ఉంది. ఈసారి ఇంకొంచెం కొత్తగా ప్రయత్నిద్దాం' అని తండ్రి అన్నారు.

ఇక్కడ ప్రశ్నించుకోవాల్సింది.. సోనీ తల్లిలా.. రాజేశ్ తండ్రిలా ఎంత మంది తల్లిదండ్రులు ఉంటున్నారని!

'ఎప్పుడూ ఫోన్ చూసుకుంటూనే ఉంటావు, నీకిక బొత్తిగా చదువు మీద ధ్యాస ఉండదు' అని దూషించడం, 'మొదటి బహుమతి తెచ్చుకోలేకపోయావు' అంటూ అవహేళన చేయడం వంటి చర్యలు పిల్లలను ఏమాత్రం మార్చవు సరి కదా..! వారికి చదువుపై, తల్లిదండ్రులపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుందంటున్నారు నిపుణులు..! 'పాజిటివ్ పేరెంటింగ్' ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారిలా..!



ఎప్పుడూ తప్పుల గురించి పిల్లలకు క్లాసులు తీసుకుంటున్నారా?
వారు ఇతరుల్లోనూ అవే లక్షణాలు వెదుకుతారు.

ఇంట్లో ఎప్పుడూ ఘర్షణ వాతావరణం ఉంటోందా?
పిల్లల మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది. అభద్రతా భావం ఏర్పడుతుంది. వారిలో కోపం పెరుగుతుంది.

ఇతరులతో పోల్చుతూ అవమానిస్తున్నారా?
అవతలివారిపై ద్వేషం ఏర్పడుతుంది. మంచి స్వభావంతో ఉన్నవారైనా తమలో తక్కువలేని స్వభావం నాటుకుపోతుంది.

భయపెట్టి, దండించి దారిలో పెట్టాలని చూస్తున్నారా?
ఇక పిల్లలు మీకు మానసికంగా దూరమైపోయినట్లే. వారిలో వారే వంచనేసుకుంటారు. ఏ విషయాన్నీ మీతో పంచుకోరు.

వారి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా మీ అభిరుచులను వారిపై రుద్దుతున్నారా?
వారిలో సృజనాత్మకత తను చంపేస్తున్నట్లే. వారి వెనకబాటుకు, కుంగుబాటుకు బీజం వేస్తున్నట్లే.

భుజం తడితే..
పిల్లలు 90% మార్కులు తెచ్చుకుంటే '100% ఎందుకు రాలేదు' అని అడిగే కంటే 'పరీక్షల్లో బాగా రాణించావు. మిస్ అయిన ప్రశ్నలు నేర్చుకుంటే ఇంకా మంచి మార్కులొస్తాయి' అని చెప్పండి.

అప్పుడు అండగా..
పిల్లల ఓటమిని అంగీకరించడం, వారి అభిప్రాయాలను గౌరవించడం, సహనంగా ఉండడం, తమ అభిరుచులను పంచుకోవడం వంటివి పిల్లల్లో ధైర్యాన్ని పెంపొందిస్తాయి.

ఒక్క ప్రశంస..
చిన్నదైనా సరే మంచి ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా ప్రశంసించండి. ఇది వారిలో ఆత్మవిశ్వాసం అనే విత్తనాన్ని నాటుతుంది.

నిజం వైపు నిల్చుంటే..
పిల్లలకు నిజాలు చెప్పడం... నిజాయతీగా ఉండడం అలవాటు చేయండి. అవి వారిని ఉన్నతమైన వ్యక్తులుగా మార్చుతాయి. నైతిక బలాన్నిస్తాయి.

ఆ కాసేపు..
ఎంత బిజీగా ఉన్నా రోజుకు కనీసం 20నిమిషాలు పిల్లలతో గడపాలి. ఒకవేళ బయట ప్రాంతాల్లో పని చేస్తుంటే పిల్లలతో వీడియో కాల్స్ మాట్లాడితే అయినా వారికి దగ్గరగా ఉండాలి.

-ఈనాడు అమరావతి, ప్రత్యేక విభాగం

నాగరాణులు


విద్యా రాజు

పాము కనిపిస్తే వెన్నులో వణుకు వస్తుంది. దాని కాటుకు బలవుతున్న వార్తలు తరచూ చూస్తున్నాం. అది మనిషిని భయపెడుతుంది. కాబట్టే, అది కనిపించడం ఆలస్యం.. చంపడానికి చూస్తారు. కానీ కేరళలో ఆ పరిస్థితిలో మార్పు తెస్తున్నారు కొందరు మహిళలు. ఆ రాష్ట్ర అటవీశాఖ.. స్నేక్ అవేర్‌నెస్ రెస్క్యూ అండ్ ప్రొటెక్షన్ (సర్పా) పేరిట విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీనిద్వారా శిక్షణ పొంది పాములను రక్షించి, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారీ మహిళలు. సర్పకు ప్రత్యేక యాప్ కూడా ఉంది. ఎక్కడ పామును చూసినా పిలుపు వచ్చినా వీళ్లు ప్రత్యక్షమవుతారు. అనుశ్రీ బాబుది కోజికోడ్. చిన్నప్పుడు అనుకోకుండా ఓ పామును కాపాడారు. ఆ అనుభవంతో పెద్దయ్యాక పాములు పట్టడంలో శిక్షణ తీసుకున్న ఆమె పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు. దాదాపు 620 పాములను కాపాడారామె. కొచ్చికి చెందిన విద్యా రాజుకి దాదాపు 60 ఏళ్లు. సాయం కావాలంటూ పిలుపు రాగానే ఆ ప్రదేశానికి వెళ్తారామె. ఎక్కడ పాము కనిపించినా కేరళ ప్రజలు 'సర్ప' యాప్‌ను ఆశ్రయిస్తున్నారు. యువతుల దగ్గర్నుంచి రిటైర్ అయిన వారి వరకు అన్ని వయసుల వారూ ఈ బృందంలో ఉన్నారు. 311 మంది మహిళలు నిత్యం సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇదంతా వాళ్లు చేస్తోంది.. ఉచితంగానే. ఎవరూ పాము కాటుకు బలవ్వొద్దు. ఎవరి చేతిలోనూ పాములు చనిపోవద్దు అన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు వీళ్లు. పాములను పట్టడమే కాదు, ఎవరైనా కాటుకు గురైనా వారికి అత్యవసర చికిత్సను అందించడంపైనా శిక్షణ తీసుకుంటున్నారు. 'జీరో పాము కాటు' లక్ష్యంగా పనిచేస్తున్నారు. - వసుంధర డెస్క్

హాయ్.. హలో.. నమస్తే..



'హాయ్.. హలో.. నమస్తే.. గుడ్ ఆఫ్టర్‌నూన్ ఎవ్రీబడీ. నా పేరు హర్షిత. నాతో ఉన్నది నిషిత. మీరు వింటున్నది వాయిస్ గ్రీన్ ఎఫ్‌ఎం 674.26. ఏయ్.. నిషితా..!. నీకిది తెలుసా.. మన దేశ ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాంబు పేల్చారు. 'కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన అక్కాతమ్ముళ్లు యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ పలు అవార్డులు అందుకున్నారు' అంటూ అంతర్జాతీయ, జాతీయ, స్థానిక, వర్తమాన వ్యవహారాలతో సంభాషణ సాగుతుంది. అయితే వీరు రేడియో జాకీలు కాదు పెద్దపల్లి జిల్లా ధర్మారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు. నిత్యం భోజన విరామ సమయంలో ఈ బడిలో జరిగే ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ కార్యక్రమం ఇది. వర్తమాన అంశాలతో పాటు క్రమశిక్షణ, పొడుపు కథలు, జోక్‌లు, మధ్యమధ్యలో దేశభక్తి, పిల్లల పాటలు వినిపిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల పుట్టిన రోజు శుభాకాంక్షలు, సాధించిన విజయాలు, ప్రిన్సిపల్, క్లాస్ టీచర్ల ప్రకటనలూ వస్తాయి. ఈ పాఠశాలలో 674 మంది విద్యార్థులు, 26 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. పాఠశాల చుట్టూ పచ్చని పంటపొలాలున్నాయి. అందుకే దీనికి వాయిస్ గ్రీన్ ఎఫ్‌ఎం 674.26 స్టేషన్‌గా పేరు పెట్టామని ప్రిన్సిపల్ ఈరవేని రాజ్‌కుమార్ తెలిపారు. రసాయనశాస్త్రం టీచర్ నరేంద్రబాబు పర్యవేక్షిస్తున్నారు. అందరూ ఆవరణలో కూర్చుని భోజనాలు చేసే 45 నిమిషాల సమయాన్ని ఇలా వినియోగించుకుంటున్నారు. - న్యూస్‌టుడే, ధర్మారం

ఆకలి తీర్చే బ్యాంక్

మనం ఆర్థిక లావాదేవీలను నిర్వహించే బ్యాంకు చూశాం. మరి, రోడ్డు వెంట ఆకలితో నకనకలాడుతూ కనిపించే పేదలకు రోజూ ఒకే సమయానికి భోజనం వడ్డించే బ్యాంకును మీరెప్పుడైనా చూశారా? అదే.. నిరంతరాయంగా!! నిజామాబాద్‌కు చెందిన నవీన్ చంటి విద్యుత్ శాఖ గ్రేడ్-2 ఉద్యోగి. చిరిగిన దుస్తులు, మాసిన జుట్టు, ఖాళీ కడుపులతో రహదారుల పక్కన కనిపించే పేదలు ఆయన మనసును చలించిపోయేలా చేశారు. వారి ఆకలిని ఒక్క పూటైనా తీర్చలేమా? అని ఆలోచించారు. ఈ ఆలోచనలోంచి పురుడు పోసుకున్నదే 'నిజామాబాద్ ఫుడ్ బ్యాంక్'. దీనిని 2016, ఫిబ్రవరి 14న ప్రారంభించారు. ఏడాది పాటు ప్రతి ఆదివారం వంద మందికి తగ్గకుండా భోజనం అందించారు. రెండో ఏడాది నుంచి ప్రతిరోజూ ఒక పండు, స్వీట్, కూర, సాంబారుతో అన్నం వడ్డిస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో 150 మంది నగర యువత వాలంటీర్లుగా సేవలందిస్తుండటం విశేషం. ఈ సైన్యమంతా కలిసి ఇటీవల వరకు పది లక్షల మంది ఆకలిని తీర్చడం విశేషం. కరోనా లాక్‌డౌన్ సమయంలో జాతీయ రహదారిపై నిర్మల్ నుంచి మేడ్చల్ వైపు వెళ్లే ఎందరో వలస కూలీలకు భోజనం, బిస్కెట్లు, అల్పాహారాన్ని అందించడమే కాదు.. దేశ ప్రధాని మోదీ నుంచి ప్రశంసలూ అందుకున్నారు. కార్యక్రమ నిర్వహణకు నగదు విరాళాలు తీసుకోకపోవడం మరో ప్రత్యేకత. ఏటా ఫిబ్రవరిలో 'రైస్ బ్యాగ్ ఛాలెంజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఏడాదికి సరిపోయే బియ్యం, వంట సరుకులు, సామగ్రిని దాతల నుంచి సేకరిస్తారు.


అన్నం వడ్డిస్తున్న ఫుడ్ బ్యాంక్ వ్యవస్థాపకులు నవీన్ చంటి

ఏటా దసరా రోజు 300 మందికి కొత్త దుస్తులు అందజేస్తున్నారు. 'దిక్కులేనివారి ఆకలి బాధ తీర్చాలన్నదే నా ఆశయం. నాలో శక్తి ఉన్నంత వరకు కార్యక్రమం కొనసాగిస్తా' అని నవీన్ చంటి అంటున్నారు.
-న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్; ఈనాడు-నిజామాబాద్

మేకల పద్మ.. వీధి కుక్కలకు అమ్మ



సుమారు 13 ఏళ్లుగా (2012 నుంచి) శునకాలకు సేవలందిస్తూ కన్నబిడ్డల్లా పెంచిపోషిస్తున్నారు మేకల పద్మ. ఇందుకోసం ఖమ్మం జిల్లా కేంద్రంలోని మధురానగర్‌లో రెండెకరాల ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకొని నెలకు రూ.60వేలు చెల్లిస్తున్నారు. అరెకరంలో షెడ్డు నిర్మించి..చుట్టూ ఫెన్సింగ్ వేయించారు. 138 శునకాలను పెంచుతున్నారు. అనారోగ్యంతో తిరుగుతున్న, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన కుక్కలను అక్కున చేర్చుకుంటున్నారు. తన ఇద్దరు కుమారులు, కుమార్తె పంపించే డబ్బుతో పాటు దాతలు సమకూర్చే దాణాను కుక్కల సంరక్షణకు వినియోగిస్తున్నానని మేకల పద్మ 'ఈనాడు'కు తెలిపారు. శునకాలపై ప్రేమతో 2021లో క్రాఫ్ట్ టీచర్ ఉద్యోగాన్ని వదులుకున్నానని చెప్పారు. మూగజీవాలకు సేవ చేస్తున్న ఈమె.. వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పురస్కారాలు అందుకున్నారు. - ఈనాడు, ఖమ్మం

కుంకీ.. రాగిముద్ద, వరి కంకి..

జనావాసాల్లోకి వచ్చి పంట విధ్వంసం, ప్రాణ, ఆస్తి నష్టం కలిగిస్తున్న ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి తరిమికొట్టగల సామర్థ్యం కుంకీల సొంతం. ప్రత్యేకంగా శిక్షణ పొందిన నాలుగు కుంకీలను (రంజన్, కృష్ణ, దేవ, అభిమన్యు) కర్ణాటక నుంచి తీసుకురాగా, ఏపీకి చెందిన వినాయక్, జయంత్‌లను చిత్తూరు జిల్లా పలమనేరు మండలం ముసలిమడుగు ఏనుగుల శిబిరంలో ఉంచారు. ఈ నేపథ్యంలో కుంకీల ఆహారం, దినచర్య ఎలా ఉంటుందో ఒకసారి చూద్దాం. ఒక్కో కుంకీకి ఉదయం 6 గంటలకు 350 గ్రాముల బెల్లం, 7 గంటలకు వరి కంకులు అందించి.. 8.30 గంటలకు శిక్షణ ఇస్తారు. శిక్షకుడు చెప్పే విషయాలను అవగాహన చేసుకుంటూనే పచ్చగడ్డి, రావి, జువ్వి, అత్తి, మర్రి, అరటి బోదలు (మొత్తం 50 కిలోలు) తింటాయి. 9 గంటలకు నీరు తాగిన తర్వాత 10 గంటలకు రాగిముద్దలు పెడతారు. అప్పటి నుంచి సాయంత్రం 4 గంటల వరకు అడవిలో నడకతో పాటు మేత ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు స్నానం చేయించి 5.30 గంటలకు రాగి ముద్దలు అందించి నీరు తాపిస్తారు. 6.30 నుంచి రాత్రి 12 గంటల వరకు వరి కంకులు, రావి ఆకులు, అరటి బోదలు, గడ్డి తింటూ ఆ తర్వాత నిద్రపోతాయి. ఇలా ఒక్కో ఏనుగు రోజుకు 17 నుంచి 18 గంటలు తింటూనే ఉంటుంది. నిత్యం ప్రతి కుంకీ ఆహారానికి రూ.3000 ఖర్చు చేస్తున్నారు. ఈ శిబిరాన్ని 30 మంది సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. కుంకీల ఆహారం కోసం అడవిలోని 50 ఎకరాల విస్తీర్ణంలో వాటికి అవసరమైన పంటలను సాగు చేస్తున్నట్లు పలమనేరు అటవీ అధికారి వేణుగోపాల్ తెలిపారు.



– న్యూస్‌టుడే, పలమనేరు

గో రక్షాబంధన్



ఆవు పేడ మిశ్రమంతో తయారు చేసిన పర్యావరణ హితమైన, ఆరోగ్యపరమైన రాఖీలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్డీ)లోని గ్రామీణ సాంకేతిక పార్కులో దీర్ఘాయుష్ సంస్థ నిర్వాహకుడైన శివరామకృష్ణాచారి వీటిని తయారు చేస్తున్నారు. ఆవు పేడలో ఔషధగుణాలున్నాయి. ప్రధానంగా పేడను తాకడం వల్ల శరీరంలో రేడియేషన్ తగ్గుతుందని తేలడంతో శివరామ రాఖీల రూపకల్పనపై దృష్టి సారించారు. పేడకు తోటకూరవిత్తనాలు, చింతగింజల పొడి, తుమ్మ బంక మిశ్రమాన్ని కలిపి రాఖీలను రూపొందించారు. సహజరంగులతో వాటిని అందంగా తీర్చిదిద్దారు. పండుగ అనంతరం రాఖీలను పొలాల్లో, కుండీల్లో వేసి సహజ ఎరువుగా వినియోగించవచ్చని, ఇందులో విత్తనాలు ఉండటం వల్ల తోటకూర కూడా కాస్తుందని వివరించారు. ఈ రాఖీలను చౌకధరలకు విక్రయిస్తున్నామని, దీని ద్వారా పది మంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. – ఈనాడు, హైదరాబాద్

అనితర సాధ్యం..!



స్వామి దయానంద సరస్వతి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించారని చరిత్ర పాఠాల్లో చదువుకుంటాం. అలానే హైదరాబాద్ తదితర పెద్ద నగరాల్లో వాటికి సంబంధించిన కార్యాలయాలున్నాయి. నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోనూ తరచుగా ఈ పేరు వినిపిస్తుంటుంది. ఇందుకు కారణం స్థానికురాలైన గుడిపాటి అనిత ఆర్య కృషే. వీరి కుటుంబం ఏళ్లుగా.. ఆర్య సమాజ్‌లో కొనసాగుతోంది. మహిళలు సైతం వేదాలు చదవాలని ప్రచారం చేసే ఆర్య సమాజ ఆశయాలకు అనుగుణంగా.. అనిత ఏళ్లుగా వేద పారాయణం చేస్తూ తమ ఇంట్లో నిత్య అగ్నిహోత్రం నిర్వహిస్తున్నారు. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు నిర్వహించే 16 సంస్కారాలను... మంత్రాలు పఠిస్తూ నిర్వహిస్తున్నారు. అంతిమ సంస్కారాలను సైతం శ్మశానవాటికకు వెళ్లి.. పార్థివ దేహంపై సుగంధ ద్రవ్యాలు చల్లుతూ.. మంత్రాలు పఠిస్తూ నిర్వహిస్తారు. ఇలా ఆమె ఇప్పటివరకు సుమారు 320కి పైగా యాగాలు, 20కి పైగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆర్య సమాజ ఆశయాలను కొనసాగిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. – న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం

మొక్కజొన్న.. నూనెగా మిన్న!



మొక్కజొన్న నుంచి తీసే కార్న్ ఆయిల్ వాడకం ఇటీవల పెరిగింది. ఇందులో పాలీఅన్‌సాచురేటెడ్ ఫ్యాట్స్ 59%, మోనోఅన్‌సాచురేటెడ్ కొవ్వు 24%, సాచురేటెడ్ ఫ్యాట్స్ 13%గా ఉంటాయి. వీటి నుంచి అందే ఫ్యాటీయాసిడ్లు, ప్రొటీన్లు గుండె, రక్తనాళాల్లో రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. అందుకే ఈ నూనెను రోజువారీ వంటకాలు, సలాడ్స్, స్నాక్స్‌తో పాటు సౌందర్య సాధనాలైన సబ్బులు, కాస్మెటిక్స్, రంగుల తయారీకి వినియోగిస్తున్నారు. కండెల నుంచి మక్కలు ఒలిచి, శుభ్రం చేసి, తేమ ఆరబెట్టాక పెద్ద క్రషర్‌లో వేసి ముడిచమురు తీస్తారు. దాన్ని రిఫైన్ చేసి మార్కెట్‌లోకి తెస్తున్నారు. కార్న్ ఆయిల్‌కు గిరాకీ దృష్ట్యా ప్రపంచవ్యాప్తంగా మొక్కజొన్న సాగు విస్తరిస్తోందని, ఆహారం, పౌల్ట్రీ, పారిశ్రామిక రంగాల్లో దీని వినియోగం పెరిగిందని ఏలూరు సమీపంలోని మొక్కజొన్న పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పీవీ రమణరావు తెలిపారు. –ఈనాడు, ఏలూరు

గుటుక్కున చేప గుడ్లు తినేలా!

చేప గుడ్లా ఛీఛీ అంటారు కొందరు. అవే గుడ్లు చూస్తే భలే అంటూ లొట్టలేసుకుని తింటారు మరికొందరు. బోలెడు ఆరోగ్యం దాగున్న వీటిని తప్పక తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనికితోడు అన్ని సీజన్లలో ఇవి అందుబాటులో ఉండవు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) కొత్త పరిశోధనలు చేసింది. చేప గుడ్ల(ఫిష్ రో)తో ఎక్కువ కాలం నిల్వ ఉండేలా డ్రైడ్ ఫ్లేక్స్, చట్నీ పౌడర్‌లు తయారుచేసింది. త్వరలోనే ఈ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురానుంది. పశ్చిమ దేశాల్లో స్టర్జన్ చేప గుడ్లను ఉప్పుతో పులియబెట్టి కేవియర్ తయారుచేస్తారు. దీన్ని ఆహారంలో తీసుకుంటారు. అదే తరహాలో మన దగ్గర చేప గుడ్ల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులను రూపొందించడానికి సీఐఎఫ్‌టీ ముమ్మర పరిశోధనలు చేసింది. ఇందుకోసం రోహు, కట్ల, ముల్లెట్ చేపలను ఎంపిక చేసుకుంది. వీటి గుడ్లను ప్రత్యేక పద్ధతుల్లో ఎండబెట్టి ఫ్లేక్స్, చట్నీ పౌడర్‌ను తయారుచేసింది. ఈ రెండు ఉత్పత్తుల నమూనాలను సేకరించి నిల్వ చేయగా, తొమ్మిది నెలల తర్వాత కూడా నాణ్యత బాగున్నట్లు తేలింది. 'చేపల డ్రై ఎగ్ ఫ్లేక్స్‌లో 50-60శాతం ప్రొటీన్లు, 7-8శాతం కొవ్వు ఉంటాయి. చేప గుడ్లలో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తోంది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది' అని సీఐఎఫ్‌టీ ఇన్‌ఛార్జి మధుసూదనరావు, సీనియర్ సైంటిస్టు విజు తెలిపారు.



– ఈనాడు, విశాఖపట్నం

ఆ తెగలో భర్తలకే రాఖీ



దేశవ్యాప్తంగా పాటించే రక్షాబంధన్ సంప్రదాయం మధ్యప్రదేశ్‌లోని కొన్ని గ్రామాల్లో భిన్నంగా ఉంటుంది. శతాబ్దాలుగా అక్కడి మహిళలు సోదరులకు కాకుండా భర్తలకు, చెట్లకు రాఖీ కడతారు. ఛింద్వాడా జిల్లాలోని గోండు గిరిజన సమాజంలో భర్త మాత్రమే జీవితాంతం పక్కనే ఉండి రక్షిస్తాడని నమ్ముతారు. రక్షాబంధన్ రోజున పొలాల్లో పూజలు చేసి పంటలకు, అడవుల్లోని చెట్లకు రాఖీ కడతారు. ఈ గిరిజనులు దేవ్ రాఖీలను సొంతంగా తయారు చేస్తారు. పసుపు దారం, దూదితో చేసే ఈ రాఖీకి మొదట పూజ చేశాక పొలం బాట పడతారు. –ఈటీవీ భారత్

మీ లక్ష్యాన్ని ఇతరులు సంశయించినా..



విమానం తొలిసారి గాల్లోకి ఎగిరేదాకా.. ఆ ప్రయాణం అసాధ్యమనే చాలామంది అనుకున్నారు. స్మార్ట్‌ఫోన్ మానవ జీవితాలను మరో మలుపు తిప్పేవరకూ.. అంతగా అవసరం లేని సాధనంగానే దాన్ని ఎక్కువమంది భావించారు. ఇవే కాదు.. చరిత్రలో ఇప్పటివరకూ వచ్చిన అనేక గొప్ప ఆవిష్కరణల గురించి ప్రజలు తొలుత సంశయాత్మకంగానే మాట్లాడారు. మీ లక్ష్యం కూడా ఇతరులకు వాస్తవికంగా అనిపించకపోవచ్చు. అంతమాత్రాన మీరు వెనకడుగు వేయకండి.

– అనుష్కాసోహం బత్వాల్, వ్యాపారవేత్త

కడలి కళ.. ఈ శిల!

విశాఖ సాగర్‌నగర్ తీరంలో బుధవారం శిలలు కనువిందు చేశాయి. సముద్రం వెనక్కి వెళ్లడంతో పూర్తిగా నాచు పట్టిన రాళ్లు కనిపించాయి. ఆ పచ్చటి శిలలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. 'తీరంలో ఉండే సముద్ర జీవులు రాళ్లపైనున్న నాచును తింటాయి. ఏవైనా ప్రమాదకర జీవులు రాళ్ల పరిసరాల్లో ఉంటే అవి అటువైపు రావు. అలాంటి సందర్భాల్లో నాచు బాగా పెరుగుతుంది' అని విశాఖ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయి కె.కె. తెలిపారు. ఒకట్రెండు రోజులు ఎండ ఉంటే నాచు ఎండిపోతుందని చెప్పారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం(సాగర్‌నగర్)



దండాలమ్మా.. రుద్రమ్మ



భక్తులు విగ్రహాలకు పూజలు చేయడం సాధారణంగా చూస్తుంటాం. ఇక్కడ మాత్రం మరణ శాసనానికి ప్రణమిల్లుతున్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్లలో కాకతీయ రాణి రుద్రమ మరణ వివరాలు తెలిపే అత్యంత అరుదైన శిలాశాసనం మట్టిలో కూరుకుని ఉండటంతో దీన్ని 17ఏళ్ల క్రితం గ్రామ యువత పరిరక్షించింది. పురావస్తు శాఖ సహకారంతో శాసనానికి గద్దె నిర్మించారు. కాకతీయ రాణి రుద్రమ, ఆమె సైన్యాధిపతి మల్లికార్జుననాయుడు శక సంవత్సరం 1211 (క్రీ.శ 1289) విరోధినామ సంవత్సర మార్గశిర శు.12(ద్వాదశి) శుక్రవారం (నవంబరు 27)వీరమరణం పొందినట్లు శాసనంలో ఉంది. ఏటా నవంబరు 27న గ్రామస్థులు రుద్రమ వర్ధంతిని నిర్వహిస్తూ ఈ శాసనానికి పూజలు చేస్తారు. పేదలకు దుప్పట్లు, దుస్తులు.. వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తారు. గ్రామ వివేకానంద యువజన మండలి ఆధ్వర్యంలో ఎస్‌బీఐ సహకారంతో ఇక్కడ 10 అడుగుల రాణి రుద్రమ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, నాటి గవర్నర్ తమిళిసైతోపాటు ఎందరో ప్రముఖులు ఈ శాసనాన్ని సందర్శించారు. – న్యూస్‌టుడే, నకిరేకల్

డైపర్లు మార్చినట్లు.. పార్టీలు మార్చేస్తున్నారు

- రాజకీయాల్లో విలువలు, సంప్రదాయాలు తగ్గిపోయాయి
- 'నమో భారతీయం'ఆత్మీయ సభలో వెంకయ్యనాయుడు



వల్లూరు శ్రీమన్నారాయణను సన్మానిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్ తదితరులు

ఈనాడు, అమరావతి: 'రాజకీయాల్లో విలువలు, సంప్రదాయాలు తగ్గిపోయాయి. ఏ నాయకులు ఏ పార్టీలో ఉంటారో అర్థం కావడం లేదు. పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోతేనో, అధినేత నియంతలా వ్యవహరిస్తేనో పార్టీ మారారంటే అర్థం ఉంటుంది. కానీ చిన్నపిల్లల డైపర్లు మార్చినట్లు.. రాజకీయ నాయకులు పార్టీలు మార్చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి, రాజకీయ గౌరవానికి మంచిది కాదు' అని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. విజయవాడలో బుధవారం 'నమో భారతీయం' ఆధ్వర్యంలో భాజపా సీనియర్ నాయకుడు వల్లూరు శ్రీమన్నారాయణ ఆత్మీయ అభినందన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొందరు కార్యకర్తలు స్థాయి మరచిపోయి అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెదపులిపాక గ్రామానికి చెందిన శ్రీమన్నారాయణ పదవులు ఆశించకుండా నమ్మిన పార్టీ కోసం 56 ఏళ్లుగా పనిచేస్తున్నారని గుర్తుచేశారు.

జట్కా బండిలో తిరుగుతూ మైకులో చెప్పేవాణ్ని

'కాలేజీ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రాత్రి పూట ఖాళీ దొరికితే గోడలపై పార్టీ గురించి రాసేవాడిని. నా మాటలు పొందికగా ఉన్నా.. అక్షరాలు అంత అందంగా ఉండేవి కావు. నిదానంగా అలవాటు చేసుకున్నా. నేను రాజకీయాల్లో చేరినప్పుడు నా వయసు చాలా తక్కువ. వాజ్‌పేయీ, ఆడ్వాణీ, సుందర్‌సింగ్ భండారీ, నానాజీ దేశ్‌ముఖ్ లాంటి వాళ్లు నెల్లూరు వస్తున్నారంటే.. మైకులో జట్కా బండిపై తిరిగి అనౌన్స్ చేసేవాణ్ని' అని వెంకయ్యనాయుడు గుర్తుచేసుకున్నారు. 'ఉప రాష్ట్రపతి అయిన తర్వాత రాజ్యాంగ పదవిలో చేరాను కాబట్టి రాజకీయాలకు దూరమయ్యాను. కానీ నా మనసంతా భాజపా ఉంది' అని పేర్కొన్నారు.

ఫిజిక్స్ చూసి పెళ్లి చేసుకుని.. కెమిస్ట్రీ కుదరలేదని విడిపోతున్నారు

భారతదేశంలోని కుటుంబ, వివాహ వ్యవస్థను ప్రపంచమంతా గౌరవిస్తోందని, దాన్ని మనం కాపాడుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు. 'మన కుటుంబ వ్యవస్థలు, వివాహ బంధాలు దెబ్బతింటున్నాయి. పేరెంట్స్ డే అప్పుడే కొందరికి తల్లిదండ్రులు గుర్తుకొస్తున్నారు. అన్నదమ్ములు కూడా కలిసిమెలిసి ఉండట్లేదు. ఫిజిక్స్ చూసి పెళ్లి చేసుకుని కెమిస్ట్రీ కుదరలేదని విడిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్.లక్ష్మీపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కుమారస్వామి, నమో భారతీయం వ్యవస్థాపక అధ్యక్షులు జీవీ రామరాజు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల భాజపా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, తాతినేని రామచంద్రరావు పాల్గొన్నారు.

కిసాన్ రైలు ద్వారా ఏపీ నుంచి 34,196 టన్నుల ఉద్యాన ఉత్పత్తుల రవాణా

ఈనాడు, దిల్లీ: కిసాన్ రైలు 2020 ఆగస్టు 7 నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ నుంచి అస్సాం, బిహార్, పశ్చిమబెంగాల్, దిల్లీ, త్రిపుర రాష్ట్రాలకు 116 ట్రిప్పులు తిరిగింది. దీని ద్వారా 34,196 టన్నుల పండ్లు, కూరగాయల రవాణా జరిగింది. ఇందులో అరటి, మామిడి, ఉల్లి రకాలు కూడా ఉన్నాయి. 2024-25లో కంటెయినర్ కార్పొరేషన్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రి నుంచి 524, విశాఖపట్నం నుంచి 113 కంటెయినర్ల సరకును రవాణా చేసింది. బుధవారం లోక్‌సభలో తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుమళ్ల ప్రసాదరావు, లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ ఈమేరకు సమాధానం ఇచ్చారు.

మెట్రో రైల్లో విన్నాను.. నిజమనుకున్నాను!

'షార్ప్ షూటర్ల' కథనంపై 99 టీవీ పాత్రికేయుడు వాసుదేవన్ వెల్లడి

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను హతమార్చేందుకు 200 మంది వరకు షార్ప్ షూటర్లు వచ్చారని 99 టీవీ ఛానల్‌లో కథనం ప్రసారం చేసిన పాత్రికేయుడు పత్రి వాసుదేవన్ గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసుల ఎదుట హాజరయ్యారు. దీంతో సీఐ వంశీధర్ ఆయనకు 41ఎ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు వాసుదేవన్‌ను విచారించారు. జగన్ పర్యటించే ప్రాంతాల్లో 200 మంది షార్ప్ షూటర్లు వచ్చారని, ఆయన పర్యటించే ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తున్నారని గత నెల 20న ఛానల్‌లో ప్రసారం చేశారు. దీనిపై జనసేన నాయకుడు సాయినాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వాసుదేవన్ కోసం గాలిస్తున్నారు. పరారీలో ఉన్న ఆయన బుధవారం పోలీసుల ఎదుట హాజరయ్యారు. హైదరాబాద్‌లోని మెట్రో రైలులో ప్రయాణికులు అనుకుంటుంటే.. అదే నిజమని నమ్మి కథనం చేసి ప్రసారం చేశానని పోలీసుల ప్రశ్నకు బదులిచ్చారు. ఆధారాల్లేకుండా ఆ విధంగా చెప్పడం తప్పేనని అంగీకరించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరు కావాలని పోలీసులు ఆయనకు స్పష్టం చేశారు.

తండ్రీకుమారుల గొడవ..

- అడ్డుకునేందుకు వెళ్లిన ఎస్సై దారుణ హత్య



షణ్ముగవేల్

చెన్నై(అర్కేనగర్), న్యూస్‌టుడే: తండ్రీకుమారుల గొడవను అడ్డుకునేందుకు వెళ్లిన ప్రత్యేక ఎస్సైను దారుణంగా హత్య చేసిన ఘటన తమిళనాడులో చోటు చేసుకొంది. తిరుప్పూర్ జిల్లా కుడిమంగళం సిక్కనూత్తు ప్రాంతంలో మడత్తుకుళం అన్నాడీఎంకే ఎమ్మెల్యే మహేంద్రన్‌కు సొంత తోట ఉంది. అందులో మూర్తి, ఆయన కుమారుడు తంగపాండి పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. ఇద్దరూ మంగళవారం రాత్రి మద్యం మత్తులో గొడవపడ్డారు. తంగపాండి తన తండ్రిని కొట్టాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుడిమంగళం పోలీస్‌స్టేషన్ ప్రత్యేక ఎస్సై షణ్ముగవేల్(57), ఓ కానిస్టేబుల్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరి మధ్య ఘర్షణను ఆపిన షణ్ముగవేల్.. తండ్రీ కుమారులను ఫొటోలు తీసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో అక్కడికొచ్చిన మూర్తి మరో కుమారుడు మణికంఠన్ కత్తితో షణ్ముగవేల్, కానిస్టేబుల్‌ను నరికేశాడు. షణ్ముగవేల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కానిస్టేబుల్‌ను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు మూర్తి, మణికంఠన్‌ను అరెస్టు చేయగా, తంగపాండి కోసం గాలిస్తున్నారు.

'108'కు రూ.6.20 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర అత్యవసర సేవల్లో భాగంగా '108' అంబులెన్సులకు గతంలో సరఫరా చేసిన యంత్రాలు, ఇతర సామగ్రి బిల్లుల బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం రూ.6.20 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు పెంపుపై మంత్రి సవిత హర్షం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అర్హులైన నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు వినియోగ పరిమితిని 200 యూనిట్లకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయించిందని బుధవారం ఓ ప్రకటనలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత వెల్లడించారు. ఎన్నికల్లో వారికిచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

కోనసీమ యువ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: యువతలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునేందుకు 'కోనసీమ యువ సదస్సు' లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ నెల 12న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో నిర్వహించనున్న 'కోనసీమ యవ సదస్సు' పోస్టర్‌ను ఉండవల్లి నివాసంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. కేబినెట్ సమావేశానికి ముందు జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, సవిత, సంధ్యారాణి, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

EENADU Vol: 51, Issue: 359 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

మకరందం

makarandam@eenadu.in
మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్ - 501512

పునర్దర్శన ప్రదాత

విమాన వేంకటేశుడు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఎదురు చూస్తుంటారు భక్తులు. తీరా స్వామివారి వద్దకు చేరుకోగానే తన్మయత్వంతో కళ్లు మూయడమో రద్దీ కారణంగా రెప్పపాటులో ముందుకు కదలాల్సి రావడమో జరుగుతుంటుంది. దీంతో కళ్లారా స్వామిని చూడలేదే అన్న అసంతృప్తి వేధిస్తుంది. కానీ భక్తులకు మరోసారి దర్శనం ఇస్తారు విమాన వేంకటేశ్వరస్వామి. ఆనంద నిలయం విమానంపై వెండి మకరతోరణంతో శ్రీవారి మూలవిరాట్టును పోలిన విగ్రహం ఉంటుంది. ఆయనకు ఇరువైపులా గరుత్మంతుడు, హనుమంతుడి విగ్రహాలు కనిపిస్తాయి. విమానంపై కొలువై ఉన్నందున ఆయన్ను విమాన వేంకటేశ్వరుడిగా పిలుస్తున్నారు. గర్భగుడిలో స్వామివారికి చెప్పుకోలేని కోరికలను ఈయనకు చెప్పుకోవచ్చు. ప్రధాన ఆలయంలో దర్శనం కాకపోయినా విమాన వేంకటేశ్వరుడిని దర్శిస్తే యాత్ర ఫలితం దక్కుతుందట.

★ పూర్వం భక్తులు ముందుగా విమాన వేంకటేశుడినే తొలుత దర్శించుకునేవారట. కాల క్రమేణా పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని మూలమూర్తి దర్శనం తర్వాతే ఈ దర్శనానికి అనుమతిస్తున్నారు. తిరుమల కొండపై ఏకమూర్తి పూజావిధానం ఉండటంతో ఆనంద నిలయంలో జరిగే నైవేద్య కైంకర్యాలన్నీ ఆలయం లోపలి నుంచే విమాన వేంకటేశ్వరస్వామికీ జరుగుతాయి. ఏడాదికోసారి శ్రావణమాసంలో జరిగే పవిత్రోత్సవాల్లో ఈయనకు కూడా పవిత్రమాలలను సమర్పిస్తారు. దీనికోసం అర్చక స్వాములు అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక నిచ్చెనల ద్వారా స్వామి వారి వద్దకు చేరుకుంటారు.

– జె.సత్యనారాయణ, తిరుపతి

గెలుపు కాదు ముఖ్యం

జటాయువు ఓరోజు ఆకాశమార్గాన వెళ్తుండగా... కాస్త దూరంలో ఒక రథం అతివేగంగా దూసుకెళ్తూ కనిపించింది. అందులో క్రోధం నిండిన చూపులతో రావణుడు, కన్నీటిధారలతో సీతమ్మ ఉన్నారు. వెంటనే రథానికి అడ్డునిలిచాడా పక్షిరాజు. 'రావణా, ఆగు! శ్రీరామపత్నిని విడిచిపెట్టు! ఆమెని ఎక్కడికి తీసుకెళ్తున్నావు? పరాయి స్త్రీని చేపట్టడం నీ అవివేకం, ఇది చాలా ప్రమాదకరం' అని హితవుపలికాడు. అయినా రావణుడు ఆ మాటల్ని పట్టించుకోక ముందుకెళ్లాడు. జటాయువు ఎలా అయినా సీతమ్మని రక్షించాలనే తాపత్రయంతో రావణుడితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఒక్క ఉదుటున ఎగిరి రావణుడి వీపుపై వాలి శరీరాన్నంతా చీల్చేశాడు. ఆ చర్యకు రాక్షసరాజైన రావణుడు కోపంతో ఊగిపోయాడు. జటాయువు రెక్కలను నరికి నేలమీదకు విసిరికొట్టాడు. అయినా ఆ పక్షిరాజు శ్రీరాముడు వచ్చేవరకు మృత్యువుతో పోరాడి, రాగానే ఆ రాక్షసుడి దుశ్చర్యలను రామయ్యకు వివరించి, ఆయన చేతుల్లోనే ప్రాణాలు విడిచాడు. ఆ పక్షిరాజు తాను ఓడిపోతానని తెలిసీ ఎంతో ధైర్యంగా భీకర యుద్ధం చేశాడు. 'గెలుపు కాదు ముఖ్యం. ఓటమికి వెరవకుండా ముందుకు వెళ్లడమే ధ్యేయం' అన్నదే జటాయువు మనకు నేర్పే పాఠం.

అష్టలక్ష్మి రూపాలైన ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి ధైర్యలక్ష్మి విజయలక్ష్మి, విద్యాలక్ష్మిగా... వరలక్ష్మీదేవి భక్తులను అనుగ్రహిస్తుంది. తార్కికంగా ఆలోచిస్తే ఈ లక్ష్మీరూపాల ఉపాసన మానవుల చతుర్విధ పురుషార్థాలైన ధర్మ అర్థ కామ మోక్షాలను అందజేయగలదు.


వరలక్ష్మీ నమోస్తుతే

ఆదిలక్ష్మి పౌరాణిక సంపదకు చిహ్నంగా భావించినా ఆధ్యాత్మిక సంపదకు తొలిమెట్టు వంటిది. తన భక్తుల నిత్య అవసరాలకు ధనలక్ష్మి అలంకరిస్తే, వారి పొట్టపొట్టు తీర్చే తల్లి ధాన్యలక్ష్మి. ధర్మపాలనకు, పరిరక్షణకు కొండంత అండగా గజలక్ష్మి నిలిస్తే, పసిపిల్లల రక్షణ, సంరక్షణకు సంతానలక్ష్మి సహకరిస్తుంది. అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యే ప్రపంచంలో సవాళ్లను తట్టుకునే ధైర్యాన్నిచ్చే తల్లి ధైర్యలక్ష్మి కాగా నిస్వార్థ లోకోపకార ప్రయత్నాన్ని నెరవేర్చే చుక్కాని విజయలక్ష్మి. మన తప్పటడుగులను సరిచేసి జ్ఞానవంతులను చేసే తల్లే విద్యాలక్ష్మి.

పై లక్షణాలన్నీ ప్రతి స్త్రీలోనూ ఉండేవే. అవసరాన్ని బట్టి ఆయా పాత్రల్లో ఇమిడిపోవడం మహిళకు సునాయాసం. చారుమతి సహనంతో, సమయస్ఫూర్తితో ప్రవర్తించిన తీరు వరలక్ష్మీదేవిని ముగ్ధురాలిని చేసింది. ఆమెలో సంపూర్ణత్వాన్ని గమనించిన మాత కోరకుండానే కొంగుబంగారమై నిలిచింది.

■ పరమాత్మ ప్రతి అవతారం ఒక లక్ష్యసాధనకు ఉద్దేశించినదే. ఆ లక్ష్యమే వేదమయుగా వరాహ అవతారానికి దారి చూపించింది. సీతగా రావణ సంహారానికి వారధి వేసింది. అలా ఆ లక్ష్య సిద్ధిదాత్రే వరలక్ష్మీమాతగా ఇల నెలవైన పుణ్య శ్రావణ మాసమిది.

■ వ్రతం చేసేవారు ఇంట్లో ఈశాన్య మూల మంటపాన్ని నెలకొల్పాలి. దానిపై ముగ్గు వేసి, అరటి ఆకు పరచి బియ్యం పోయాలి. ఆపై పంచపల్లవాలు పరిచి, ఒక స్వచ్ఛమైన నీటితో నిండిన కలశం ఉంచాలి. దానిపై మామిడి ఆకులను, కొబ్బరిని ఉంచాలి. ప్రాణం, శక్తి, చైతన్యం వంటివన్నీ నీటి ద్వారానే ప్రసారమవుతాయి కాబట్టి కలశ స్థాపనకు వ్రతం ప్రాధాన్యమిచ్చింది. తర్వాత అమ్మవారి రూపాన్ని శక్తి మేర అలంకరించి మంటపంలో ఉంచాలి. అవుపతే దీపాలు, పసుపు లేదా తొమ్మిది తోరాల కంకణాలు, పరమాన్నం, పాయసం, పూర్ణాలు, బూరెలు, మొలకల వంటి నైవేద్యాలను సిద్ధంగా ఉంచుకోవాలి. హరిద్రా గణపతిని, అమ్మవారిని తమ లపాకుపై ఉంచి కలశం వద్ద పూజకు సిద్ధం చేసుకోవాలి. యథా శక్తి ధ్యానావహనాది షోడశోపచార పూజచేసి, వ్రతకథను పఠించాలి.



■ మనసులో ఉన్న కోరికలు నెరవేరాలని వ్రతాలు, నోములు ఆచరిస్తారు. వ్రతం అంటే నియమం. సాధకుడిని మానసికంగా దీక్షకు సన్నద్ధం చేసే సాధనం. పురాణాలు వివిధ రకాల వ్రతాలను సూచించాయి. వాటిని మనసా వాచా కర్మణా ఆచరించినప్పుడే ఆ ఫలితాలు అందుతాయని పెద్దలు పేర్కొంటారు. వాటిలో అత్యుత్తమమైనది వరలక్ష్మీ వ్రతం.

■ పసుపుపచ్చని గడపలతో, ఆకుపచ్చని తోరణాలతో, గలగలమనే గాజుల సవ్వడులతో, ఘల్లుఘల్లుమని అడుగులు వేసే పేరంటాళ్ల రాకపోకలతో కళకళలాడే మాసమే శ్రావణమాసం. సౌభాగ్యలక్ష్మిని ఆహ్వానించటానికి అమ్మ వారి ప్రతిమతోపాటు, తమను తాము లక్ష్మిలా లక్షణంగా అలంకరించుకోని మహిళలు ఉండరంటే అతిశయోక్తి కాదు. కుటుంబ శ్రేయస్సు కోసం, సకల శుభాల కోసం రోజంతా ఉపవాసం ఉంటూ మోముపై చెదరని చిరునవ్వుతో, అమ్మ ప్రతిమపై మీరని ధ్యానంతో వచ్చిన ప్రతి స్త్రీలోనూ అమ్మను దర్శించుకునే అపురూప సందర్భమే వరలక్ష్మీ వ్రతం. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందొచ్చే శుక్రవారం ఆచరించే ఈ వ్రతం లక్ష్మీ నారాయణులు ఇద్దరికీ ప్రీతిపాత్రం.

■ అమ్మవారి పూజ కోసం కనీసం మూడు తోరాలను సిద్ధం చేసుకోవాలి. వీటిలో ఒకటి అమ్మవారికి, ఒకటి పూజ చేసేవారికి, ఒకటి ముత్తయిదువుకు. ఇలా సిద్ధం చేసుకున్న తోరాన్ని నవసూత్రం అని పిలుస్తారు. వీటిలో తొమ్మిది పోగులు, తొమ్మిది ముడులు లేదా పదహారు చొప్పున పోగులు, ముడులు ఉండవచ్చు. సంఖ్య ఏదైనా తోరగ్రంథి పూజ ఇహపర విజయాలను సాధ్యం చేస్తుందని భక్తుల నమ్మకం.


■ వరలక్ష్మీదేవి చారుమతిని, ఆమె పరివారాన్ని అనుగ్రహించిన తీరు మనల్ని ఒకింత ఆశ్చర్యపరచినా, చారుమతిలోని సద్గుణాలు మనం ఆమెను అనుసరించేలా చేయగలవు. ఆ ఐశ్వర్యలక్ష్మీ కరుణాకటాక్షాలు మనందరి మీదా ఉండాలని కోరుకుంటూ... సకలాభీష్ట సిద్ధిరస్తు..!

– పార్నంది అపర్ణ

నష్టాలకు సిద్ధపడాలి

లోకంలో ఎవరికైనా ఏదైనా నష్టం కలగడం సహజమే. అప్పుడు చాలా బాధపడతాం. కానీ ఆ బాధ వల్ల మనసులో ఆనందం మాయమై దుఃఖం చేరుతుంది. నష్టాలకు దుఃఖించడం తగదు అంటాడు బుద్ధుడు.

విశాఖ బుద్ధుని అనుచరుల్లో ముఖ్యురాలు. నిత్యం విహారను దర్శించేది. ఎప్పుడు వచ్చినా తన ఆభరణాలన్నీ సేవకురాలికి ఇచ్చి విహార బయటే భద్రపరచమని చెప్పేది. ఇంటికి వెళ్లేటప్పుడు తిరిగి తీసుకువెళ్లేది. ఒకసారి అలా బయట ఉంచిన ఆభరణాలను విశాఖ సేవకురాలు తీసుకెళ్లడం మర్చిపోయింది. విహారలోనే ఉన్న ఆ నగలను మరో అనుచరుడు ఆనందుడు చూసి భద్రపరిచాడు. తన బంగారాన్ని విహారలో మరచిపోయినట్టు గుర్తించిన విశాఖ.. బుద్ధుని వద్దకు వెళ్లింది. 'నా చేజారిన నగలను విహారకే దానం ఇవ్వాలి. ఏం చేయమంటారు?' అని ప్రశ్నించింది. అది విన్న బుద్ధ భగవానుడు ఆ నగలు విక్రయించగా వచ్చే డబ్బుతో మరో విహార నిర్మిస్తే మరింత మందికి ఆశ్రయం లభిస్తుందని చెప్పడంతో విశాఖ అలాగే చేసింది. మరచిపోయిన ఆభరణాలు తనవి కాదు అనుకుంది కాబట్టే విశాఖ విచారించలేదు. జీవితంలో ఎప్పుడైనా ఎలా అయినా నష్టం జరగవచ్చు. దాన్ని తట్టుకుని నిలబడితే నిరాశకు చోటుండదు.



ప్రేమాభిమానాల పౌర్ణమి

ఆగస్టు 9 రాఖీ పండుగ

రాఖీపౌర్ణమి - రక్షాబంధన్ అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పూర్ణిమ అనీ అంటారు. తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీకి.. మన పురాణేతిహాసాల్లో చక్కని ప్రాధాన్యం ఉంది.

శిశుపాలుడిని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన శ్రీకృష్ణుడి చూపుడు వేలికి గాయమై రక్తం ధారగా కారుతుంది. అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి కృష్ణుడి వేలికి కట్టు కడుతుంది. దాంతో శ్రీకృష్ణుడు దానికి కృతజ్ఞతగా ద్రౌపదికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇస్తాడు. అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుంచి కాపాడతాడు.

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం జరిగింది. అందులో ఓడిపోయిన దేవేంద్రుడు నిర్వీర్యుడై, తన పరివారంతో అమరావతిలో తల దాచుకుంటాడు. రాక్షసరాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకొని భర్త నిస్సహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. సరిగ్గా శ్రావణ పౌర్ణమి రోజున పార్వతీ పరమేశ్వరులను, లక్ష్మీనారాయణులను పూజించి... దేవేంద్రుడి చేతికి రక్ష కడుతుంది. అది గమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి సమరానికి పంపుతారు. ఆ యుద్ధంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. అలాగే బలి చక్రవర్తి కోరిక మేరకు శ్రీమహావిష్ణువు అతనితోపాటు పాతాళంలో ఉండిపోతాడు. లక్ష్మి వెళ్లి బలిచక్రవర్తికి రక్షా బంధనం కట్టి, తన భర్తను వైకుంఠానికి తీసుకొస్తుంది. ఆ రక్షాబంధనమే నేడు రాఖీ పండుగగా మారిందని పురాణాలు చెబుతున్నాయి.



బిడ్డలు కలిసిమెలిసి ఉండాలి, అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లకు రక్షగా నిలవాలి. ఆడపడుచులు ప్రేమానుబంధాలు నిలపాలనే ఆశలతో చేసుకునేదే ఈ పండుగ.

దురాశతోనే చేటు



కష్టపడి సంపాదించడం, ఉన్నదాంట్లో తృప్తిగా జీవించడాన్ని మాత్రమే బైబిల్ ప్రోత్సహిస్తుంది తప్ప డబ్బు మీద వ్యామోహాన్ని హర్షించదు. న్యాయమైన మార్గాల్లో ఆర్జించడం తప్పు కాదు కానీ, దురాశ దుఃఖానికి చేటు అన్నది వాక్యం. అన్యాయంగా సంపాదించిన కోట్లకంటే సామర్థ్యం కొద్దీ న్యాయంగా ఆర్జించిన రూపాయలే ప్రశాంతతను, తృప్తినీ ఇవ్వగలవు. ఇతరుల సొమ్ము కోసం ఆశపడటాన్ని బైబిల్ ఉపేక్షించదు. లోకంలో జరిగే దురాగతాలకు డబ్బు మీద వ్యామోహమే కారణంగా కనబడుతుంది. అందుకే విపరీతమైన ఆకాంక్ష, దురాశలు మనిషికి పనికిరావు. ఈ భూమ్మీద నివసించే కొద్దికాలంలో.. నలుగురికీ మంచి చేసి సంతృప్తిగా జీవించాలి. అటువంటి జీవన శైలి ఉన్నవారు అందరికీ ఆదర్శంగా నిలవగలరు.

నమాజ్.. ఓ సమగ్ర ఆరాధన

ఇస్లాం సందేశం

ఇస్లాం అనే ఆధ్యాత్మిక సౌధం ఐదు మూలస్తంభాలపై నిర్మితమైంది. అవి షహాదా (విశ్వాస ప్రకటన), సలాహ్ (ప్రార్థన), జకాత్ (విధిగా దానం), సామ్ (ఉపవాసం), హజ్ (మక్కా యాత్ర). ప్రతి ముస్లింను అల్లాహ్‌కు చేరువ చేసే ప్రధాన మార్గాలివి. వీటిల్లో రెండోదైన నమాజ్ అత్యంత విశిష్టమైన దైవారాధన విధానం. రోజుకు ఐదుసార్లు విధిగా ఆచరించే నమాజ్ అల్లాహ్‌తో ప్రత్యక్ష బంధం బలోపేతానికి ఉపకరించే సాధనం. ఆధ్యాత్మికంగా సుసంపన్నం చేసే, మనసును శుద్ధిచేసే ఈ ప్రక్రియ రోజువారీ జీవితంలో అల్లాహ్ ఉనికిని, ఆయన ఆజ్ఞలను నిరంతరం గుర్తుచేస్తూ ఉంటుంది. విభిన్న శారీరక భంగిమలు, దైవారాధనతో కూడిన నమాజ్ బహుళ ప్రయోజనకారి. సలాహ్ చెడు ప్రభావాలు, ప్రలోభాలను ఒక కవచంలా నిలువరిస్తుంది. రోజూ నిర్దిష్ట సమయాల్లో నమాజ్‌ను ఆచరించడంతో క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ అలవడతాయి. దైనందిన జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడిని, ఆందోళనను తగ్గించటానికి.. మొత్తంగా ఆరోగ్యం మెరుగవటానికి దోహదపడుతుంది.




మసీదుల్లో సమష్టిగా నమాజ్ ఆచరించటం సామాజిక బంధాలను, ఐక్యతను పెంపొందిస్తుంది. అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకోవటానికి నమాజ్‌ను మించింది లేదని ప్రవక్త ముహమ్మద్ (స) పలు సందర్భాల్లో ప్రస్తావించారు. దీనిలో భాగమైన సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేసే సమయంలో అల్లాహ్‌కు అత్యంత సన్నిహితమవుతారని ప్రత్యేకంగా ప్రవచించారు. ఇది గుండె, మెదడు పనితీరుపై పలు సానుకూల ప్రభావాలను చూపుతుందని కొన్ని అధ్యయనాల్లోనూ వెల్లడైందని యూఎస్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పేర్కొంటోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. నమాజ్ కేవలం ఒక మతాచారం కాదు. ఇస్లాంను చిత్తశుద్ధితో ఆచరించే ముస్లింల జీవితాలను తీర్చిదిద్దే.. వారి శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సులను పెంపొందించే సమగ్ర ఆరాధన మార్గం.

నీతి దీపం

చంద్రగుప్తమౌర్యుడి రాజ్య సలహాదారుడు, అర్థశాస్త్ర రచయిత అయిన చాణక్యుడిని కలవడానికి ఓసారి ఒక గ్రీకు రాయబారి వెళ్లాడు. చాణక్యుడు ఓ పూరిగుడిసెలో ఉండటం చూసి 'ఇంతటి గొప్పవాడు ఈ సాధారణ గుడిసెలో ఎలా ఉంటున్నాడు?' అనుకుని ఆశ్చర్యపోయాడు. ఆ ఇంట్లో ఓ దీపం వెలుగులో ముఖ్యమైన కాగితాలు చూస్తూ ఉన్నాడు చాణక్యుడు. ఆ రాయబారిని చూసిన వెంటనే... ఉన్న దీపం ఆర్పేసి మరో దీపం వెలిగించాడు. 'రండి, కూర్చోండి. మీరెవరు? ఏ పని మీద వచ్చారు?' అని ప్రశ్నించాడు. అప్పుడా గ్రీకు రాయబారి 'అయ్యా! అది చెబుతా కానీ ముందు నా సందేహం తీర్చండి. ముందున్న దీపాన్ని ఆర్పేసి మరో దీపం ఎందుకు వెలిగించారు?' అని అడిగాడు. దానికి చాణక్యుడు... 'నేను దేశం కోసం చేసే పనులకు సంబంధించి ఆ దీపం వెలుగులో చేస్తాను. దాని నూనె ఖర్చులను రాజుగారు భరిస్తారు. ప్రస్తుతం మీరు నాతో సొంత విషయాలు మాట్లాడటానికి వచ్చారు. అందువల్ల ఆ దీపం ఆర్పేసి ఇది వెలిగించాను. దీనికయ్యే నూనె నా జీతం డబ్బులతో కొన్నాను' అని బదులిచ్చాడు. ఆ సమాధానం విన్న రాయబారి చాణక్యుడి నిజాయతీ చూసి ఆశ్చర్యపోయాడు.

ఏది పాఠం?



కురుపాండవులు ద్రోణాశ్రమంలో విద్య నభ్యసిస్తున్నారు. అనుకోకుండా ఓసారి ద్రోణాచార్యుడు కొన్ని రోజులు ఆశ్రమం విడిచి వెళ్లాల్సి వచ్చింది. తాను తిరిగి వచ్చేలోపు కొన్ని పాఠాలను అప్పజెప్పాలని శిష్యులకు చెప్పి బయలుదేరాడు. ద్రోణుడు తిరిగి రాగానే ఒక్క ధర్మరాజు తప్ప మిగతా శిష్యులంతా చదివింది అప్పజెప్పారు. ధర్మరాజు మాత్రం కేవలం ఒక్క వాక్యాన్ని మాత్రమే చదివానని చెప్పాడు. అది విన్న ద్రోణుడు ఆగ్రహంతో.. 'ఏమిటి? ఇన్ని రోజుల్లో కేవలం ఒక్క వాక్యాన్నే చదివావా? నీకు గురువంటే గౌరవం లేదా?' అని గద్దించాడు. దాంతో ధర్మరాజు... 'గురువర్యా... మీరు విన్నది నిజమే! ఒక్క వాక్యమే చదవగలిగాను. ఆ విషయాన్నే నెమ్మదిగా నేను అలవర్చుకుని అందరికీ నేర్పించాలని ప్రయత్నిస్తున్నాను' అని బదులిచ్చాడు. అది విన్నాక ద్రోణుడికి ఇంకాస్త కోపం ఎక్కువై ధర్మరాజుకు శిక్ష విధించాడు. అయినప్పటికీ ధర్మరాజు శాంతంగా ఉండటం చూసిన అతడు ఆశ్చర్యపోయి నెమ్మదిగా... 'శిష్యా! అసలు నువ్వు చదివిన ఆ వాక్యం ఏమిటి' అని ప్రశ్నించాడు. దాంతో ధర్మరాజు ఆ పుస్తకం తీసుకొచ్చి 'ఎలాంటి పరిస్థితుల్లోనైనా కోపం తెచ్చుకోకూడదు' అన్న వాక్యం చూపించాడు. అది చూసిన ద్రోణుడికి జరిగిన పొరపాటు అర్థమైంది. 'శిష్యా! ఈ రోజు నాకు ఓ పెద్ద పాఠం తెలియజెప్పావు. ఎంత చదివామన్నది ముఖ్యం కాదు, ఏం నేర్చుకున్నామన్నదే ప్రధానం' అంటూ ధర్మరాజును మెచ్చుకున్నాడు.

తెర తీయవేమి?

గీతగోవిందం

దైవ దర్శనానికి వెళ్లినప్పుడు ఇహ లోక సంబంధమైన కోర్కెలను, క్షణిక సుఖాలను కాదు కోరాల్సింది. ఆ స్వామిని మరేం కోరుకోవాలో తెలియచెప్పే కృతి ఇది. మనసును కమ్మిన తెరలను, కళ్లను కప్పిన పొరలను, బుద్ధిని బలహీనం చేసిన భ్రమలను తొలగించమని కోరుకోవాలనేది దీని అంతరార్థం.

త్యాగరాజ స్వామి జీవిత చరిత్రలో మరపురాని ఓ దివ్య సంఘటన మానవాళికి సుకృతాన్ని అందించేందుకా అన్నట్టు జరిగింది. ఒకనాడు ఆయన తిరుమల స్వామి దర్శనానికి వెళ్లాడు. అప్పుడే నివేదన సమయం కావడంతో అర్చకులు తెరవేశారు. త్యాగరాజ స్వామికి, తిరుపతి వేంకటరమణుడికి నడుమ తెర నిలిచింది. అప్పుడే ఆ వాగ్గేయకారుడి మదిలో గౌళిపంతు రాగం ఆదితాళంలో ఈ కృతి మెదిలింది.

తెరతీయగ రాదా లోని
తిరుపతి వెంకట రమణ మత్సరమను
పరమపురుష ధర్మాదిమోక్షముల
పారదోలుచున్నది నాలోని
మత్స్యము ఆకలిగొని గాలముచే
మగ్నమైనరీతి యున్నది
అచ్చమైన దీప సన్నిధిని మరు
గిడబడి చెఱిచినట్లున్నది
మరుగడ్డబడి చెరచినట్టున్నది
ఇరవొందగ భుజియించు సమయమున
ఈగ తగులురీతి యున్నది
హరిధ్యానము సేయువేళ
చిత్తము పోయినట్టున్నది
వాగురయని తెలియక మృగ గణములు
వచ్చి తగులురీతి యున్నది
వేగమే నీ మతము ననుసరించిన
త్యాగరాజనుత! మదమత్సరమను
తెరతీయగ రాదా...

● 'ఓ వేంకటరమణ తెరతీయలేవా, నీ దర్శనం కలిగించలేవా...' అన్నట్లు పల్లవిలో పైకి కనిపించినా లోతైన తాత్త్విక చింతనతో ముందుకు సాగుతుంది. పదాన్ని విరిచి 'నాలోని వేంకటరమణ' అని చదువుకుంటే తన లోని పరమాత్మ స్వరూపుడైన జీవాత్మతో త్యాగయ్య విన్నవిస్తున్నట్లు అర్థమవుతుంది. అనుపల్లవిలో 'ఓ పురుషోత్తమా, నాలో కామ క్రోధ లోభ మోహ మద మత్సరాలనే అరిషడ్వర్గం చేరి ఉంది. దానిలోని మత్సరం అనే తెరను తీసెయ్యవయ్యా' అనే విన్నపం కనిపిస్తుంది.

● మొదటి చరణంలో చేప కాలం సమీపించి గాలానికి చిక్కినట్టు, జ్ఞాన దీప కాంతులు మరుగునపడి అజ్ఞాన అంధకారం అలముకున్నట్టు... తన పరిస్థితి స్థిమితం లేకుండా ఉందని, దీనికి కారణమైన మత్సరమనే తెరను తీసెయ్యొచ్చు కదా స్వామి అని వేడుకొంటున్నాడు త్యాగ బ్రహ్మ.

● రెండో చరణంలో స్వామిని దర్శించేందుకు తనకు కలుగుతున్న అవరోధాలను మరింత కవితాత్మకంగా వెళ్లబోసుకున్నాడు. 'ఆకలిగొని భోజనం చేసే సమయంలో అన్నంలో ఈగ పడినట్టు, హరిధ్యానం చేసేటప్పుడు మన సెక్కడెక్కడో తిరుగాడుతున్నట్లు ఉంది' అని బాధపడ్డాడు.

● మూడో చరణాన మరింత చక్కని పదప్రయోగం చూడవచ్చు. నీవు చూపిన ధర్మమార్గంలోనే నడవాలనుకుంటున్నాను. అందుకైనా ఈ కష్టాల నుంచి వేగంగా నన్ను బయటపడేయడానికి, నీ దర్శనభాగ్యం కలగటానికి తెరతీయొచ్చు కదా' అంటూ వేడుకున్నాడు.



–ప్రొ.యల్లాప్రగడ మల్లికార్జునరావు, గుంటూరు

ఈనాడు సినిమా

సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎట్టుంటదో సూద్దురు!

"పది మంది బతుకుల్ని నాశనం చేసే బతుకు బతుకేనా" అని ప్రశ్నిస్తోంది నటి అనుష్క. ఇప్పుడామె ప్రధాన పాత్రధారిగా క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన చిత్రం 'ఘాటి'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి సంయుక్తంగా నిర్మించారు. విక్రమ్ ప్రభు, జగపతిబాబు, చైతన్యరావు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా సెప్టెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే బుధవారం ఈ చిత్ర ట్రైలర్ను విడుదల చేశారు. "ఈ మాటల్లో మాటలు ఉంటారు సర్. బ్రిటిష్ కాలంలో కొండలు బద్దలు కొట్టి రక్తంతో రోడ్లు వేసేవాళ్లు. ఇప్పుడు గంజాయి మోసే కంచర గాడిదలు" అంటూ ఓ వ్యక్తి చెప్పే వాయిస్ ఓవర్తో మొదలైన ట్రైలర్.. ఈ చిత్ర కథ, పాత్రలపై ఓ స్పష్టత ఇచ్చింది. ఆంధ్రా - ఒడిశా సరిహద్దుల్లో జరిగే కథ ఇది. అనుష్క, విక్రమ్ ప్రభు గంజాయి స్మగ్లింగ్ చేసే పాత్రలుగా కనిపించారు. వాళ్లు తాము చేస్తున్న పని తప్పని తెలుసుకుని ఆ నేర వృత్తి నుంచి బయటకొచ్చాక.. గంజాయి మాఫియా నడిపించే వ్యవస్థపై తిరుగుబాటుకు సిద్ధపడినప్పుడు ఏం జరిగింది? వాళ్లకు ఎదురైన సవాళ్లేంటి? అన్నది ప్రచార చిత్రంలో ఆసక్తికరంగా చూపించారు. అనుష్క ఇందులో యాక్షన్ కోణంలో సాగే శక్తిమంతమైన పాత్రలో అలరించనుంది. "సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎట్టుంటదో సూద్దురుగాని" అంటూ ట్రైలర్ ఆఖర్లో వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సాగర్ నాగవెల్లి సంగీతమందించారు.



సాబ్...

రెండో భాగం ఉంది



ప్రభాస్ చిత్రమంటే రెండు భాగాలు పక్కా.. అనేది పరిపాటిగా మారిపోయింది. ఇప్పటికే ఆయన 'కల్కి 2', 'సలార్ 2' సినిమాలు చేయాల్సి ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'ది రాజాసాబ్'కి కూడా రెండో భాగమున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. తాజాగా దీనిపై చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ స్పష్టత ఇచ్చారు. 'రాజాసాబ్ 2' ఉంటుందని.. కాకపోతే ఇది తొలి భాగానికి కొనసాగింపులా ఉండదని.. థీమ్, సెటప్ ఒకే తరహాలో ఉంటాయని విశ్వప్రసాద్ చెప్పారు. అనంతరం విడుదల తేదీ విషయమై స్పందిస్తూ.. ప్రభాస్ అభిమానులు, తెలుగు మార్కెట్ వర్గాలు ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న తీసుకు రావాలని కోరుతున్నారని.. హిందీ ప్రేక్షకులు మాత్రం డిసెంబరు 5న విడుదల చేయాలని కోరుతున్నారని చెప్పారు. ఏదేమైనా తాము అనుకున్న తేదీకే సినిమాని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అక్టోబరు నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తి కానుందని విశ్వప్రసాద్ తెలియజేశారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా.. సంజయ్ దత్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

నా మంచితనమే వాటికి సమాధానం

– చిరంజీవి



చుక్కపల్లి సురేశ్, తేజ సజ్జా, చిరంజీవి, సంయుక్తా మేనన్

సామాజిక మాధ్యమాల్లో వచ్చే విమర్శలపై తాను మాట్లాడకపోయినా తాను చేసిన మంచే మాట్లాడుతుందని కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఫీనిక్స్ ఫౌండేషన్, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ భాగస్వామ్యంలో బుధవారం హైదరాబాద్లో బ్లడ్ డొనేషన్ డ్రైవ్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చిరంజీవి, తేజ సజ్జా, సంయుక్తా మేనన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరు రక్తదానం చేసిన వాళ్లందరికీ ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం పేరు చెప్పగానే తాను గుర్తొస్తున్నానంటే అది తన పూర్వజన్మ పుణ్యమన్నారు. ఓ జర్నలిస్ట్ రాసిన ఆర్టికల్ వల్లే తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన వచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే తనపై విమర్శలు చేసిన ఓ రాజకీయ నాయకుడి గురించి ప్రస్తావించారు. "నేను రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నా. ఈ మధ్య ఓ నాయకుడు నన్ను అకారణంగా మాటలన్నాడు. ఆ తర్వాత ఆయన ఓ ప్రాంతానికి వెళ్తే ఓ మహిళ ఆయనకు ఎదురు తిరిగింది. 'చిరంజీవిని అన్నన్ని మాటలనాలని మీకెందుకు అనిపించింద'ని భావోద్వేగానికి గురైంది. ఆ తర్వాత ఆమె వివరాలు కనుక్కున్నా. ఒకప్పుడు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే గౌరవమని తెలిపింది. ఆ మాటలు విని నా మది ఉప్పొంగింది. నేను చేసే మంచి పనులు, నాపై చూపే అభిమానుల ప్రేమే నా రక్షణ కవచాలు. నన్ను విమర్శించే వాళ్లకు నేను సమాధానమివ్వాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. నాలా మంచి పనులు చేసే తమ్ముళ్లకు నేనెప్పుడూ సాయంగా ఉంటాను" అని చిరంజీవి చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో తేజ సజ్జా కూడా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన రక్తాన్ని భారత ఆర్మీకి అందివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఫీనిక్స్ గ్రూప్ ఛైర్మన్ చుక్కపల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణతో నిర్మాతల భేటీ

తెలుగు సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్ మధ్య జరుగుతున్న చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్లోని ప్రసాద్ ప్రివ్యూ థియేటర్ వద్ద కథానాయకుడు నందమూరి బాలకృష్ణతో పలువురు నిర్మాతలు బుధవారం భేటీ అయ్యారు. చిత్ర పరిశ్రమలో నెలకొన్న తాజా పరిణామాల్ని ఆయనకు వివరించారు. అనంతరం బాలకృష్ణ స్పందనను టి.ప్రసన్న కుమార్ మీడియాకు వెల్లడించారు. "నిర్మాతలు బాగుండాలని బాలకృష్ణ ఎప్పుడూ చెప్తారు. ఆ విషయాన్ని మరోసారి గుర్తు చేశారు. పని రోజులు ఎంత తక్కువైతే అంత మంచిదన్నారు. అవసరం మేరకే కార్మికుల్ని తీసుకోవాలని సూచించారు. అటు నిర్మాతలు, ఇటు కార్మికులు.. అందరూ బాగుండేలా తాను చూసుకుంటానన్నారు. థియేటర్ల సమస్యను దృష్టిలో పెట్టుకుని ఏడాదికి నాలుగు సినిమాల్లో నటిస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నార"ని తెలిపారు. బాలయ్యతో జరిగిన భేటీలో మైత్రీ రవిశంకర్, చెరుకూరి సుధాకర్, దామోదర్ ప్రసాద్, ప్రసన్న కుమార్, భరత్ భూషణ్ సహా పలువురు నిర్మాతలు పాల్గొన్నారు.

ఆ నాలుగు ప్రతిపాదనలపై ఫిల్మ్ ఛాంబర్తో చర్చిస్తాం: ఫిల్మ్ ఫెడరేషన్


సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంపై తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు 24విభాగాల కార్మిక సంఘాల నేతలతో బుధవారం సాయంత్రం అత్యవసర సమావేశమై చర్చించారు. కాల్ షీట్ వేళల్లో మార్పులు, నాన్ మెంబర్స్ను తీసుకోవడం, ఆదివారం సింగిల్ కాల్షీట్, ఫైటర్లు - డ్యాన్సర్లను తీసుకోవడంలో రేషియో అంశాలపై ఫిల్మ్ ఫెడరేషన్కు నిర్మాతల మండలి చేసిన ప్రతిపాదనలపై చర్చించారు. నిర్మాతలు చేసిన ఈ నాలుగు ప్రతిపాదనలపై ఈరోజు ఫిల్మ్ ఛాంబర్ను సంప్రదించి.. చర్చలు జరపాలని ఫెడరేషన్ నాయకులు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 3గం.లకు తెలంగాణ ఎఫ్డీసీ ఛైర్మన్ దిల్రాజుతో సమావేశం కానున్నారు. అలాగే తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డినీ కలవాలని ఫెడరేషన్ నాయకులు నిర్ణయించారు. 30 శాతం వేతనాల పెంపు, ఏరోజుకు ఆరోజు చెల్లింపునకు అంగీకరిస్తేనే చిత్రీకరణలకు హాజరవుతామనే తమ డిమాండ్కు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఈ సమస్యకు ఈరోజుతో సామరస్యపూర్వక పరిష్కారం సాధించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

మరో కథ విన్నారా?



కథానాయకుడు రవితేజ త్వరలో 'మాస్ జాతర'తో థియేటర్లలో సందడి చేయనున్నారు. మరోవైపు కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. దీంతో పాటు 'మ్యాడ్' ఫేమ్ కల్యాణ్ శంకర్ చెప్పిన కథకు పచ్చజెండా ఊపినట్లు వార్తలొచ్చాయి. కాగా, ఇప్పుడాయన మరో ప్రాజెక్ట్ విషయమై కన్నడ దర్శకుడు ఎ.పి.అర్జున్తో చర్చలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కథాలోచన నచ్చడంతో దీనిపై రవితేజ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఓ ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్ను నిర్మించే అవకాశముంది. దర్శకుడు అర్జున్ కన్నడలో 'అద్దూరి' చిత్రంతో విజయాన్ని అందుకున్నారు. గతేడాది 'మార్టిన్' అనే సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించారు.

తాజా కబురు



అమరన్ దర్శకుడితో కార్తిక్ ఆర్యన్?

గతేడాది 'అమరన్'తో ఓ సరికొత్త ప్రేమకథను తెరపై ఆవిష్కరించి ప్రేక్షకుల మనసుల్ని కదిలించారు దర్శకుడు రాజ్కుమార్ పెరియసామి. ప్రస్తుతం ధనుష్తో కలిసి 'డీ 55'తో బిజీగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఆయన బాలీవుడ్లోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు దీని గురించి మరో వార్త నెట్టింట్లో సందడి చేస్తోంది. హిందీ హీరో కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో రాజ్కుమార్ ఓ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. దీన్ని టీ-సిరీస్ నిర్మించనుందట. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ ప్రాజెక్టులో అక్షయ్ ఖన్నా మరో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఈ చిత్రాన్ని పట్టాలెక్కించనున్నట్లు కార్తిక్ ఆర్యన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన శ్రీలీలతో కలిసి ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నారు.

అమ్మాయిల్ని అమ్మోరులా పెంచాలి



శశిధర్, అనూప్, కృష్ణచైతన్య, చందూ మొండేటి, శివ నిర్వాణ

'30రోజుల్లో ప్రేమించటం ఎలా' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన దర్శకుడు మున్నా. ఇప్పుడాయన రెండో ప్రయత్నంగా 'బ్యాడ్ గాళ్స్' అనే సినిమాని ప్రకటించారు. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ మోషన్ పోస్టర్ను దర్శకులు చందూ మొండేటి, శివ నిర్వాణ, కృష్ణచైతన్య, అనూప్ బుధవారం హైదరాబాద్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మున్నా మాట్లాడుతూ.. "అమ్మాయిల్ని తల్లిదండ్రులు భయంతో పెంచుతారు. కానీ, వాళ్లను భయంతో కాకుండా ధైర్యంతో పెంచాలని చెప్పే కథ ఇది. అమ్మాయిల్ని అమ్మోరులా పెంచాలనే సందేశాన్నిస్తుంది. రేణూ దేశాయ్ ఇందులో ఓ మంచి పాత్ర పోషించారు" అన్నారు.

వేటాడే 'అంధేరా'



'అంధేరా'

వైవిధ్యమైన చిత్రాలు, సిరీస్లతో ప్రేక్షకుల్ని థ్రిల్ చేస్తున్న ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో.. ఇప్పుడు మరో కొత్త కథను సినీప్రియులకు పరిచయం చేయడానికి సిద్ధమైంది. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో రూపొందిన సిరీస్ 'అంధేరా'. ప్రియా బాపట్, కరణ్వీర్ మల్హోత్రా, ప్రజక్తా కోలి, సుర్వీన్ చావ్లా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్కు రాఘవ్ ధర్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సిరీస్ విడుదలను అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్స్టా వేదికగా ఫస్ట్లుక్ను పంచుకుంది ఓటీటీ సంస్థ. "మీరు కొంచెం ధైర్యంగా ఉండండి. ఎందుకంటే ఈ 'అంధేరా' కేవలం వెంటాడదు.. వేటాడుతుంది. ఈ నెల 14న రాబోతుంద"నే వ్యాఖ్యల్ని జోడించింది. ఈ సూపర్ నేచురల్ హారర్ సిరీస్ను ఎక్సెల్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా నిర్మించారు.

న్యాయపరమైన చర్యలకు సిద్ధమైన 'రాంఝనా' బృందం



ధనుష్ హీరోగా ఆనంద్ ఎల్ రాయ్ తెరకెక్కించిన చిత్రం 'రాంఝనా'. 2013లో విడుదలైన ఈ రొమాంటిక్ డ్రామా చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా క్లైమాక్స్ విషాదకరంగా ముగుస్తుంది. ఇటీవల రీరిలీజ్ చేసిన ఈ సినిమా తమిళ వెర్షన్ క్లైమాక్స్లో ధనుష్ చనిపోతే.. అతడిని ఏఐతో బతికించారు మేకర్స్. ఆ విధంగా క్లైమాక్స్ను మార్చి రీరిలీజ్ చేయడంతో చిత్ర దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్తో పాటు ధనుష్ దీనిపై స్పందించారు. అంతేకాదు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ దీనిని ఖండించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆనంద్ ఎల్ రాయ్ మాట్లాడుతూ చట్టపరమైన చర్యలకు సిద్ధమైనట్లు తెలిపారు. క్లైమాక్స్ను మార్చడం తనను ఎంతగానో బాధించిందని దర్శకుడు ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు ఇండస్ట్రీకి ప్రమాదకరమని అన్నారు. "నా ఇతర చిత్రాల గురించి కూడా ఆందోళన చెందుతున్నాను. ఈ విషయంలో ధనుష్ కూడా కలత చెందారు. ఇలాంటి అదనపు మార్పులు చేయడం మా సృజనాత్మకతను దెబ్బతీసినట్లే అవుతుంది. దీనిపై న్యాయపరమైన చర్యలకు సిద్ధమవుతున్నాం"అని ఆనంద్ పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేసిన ఇరోస్ ఇంటర్నేషనల్ తమిళ్ వెర్షన్ను ఈ నెల 1న విడుదల చేసింది. సినిమాలో విషాదకరమైన ముగింపుని.. ఏఐ సహాయంతో సంతోషకరంగా మార్చి రీరిలీజ్ చేశారు. దీనిపై ఇరోస్ ఇంటర్నేషనల్ సంస్థ స్పందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ సాయంతో క్లైమాక్స్ మార్పు గురించి తమ ప్రతినిధి ధనుష్ టీమ్ను నేరుగా సంప్రదించిందని అయితే విడుదలకు ముందు వారు అభ్యంతరం తెలపలేదని పేర్కొంది.

బ్రిటిషర్లపై ఓ రెబల్ పోరు



బ్రిటిష్ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసేందుకు 'డేవిడ్ రెడ్డి'గా తెరపైకి రానున్నారు మంచు మనోజ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని హనుమ రెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్నారు. మోతుకూరి భరత్, నల్లగంగుల వెంకట్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మనోజ్ చిత్రసీమలోకి వచ్చి బుధవారంతో 21ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ కొత్త సినిమాని అధికారికంగా ప్రకటించారు. టైటిల్ పోస్టర్ను విడుదల చేశారు. "మద్రాస్లో పుట్టాడు. దిల్లీలో పెరిగాడు. ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వణికిస్తున్నాడు" అంటూ పోస్టర్పై ఉన్న వాక్యం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. "కుల వ్యవస్థ ఒత్తిడుల నుంచి తిరగబడి, బ్రిటిష్ సామ్రాజ్యంపై పోరుకు సిద్ధమైన ఓ రెబల్ కథ ఇది. సినిమా బలమైన భావోద్వేగాలతో.. రా రస్టిక్గా ఉండనుంది. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

మణిరత్నం ప్రేమకథలో రుక్మిణి?



ఇటీవల విడుదలైన 'థగ్ లైఫ్' సినిమాతో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు ప్రముఖ దర్శకుడు మణిరత్నం. ప్రేమకథలకు కేరాఫ్ అడ్రస్గా నిలిచిన ఆయన.. ఇప్పుడు తన రాబోయే ప్రాజెక్టు కోసం మళ్లీ అదే బాటలో అడుగులు వేయబోతున్నట్లు తెలుస్తోంది. తమిళ యువ హీరో ధ్రువ్ విక్రమ్, అందాల తార రుక్మిణీ వసంత్ జంటగా మణిరత్నం ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు సమాచారం. "ప్రేమ, పోరాటం, కుటుంబ సంప్రదాయాలను మిళితం చేసే ఓ ప్రత్యేకమైన కథతో ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమయ్యారు దర్శకుడు మణిరత్నం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నవంబరులో చిత్రీకరణను మొదలు పెట్టాలని నిర్ణయించుకుంది చిత్రబృందం. ఈ రొమాంటిక్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతమందించనున్నారు. తొలిసారి కలిసి నటిస్తున్న రుక్మిణి, ధ్రువ్ల జంట సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఈ మధ్యకాలంలో మణిరత్నం నుంచి వచ్చిన సినిమాలన్నింటికీ పూర్తి భిన్నంగా ఈ ప్రాజెక్టు ఉండనుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

హీరో అయితే అవకాశాలు తగ్గుతాయనే భయం లేదు



"హాస్యనటులుగా ఉన్న నాలాంటి వాళ్లు హీరో పాత్రలు చేస్తే ప్రేక్షకులు రెట్టింపు వినోదాన్ని కోరుకుంటారు. అందుకే ఆ తరహా సినిమాలే చేస్తాను" అన్నారు నటుడు ప్రవీణ్. ఇప్పుడాయన తొలిసారి హీరోగా నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్జే శివ తెరకెక్కించారు. వైవా హర్ష టైటిల్ పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ప్రవీణ్ బుధవారం హైదరాబాద్లో విలేకర్లతో మాట్లాడుతూ.. "హంగర్ కామెడీ థ్రిల్లర్ అనే కొత్త జానర్తో రూపొందిన చిత్రమిది. హారర్, థ్రిల్తో పాటు ఆధ్యాత్మిక అంశాలు మిళితమై ఉంటాయి. ఓ తిండిబోతు దెయ్యం జీవితంలోకి వస్తే అది పెట్టే ఇబ్బందుల్ని వినోదాత్మకంగా, భావోద్వేగభరితంగా చూపించే ప్రయత్నం చేశాం. ఇది తప్పకుండా అందరికీ నచ్చేలాగే ఉంటుంది. ఈ సినిమా ప్రధానంగా ఐదు పాత్రల చుట్టూనే తిరుగుతుంది. నేనిందులో కథను నడిపించే పరమేశ్ పాత్రలో కనిపిస్తాను. నా పాత్రలో వినోదంతో పాటు బలమైన భావోద్వేగాలు కూడా ఉంటాయి. మన జీవితంలో నుంచి ఓ మంచి మిత్రుడు అనివార్య కారణాల వల్ల వెళ్లిపోవాల్సి వస్తే మనలో ఓ బాధ ఉంటుంది. దాన్ని దీంట్లో హృదయాలకు హత్తుకునేలా చూపించాం. పతాక సన్నివేశాలు చాలా భావోద్వేగభరితంగా ఉంటాయి. హీరోగా మారితే హాస్యనటుడిగా అవకాశాలు తగ్గిపోతాయనే భయం నాకు లేదు. నన్ను నేను నిజంగా హీరోగా భావిస్తే అలాంటి భయం కలుగుతుంది. నేను అన్ని రకాల పాత్రలు చేయాలనుకుంటున్నా. ప్రస్తుతం 'విశ్వంభర', 'ఉస్తాద్ భగత్ సింగ్', 'మాస్ జాతర', 'లెనిన్', 'ఆకాశంలో ఓ తార' తదితర చిత్రాల్లో నటిస్తున్నా" అని చెప్పారు.

ఈనాడు బిజినెస్



కీలక రేట్లని కదల్చని టారిఫ్ అనిశ్చితులు

● వృద్ధి అంచనా 6.5% వద్దే ● ద్రవ్యోల్బణ అంచనాల తగ్గింపు
● రేట్ల కోత ప్రభావం వ్యవస్థలో ఇంకా కనిపించలేదు
● మరణించిన వారి ఖాతాల సెటిల్‌మెంట్ సులువుగా

ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష

వడ్డీరేట్ల విషయంలో సరైన నిర్ణయం తీసుకునే ముందు ఎంపీసీ మొత్తం సమాచారాన్ని గమనిస్తూ, అప్రమత్తతతో వ్యవహరిస్తుంది. సాధారణ స్థాయి కంటే అధిక వర్షాలు పడుతుండటం, తక్కువ ద్రవ్యోల్బణం, పెరుగుతున్న సామర్థ్య వినియోగం, సానుకూల ఆర్థిక పరిస్థితులు కలిసి దేశీయ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇస్తాయని ఆశిస్తున్నాం. మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వృద్ధికి అధికంగా సహకరిస్తోంది.

- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక రేట్లను యథాతథంగా ఉంచింది. రెపో రేటును 5.5% వద్దే ఉంచాలని పరపతి విధాన కమిటీ (ఎంపీసీ)లోని సభ్యులందరూ నిర్ణయించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య విధానాలు.. మనదేశ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు విధిస్తామన్న హెచ్చరికల నేపథ్యంలో, ఆ ప్రభావాన్ని గమనించాకే రేట్ల సవరణపై నిర్ణయం తీసుకోవాలని భావించడమే ఇందుకు కారణం. అయితే ఈ విషయాన్ని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ నేరుగా ప్రస్తావించలేదు. అంతర్జాతీయ అనిశ్చితులు కొనసాగుతున్నందున కీలక రేట్లను సవరించడం లేదనే పేర్కొన్నారు.

3.7% కాదు.. 3.1 శాతమే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటెయిల్ ద్రవ్యోల్బణ అంచనాలను 3.1 శాతానికి ఆర్‌బీఐ తగ్గించింది. ఇది 3.7 శాతంగా ఉంటుందని గతంలో అంచనా వేసిన సంగతి విదితమే. రిటెయిల్ ద్రవ్యోల్బణం జనవరి-మార్చిలో 4 శాతాన్ని మించొచ్చని మల్హోత్రా అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనాలను మార్పు లేకుండా 6.5 శాతంగానే ఆర్‌బీఐ కొనసాగించింది.

కోతల ప్రభావం ఇంకా కనిపించాల్సి ఉంది

2025లో రెపోరేటును 1% తగ్గించామని, ఈ ప్రభావం ఆర్థిక వ్యవస్థలో ఇంకా కనిపించాల్సి ఉందని మల్హోత్రా అన్నారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో భారత్ సరైన స్థానంలో ఉండాలంటే అన్ని విభాగాల్లోనూ బలమైన విధానాలు ఉండాలని, కేవలం పరపతి విధానమే సరిపోదన్నారు.

చనిపోయిన వారి ఖాతాలు, లాకర్ల సెటిల్‌మెంట్ సరళంగా!

ఇంట్లో ఎవరైనా మరణించిన పక్షంలో వారి బ్యాంకు ఖాతాలు, లాకర్లలోని సొత్తును సంబంధీకులు స్వాధీనం చేసుకోవడానికి ఒక్కో బ్యాంకు ఒక్కోలా ధ్రువీకరణ పత్రాలను అడుగుతుంది. దీనిని సరిదిద్ది.. చనిపోయిన వారికి చెందిన బ్యాంకు ఖాతాలు, లాకర్ల సెటిల్‌మెంట్ ప్రక్రియను సరళీకరించాలని ఆర్‌బీఐ భావిస్తోంది. ముసాయిదా సర్క్యులర్‌ను ప్రజల అభిప్రాయాల నిమిత్తం త్వరలోనే జారీ చేయనుంది.

✦ ట్రెజరీ బిల్లుల్లో సిప్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు రిటెయిల్ మదుపర్లకు వీలు కల్పించే ఆర్‌బీఐ రిటెయిల్-డైరెక్ట్ ప్లాట్‌ఫాంను మరింత విస్తరించనున్నట్లు మల్హోత్రా తెలిపారు.

2025-26లో ద్రవ్యోల్బణం అంచనాలు

త్రైమాసికం	ద్రవ్యోల్బణ అంచనా(%లో)
1	3.1
2	2.1
3	3.1
4	4.4

ట్రంప్ 'మృత ఆర్థిక వ్యవస్థ' వ్యాఖ్యలపై..

భారత్ 'మృత ఆర్థిక వ్యవస్థ' (డెడ్ ఎకానమీ) అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మల్హోత్రా స్పందిస్తూ 'భారత దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. ప్రపంచ వృద్ధికి అమెరికా కన్నా భారతే ఎక్కువ మద్దతు ఇస్తోంద'న్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) ప్రకారం ప్రపంచ వృద్ధి 3 శాతంగా ఉంటే.. భారత్ వృద్ధి అంచనా 6.5 శాతమని గుర్తు చేశారు. 'ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 18 శాతంగా ఉండగా, అమెరికా వాటా 11 శాతం కంటే తక్కువగా ఉంద'ని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు.

ద్రవ్యోల్బణంపై ప్రభావం ఉండదు

అమెరికా టారిఫ్‌ల ప్రభావం దేశీయ ద్రవ్యోల్బణంపై పెద్దగా ఉండకపోవచ్చని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. ఒక వేళ భారత్ ప్రతీకార సుంకాలను విధిస్తే, అపుడు కొంత ప్రభావం ఉండొచ్చని అన్నారు. మన రిటెయిల్ ద్రవ్యోల్బణాన్ని లెక్కించే వస్తువుల జాబితాలో 50% ఆహార వస్తువులే ఉన్నాయని, వీటికి అంతర్జాతీయ పరిణామాలతో సంబంధం లేదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పూనమ్ గుప్తా అన్నారు.

అక్టోబరులో 0.25 శాతం కోత!

'ప్రస్తుతం రేట్ల సవరణకు సాంకేతికంగా విరామం ఇచ్చినట్లు భావిస్తున్నాం. ద్రవ్యోల్బణం తక్కువగానే ఉంటుందన్న అంచనాల వల్ల, 25 బేసిస్ పాయింట్ల కోతకు సమీప భవిష్యత్తులో అవకాశం ఉంటుంద'ని ఎస్‌బీఐ ఎకనమిక్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ అంచనా వేస్తోంది. 'టారిఫ్‌ల వల్ల దేశ వృద్ధిరేటు తగ్గే అవకాశాలున్నాయి. అందువల్ల అక్టోబరులో 25 బేసిస్ పాయింట్ల రేట్ల కోతను అంచనా వేస్తున్నామ'ని యూబీఎస్ సెక్యూరిటీస్ అంటోంది. 'వృద్ధిరేటు తగ్గే సూచనలుంటే, రేట్ల కోతకు కొంచెం అవకాశం ఉంద'ని కోటక్ మహీంద్రా బ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త ఉపాసన భరద్వాజ్ అంటున్నారు.

హీరో మోటోకార్ప్ లాభంలో 65% వృద్ధి

దిల్లీ: హీరో మోటోకార్ప్ జూన్‌త్రైమాసికంలో రూ.1,705.65 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,032.21 కోట్లతో పోలిస్తే ఇది 65.24% అధికం. ఏథర్ ఎనర్జీలో పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా వచ్చిన ప్రయోజనాలు ఇందుకు దోహదం చేశాయి. ఆదాయాలు రూ.10,210.79 కోట్ల నుంచి రూ.9,727.75 కోట్లకు పరిమితమయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో అనుబంధ కంపెనీ ఏథర్ ఎనర్జీ తన పబ్లిక్ ఇష్యూను విజయవంతంగా పూర్తి చేసింది. ఇందులో వాటా విక్రయం వల్ల హీరో మోటో రూ.722.18 కోట్లను పొందింది. ఇది కూడా లాభంలో కలిసి ఉన్నట్లు ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో తెలిపింది. 2025-26 జూన్ త్రైమాసికంలో 13.67 లక్షల ద్విచక్ర వాహనాలను సంస్థ విక్రయించింది. ఏడాది క్రితం ఇదే సమయంలో అమ్మిన 15.35 లక్షల వాహనాలతో పోలిస్తే ఇవి 11% తక్కువ.

సైన్యం నుంచి లోకేశ్ మెషీన్స్‌కు రూ.17.68 కోట్ల ఆర్డర్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన లోకేశ్ మెషీన్స్ లిమిటెడ్ (ఎల్ఎంఎల్)కు భారత సైన్యం నుంచి రూ.17.68 కోట్ల ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ తుపాకీ విడిభాగాల సరఫరాకు సంబంధించినదని లోకేశ్ మెషీన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.లోకేశ్వరరావు వెల్లడించారు. దీని ప్రకారం భారత సైన్యానికి ఎంఎంజీ (గన్ మెషీన్ 7.62 ఎంఎం మ్యాగ్) మాడిఫికేషన్ కిట్లను లోకేశ్ మెషీన్స్ 12 నెలల్లో సరఫరా చేయాల్సి ఉంటుంది.

భారీ విస్తరణ దిశగా ఇండోసోల్ సోలార్

2027లో పబ్లిక్ ఇష్యూ ఆలోచన

హైదరాబాద్: సోలార్ పీవీ సెల్ మాడ్యూళ్లు ఉత్పత్తి చేసే ఇండోసోల్ సోలార్, 2027లో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)లో 25% వాటా విక్రయించాలనే ఆలోచన చేస్తోంది. ఈ లోపు భారీగా పెట్టుబడి పెట్టి తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే సన్నాహాలు చేపట్టింది. వచ్చే ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో 1 గిగావాట్ సామర్థ్యం గల సెల్ మాడ్యూల్ ప్లాంటును ప్రారంభించనుంది. ఈ సంస్థ షిర్డి సాయి ఎలక్ట్రికల్స్ అనుబంధ కంపెనీ. పీఎల్ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక) పథకం కింద రూ.5,175 కోట్ల రాయితీ తమకు లభిస్తుందని ఇండోసోల్ సోలార్ సీఎండీ ఎన్.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. విస్తరణ కార్యకలాపాలపై వచ్చే కొన్నేళ్లలో రూ.69,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయం రూ.879 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్), ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.879 కోట్ల మొత్తం ఆదాయం, రూ.85 కోట్ల నికరలాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.1.96గా నమోదైంది. 2024-25 ఇదేకాలంతో పోలిస్తే ఆదాయం 26.8% పెరిగినా నికరలాభం తగ్గింది. కంపెనీ చేతిలో రూ.70 కోట్ల నగదు నిల్వలున్నాయి. ప్రస్తుత మొదటి త్రైమాసికంలో ఆసుపత్రిలో చేరికలు, ఔట్‌పేషెంట్లు చికిత్స పొందిన వారి సంఖ్యతో పాటు, వైద్య పడకలు-ప్రతి రోగిపై సగటు ఆదాయం పెరిగినట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బి.భాస్కరరావు తెలిపారు. బెంగళూరులో కొత్త ఆసుపత్రులు త్వరలో ప్రారంభమవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న వ్యాపార లక్ష్యాలను సాధించగలమని ధీమా వ్యక్తం చేశారు.



దివీస్ లేబొరేటరీస్‌కు రూ.557 కోట్ల లాభం

ఈనాడు, హైదరాబాద్: దివీస్ లేబొరేటరీస్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.2,476 కోట్ల ఆదాయం, రూ.557 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.2,142 కోట్లు, లాభం రూ.430 కోట్లు ఉన్నాయి. దీంతో పోలిస్తే ప్రస్తుత ఫలితాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. నికరలాభం 30% పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో విదేశీ మారకపు ద్రవ్య లాభం రూ.39 కోట్లు ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. కాకినాడలో యూనిట్-3 మొదలు కావడం, అన్ని యూనిట్లలో ఉత్పత్తి సామర్థ్యాన్ని 80% వరకు వినియోగించడం వల్ల మెరుగైన ఆదాయాలు, లాభాలు నమోదు చేయడానికి దోహదపడినట్లు తెలుస్తోంది. జనరిక్ ఔషధాలపై ఆదాయాలు తగ్గినట్లు తెలిసింది.

55% భారత ఎగుమతులపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం: ఫియో

దిల్లీ: భారత ఉత్పత్తులపై మరో 25% సుంకం విధించి, మొత్తం 50% వసూలు చేయాలని అమెరికా నిర్ణయించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఫియో) వెల్లడించింది. అమెరికాకు భారత్ నుంచి వెళ్లే 55% ఉత్పత్తులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపింది. ముఖ్యంగా జౌళి, సముద్ర, తోలు ఉత్పత్తులు, రత్నాభరణాల ఎగుమతులపై ప్రభావం పడనుంది. 'ఇతర రంగాల్లోని పోటీ దేశాలతో పోలిస్తే మన ఉత్పత్తులు 30-35% ఎక్కువ ఖరీదు కానున్నాయి' అని ఫియో డీజీ అజయ్ సహాయ్ పేర్కొన్నారు. అధిక ఖర్చులతో ఇప్పటికే ఆర్డర్లు నిలిచిపోయాయని అన్నారు.

జీడీపీ, ఐఐపీ గణనకు ఆధారిత సంవత్సరంగా 2022-23: స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) గణన కోసం కొత్త ఆధారిత సంవత్సరంగా 2022-23ను, వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) గణనకు 2024ను పరిగణించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ విషయాన్ని బుధవారం పార్లమెంటుకు తెలిపింది.

అంకురాల కోసం రూ.100 కోట్లు: బయోమ్

ఈనాడు, హైదరాబాద్: సమాజంపై ప్రభావం చూపే అంకురాలను ప్రోత్సహించేందుకు రూ.100 కోట్లతో నిధిని ఏర్పాటు చేసినట్లు బయోమ్ వెల్లడించింది. ఇందుకోసం తన తొలి దశ నిధుల సమీకరణను పూర్తి చేసినట్లు పేర్కొంది. సైయెంట్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్ రెడ్డి, ఆజిరేన్ ఎనర్జీ వ్యవస్థాపకుడు ప్రసాద్ యేర్నేని, జీవీకే బయో ఎండీ అకిన్ రెడ్డి తదితరులు ఈ పెట్టుబడులను అందించినట్లు బయోమ్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీనివాస్ కొల్లిపర తెలిపారు.

టీసీఎస్ సిబ్బందికి 1 నుంచి వేతనాల పెంపు

దిల్లీ: దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తన ఉద్యోగులకు వేతనాల పెంపును ప్రకటించింది. సెప్టెంబరు 1 నుంచి ఈ పెంపు అమలు కానుంది. జూనియర్, మధ్య స్థాయి ఉద్యోగుల్లో దాదాపు 80% మందికి వేతనాల పెంపు ఉంటుంది. సీ3ఏ, దాని సమానమైన గ్రేడ్‌లలో అర్హులైన అసోసియేట్స్‌కు వేతన సవరణ ఉంటుందని ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో టీసీఎస్ సీహెచ్‌ఆర్ఓ మిలింద్ లక్కడ్, కాబోయే సీహెచ్‌ఆర్ఓ కె.సుదీప్ పేర్కొన్నారు. ఏ స్థాయిలో వేతనాల పెంపు ఉంటుందనే విషయంపై కంపెనీ స్పష్టత ఇవ్వలేదు.

కోడి గుడ్లు

7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	440
వరంగల్	442
విజయవాడ	490
గోదావరి	480
విశాఖపట్నం	500
చిత్తూరు	513

ఎటెర్నల్ నుంచి వైదొలగనున్న యాంట్‌ఫిన్!

రూ.5,375 కోట్లకు తన వాటా విక్రయించే అవకాశం

దిల్లీ: జొమాటో మాతృసంస్థ ఎటెర్నల్ లిమిటెడ్‌లో తనకున్న వాటాను చైనా సంస్థ అలీబాబాకు చెందిన యాంట్‌ఫిన్ సింగపూర్ హోల్డింగ్ పీటీఈ లిమిటెడ్ విక్రయించనున్నట్లు ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. 2025 జూన్ చివరకు ఎటెర్నల్‌లో యాంట్‌ఫిన్‌కు 1.95% వాటా ఉంది. ఈ వాటాకు సమానమైన 18.84 కోట్ల షేర్లను, ఒక్కోటి రూ.285 చొప్పున మొత్తంగా రూ.5,375 కోట్లకు యాంట్‌ఫిన్ విక్రయించనున్నట్లు సమాచారం. బుధవారం ఎటెర్నల్ షేరు రూ.298.90 వద్ద ముగిసింది. ఈ ధర కంటే 5% తక్కువకే యాంట్‌ఫిన్ విక్రయిస్తుండటం గమనార్హం. యాంట్‌ఫిన్‌లో చైనా కుబేరుడు జాక్ మాకు చెందిన అలీబాబా సంస్థ పెట్టుబడులున్నాయి. ఆయనకు చెందిన యాంట్‌ఫిన్ ఈనెల 5న పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్‌లో తనకున్న 5.84% వాటాను రూ.3,980 కోట్లకు విక్రయించిన సంగతి తెలిసిందే. భారత సంస్థల్లో తమ వాటాలను చైనీయులు విక్రయిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

14% పెరిగిన బజాజ్ ఆటో లాభం

దిల్లీ: బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.2,210.44 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదుచేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,941.79 కోట్లతో పోలిస్తే ఇది 13.84% ఎక్కువ. ఎగుమతులు రాణించడం, ప్రీమియం మోటార్ సైకిళ్లు, వాణిజ్య వాహనాలు, చేతక్ విద్యుత్ స్కూటర్ అమ్మకాల్లో వృద్ధి ఇందుకు దోహదపడినట్లు సంస్థ తెలిపింది. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.11,932.07 కోట్ల నుంచి రూ.13,133.35 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.9,703.61 కోట్ల నుంచి రూ.10,681.68 కోట్లకు చేరాయి. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ 11,11,237 వాహనాలు విక్రయించింది. ఏడాది క్రితం ఇదే సమయంలో అమ్ముడైన 11,02,056 వాహనాలతో పోలిస్తే ఇవి 1% ఎక్కువ. దేశీయ విక్రయాలు 6,90,621 నుంచి 8% తగ్గి 6,34,808కు పరిమితమయ్యాయి. ఎగుమతులు మాత్రం 4,11,435 నుంచి 16% పెరిగి 4,76,429కు చేరాయి.

విద్యుత్తు చేతక్‌ల ఉత్పత్తి సగమే!: అరుదైన భూఅయస్కాంతాల కొరత కారణంగా ప్రస్తుత జులై-సెప్టెంబరు త్రైమాసికంలో చేతక్ విద్యుత్ స్కూటర్ల ఉత్పత్తి ప్రణాళికలో 50-60 శాతమే సాధించగలమని బజాజ్ ఆటో తెలిపింది. విద్యుత్ త్రిచక్ర వాహన ఉత్పత్తిలోనూ 70-80 శాతమే అందుకోగలమని స్పష్టం చేసింది. పండగల సీజన్ గిరాకీపై ఈ ప్రభావం పడొచ్చని వివరించింది. ఆగస్టులో అసలు ఉత్పత్తి చేయలేమని భావించినా, 40% వరకు అందుకోగలమని భావిస్తున్నట్లు వివరించింది. తమ ఆదాయాల్లో విద్యుత్తు వాహనాల వాటా 20 శాతానికి పైగా ఉందని తెలిపింది.

గ్రీన్ అమ్మోనియా కిలో రూ.55.75

దిల్లీ: జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ 'సైట్' (స్ట్రాటెజిక్ ఇంటర్వెన్షన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్) ప్రోగ్రామ్ కింద గ్రీన్ అమ్మోనియాను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఎస్ఈసీఐ నిర్వహించిన తొలి వేలంలో.. కిలో రూ.55.75 చొప్పున సరఫరా చేసేందుకు బిడ్ అందినట్లు కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) వెల్లడించింది.

హుబ్లీలో ఇన్ఫోసిస్ ఏఐ కేంద్రం

1,000కి పైగా స్థానిక నియామకాలు



దిల్లీ: కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ కోసం కొత్త అభివృద్ధి కేంద్రాన్ని ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ కర్ణాటకలోని హుబ్లీలో ప్రారంభించింది. ఇందులో 1000 మందికి పైగా స్థానికులను ఉద్యోగాల్లో నియమించుకుంది. ఈ కొత్త కేంద్రం ఇన్ఫోసిస్ లివింగ్ ల్యాబ్స్ నెట్‌వర్క్‌లో భాగం. ఈ కేంద్రం ప్రపంచ వ్యాప్త వినియోగదారుల కోసం అధునాతన డిజిటల్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తుందని సంస్థ తెలిపింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
భెల్	(455.40)	(211.40)	6,279.78	5,874.98
ట్రెంట్	424.7	391.2	4,883.48	4,104.44
జిందాల్ స్టెయిన్‌లెస్	714.66	646.07	10,276.01	9,480.50
బ్లూస్టార్	120.82	168.76	2,982.25	2,865.37
బేయర్ క్రాప్‌సైన్స్	278.7	254.2	1,933.3	1,658.7
పిడిలైట్ ఇండస్ట్రీస్	678.13	571.27	3,753.1	3,395.35
భారత్ ఫోర్జ్	284	174	3,958	4,158
ఎన్ఐఐటీ లెర్నింగ్	49.3	60	451.3	407.2
ఈఐడీ ప్యారీ	464.46	225.87	8,813.39	6,806.98
పీవీఆర్ ఐనాక్స్	(54.5)	(179)	1,469.1	1,190.7
పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	8,981	7,182	28,628.92	24,736.68
హడ్కో	630.23	557.75	2,945.47	2,197.19
ఎవరెడీ ఇండస్ట్రీస్	30.23	29.36	374.14	349.37

విమాన నిర్వహణ సేవలు సొంతంగానే

● ప్రభుత్వ కంపెనీకి దూరం
● ఎయిరిండియా ప్రణాళికలు



దిల్లీ: ఎయిరిండియా తన విమాన నిర్వహణ సేవల కోసం పొరుగు సంస్థలపై ఆధారపడడానికి బదులు సొంతంగా చేసుకోవాలని భావిస్తోంది. ఇందు కోసం తన వాటాదారు సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) నుంచి మద్దతు తీసుకోనుందని ఆంగ్ల వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ప్రీ-ఫ్లైట్, రోజువారీ విమాన తనిఖీలు, చిన్నపాటి మరమ్మతు పనులు, ఇతర పరిష్కార కార్యకలాపాలను ప్రభుత్వ రంగానికి చెందిన ఏఐ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఏఐఈఎస్ఎల్)తో ప్రస్తుతం ఎయిరిండియా చేయిస్తోంది. ఈ పనులను సొంతంగానే చేపట్టాలని సంస్థ అనుకుంటోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దశలవారీగా ఏఐఈఎస్ఎల్ నుంచి దూరంగా జరగాలని భావిస్తోందని సమాచారం. జూన్‌లో జరిగిన విమాన దుర్ఘటన అనంతరం ఎయిరిండియా ఈ అడుగులు వేస్తుండడం గమనార్హం.


✦ ఈ విషయంపై ఎయిరిండియా ప్రతినిధి మాట్లాడుతూ 'ఏఐఈఎస్ఎల్‌తో పనిచేయడం కొనసాగిస్తాం. అయితే మా విమానాల విస్తరణ కారణంగా ప్రస్తుత ఎంఆర్ఓ (మరమ్మతు, నిర్వహణ, ఓవరాలింగ్) వసతులు సరిపోవనే భావిస్తున్నామ'ని తెలిపారు.

వాట్సప్ నుంచి 'సేఫ్టీ ఓవర్‌వ్యూ'

దిల్లీ: మెటాకు చెందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్, సరికొత్త 'సేఫ్టీ ఓవర్‌వ్యూ' టూల్‌ను తీసుకొచ్చింది. మన కాంటాక్ట్ లిస్ట్‌లో లేని వ్యక్తి ఎవరైనా, కొత్త వాట్సప్ గ్రూప్‌లో మనను చేరిస్తే వెంటనే ఈ టూల్ అప్రమత్తం చేస్తుంది. స్కామ్‌లు, మోసాలను నిరోధించే చర్యల్లో భాగంగా మెటా ఈ ఫీచర్‌ను అభివృద్ధి చేసింది. సేఫ్టీ ఓవర్‌వ్యూ చేతిలో వినియోగదారుడిని చేర్చిన గ్రూప్‌నకు సంబంధించిన కీలక సమాచారం ఉంటుంది. దీంతో పాటు భద్రంగా ఉండటానికి చిట్కాలను కూడా అందిస్తుంది. 'ఈ ఫీచర్ అప్రమత్తం చేసిన తర్వాత, చాట్‌ను చూడకుండానే గ్రూప్ నుంచి వైదొలగొచ్చు. సేఫ్టీ ఓవర్‌వ్యూ ఇచ్చిన వివరాలను చూసిన తర్వాత గ్రూప్‌ను గుర్తిస్తే, చాట్‌లను కూడా ఎంచుకునే సౌలభ్యం ఉంది' అని వాట్సప్ వివరించింది.

వాహన గిరాకీ రికవరీకి భారత ఆర్థిక విధానాల తోడ్పాటు

హ్యుందాయ్ ఎండీ అన్‌సూ కిమ్



దిల్లీ: భారత ఆర్థిక స్థిరత్వం, భవిష్యత్తు కోసం అనుసరిస్తున్న విధానాలతో వాహన, వాహన విడిభాగాలు వంటి వినియోగ ఆధారిత రంగాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ అన్‌సూ కిమ్ పేర్కొన్నారు. సమీప - మధ్యకాల వ్యవధిలో వాహన గిరాకీ రికవరీకి ఈ చర్యలు తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు. విలాస మోడల్ 'జెనెసిస్'ను భారత విపణిలోకి తీసుకొచ్చేందుకు గల అవకాశాలను హ్యుందాయ్ మదింపు చేస్తోంది. 2024-25 కంపెనీ వార్షిక నివేదికలో కిమ్ పలు విషయాలను వెల్లడించారు. పరిశ్రమ అంచనాలకు అనుగుణంగానే 2025-26 దేశీయ విక్రయాల్లో ఒక అంకె వృద్ధి నమోదుకావొచ్చని, ఎగుమతులు 7-8% పెరగొచ్చన్నారు. 'అంతర్జాతీయ ఆటంకాలు, స్థూల ఆర్థిక అనిశ్చితులు, అధిక బేస్ ఎఫెక్ట్ కారణంగా వాహన పరిశ్రమకు సవాళ్లు కొనసాగొచ్చు. రెపో రేట్ల కోత, ఆదాయ పన్ను ఉపశమనం వంటి నిర్ణయాలతో అనుకూల పరిస్థితులు ఏర్పడొచ్చు' అని కిమ్ వివరించారు.

ఎయిర్‌బస్ ఇండియా ఎండీగా యూగెన్ వెస్ట్‌మెయర్

దిల్లీ: విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్, తన భారత - దక్షిణ ఆసియా విభాగాలకు ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా యూగెన్ వెస్ట్‌మెయర్‌ను నియమించింది. ప్రస్తుతం సంస్థలో ఎగ్జిక్యూటివ్ వైస్-ప్రెసిడెంట్, ముఖ్య ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్న 53 ఏళ్ల యూగెన్, సెప్టెంబరు 1న నూతన బాధ్యతలు చేపడతారు. ప్రస్తుతం ఎండీగా ఉన్న రెమి మయాహ్ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇకపై కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ వైస్-ప్రెసిడెంట్ ఇంజినీరింగ్‌గా, ఎయిర్‌బస్ హెడ్ ఆఫ్ టెక్నాలజీగా రెమి మయాహ్ వ్యవహరించనున్నారని సంస్థ తెలిపింది.

✦ 2020లో ఎయిర్‌బస్‌లో ముఖ్య ప్రొక్యూర్‌మెంట్ ఆఫీసర్‌గా చేరిన యూగెన్, 1998లో బీఎండబ్ల్యూలో తన వృత్తి పరమైన జీవితాన్ని ప్రారంభించారు. నూతన బాధ్యతల్లో భాగంగా భారత్, దక్షిణ ఆసియాలో ఎయిర్‌బస్ కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్, డిఫెన్స్, స్పేస్, హెలికాప్టర్స్ వ్యాప్తిని విస్తృతం చేయనున్నారు.

2 రోజుల్లో రూ.3.5 లక్షల కోట్లు ఆవిరి

ఐటీ, ఆరోగ్య సంరక్షణ షేర్లలో విక్రయాలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.4,999 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.6,794 కోట్లు



సెన్సెక్స్ ▼ 166 80544
నిఫ్టీ ▼ 75 24574

సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. ఐటీ, ఆరోగ్య సంరక్షణ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం ప్రభావం చూపింది. మన దేశంపై టారిఫ్‌లు మరింత పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనలతో మదుపర్లు కలవరపడుతున్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 16 పైసలు లాభపడి 87.72 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు ధర 1.61% పెరిగి 68.73 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, షాంఘై, హాంకాంగ్ సానుకూలంగా ముగియగా, దక్షిణ కొరియా ఫ్లాట్‌గా ముగిసింది. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.77 లక్షల కోట్లు తగ్గి, రూ.445.19 లక్షల కోట్ల (5.08 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. వరుసగా 2 రోజుల్లో రూ.3.50 లక్షల కోట్ల మార్కెట్ విలువ ఆవిరైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 80,694.98 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,710.25 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. తర్వాత 80,834.43 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, మళ్లీ ఒక దశలో 80,448.82 పాయింట్ల కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 166.26 పాయింట్ల నష్టంతో 80,543.99 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 75.35 పాయింట్లు కోల్పోయి 24,574.20 పాయింట్ల వద్ద ముగిసింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టపోయాయి. సన్ ఫార్మా 2.33%, టెక్ మహీంద్రా 1.97%, బజాజ్ ఫైనాన్స్ 1.67%, ఇన్ఫోసిస్ 1.64%, హెచ్‌సీఎల్ టెక్ 1.38%, ఎటెర్నల్ 1.04%, టీసీఎస్ 1% చొప్పున పడ్డాయి. ఏషియన్ పెయింట్స్ 2.19%, బీఈఎల్ 0.80%, ట్రెంట్ 0.79% మేర లాభపడ్డాయి.

✦ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) 23,000 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఇసాప్) కింద రూ.400-500 కోట్ల విలువైన స్టాక్‌లను జారీ చేయనున్నట్లు గ్రూప్ సీఈఓ, ఎండీ అనీశ్ షా వెల్లడించారు.

✦ మౌలిక వసతులు, ఇంజినీరింగ్ సేవల సంస్థ బొండాడా ఇంజినీరింగ్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా రియర్ అడ్మిరల్ ఆర్.శ్రీనివాసన్ నియమితులయ్యారు. 35 ఏళ్లుగా భారతీయ నౌకాదళంతో పాటు, పలు కార్పొరేట్ సంస్థల్లో ఈయన పనిచేశారు.

✦ నజారా టెక్నాలజీస్ షేరు విభజన, బోనస్ షేర్ల జారీ కోసం ఈ నెల 12న బోర్డు సమావేశం నిర్వహించనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

నేటి బోర్డు సమావేశాలు: ఎల్ఐసీ, టైటన్, గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్, బీఎస్ఈ, కమిన్స్ ఇండియా, హెచ్‌పీసీఎల్, కల్యాణ్ జువెలర్స్, నేషనల్ అల్యూమినియం, ఎన్ఎల్‌సీ ఇండియా, ఎన్‌బీసీసీ, రామ్‌కో సిమెంట్స్, ఎంక్యూర్ ఫార్మా, సన్‌టీవీ నెట్‌వర్క్, హెచ్‌సీసీ

ఐపీఓ ప్రతిపాదనలకు ఆమోదం

ముంబయి: ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్‌తో పాటు మరో 3 కంపెనీల ఐపీఓలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. అనుమతి పొందిన వాటిలో ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ ఇండియా, గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాల్టీ, ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ సంస్థలు ఉన్నాయి.

✦ బ్లూస్టోన్ జువెలరీ ఐపీఓ ఈనెల 11-13 తేదీల్లో రాబోతోంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.492-517. తాజా షేర్ల జారీ ద్వారా రూ.820 కోట్లు సమీకరించబోతోంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో రూ.720.65 కోట్ల విలువైన 1,39,39,063 ఈక్విటీ షేర్లను విక్రయించనుంది.

సంక్షిప్తంగా..

✦ నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) షేరు బుధవారం స్టాక్ మార్కెట్‌లో నమోదైంది. ఇష్యూ ధర రూ.800తో పోలిస్తే, బీఎస్ఈలో 10% ప్రీమియంతో రూ.880 వద్ద నమోదైన షేరు.. ఒక దశలో రూ.943.85 స్థాయిని తాకింది. చివరకు 17% లాభంతో రూ.936 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.18,720 కోట్లుగా నమోదైంది.

✦ శ్రీ లోటస్ డెవలపర్స్ అండ్ రియాల్టీ షేరు, ఇష్యూ ధర రూ.150తో పోలిస్తే బీఎస్ఈలో 19.4% ప్రీమియంతో రూ.179.10 వద్ద నమోదైంది. ఒక దశలో రూ.197 స్థాయిని తాకినా, చివరకు 31.23% లాభంతో రూ.196.85 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.9,620.53 కోట్లుగా నమోదైంది.

✦ ఎం అండ్ బీ ఇంజినీరింగ్ షేరు, ఇష్యూ ధర రూ.385తో పోలిస్తే బీఎస్ఈలో 0.26% లాభంతో రూ.386 వద్ద నమోదైంది. ఒక దశలో రూ.418.85 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 6.27% లాభంతో రూ.409.15 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,338.22 కోట్లుగా నమోదైంది.

బయోటెక్నాలజీ

(జీవసాంకేతిక శాస్త్రం)

సమాజ పురోగతికి సాయపడే సాంకేతికత!



ఇన్సులిన్ ఉత్పత్తికి, వివిధ వ్యాక్సిన్లను, యాంటీబయాటిక్‌లను తయారు చేయడానికి బ్యాక్టీరియాలో జన్యుపరమైన మార్పులు చేస్తారు. ఈ విధంగా జీవశాస్త్రం, సాంకేతికతలను కలిపి జీవులు లేదా వాటి భాగాలను ఉపయోగించి మనుషులకు అవసరమైన ఉత్పత్తులను, ప్రక్రియలను అభివృద్ధి చేసే శాస్త్రమే జీవసాంకేతికశాస్త్రం. దీంతో మొక్కలను వేగంగా పెంచవచ్చు, కాలుష్యాన్ని తగ్గించవచ్చు. కోరుకున్న లక్షణాలతో సరికొత్త జీవిని సృష్టించవచ్చు. వైద్యం, వ్యవసాయం, పర్యావరణం తదితర అనేక రంగాల్లో విస్తృతంగా వినియోగిస్తున్న ఈ పరిజ్ఞానం ఆధునిక జీవన సమస్యల పరిష్కారంలో, మానవ జీవితాన్ని మెరుగుపరుచుకోవడంలో కీలకంగా మారింది. అద్భుతాలు చేస్తున్న ఆ సాంకేతికత, అందులోని రకాలు, శాఖలు, వాడుతున్న రంగాలు, కలుగుతున్న ప్రయోజనాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. దేశంలో బయోటెక్నాలజీ అభివృద్ధి క్రమం, ఇందుకోసం ఏర్పాటైన సంస్థలు, వాటి కార్యకలాపాలనూ తెలుసుకోవాలి.

ఇరవై ఒకటో శతాబ్దంలో సమాచార సాంకేతిక రంగం (ఐటీ)తో పాటు సమానంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికత బయోటెక్నాలజీ. ప్రస్తుతం బయోటెక్నాలజీ మానవాళికి వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణం, వైద్యం, ఆక్వాకల్చర్ వంటి అనేక రంగాల్లో ఉపయోగపడుతోంది. బయోటెక్నాలజీ అనే పదాన్ని 1919లో కార్ల్ హెరికే అనే శాస్త్రవేత్త ప్రతిపాదించాడు. ఇది జీవశాస్త్రం, జీవరసాయనిక శాస్త్రం, జన్యుశాస్త్రం, సూక్ష్మజీవశాస్త్రం, ఇంజినీరింగ్‌ల కలయిక.

బయోటెక్నాలజీ రకాలు



రెడ్ బయోటెక్నాలజీ: ఆరోగ్యం, వైద్య రంగాల్లో ఉపయోగించుకునే జీవ సాంకేతికత.

వైట్ బయోటెక్నాలజీ: పరిశ్రమల్లో జన్యు ఆధారిత సాంకేతికత వాడకాన్ని వివరిస్తుంది.



బ్లూ బయోటెక్నాలజీ: ఆక్వాకల్చర్, తీర ప్రాంత, సముద్ర బయోటెక్నాలజీ గురించి తెలియజేస్తుంది.

పర్పుల్ బయోటెక్నాలజీ: పేటెంట్‌లు, ప్రచురణలు, ఆవిష్కరణలు, మేధోసంపత్తి హక్కుల వివరాలు తెలిపే టెక్నాలజీ.

గ్రీన్ బయోటెక్నాలజీ: వ్యవసాయం, పర్యావరణ శుభ్రత, జీవ ఎరువులు, జీవ ఇంధనాలు వంటి వాటిలో ఈ సాంకేతికతను వినియోగించుకోవడం.



బ్రౌన్ బయోటెక్నాలజీ: వర్షాధార, ఎడారి అభివృద్ధికి సంబంధించిన సాంకేతికత.

గోల్డ్ బయోటెక్నాలజీ: బయో ఇన్‌ఫర్మాటిక్స్, నానో బయోటెక్నాలజీ గురించి తెలియజేస్తుంది.

గ్రే బయోటెక్నాలజీ: ఇది కిణ్వన ప్రక్రియ, బయో ప్రాసెస్‌లో వాడే టెక్నాలజీ.

ఎల్లో బయోటెక్నాలజీ: ఆహారం, పోషణ రంగాల్లో బయోటెక్నాలజీని ఉపయోగించుకోవడం.



బయోటెక్నాలజీ శాఖలు: ఉపయోగపడే రంగం ఆధారంగా ఈ సాంకేతికతను విభజించారు. అవి.. 1) అగ్రి బయోటెక్నాలజీ 2) యానిమల్ బయోటెక్నాలజీ 3) ప్లాంట్ బయోటెక్నాలజీ 4) ఇంధన బయోటెక్నాలజీ 5) పారిశ్రామిక బయోటెక్నాలజీ 6) మెడికల్ బయోటెక్నాలజీ 7) పర్యావరణ బయోటెక్నాలజీ 8) ఎంజైమ్ బయోటెక్నాలజీ.

భారతదేశంలో బయోటెక్నాలజీ అభివృద్ధి: దేశంలో 1982లో జరిగిన 69వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో బయోటెక్నాలజీ అభివృద్ధి గురించి తొలిసారిగా ప్రతిపాదించారు. అదే ఏడాది నేషనల్ బయోటెక్నాలజీ బోర్డు ఏర్పాటైంది. 1986లో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఏర్పాటు చేశారు. ఈ సంస్థ బయోటెక్నాలజీ రంగంలో మానవ వనరులను పెంపొందించడం కోసం వివిధ యూనివర్సిటీల్లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్, ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రాంలను ప్రారంభించింది.

- ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) - దిల్లీ, నేషనల్ డెయిరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ) - కర్నాల్ (హరియాణా), ఇండియన్ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఆర్ఐ) - ఇజత్‌నగర్ (ఉత్తర్‌ప్రదేశ్) వంటి ప్రదేశాల్లో బయోటెక్నాలజీ పరిశోధనా కేంద్రాలు ప్రారంభించారు.


ఎన్‌డీఆర్ఐ



ఐవీఆర్ఐ

- 1983లో ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న బయోటెక్నాలజీ పరిశోధనా సంస్థను నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఫర్ ప్లాంట్ బయోటెక్నాలజీగా మార్చారు.
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 7 సీపీఎంబీ (సెంటర్ ఫర్ ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ) సంస్థలు ఏర్పాటయ్యాయి.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ బయోటెక్నాలజీలో పరిశోధనలు ప్రారంభించాయి.
- దిల్లీలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనిటిక్ రిసోర్సెస్ (ఎన్‌బీపీజీఆర్)లో బయోటెక్నాలజీ పద్ధతులు ఉపయోగించి బీజద్రవ్యం (జర్మ్‌ప్లాసమ్) పరిరక్షణను ప్రారంభించారు. ఈ సంస్థలోనే నేషనల్ ఫెసిలిటీ ఫర్ ప్లాంట్ టిష్యూకల్చర్ రిసాయిసిటరీ ఉంది.

పరిశోధనా సంస్థల భాగస్వామ్యం: లఖ్‌నవూలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ ప్లాంట్స్ (సీఐఎంఏపీ), దిల్లీలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనిటిక్ రిసోర్సెస్‌లో నేషనల్ జీన్ బ్యాంకులు ఏర్పాటయ్యాయి. త్రివేండ్రంలోని ట్రోపికల్ బొటానికల్ గార్డెన్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో అతిశీతల పరిరక్షణ (క్రయో ప్రిజర్వేషన్) పద్ధతిలో వివిధ రకాల మొక్కల భాగాలు భద్రపరుస్తున్నారు. దిల్లీలోని ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్, పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ (ఎన్‌సీఎల్)లో అలంకరణ మొక్కల మైక్రో ప్రాపగేషన్‌ను ప్రారంభించారు.

- అంతర్జాతీయ స్థాయి పరిశోధన, సహాయ సహకారాల కోసం ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ సెంటర్ ఆఫ్ జెనిటిక్ ఇంజినీరింగ్ అండ్ బయోటెక్నాలజీ'ని దిల్లీలో ప్రారంభించారు.



సీఐఎంఏపీ

నిర్వచనం: జీవులను, కణాలను లేదా జీవకారకాలను నియంత్రిత పరిస్థితుల్లో మానవ శ్రేయస్సుకు వినియోగించుకోవడమే బయోటెక్నాలజీ.



బయోటెక్నాలజీ ఉపయోగాలు: జీవసాంకేతిక శాస్త్రాన్ని ప్రస్తుతం వ్యవసాయం, ఆక్వాకల్చర్, అటవీకరణ, పారిశ్రామిక రంగం, ఆరోగ్యం, వైద్యం, ఆహారశుద్ధి, పర్యావరణం లాంటి అనేక రంగాల్లో ఉపయోగిస్తున్నారు.

వ్యవసాయ రంగంలో బయోటెక్నాలజీ: ఈ సాంకేతికతను ఉపయోగించి జీవ పురుగుమందులు, జీవ ఎరువులు తయారు చేస్తున్నారు. వీటివల్ల కాలుష్యం తగ్గుతోంది. సేంద్రియ వ్యవసాయానికి కూడా బయోటెక్నాలజీ తోడ్పడుతోంది.


కార్ల్ హెరికే

ఇందులో భాగమైన కణజాల వర్ధనం విధానంలో పెంచిన మొక్కలు వేగంగా పెరుగుతూ అధిక దిగుబడి ఇస్తున్నాయి. పండ్ల మొక్కలు, ఉద్యానవన మొక్కలను తక్కువ సమయంలో అధిక సంఖ్యలో ఉత్పత్తి చేస్తున్నారు. బయోటెక్నాలజీలో అద్భుతాలు సృష్టిస్తున్న మరో సాంకేతికత 'జన్యు ఇంజినీరింగ్'. దీని ద్వారా జన్యు పరివర్తన మొక్కలు తయారు చేస్తున్నారు. ఇవి చీడపీడలను తట్టుకుంటూ అధిక దిగుబడి ఇస్తున్నాయి. ఇటీవల జన్యు ఎడిటింగ్ ద్వారా నూతన వంగడాలను తయారు చేస్తున్నారు. చేపల పెంపకం, ఆక్వాకల్చర్‌లో బయోటెక్నాలజీ వినియోగంతో అధిక దిగుబడి పొందుతున్నారు. పట్టుపురుగుల పెంపకం, తేనెటీగల పెంపకం, పాడి పరిశ్రమల్లోనూ ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. పిండమార్పిడి, కృత్రిమ గర్భధారణ లాంటి పద్ధతులను అనుసరించడం వల్ల అధిక పాల దిగుబడి, అధిక మాంసం ఉత్పత్తి సాధ్యమవుతున్నాయి.

పారిశ్రామిక రంగంలో బయోటెక్నాలజీ: జీవ సాంకేతిక రంగం ఆధారిత పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. పరిశ్రమల్లో బయోరియాక్టర్లను ఉపయోగించి సూక్ష్మజీవ నాశకాలు, వ్యాక్సిన్‌లు, ఔషధాలు తయారు చేస్తున్నారు.

వైద్య ఆరోగ్య రంగంలో వినియోగం: బయోటెక్నాలజీ అత్యధికంగా ఉపయోగపడుతున్న రంగాల్లో మొదటిది వైద్య - ఆరోగ్య రంగం. అంటువ్యాధులను నివారించేందుకు ఉపయోగపడే సూక్ష్మజీవ నాశకాలు, వ్యాధి నిరోధకతను పెంచే వ్యాక్సిన్లు, వైరస్‌లను ఎదుర్కొనే ఇంటర్‌ఫెరాన్‌లు వంటివన్నీ బయోటెక్నాలజీ పద్ధతుల్లోనే తయారుచేస్తున్నారు. రీ-కాంబినెంట్ డీఎన్ఏను ఉపయోగించి తయారుచేస్తున్న అనేక ఔషధాలు, వ్యాక్సిన్లు వైద్య ఆరోగ్య రంగాల్లో విప్లవాన్ని సృష్టిస్తున్నాయి. క్యాన్సర్‌ను తగ్గించే ఔషధాలు, కృత్రిమ మృదులాస్థి, రక్తపుగడ్డలను కరిగించే ఔషధాలు, మధుమేహ చికిత్సకు ఉపయోగించే ఇన్సులిన్ లాంటివి ఉత్పత్తి అవుతున్నాయి.

ఆహార రంగం: కిణ్వ ప్రక్రియ ద్వారా తయారయ్యే బ్రెడ్, వైన్ లాంటి పదార్థాల తయారీలో బయోటెక్నాలజీ ఉపయోగపడుతోంది. ఫెర్మెంటేషన్ బయోటెక్నాలజీ ప్రస్తుతం ప్రత్యేక విభాగంగా ఏర్పాటైంది. విటమిన్లు, అమైనో ఆమ్లాలు జీవ సాంకేతికత ద్వారానే తయారవుతున్నాయి.

శక్తి రంగం: ఈ సాంకేతికతతోనే జీవ ఇంధనాలు తయారవుతున్నాయి. బయోమాస్ నుంచి ఇథైల్ ఆల్కహాల్ తయారీ, బయోడీజిల్ ఉత్పత్తి, పెట్రో పంటలు, ఆల్గల్ హైడ్రోకార్బన్స్ లాంటివి సాధ్యమవుతున్నాయి.

పర్యావరణ పరిరక్షణ: నేల, జల కాలుష్యాన్ని తగ్గించడానికి, కాలుష్య కారకాలను విచ్ఛిన్నం చేయడానికి జీవసాంకేతికత పద్ధతులు ఉపయోగపడుతున్నాయి. బయోరెమిడియేషన్, ఫైటోరెమిడియేషన్ పద్ధతుల ద్వారా కాలుష్యాన్ని తొలగిస్తున్నారు. జన్యుపరివర్తనం చెందిన సూక్ష్మజీవులను ఉపయోగించి సముద్రంలోని చమురు తెట్టలను విచ్ఛిన్నం చేస్తున్నారు.


రచయిత
డాక్టర్ బి. నరేశ్

కరెంట్ అఫైర్స్

■ కెనడా ఇండియా ఫౌండేషన్ (సీఐఎఫ్) ఇటీవల ఏ భారత ఆధ్యాత్మిక గురువుకు 'గ్లోబల్ ఇండియన్ ఆఫ్‌ది ఇయర్' పురస్కారాన్ని ప్రదానం చేసింది?



జ: సద్గురు జగ్గీ వాసుదేవ్

■ 2024 ఏసీఐ హబ్ కనెక్టివిటీ ర్యాంకింగ్స్‌లో ఆసియా-పసిఫిక్, మధ్య ప్రాచ్య ప్రాంతంలోని టాప్ 10 విమానాశ్రయాల్లో స్థానం పొందిన భారతీయ విమానాశ్రయం ఏది? (ఇది 10వ ర్యాంక్‌లో నిలిచింది. జాబితాలోని ఏకైక భారతీయ విమానాశ్రయంగా నిలిచింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, షాంఘై పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం, దోహాలోని హమద్ అంతర్జాతీయ విమానాశ్రయాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.)

మాదిరి ప్రశ్నలు

జ: ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, దిల్లీ

■ అంతర్జాతీయ ఎవరెస్ట్ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (1953లో ఇదే రోజున న్యూజిలాండ్‌కు చెందిన సర్ ఎడ్మండ్ హిల్లరీ, నేపాల్‌కు చెందిన టెన్సింగ్ నార్గే షెర్పా లు విజయవంతంగా ఎవరెస్ట్‌ను అధిరోహించిన ఘటనకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.)

మరింత సమాచారం

జ: మే 29


నెహ్రూ తీర్మానంలో సామాజిక న్యాయం!

ఇండియన్ పాలిటీ

భారత్‌కు రాజ్యాంగాన్ని రూపొందించేందుకు ఏర్పాటైన రాజ్యాంగ సభ దేశ నిర్మాణానికి పటిష్ఠమైన పునాదులు వేసింది. ప్రజలందరి ఆశయాలను ప్రతిబింబించే విధంగా ఉదాత్తమైన, ఉన్నత విలువలతో అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించింది. ఒక వైపు రాజ్యాంగ రూపకల్పన చేస్తూ, మరోవైపు స్వతంత్ర భారత మొదటి పార్లమెంటుగా వ్యవహరించింది. ఈ రాజ్యాంగ సభ నిర్మాణం నుంచి రాజ్యాంగం ఆమోదం వరకు జరిగిన పరిశ్రమ, పరిణామాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. రాజ్యాంగసభలోని సభ్యుల కూర్పు, ఎన్నిక విధానం, పలు అంశాలపై ఏర్పాటైన కమిటీలు, వాటి అధ్యక్షులు, కీలక తీర్మానాలు, తేదీలతో పాటు రాజ్యాంగంలోని మౌలిక, ప్రధాన లక్షణాలను గ్రహించిన తీరు, అందుకు ఆధారాలు, మూలాలు, తొలి ముసాయిదా, తుది ప్రతిలోని అధికరణలు, విభాగాల సంఖ్య తదితరాలను గుర్తుంచుకోవాలి.

రాజ్యాంగ సభ

1. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) భారతదేశానికి అవసరమైన రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ సభ/రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన తొలి భారతీయుడు ఎం.ఎన్.రాయ్ (1934లో).
   - బి) కేబినెట్ మిషన్ సిఫార్సుల మేరకు 1946లో రాజ్యాంగ సభకు ఎన్నికలు జరిగాయి.
   - సి) రాజ్యాంగ సభకు ప్రాతినిధ్యం వహించిన మొత్తం సభ్యులు 389 మంది.
   - డి) రాజ్యాంగ సభకు భారత స్వాతంత్ర్య చట్టం 1947 ద్వారా చట్టబద్ధత కల్పించింది.
   - 1) ఎ, బి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
2. రాజ్యాంగ సభ సభ్యుల ప్రాతినిధ్యానికి సంబంధించిన సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి 292 మంది ఎన్నికయ్యారు.
   - బి) చీఫ్ కమిషనర్ ప్రాంతాలైన దిల్లీ, అజ్మీర్, మేవార్, కూర్గ్ అండ్ బ్రిటిష్ బెలూచిస్థాన్‌ల నుంచి నలుగురు సభ్యులు నామినేట్ అయ్యారు.
   - సి) స్వదేశీ సంస్థానాల నుంచి 93 మందికి ప్రాతినిధ్యం లభించింది.
   - డి) గవర్నర్ జనరల్ ద్వారా 9 మంది నామినేట్ అయ్యారు.
   - 1) ఎ, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
3. రాజ్యాంగ సభలో సభ్యత్వం లేని ప్రముఖులను గుర్తించండి.
   - 1) మహాత్మా గాంధీ, శ్యాంప్రసాద్ ముఖర్జీ
   - 2) మహాత్మా గాంధీ, మహ్మద్ అలీ జిన్నా
   - 3) బాబూ జగ్జీవన్ రాం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్
   - 4) సర్దార్ వల్లభాయ్ పటేల్, బెనగళ నరసింగరావు (బి.ఎన్.రావు)
4. రాజ్యాంగ సభలో వివిధ వర్గాల వారికి ప్రాతినిధ్యం వహించిన ప్రముఖులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) మైనార్టీలు (అల్పసంఖ్యాక వర్గాలు) - హెచ్.సి. ముఖర్జీ
   - బి) మహిళలు - హంసామెహతా
   - సి) పారసీకులు - ఫ్రాంక్ ఆంటోని
   - డి) షెడ్యూల్డు కులాలు - డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్
   - 1) ఎ, బి, సి 2) ఎ, బి, డి 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి


హెచ్.సి.ముఖర్జీ


5. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   - ఎ) రాజ్యాంగ సభకు ఎన్నికైన మహిళలు 15 మంది.
   - బి) రాజ్యాంగ సభకు ఎన్నికైన ఏకైక ముస్లిం మహిళ బేగం ఎయిజాజ్ రసూల్.
   - సి) స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగ సభలోని సభ్యులు 299.
   - డి) రాజ్యాంగ సభకు ఎన్నికైన హిందువులు 129.
   - 1) ఎ, బి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి


ఎయిజాజ్ రసూల్

6. రాజ్యాంగ సభ తొలి సమావేశం దిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎప్పుడు జరిగింది?
   - 1) 1946, డిసెంబరు 9 2) 1946, నవంబరు 26 3) 1947, జులై 29 4) 1947, ఆగస్టు 18
7. రాజ్యాంగ సభ తొలి సమావేశానికి తాత్కాలిక అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎవరు వ్యవహరించారు?
   - 1) సచ్చిదానంద సిన్హా, ఫ్రాంక్ ఆంటోని
   - 2) బాబూ రాజేంద్రప్రసాద్, శ్యాంప్రసాద్ ముఖర్జీ
   - 3) డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ఎం.ఆర్.జయకర్
   - 4) బెనగళ నరసింగరావు, మౌలానా అబుల్ కలాం ఆజాద్
8. 1946, డిసెంబర్ 11న రాజ్యాంగసభ/రాజ్యాంగ పరిషత్‌కు శాశ్వత అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికయ్యారు?
   - 1) డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్
   - 2) బెనగళ నరసింగరావు (బి.ఎన్.రావు)
   - 3) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
   - 4) అయ్యదేవర కాళేశ్వరరావు
9. 1946, డిసెంబరు 11న రాజ్యాంగసభ/రాజ్యాంగ పరిషత్‌కు శాశ్వత ఉపాధ్యక్షులుగా ఎవరు ఎన్నికయ్యారు?
   - 1) హెచ్.సి.ముఖర్జీ, వి.టి.కృష్ణమాచారి
   - 2) హెచ్.సి.ముఖర్జీ, టి.టి.కృష్ణమాచారి
   - 3) కె.ఎం.మున్షీ, డి.పి.ఖైతాన్
   - 4) ఎన్.గోపాలస్వామి అయ్యంగార్, డి.పి.ఖైతాన్
10. రాజ్యాంగసభలో చారిత్రక లక్ష్యాలు, ఆశయాల తీర్మానాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఎప్పుడు ప్రవేశపెట్టారు?
    - 1) 1946, డిసెంబరు 12 2) 1946, డిసెంబరు 13 3) 1946, డిసెంబరు 23 4) 1946, డిసెంబరు 31
11. రాజ్యాంగ సభలో నెహ్రూ ప్రవేశపెట్టిన 'లక్ష్యాలు, ఆశయాలు' తీర్మానంలోని అంశాలను గుర్తించండి.
    - ఎ) ప్రపంచ శాంతి, మానవాళి సంక్షేమానికి భారత దేశం కృషి చేస్తుంది.
    - బి) భారతదేశం స్వతంత్ర, సార్వభౌమ, గణతంత్ర రాజ్యంగా పనిచేస్తుంది.
    - సి) భారత ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం సమానంగా అందించబడుతుంది.
    - డి) అల్పసంఖ్యాక, అణగారిన, గిరిజన, వెనుకబడిన వర్గాల వారికి ప్రత్యేక రక్షణలు కల్పిస్తారు.
    - 1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
12. చారిత్రక లక్ష్యాలు, ఆశయాల తీర్మానాన్ని రాజ్యాంగ సభ ఏకగ్రీవంగా ఎప్పుడు ఆమోదించింది?
    - 1) 1947, జనవరి 9 2) 1947, జనవరి 22 3) 1947, జనవరి 31 4) 1947, డిసెంబరు 22
13. రాజ్యాంగ రచన కోసం రాజ్యాంగ సభ ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.

ఎ) కేంద్ర రాజ్యాంగ కమిటీ	1) డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య
బి) రాజ్యాంగ ముసాయిదా కమిటీ	2) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
సి) సారథ్య కమిటీ	3) జవహర్‌లాల్ నెహ్రూ
డి) సభా కమిటీ	4) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్


    - 1) ఎ-3, బి-2, సి-4, డి-1 2) ఎ-1, బి-2, సి-4, డి-3 3) ఎ-4, బి-2, సి-1, డి-3 4) ఎ-1, బి-2, సి-3, డి-4
14. ప్రాథమిక హక్కులు, మైనారిటీ, గిరిజన వర్గాలపై రాజ్యాంగసభ ఏర్పాటు చేసిన సలహా కమిటీకి అధ్యక్షులుగా ఎవరు వ్యవహరించారు?
    - 1) సయ్యద్ మహ్మద్ సాదుల్లా
    - 2) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
    - 3) సర్దార్ వల్లభాయ్ పటేల్
    - 4) జె.బి.కృపలానీ


సర్దార్ వల్లభాయ్ పటేల్

15. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధ్యక్షతన 1947, ఆగస్టు 29న ఏర్పాటు చేసిన రాజ్యాంగ ముసాయిదా కమిటీలోని సభ్యులను గుర్తించండి.



    - ఎ) ఎన్.గోపాలస్వామి అయ్యంగార్, కె.ఎం.మున్షీ
    - బి) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, బి.ఎల్.మిట్టల్
    - సి) సయ్యద్ మహ్మద్ సాదుల్లా, డి.పి.ఖైతాన్
    - డి) హెచ్.వి.ఆర్.అయ్యంగార్, బి.ఎల్.మిట్టల్
    - 1) ఎ, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
16. రాజ్యాంగ సభ రాజ్యాంగ రచనకు ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    - ఎ) సుప్రీంకోర్టుపై ఏర్పడిన కమిటీ - ఎస్.వరదాచారియర్
    - బి) జాతీయ పతాకంపై ఏర్పడిన కమిటీ - డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్
    - సి) భాషా ప్రావిన్సులపై ఏర్పడిన కమిటీ - ఎస్.కె.థార్
    - డి) ఆర్థిక అంశాలపై ఏర్పడిన కమిటీ - నళినీ రంజన్ సర్కార్
    - 1) ఎ, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
17. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    - ఎ) రాజ్యాంగ సభకు కార్యదర్శిగా హెచ్.వి.ఆర్. అయ్యంగార్ వ్యవహరించారు.
    - బి) రాజ్యాంగ సభకు సలహాదారుడిగా బెనగళ నరసింగరావు వ్యవహరించారు.
    - సి) స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగ సభలోని సభ్యుల సంఖ్య 299.
    - డి) రాజ్యాంగ సభ చివరి సమావేశానికి అధ్యక్షులు జవహర్‌లాల్ నెహ్రూ.
    - 1) ఎ, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
18. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నేతృత్వంలోని రాజ్యాంగ ముసాయిదా కమిటీ రూపొందించిన ముసాయిదా రాజ్యాంగంలోని అంశాలను గుర్తించండి.
    - 1) ఆర్టికల్స్- 315, షెడ్యూల్స్- 8
    - 2) ఆర్టికల్స్- 395, షెడ్యూల్స్- 8
    - 3) ఆర్టికల్స్- 325, షెడ్యూల్స్- 8
    - 4) ఆర్టికల్స్- 365, షెడ్యూల్స్- 8
19. రాజ్యాంగ నిర్మాతలు భారత ప్రభుత్వ చట్టం, 1935 నుంచి దేనిని గ్రహించారు?
    - ఎ) సమాఖ్య విధానం, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు
    - బి) అత్యవసర పరిస్థితి, అధికారాలు
    - సి) స్పీకర్, డిప్యూటీ స్పీకర్ వ్యవస్థలు
    - డి) పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు
    - 1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
20. రాజ్యాంగ రూపకల్పన సమయంలో వివిధ దేశాల నుంచి గ్రహించిన అంశాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    - ఎ) ఐర్లాండ్ - ఆదేశిక సూత్రాలు, రాజ్యసభకు విశిష్ట వ్యక్తుల నియామకం.
    - బి) ఆస్ట్రేలియా - ఉమ్మడి జాబితా, పార్లమెంట్ సభ్యుల హక్కులు, సౌకర్యాలు.
    - సి) జపాన్ - జీవించే హక్కు
    - డి) కెనడా - బలమైన కేంద్ర ప్రభుత్వం, అవశిష్టాధికారాలు కేంద్రానికి లభించడం.
    - 1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
21. రాజ్యాంగ నిర్మాతలు వివిధ దేశాల నుంచి గ్రహించిన అంశాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    - ఎ) అమెరికా - న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తి, న్యాయసమీక్ష
    - బి) దక్షిణాఫ్రికా - రాజ్యాంగాన్ని సవరించే విధానం
    - సి) ఫ్రాన్స్ - ప్రొటెం స్పీకర్
    - డి) బ్రిటన్ - సమన్యాయపాలన, ఏకపౌరసత్వం
    - 1) ఎ, బి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
22. డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌ను తాత్కాలిక రాష్ట్రపతిగా ఎన్నుకున్న రాజ్యాంగ సభ చివరి సమావేశం ఎప్పుడు జరిగింది?
    - 1) 1949, నవంబరు 26 2) 1950, జనవరి 24 3) 1950, జనవరి 26 4) 1951, జనవరి 18
23. ముసాయిదా రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఎప్పుడు ఆమోదించింది?
    - 1) 1949, నవంబరు 26
    - 2) 1949, డిసెంబరు 13
    - 3) 1950, జనవరి 24 4) 1950, జనవరి 26
24. కింద పేర్కొన్న అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
    - ఎ) రాజ్యాంగ రచనకు పట్టిన సమయం - 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు.
    - బి) రాజ్యాంగ రచనకు రాజ్యాంగ సభ నిర్వహించిన మొత్తం సమావేశాలు - 11.
    - సి) రాజ్యాంగ సభకు చిహ్నం - ఏనుగు.
    - డి) రాజ్యాంగ సభకు ముఖ్య లేఖకుడు - డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్
    - 1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి


రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-4; 2-2; 3-2; 4-2; 5-3; 6-1; 7-1; 8-3; 9-1; 10-2; 11-4; 12-2; 13-1; 14-3; 15-3; 16-1; 17-3; 18-1; 19-3; 20-4; 21-4; 22-2; 23-1; 24-1.

గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక అనుపాతంలో ప్రజలు నగరాలకు వలస వెళ్లడాన్ని పట్టణీకరణగా పేర్కొంటారు. అభివృద్ధి ప్రక్రియలో ఇది ఒక పరిణామం. పారిశ్రామికీకరణ, సాంకేతిక ప్రగతి పట్టణాలు, వాటి చుట్టు పక్కల ప్రాంతాల్లో అధికంగా జరుగుతుంది. దీంతో వ్యవసాయ రంగంలోని మిగులు శ్రామికులు ఉపాధి కోసం పట్టణాల బాట పడుతున్నారు. పట్టణీకరణ వేగవంతం కావడానికి ఇదే ప్రధాన కారణం. నగరాలు నానాటికీ విస్తరిస్తుండటంతో అందులో నివసించే ప్రజలకు మౌలిక వసతుల కల్పించడం, అవసరాలు తీర్చడం అనేది ముఖ్యం. ఇందుకోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణాల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు, పథకాలను ప్రవేశపెడుతున్నాయి. వీటి గురించి పోటీపరీక్షార్థి తెలుసుకోవడం అవసరం.



విస్తరిస్తోన్న నగరాలకు.. విరివిగా సౌకర్యాల కల్పన!

మౌలిక వసతులు - పట్టణాల ఆర్థికాభివృద్ధి

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

దేశంలో జనాభా కుగ్రామాల నుంచి గ్రామాలకు, గ్రామాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి నగరాలకు, మహానగరాలకు వలస వెళ్తోంది. ఈ పరిణామంతో పెద్దపట్టణాలు, నగరాలు, మహానగరాల్లో జనాభా వేగంగా పెరుగుతోంది. 1901లో క్లాస్-4 పట్టణాల జనాభా మొత్తం దేశ జనాభాలో 6.29% ఉండగా 2011లో 0.50% మాత్రమే ఉంది. క్లాస్-3 పట్టణ జనాభా 1901లో 16.50% ఉండగా, 2011లో 14.12%కు తగ్గింది. క్లాస్-1 పట్టణ/నగరాలను పరిశీలిస్తే 1901లో 22.93% కాగా, 2011లో 60.79%గా ఉంది.

పట్టణీకరణ - ఆర్థికాభివృద్ధి

పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధి మధ్య సన్నిహిత సంబంధం ఉంటుంది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాల్లో పెరుగుదలను ఆర్థికాభివృద్ధి సూచిస్తుంది. ఆర్థికాభివృద్ధిలో పారిశ్రామికీకరణ ప్రధాన పాత్ర పోషిస్తుంది.

- రవాణా, సమాచార వ్యవస్థ, విద్యుత్ శక్తి, నైపుణ్యాలు ఉన్న శ్రామికుల లభ్యత, బ్యాంకింగ్ మొదలైన సౌకర్యాలు పట్టణాల్లో అందుబాటులో ఉంటాయి. అందుకే ఈ ప్రాంతాల్లో పారిశ్రామికీకరణ వేగంగా జరుగుతుంది.
- ఆర్థికాభివృద్ధి వల్ల తలసరి ఆదాయాలు పెరుగుతాయి. దీంతో వివిధ పారిశ్రామిక వస్తువులకు డిమాండ్ ఏర్పడుతుంది.
- వ్యవసాయ రంగంలో కంటే పారిశ్రామిక, సేవారంగాల్లో ఉత్పాదకత ఎక్కువగా ఉంటుంది. వేతనాలు అధికం.
- పట్టణీకరణలో ప్రజలు చిన్న కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తారు. కుటుంబ నియంత్రణను పాటిస్తారు.
- అధిక పట్టణీకరణ వల్ల నిరుద్యోగం, పేదరికం తగ్గుతాయని కచ్చితంగా చెప్పలేం. ఉదాహరణకు మన దేశంలో నిరుద్యోగానికి, పేదరికానికి పట్టణీకరణకు సహసంబంధం లేదు. పట్టణాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి నిమిత్తం వచ్చే మిగులు శ్రామికులకు ఇక్కడ పని లభిస్తుందని పేర్కొనలేం. నైపుణ్య లేమి, విద్యార్హత లేకపోవడం లాంటివి వీరికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి.
- పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా పరిశ్రమలు, సేవా రంగాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. వీటి నుంచే అధిక ఉత్పాదకత లభిస్తోంది. అందుకే తలసరి ఆదాయాలు, స్థూల జాతీయోత్పత్తిలో పట్టణాల వాటా ఎక్కువగా ఉంటోంది.

మార్టిన్ అండర్సన్ విశ్లేషణ

"పట్టణీకరణ అంటే ప్రజలు నగరాలకు వలస వెళ్లడమే కాదు.. వారి దృక్పథాలు, విశ్వాసాలు, విలువలు, ప్రవర్తనలో మార్పులు సంభవించడం."

– అమెరికా ఆర్థికవేత్త మార్టిన్ అండర్సన్

- పట్టణీకరణకు అయిదు లక్షణాలు ఉంటాయని అండర్సన్ వివరించారు. అవి:

1. ద్రవ్య ఆర్థిక వ్యవస్థ
2. పౌర పరిపాలన
3. సాంకేతిక మార్పులు
4. లిఖిత రికార్డులు
5. నవకల్పనలు

ప్రభుత్వ పథకాలు/ కార్యక్రమాలు

పట్టణాలకు సంస్థాగత, భౌతిక, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు అనేవి ముఖ్యమైన అంశాలు. వీటిని మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు, పథకాలు ప్రారంభించాయి. వాటిలో ముఖ్యమైన వాటిని పరిశీలిస్తే..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ పథకం (పీఎంఏవైయూ)

ఇది 2015, జూన్ 25న ప్రారంభించారు. 2022 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనేది దీని లక్ష్యం. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాలకు ఇళ్ల నిర్మాణం, ఇళ్ల కొనుగోలు, నిర్మాణంపై సబ్సిడీ, ఆర్థిక సహాయం అందిస్తారు.

- 2015 నుంచి 2025 జూన్ మధ్య కాలంలో ఈ పథకం కింద 116.97 లక్షల ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి కేంద్ర సహాయం కింద రూ.1,70,302 కోట్లు విడుదలయ్యాయి. ఇప్పటివరకు 93.2 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది.



రచయిత

బండారి ధనుంజయ

విషయ నిపుణులు

అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్)

ఈ పథకాన్ని 2015, జూన్ 25న ప్రారంభించారు. దేశవ్యాప్తంగా సుమారు 500 నగరాల్లో కనీస సదుపాయాలు కల్పించడం దీని లక్ష్యం. ముఖ్యంగా మంచినీరు, మురుగునీరు/ పారిశుద్ధ్య సౌకర్యాలు, పట్టణ రవాణా సదుపాయాలను మెరుగుపరచడంపై ఎక్కువగా దృష్టి సారిస్తారు.

- ఈ పథకం 2021లో ముగియడంతో, 2021 అక్టోబరులో అమృత్ 2.0 ప్రారంభించారు. అన్ని పట్టణ స్థానిక సంస్థలకు దీన్ని విస్తరింపజేశారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటికి మంచినీరు (హర్ ఘర్ జల్) ఇవ్వాలని, జలసంరక్షణలో భాగంగా భూగర్భజలాల పెంపు, చెరువులు లాంటి జలవనరులు మెరుగుపరచడం, మురుగునీటి శుద్ధీకరణ, సాంకేతికతను (ఐటీ) ఉపయోగించి వనరుల నిర్వహణ సమర్థంగా చేపట్టాలని నిర్ణయించారు. అమృత్-1లో 500 నగరాలపై దృష్టి సారించగా, అమృత్ 2.0లో 4,378 చట్టబద్ధమైన పట్టణాలను (స్టాట్యుటరీ టౌన్స్) చేర్చారు.

విజయాలు (2025, జూన్ నాటికి): 189 లక్షల ట్యాప్ కనెక్షన్లు అందించారు. 64,463 కి.మీ. నీటి సరఫరా నెట్‌వర్క్‌ను నిర్మించారు.

- ట్యాప్ వాటర్ కవరేజీ 2011లో 49 శాతం ఉండగా, 2025 నాటికి అది 70 శాతానికి పెరిగింది.

अमृत

Atal Mission for Rejuvenation and Urban Transformation

హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్, అగ్‌మెంటేషన్ యోజన (హృదయ్)

2015, జనవరి 21న ప్రారంభమైంది. దీన్ని కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. దీని కింద కేంద్రం గుర్తించిన వారసత్వ సంపద సంరక్షణ, పునరుద్ధరణ చేపడతారు. అక్కడ కనీస సదుపాయాలైన నీరు, పారిశుద్ధ్యం, రోడ్డు మార్గాలు, వ్యర్థాల నిర్వహణ చేపట్టడం, సాంస్కృతిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఆర్థిక వ్యవస్థలను మెరుగుపరచడం, స్థానిక సంస్థలు, వ్యక్తుల భాగస్వామ్యం పెంచడం, స్థానిక సంస్థల సామర్థ్యాలను పెంచడం మొదలైనవి చేపడతారు.

- ఇందుకోసం ప్రాథమికంగా 12 నగర/పట్టణ ప్రాంతాలను గుర్తించారు. అవి: అజ్మీర్ (రాజస్థాన్), అమరావతి (ఆంధ్రప్రదేశ్), అమృత్‌సర్ (పంజాబ్), బాదామి (కర్ణాటక), ద్వారక (గుజరాత్), గయ (బిహార్) కాంచీపురం, వేలంకన్నీ (తమిళనాడు), మధుర, వారణాసి (ఉత్తర్‌ప్రదేశ్), పూరీ (ఒడిశా), వరంగల్ (తెలంగాణ).

734 Word of the Day

Pacifist

Telugu meaning: శాంతి ప్రేమికుడు, శాంతియుత

English meaning: The word 'pacifist' (ప్యాసిఫిస్ట్) is a noun that refers to a person who believes in peace and opposes war or violence. As an adjective, it relates to such beliefs.

Synonyms: Peacemaker, Non-violent

Antonyms: Warmonger, Aggressor

Usage: **1. (As a Noun):** Being a pacifist, he refused to join the military and advocated for peaceful protests.

2. (As an Adjective): Her pacifist beliefs clashed with the government's call for armed retaliation.

Current Affairs



India and the Philippines announced the establishment of a Strategic Partnership during a State Visit by Philippine President Ferdinand R. Marcos Jr. to India, marking a significant step toward deepening bilateral cooperation. The announcement was made following bilateral talks between President Marcos and Prime Minister Narendra Modi on 5 August 2025.



On 5 August 2025, Amit Shah became the longest-serving Union Home Minister in India's history, marking a significant milestone in his political career. With 2,258 days in office, he has now surpassed Shri Lal Krishna Advani's tenure of 2,256 days as Home Minister.



Jaguar Land Rover has named PB Balaji as its Chief Executive Officer, the first Indian to hold the top position at the marquee British brand. He succeeds Adrian Mardell, who has expressed his desire to retire from JLR after three years as CEO and 35 years with the company.

The Defence Acquisition Council under the chairmanship of Defence Minister Rajnath Singh approved various proposals amounting 67 thousand crore rupees on 5 August 2025. For the Indian Army, Acceptance of Necessity was accorded for the procurement of Thermal Imager-based Driver Night Sight for infantry fighting vehicles BMP. This would enhance night driving capability of BMP and provide higher mobility and operational advantage to the Mechanised Infantry.

For more Current Affairs: Scan QR code

జాతీయ చేనేత దినోత్సవం

ఆగస్టు 7

చరిత్రలో ఈనాడు

భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా నిలిచే 'చేనేత'కు గుర్తుగా దేశవ్యాప్తంగా ఏటా ఆగస్టు 7న 'జాతీయ చేనేత దినోత్సవం'గా (National Handloom Day) నిర్వహిస్తారు. భారత్‌లో చేనేత రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. గ్రామాల్లో వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభాకు ఈ రంగమే ఉపాధి కల్పిస్తోంది. సాధారణంగా వీటిని మగ్గాలపై నేస్తారు. వీటిపై నేసే ప్రతి వస్త్రం దేనికదే ప్రత్యేకం. మన దేశంలో వెంకటగిరి, కాంచీపురం, వారణాసి మొదలైనవి సంప్రదాయ చేనేత రకాలు. ఈ వృత్తి నైపుణ్యాలు తరతరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. మన చేనేత కళాకారులు నేసే వస్త్రాలు ఖండాంతర ఖ్యాతి గడించాయి. ప్రజలు చేనేత ఉత్పత్తులు వాడేలా ప్రోత్సహించడం, ఈ రంగంలోని కార్మికులకు మద్దతు కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- ప్రాచీన కాలం నుంచే మన దేశంలో మగ్గాల ద్వారా చేనేత ఉత్పత్తి జరిగింది. మొదట్లో విధానంలో వస్త్ర ఉత్పత్తికి చాలా సమయం పట్టేది. ఇంగ్లండ్‌కు చెందిన జాన్ కే 1733లో ఫ్లై షటిల్‌ను కనిపెట్టాక మగ్గం ద్వారా వస్త్రాల ఉత్పత్తి సామర్థ్యం బాగా పెరిగింది. 1801లో జోసెఫ్ ఎం జాకార్డ్ పెద్ద డిజైన్లు రూపొందించే పరికరాన్ని పారిస్ నేషనల్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. దాన్నే ప్రస్తుతం చేనేత రంగంలో ఉపయోగిస్తున్నారు. ఆ పరికరాన్ని జాకార్డ్‌గా పిలుస్తున్నారు.



చారిత్రక నేపథ్యం:

నాటి బ్రిటిష్ రాజప్రతినిధి లార్డ్ కర్జన్ బెంగాల్‌ను రెండు రాష్ట్రాలుగా విభజిస్తూ 1905, జులై 20న అధికారిక ప్రకటన చేశాడు. దీన్ని నిరసిస్తూ అనేక ఉద్యమాలు జరిగాయి. ఆగస్టు 7న బెంగాల్ జాతీయవాదులంతా కలిసి ఒక పెద్ద సభ నిర్వహించారు. అందరూ కర్జన్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా నినదించారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తువుల వాడకాన్ని చేపట్టాలని ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. అదే స్వదేశీ ఉద్యమానికి నాందిగా నిలిచింది. ముఖ్యంగా ఇందులో చేనేత వస్త్రాల వాడకంపై ఎక్కువ చర్చ జరిగింది.

- ఈ ఉద్యమ స్ఫూర్తితో ఏటా ఆగస్టు 7న 'జాతీయ చేనేత దినోత్సవం'గా నిర్వహించాలని 2015లో భారత ప్రభుత్వం తీర్మానించింది.

జనరల్ స్టడీస్ - బయాలజీ

మైటోకాండ్రియా


కణశ్వాసక్రియలో కీలకపాత్ర పోషిస్తూ, పోషకాలను శక్తిగా మార్చే ప్రక్రియకు మైటోకాండ్రియానే కారణం. ఈ ద్విస్తరిత కణాంగాలు అనేక యూకారియోటిక్ కణాల్లో కనిపిస్తాయి. ఇవి సంక్లిష్టమైన, గతిజ నిర్మాణాన్ని ప్రదర్శిస్తాయి. మైటోకాండ్రియా నిర్మాణం, విధులు, వాటి ప్రాముఖ్యం గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన అవసరం.

మైటోకాండ్రియా అనేది నిజ కేంద్రక కణాల్లో కనిపించే ప్రధాన కణాంగం. సాధారణంగా వీటిని కణం పవర్‌హౌస్‌లు లేదా శక్త్యాగారాలుగా పేర్కొంటారు. ప్రఖ్యాత ఫిజియాలజిస్ట్‌గా పేరుగాంచిన ఆల్బర్ట్ వాన్ కొల్లికర్ మొదటిసారిగా 1857లో దీన్ని కనుక్కున్నారు.

ఆకారం, పరిమాణం

సాధారణంగా ఇవి కడ్డీ ఆకారంలో లేదా అండాకారంలో (ఓవల్) ఉంటాయి.

- వీటి పరిమాణం 0.5 నుంచి 10 మైక్రోమీటర్ల పొడవుతో ఉంటుంది.



నిర్మాణ భాగాలు

- బాహ్య పొర
- త్వచాంతర అవకాశిక (ఇంటర్‌మెంబ్రేన్ స్పేస్)
- లోపలి పొర
- క్రిస్టే
- మాతృక

సైనైడ్

ఇది మైటోకాండ్రియాను లక్ష్యంగా చేసుకొని మానవ శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రత్యేకంగా లోపలి మైటోకాండ్రియల్ పొరలోని ఎలక్ట్రాన్ రవాణా గొలుసును నిరోధిస్తుంది. విష పదార్థమైన సైనైడ్ సాధారణంగా సైటోక్రోమ్ 'సి' ఆక్సిడేజ్‌తో (కాంప్లెక్స్ iv) బంధితమవుతుంది.

మైటోకాండ్రియా ప్రత్యేక లక్షణాలు, మైటోకాండ్రియా విధులు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Posts at Homi Baba Cancer Hospital

Homi Baba Cancer Hospital & Research Centre, Bihar, is conducting interviews for the clerk, MTS, medical officer, and technician posts. The total no. of posts is 21. Eligible candidates can appear for the interview on 2025 August 18, 19, 20, 21, 22, 25.

Graduate Apprentice Posts In Bel

Bharat Electronics Limited (BEL), Bangalore is conducting interviews for the Graduate Apprentice posts. The selected candidate will get stipend amount of Rs.12,000 per month. Eligible candidates can appear for the interview on 13 August 2025.

Technician Posts

National Science Centre (NSC) of the National Council of Science Museums, New Delhi, invites online applications from eligible candidates for the Technician posts. The total no. of posts is 24. The application fee is Rs.885. The last date for online applications is 30 August 2025.

Did You Apply..?

Today (August 7) is the last date for the following Jobs

- RRB Technician Grade-I & III - 6238 posts.
- DSSSB Recruitment Notification 2025 - 2119 posts. ***Eligibility:*** Matriculation, Diploma, Bachelor's Degree, Master's Degree.
- 28 posts in Konkan Railway. ***Eligibility:*** 10th, Diploma or Degree.

For more information and other notifications - scan QR code

Bank Exams Reasoning

Theme Detection

Directions (Qs. 1 - 5): *Each of the following questions contains a small paragraph followed by a question on it. Read each paragraph carefully and answer the question given below it:*

1. The virtue of art does not allow the work to be interfered with or immediately ruled by anything other than itself. It insists that it alone shall touch the work in order to bring it into being. Art requires that nothing shall attain the work except through art itself.

This passage best supports the statement that:

A) Art is governed by external rules and conditions.

B) Art is for the sake of art and life.

C) Art is for the sake of art alone.

D) Artist realizes his dreams through his artistic creation.

E) Artist should use his art for the sake of society.

2. Though the waste of time or the expenditure on fashions is very large, yet fashions have come to stay. They will not go, come what may. However, what is now required is that strong efforts should be made to displace the excessive craze for fashion from the minds of these youngsters.

The passage best supports the statement that:

A) Fashion is the need of the day.

B) The excessive craze for fashion is detrimental to one's personality.

C) The board for fashion should be done away with so as not to let down the constructive development.

D) Work and other activities should be valued more than the outward appearance.

E) None of these

3. Due to enormous profits involved in smuggling, hundreds of persons have been attracted towards this anti-national activity. Some of them became millionaires overnight. Loot has a cast spotlight both on the Eastern and Western Coast. It has been a heaven for smugglers who have been carrying on their activities with great impunity. There is no doubt, that from time-to-time certain seizures were made by the enforcement authorities, during raids and ambushes but even allowing these losses the smugglers made huge profits.

The passage best supports the statement that:

A) Smuggling hampers the economic development of a nation.

B) Smuggling ought to be curbed.

C) Authorities are taking strict measures to curb smuggling.

D) Smuggling is fast increasing in our country owing to the quick profit it entails.

E) None of these

4. The only true education comes through the stimulation of the child's powers by the demands of the social situations in which he finds himself. Through these demands he is stimulated to act as a member of a unity, to emerge from his original narrowness of action and feeling, and to conceive himself from the standpoint of the welfare of the group to which he belongs.

The passage best supports the statement that real education:

A) Will take place if the children imbibe action and feeling.

B) Will take place if the children are physically strong.

C) Is not provided in our schools today.

D) Comes through the interaction with social situations.

E) Comes from the self-centered approach of the students.

5. Emerson said that the poet was landlord, seaboard, air lord. The flight of imagination made the poet master of land, sea and air. But a poet's dream of yesterday becomes today an actual achievement and a reality for all men. Even those who invented, improved and perfected the aeroplane could hardly have dreamt of the possibility of flight into outer space.

The passage best supports the statement that:

A) Seemingly impossible imaginations make one a good poet.

B) All imaginations become a reality someday.

C) What man imagined has never been impossible; he has always turned it a reality through his conception of ideas and sheer hard labor.

D) Man has reached the climax of technological development with his exploration into outer space.

E) None of these

Scan the QR code for Key

These model questions were prepared by

Rajesh Madhu

Asst. Prof. of Mathematics.



‘ఊరికూరికే అటూఇటూ కదలకుండా ఒకచోట కుదురుగా కూర్చుంటేనే కదా, ఏ పనిమీదన్నా ఏకాగ్రత కుదిరేది’ అనేది చాలామంది నమ్మకం. మితిమీరిన స్క్రీన్ టైమ్ వాడకంలో మునిగి కదలకుండా ఒకచోట బైఠాయించే కాలమిది. ఈ పరిస్థితుల్లో పాఠ్యాంశాలపై ధ్యాస కుదరాలంటే.. కదలాలంటున్నారు ‘ఫిడ్జెట్ టు ఫోకస్’ పుస్తక రచయితలు.

కదలికతో ఏకాగ్రత!

ఇప్పటికే ఫిడ్జెట్ బొమ్మలు, మెత్తని బంతులు.. స్టడీ టేబుళ్ల మీదా, వర్క్ టేబుళ్ల మీదా విరివిగా కనబడుతున్నాయి. ఎవరో ఒకరి చేతివేళ్ల నడుమ ఫిడ్జెట్ స్పిన్నర్ తిరిగేస్తూ కనబడుతుంది. ఫిడ్జెటింగ్ అంటే స్థిరంగా ఉండకుండా, కదులుతూ ఉండడం.

సాధారణంగా అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) ఉన్నవారు ఏ ఒక్క పనిలోనూ ధ్యాస పెట్టి, దానిలో నిమగ్నం కాలేకపోతుంటారు. అందులోనూ చేయాల్సిన పని ఆసక్తికరంగా లేకపోయినా, అయిష్టంగా చేయవలసి వచ్చినా ఆ పని మీద ఏకాగ్రత కుదరడం కష్టం.

‘ఇంద్రియ ప్రధానమైన చలన అవసరాలు ఆసక్తికరంగా, ఆనందపరిచేవిగా ఉంటే ఎన్ని పనుల మీదకు దృష్టి మళ్లినా మొదలుపెట్టిన ప్రాథమిక పని (విద్యార్థుల విషయంలో చదవడం) మీద ధ్యాస కుదురుతుంది. అలా ఫిడ్జెటింగ్ కొందరిలో ధ్యాస చెదరిపోనీకుండా .. ధ్యాస కుదిరేలా చేస్తుంది’ అంటారు ‘ఫిడ్జెట్ టు ఫోకస్’ రచయితలైన రోలండ్ రాట్జ్, సారా డి రైట్. ఏకాగ్రత లేమి ఒక అంతర్జాతీయ సమస్య. ఇష్టమున్నా లేకున్నా స్టడీ అవర్స్ పేరిట కదలకుండా కనురెప్పలైనా ఆర్పలేనంత కఠిన నియమాలు, ఒత్తిళ్ల మధ్య చదవవలసి వస్తుంది. ఇదంతా కదలకుండా ఉండడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని భావించడం వల్లనే. వాస్తవం అందుకు భిన్నంగా ఉంది.

మన ఏకాగ్రతకు సాయపడే ఫిడ్జెటింగ్ ఎలా చేయవచ్చో చూద్దాం.

1 దృశ్య (కదలిక) వ్యూహం

ఏదైనా పనిచేస్తున్నప్పుడు కూడా చుట్టూ పరిసరాలను నిశితంగా, సూక్ష్మంగా పరిశీలించడమే
- ప్రకాశవంతమైన ఫోల్డర్లు, హైలైటర్లు, కలాలు మొదలైన రంగురంగుల పరికరాలను ఉపయోగించడం .
- కిటికీలో నుంచి బయటి దృశ్యాలను చూడడం
- గోడ మీది చిత్రపటాన్నో, గోడ వారనున్న చెట్టూచేమనో, కొమ్మల నడుమ పిట్టగూడునో పరిశీలించడం.

2 వినికిడి (కదలిక) వ్యూహం

చదువుకొనేటప్పుడూ, రాసుకొనేప్పుడూ, లేదా అసైన్‌మెంట్ టాస్కులు చేసుకొనేటప్పుడూ ఏదైనా వింటూ ఉండడమే.
- లయాత్మకమైన సంగీతం వినడం
- కూనిరాగాలు తీయడం లేదా పాడడం
- గడియారం ముల్లు టిక్ టిక్ ధ్వని వినడం

3 రుచి (కదలిక) వ్యూహం

ఆహారపదార్థాలు వివిధ ఆకారాలు, రుచి, వాసన, ఉష్ణోగ్రతలతో చదవడానికి తోడ్పడే ముఖ్య పాత్ర వహిస్తాయి.
● ఉప్పు, తీపి, కారం, వగరు వంటి వివిధ ఆహార పదార్థాలను రుచి చూడండి. ● వేడి వేడి టీనో, చల్లచల్లటి నీటినో తాగండి. ● నెమ్మదిగా నమిలి తినే చిరుతిళ్ళు ● నిమ్మరసం, కొబ్బరినీళ్ల వంటి పానీయాలు

4 ముఖ (కదలిక) వ్యూహం

చదువుకొనేటప్పుడు..
- పెన్నునో, చూయింగ్ గమ్‌నో నమలడం
- కొద్ది కొద్దిగా సిప్ చేస్తూ కాఫీనో, పానీయాన్నో తాగడం.
- ఏలక్కాయ, లవంగం, బాదం లాంటివి నోట్లో వేసుకోవడం

5 స్పర్శ (కదలిక) వ్యూహం

ఏదైనా మాట్లాడుతున్నప్పుడు, వినేటప్పుడు ఏకాగ్రతకోసం ఉపయోగపడే వ్యూహాలు..
- నోట్స్ రాసుకోవడం, డూడుల్స్ గీసుకోవడం
- ఫిడ్జెట్ బొమ్మలు, బంతులు, స్పిన్నర్, స్లింకీ వంటివి వాడడం
- జుట్టును సవరించుకోవడం, బట్టలను సరిచేసుకోవడం.. ● తాళాల గుత్తి తిప్పడం

6 శరీర (కదలిక) వ్యూహం

చదువుకొనేటప్పుడు ఏకాగ్రతకోసం వ్యూహాత్మకంగా శరీరాన్ని కదిలించడమన్నమాట.
● వ్యాయామం, నడక, జాగింగ్, బైక్ రైడింగ్ తదితరాలు
● కుర్చీలో కదలడం ● లేచి నిలబడడం ● వడివడిగా నడవడం ● కాలి వేళ్లను కదిలించడం


ఎవరికి ఏ రకమైన కదలికలు (ఫిడ్జెటింగ్) సాయపడతాయి అనేది స్వానుభవంతో తెలుస్తుంది. ఎవరికి అనువుగా, అనుకూలంగా ఉన్న చిట్కాలను వారు పాటించాలి. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం.. మన ఫిడ్జెటింగ్ ఇతరులను ఇబ్బంది పెట్టనీయకుండా అప్రమత్తంగా ఉండాలి.

మూలభావన ఏమిటంటే- ఒకే చోట గిరిగీసుకొని బిగించుకు కూర్చుంటే సరిపోదు. మరింత ముఖ్యంగా, తెరకే కళ్లప్పజెప్పి ఊరుకోకుండా కాస్త తాజాగాలిని పీల్చండి. విశాలమైన ఆకాశం, పచ్చటి పరిసరాల వైపు దృష్టి మళ్ళించండి. పక్షుల కువకువలు, కుక్కర్ లేదా ట్రాఫిక్ శబ్దాలను కూడా వినండి. వివిధ రుచులూ, కమ్మటి సువాసనలను ఆస్వాదించండి. కాస్త కాలు కదపండి. చేతులు మెదపండి. ద్విగుణీకృతమైన ఉత్సాహం పుంజుకొని ఏకాగ్రతతో పఠనం, అభ్యాసం, పరీక్ష సన్నద్ధత కొనసాగించండి.



– చంద్రలత

ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఐటీలోనే కాదు.. ఆర్మీలోనూ ఆకర్షణీయ వేతనాలు ఉంటాయి. ఉద్యోగ భద్రతకు తిరుగుండదు. అర్హతలు, ఆసక్తి ఉన్నవారు ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) టెక్నికల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. శిక్షణ అనంతరం పీజీ డిప్లొమా అందుకుని, లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగంలో చేరిపోవచ్చు. పెళ్లికాని పురుషులు, మహిళలు 379 పోస్టులకు పోటీపడవచ్చు. ఎంపికైనవారు సుమారు రూ.18 లక్షల వార్షిక వేతనం అందుకోవచ్చు.



బీటెక్‌తో ఆర్మీలోకి..

■ వార్షిక వేతనం రూ.18 లక్షలు
■ మహిళలూ అర్హులే

దాదాపు ఏటా రెండుసార్లు ఇండియన్ ఆర్మీ ఎస్ఎస్‌సీ టెక్ పోస్టులకు ప్రకటన విడుదలచేస్తోంది. అందువల్ల రక్షణ రంగంలో సేవలందించాలనుకున్న ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు వీటిని లక్ష్యంగా చేసుకోవచ్చు. రాత పరీక్ష లేదు. ఇంటర్వ్యూలో మెరిస్తే చాలు.. చదువుకున్న బ్రాంచీ నేపథ్యంతోనే ఉద్యోగ విధులు నిర్వర్తించవచ్చు. తక్కువ వ్యవధిలోనే అత్యున్నత స్థాయినీ చేరుకోవచ్చు.

ఎంపిక..

దరఖాస్తులను గ్రాడ్యుయేషన్ (బీటెక్) మార్కులతో వడపోస్తారు. ఇలా అవకాశం వచ్చినవారిని సెలక్షన్ కేంద్రాల్లో ఇంటర్వ్యూకి ఆహ్వానిస్తారు. ఏపీ, తెలంగాణ వారికి బెంగళూరులో ముఖాముఖి ఉంటుంది. సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్ ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తారు. ఇవి రెండు దశల్లో ఐదు రోజులు కొనసాగుతాయి. తొలిరోజు స్టేజ్-1లో ఉత్తీర్ణులైతే తర్వాతి 4 రోజులు నిర్వహించే స్టేజ్-2 ఇంటర్వ్యూలో కొనసాగుతారు. ఇందులోనూ విజయవంతమైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణకు తీసుకుంటారు.

శిక్షణ.. వేతనాలు..

ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీలో ఏప్రిల్, 2026 నుంచి శిక్షణ మొదలవుతుంది. వ్యవధి 49 వారాలు. ఈ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ అందిస్తుంది. వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఉద్యోగంలో లెవెల్-10 రూ.56,100 మూల వేతనంతోపాటు మిలటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి. తొలి నెల నుంచే అన్నీ కలిపి రూ.1.5 లక్షల వరకు పొందవచ్చు. పదేళ్లు విధుల్లో కొనసాగవచ్చు. అనంతరం సంస్థ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల ప్రకారం కొందరిని శాశ్వత విధుల్లోకి (పర్మనెంట్ కమిషన్) తీసుకుంటారు. మిగిలినవారికి మరో నాలుగేళ్లపాటు సర్వీస్ పొడిగిస్తారు. ఆ వ్యవధి తర్వాత వీరు వైదొలగాలి. లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగంలో చేరినవాళ్లు.. రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల సేవలతో మేజర్, 13 ఏళ్లు కొనసాగితే లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు చేరుకోవచ్చు.

వివరాలు

ఖాళీలు: 379. పురుషులకు 350, మహిళలకు 29 (వీటిలో ఆర్మీ విడోలకు 2 కేటాయించారు) మెన్ పోస్టుల్లో విభాగాలవారీ.. సివిల్ 75, కంప్యూటర్ 60, ఎలక్ట్రికల్ 33, ఎలక్ట్రానిక్స్ 64, మెకానికల్ 101, మిగతా బ్రాంచీల్లో 17 ఉన్నాయి. మహిళలకు.. సివిల్ 7, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ 4, ఎలక్ట్రికల్ 3, ఎలక్ట్రానిక్స్ 6, మెకానికల్ 9 ఉన్నాయి.


విద్యార్హత: సంబంధిత/ అనుబంధ విభాగాల్లో ఇంజినీరింగ్ పూర్తి చేసినవారు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ సైన్స్ ఖాళీలకు.. బీటెక్ (ఐటీ), ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులవారూ అర్హులే. డిఫెన్స్ విడో ఖాళీల్లో ఒక పోస్టుకు ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు, మరొకదానికి ఇంజినీరింగ్ వాళ్లు పోటీపడొచ్చు.

వయసు: 01.04.2026 నాటికి 20 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. 01.04.1999 - 31.03.2006 మధ్య జన్మించినవారు అర్హులు. ఆర్మీ విడోలకు గరిష్ఠ వయసు 35 ఏళ్లు మించరాదు.

ఆన్‌లైన్ దరఖాస్తులు: 22.08.2025 మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారు.

వెబ్‌సైట్: https://www.joinindianarmy.nic.in/

ఎంఎస్ యాక్సెస్‌కు ఏ ప్రత్యేకత?



వివిధ పోటీ పరీక్షల్లో కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షిస్తున్నారు. దీనిపై ఏ అంశాల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో గమనించుకోవాలి.

ఎంఎస్ ఆఫీస్ అప్లికేషన్లలో ముఖ్యమైన ఎంఎస్ వర్డ్, ఎంస్ ఎక్సెల్, ఎంఎస్ పవర్ పాయింట్, ఎంఎస్ యాక్సెస్‌ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

మైక్రోసాఫ్ట్ వర్డ్

టెక్స్ట్ ఫైళ్లను సృష్టించడానికి అత్యంత అనుకూలమైనది. డాక్యుమెంట్లను సృష్టించడం, ఎడిటింగ్, ఫార్మాట్ చేయడంతో పాటు వాడుకలో సౌలభ్యానికి ఇది ప్రసిద్ధి చెందింది. మైక్రోసాఫ్ట్ వర్డ్ ఇంటర్‌ఫేజ్‌లో వివిధ రకాల టాబ్‌లు, వాటిలో ఉండే వివిధ రకాల కమాండ్లను సూచించే బటన్‌లైన న్యూ, ఓపెన్, సేవ్, సేవ్ యాజ్, ప్రింట్, షేర్, ఎక్స్‌పోర్ట్, క్లోజ్, హోమ్, ఇన్‌సర్ట్, డ్రా, డిజైన్, లేఔట్, రిఫరెన్సెస్, మెయిలింగ్, రివ్యూ, వ్యూ, అనుబంధ బటన్ల గురించి వివరంగా గ్రహించాలి.

ఎంఎస్ ఎక్సెల్

వ్యాపారం, వాణిజ్యంతో పాటు ఎన్నో రంగాల్లో వినియోగించే వివిధ రకాల గణిత గణనలు, గ్రాఫ్ సాధనాలు, పట్టికలు, మాక్రో ప్రోగ్రామింగ్ మొదలైన వివిధ కార్యకలాపాలను సులభంగా నిర్వహించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది.

టైటిల్ బార్, మెనూ బార్, టూల్ బార్, టాస్క్ పేన్, స్టేటస్ బార్ లాంటి ఎలిమెంట్స్ ఏయే పనులు నిర్వహిస్తాయో తెలుసుకోవాలి. సెల్స్ సెలెక్ట్ చేయడం, రో, కాలమ్స్‌కు ముందు కొత్తగా రో/ కాలమ్స్ ఇన్సర్ట్ చేయడం, సైజ్ మార్చడం, డేటా ఎడిట్ చేయడం, ఇన్సర్ట్ చేయడం, తొలగించడం, ప్రింట్ చేయడానికి ఏ విధమైన సూచనలు ఇవ్వాలో నేర్చుకోవాలి.

ఎంఎస్ ఎక్సెల్ స్ప్రెడ్ షీట్లోని సెల్‌ను ఫార్మాట్ చేయడానికి కింది దశల్లో దేన్ని ఉపయోగిస్తారు?

ఎ) వ్యూ - సెలెక్ట్ సెల్- ఫార్మాట్
బి) సెలెక్ట్ సెల్- రైట్ క్లిక్ - ఫార్మాట్ సెల్
సి) మెనూ- సెలెక్ట్ సెల్ - ఫార్మాట్
డి) సెలెక్ట్ సెల్- వ్యూ- ఫార్మాట్ సెల్

జవాబు: బి

ఎంఎస్ ఎక్సెల్ 2010లో వర్క్‌షీట్లోని అదే సెల్‌లో కొత్త లైన్‌ను నమోదు చేయడానికి కింది కీ బోర్డ్ షార్ట్‌కట్‌లలో దేన్ని ఉపయోగిస్తారు?

ఎ) టాబ్ + ఎంటర్
బి) కంట్రోల్ + ఎంటర్
సి) షిఫ్ట్ + ఎంటర్
డి) ఆల్ట్+ ఎంటర్

జవాబు: డి

ఎంఎస్ పవర్ పాయింట్

సంస్థాగత, వ్యక్తిగత ప్రాజెక్టుల కోసం దృశ్యపరంగా ప్రభావవంతమైన ప్రజెంటేషన్లను రూపొందించడానికి ముఖ్య సాధనమైన పవర్ పాయింట్‌పై పోటీ పరీక్షల్లో ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి. పవర్ పాయింట్‌లో ఉండే మెనూలు: ఫైల్, ఎడిట్, వ్యూ, ఇన్సర్ట్, ఫార్మాట్, టూల్స్, స్లైడ్ షో, విండో, హెల్ప్. ఆయా మెనూలను సూచించడానికి షార్ట్ కట్ కీలను తెలుసుకోవాలి. ప్రజంటేషన్‌లో ఉండే కాంపోనెంట్స్ అయిన స్లైడ్స్, ఔట్ లైన్స్, స్పీకర్ నోట్స్, హ్యాండ్ అవుట్స్ గురించీ గ్రహించాలి. స్లైడ్స్ తయారు చేయడంలో, ఉపయోగపడే స్లైడ్ల బ్యాక్ గ్రౌండ్ మార్చడం, కలర్ స్కీమ్ మార్చడం, క్లిప్ ఆర్ట్‌ను యాడ్ చేయడం వంటివి ముఖ్యం.

పవర్ పాయింట్‌ను ఎవరు కనుగొన్నారు?

ఎ) అలాన్ ట్యూరింగ్ బి) బిల్ గేట్స్
సి) రాబర్ట్ గాస్కిన్స్, డెన్నిస్ ఆస్టిన్
డి) స్టీవ్ జాబ్స్

జవాబు : సి

ఎంఎస్ యాక్సెస్

ఒకే తరహా డేటా బేస్‌ను 255 మంది యూజర్లు ఒకేసారి యాక్సెస్ చేయగలిగిన మల్టీ యూజర్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీబీఎంఎస్) అయిన ఎంఎస్ యాక్సెస్ గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలి. డేటాబేస్ సాఫ్ట్‌వేర్‌లోని డేటాను సులభంగా ఇంటర్నెట్‌పై ఉంచగలగటానికి ఎంఎస్ యాక్సెస్ అనువైనదిగా చెప్పుకోవచ్చు. యాక్సెస్ డేటా బేస్‌కి చెందిన కాంపోనెంట్స్..టేబుల్స్, క్వైరీస్, ఫార్మ్స్, మాక్రోస్, మాడ్యూల్స్‌పై అవగాహన అవసరం. యాక్సెస్ ఫీచర్స్‌లో ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సినవి: ఎక్స్ టర్నల్ ఫైల్స్ ఎగుమతి, దిగుమతి, విజార్డ్స్, బిల్ట్ ఇన్ ఫంక్షన్స్, బిల్ట్ ఇన్ సెక్యూరిటీ.

ఇవేకాకుండా యుటిలిటీ సాఫ్ట్‌వేర్‌లు అయిన యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ల గురించీ, డిస్క్ డిఫ్రాంగ్మెంటార్ టూల్స్, ఫైల్ మేనేజ్‌మెంట్ టూల్స్, డిస్క్ క్లీన్‌అప్ టూల్స్, టెక్స్ట్ ఎడిటర్స్‌పై అవగాహన పెంచుకోవడం మేలు.

– డా. చెన్నంశెట్టి రమేష్

ఇంటర్ లేకుండా పీజీ?

పదోతరగతి 1998లో పాస్ అయ్యాను, 1999-2000లో ఇంటర్మీడియట్ మధ్యలో వదిలివేసి.. 2000-2003 ఓపెన్ యూనివర్సిటీలో బీకాం థర్డ్ క్లాసులో పూర్తిచేశాను. ఇప్పుడు పీజీ చేయడానికి అర్హుడినేనా? ఈ డిగ్రీ చెల్లుబాటు అవుతుందా? ఎందుకంటే కొన్ని యూనివర్సిటీలు పీజీ చేయడానికి ఇంటర్ తప్పనిసరిగా చదివుండాలి అంటున్నాయి. అలాగే కొన్ని కంపెనీలు 10+2+3 ఎడ్యుకేషన్ ఉండాలంటున్నాయి. కొందరేమో ఇప్పుడు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్మీడియట్ చేస్తే.. నా డిగ్రీ చెల్లుబాటు అవుతుంది అంటున్నారు. సలహా ఇవ్వగలరు. – రాజు

■ మీ ప్రస్తుత వయసు దాదాపు 42 సంవత్సరాలు ఉండొచ్చు. ఒకవేళ, ఇప్పుడు ఇంటర్మీడియట్ ఓపెన్‌లో పూర్తిచేస్తే, అప్పటికి మీకు 45 ఏళ్లు వస్తాయి. అంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి మీ వయసు సహకరించకపోయే ప్రమాదం ఉంది. పీజీ చేసి, ఏ రంగంలో, ఎలాంటి ఉద్యోగాల కోసం ప్రయత్నించాలని అనుకుంటున్నారు? ప్రస్తుతం ఏం చేస్తున్నారు? ఏ రంగంలో స్థిరపడాలి అనుకుంటున్నారు? అనే విషయాలను బట్టి సరైన మార్గాన్ని ఎంచుకోవాలి. డిగ్రీ పూర్తి చేశాక ఇంటర్మీడియట్ చేస్తే.. 10+2+3 నిబంధన ప్రకారం విద్యను అభ్యసించినట్లు కాదు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ సొసైటీలో చేయడం వల్ల 10+3+2 విధానంలో చదివినట్లు అవుతుంది. ఇలా చేయడం కొన్ని యూనివర్సిటీలతోపాటు, చాలా కంపెనీలకు కూడా ఆమోదయోగ్యం కాకపోవచ్చు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు కూడా ఇంటర్మీడియట్ చదివిన తర్వాత డిగ్రీ చదివితేనే దరఖాస్తు చేయడానికి అవకాశం ఉంటుంది. బీకాం డిగ్రీలో థర్డ్‌క్లాస్ ఉంది కాబట్టి, ఇప్పుడు ఇంటర్మీడియట్, డిగ్రీలను మంచి మార్కులతో పూర్తిచేయండి. డిగ్రీలో కూడా నైపుణ్యాలు పెంచుకోవడానికి, ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సుని ఎంచుకోండి. ఆసక్తి ఉంటే పీజీ చేసే ప్రయత్నం చేయండి. డిగ్రీలు, సర్టిఫికెట్లు పొందడానికి ముందు.. త్వరగా ఉపాధి పొందడానికి అవకాశమున్న స్వల్పకాలిక ప్రొఫెషనల్ కోర్సులు చేయడంపై దృష్టి పెట్టండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఎస్‌బీఐలో 6,589 జూనియర్ అసోసియేట్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్): 6,589 (రెగ్యులర్: 5,180 + బ్యాక్‌లాగ్: 1,409)

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ

వయసు: 2025 ఏప్రిల్ 1 నాటికి 20 ఏళ్ల నుంచి 28 ఏళ్లు ఉండాలి. 02.04.1997 - 01.04.2005 మధ్య జన్మించి ఉండాలి. ఓబీసీలకు 3 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10 నుంచి 15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

వేతన శ్రేణి: నెలకు రూ.24,050 - రూ.64,480.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 26.08.2025

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.750. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఎక్స్‌ఎస్, డీఎక్స్‌ఎస్‌కు ఫీజు లేదు.

ఎంపిక: ● ప్రిలిమినరీ పరీక్ష ● మెయిన్స్ పరీక్ష ● స్థానిక భాషా పరీక్షతో

వెబ్‌సైట్: https://sbi.co.in/web/careers/Current-openings

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 417 మేనేజర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా వివిధ విభాగాల్లోని మేనేజర్, ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: సేల్స్, అగ్రి మార్కెటింగ్.
- మేనేజర్ (సేల్స్): 227,
- అగ్రి మార్కెటింగ్ ఆఫీసర్: 142,
- అగ్రి మార్కెటింగ్ మేనేజర్: 48

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: మేనేజర్ పోస్టులకు 24 ఏళ్ల నుంచి 34 ఏళ్లు, ఆఫీసర్‌కు 24 నుంచి 36 ఏళ్లు, అగ్రి మార్కెటింగ్ మేనేజర్‌కు 26 నుంచి 42 ఏళ్లు.

వేతన శ్రేణి: నెలకు మేనేజర్‌కు రూ.64,820 - రూ.93,960, ఆఫీసర్‌కు రూ.48,480 - రూ.85,920.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 26.08.2025

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.850. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈఎస్ఎం, డీఈఎస్ఎం, మహిళలకు రూ.175.

ఎంపిక: రాత పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://www.bankofbaroda.in/career/

వాక్ ఇన్స్

టీఎంసీలో మెడికల్ ఆఫీసర్ ఖాళీలు

వారణాసిలోని టాటా మెమోరియల్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ (పీడియాట్రిక్ మెడిసిన్/ రేడియేషన్ ఆంకాలజీ /పాలియేటివ్ మెడిసిన్ /అనస్థీషియాలజీ)

వేతన శ్రేణి: నెలకు రూ.1,04,000 - 1,28,000.

దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా. recruitment@mpmmcc.tmc.gov.inకు పంపాలి.

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూతో.

దరఖాస్తుకు చివరి తేదీ: 11.08.2025.

ఇంటర్వ్యూ తేదీ: 14.08.2025. **వేదిక:** మహామాన పండిట్ మదన్ మోహన్ మాలవీయ క్యాన్సర్ సెంటర్ వారణాసి, ఉత్తర్‌ప్రదేశ్. **వెబ్‌సైట్:** https://tmc.gov.in/m_events/events/jobvacancies

ఈఎస్ఐసీ కలబురిగిలో..

కర్ణాటక రాష్ట్రం కలబురిగిలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 20. ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-4, అసిస్టెంట్ ప్రొఫెసర్-15.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బీడీఎస్ (డెంటల్ సర్జరీ)తో పాటు ఉద్యోగ అనుభవం ఉండాలి. **వయసు:** 21.08.2021 నాటికి 63 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,34,630. అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,56,024. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,34,046.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 20, 21

వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

ఐఐటీ తిరుపతిలో.. నాన్ టీచింగ్ పోస్టులు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీటీ).. 42 నాన్-టీచింగ్ పోస్టులను భర్తీచేయనుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఎంపిక చేయనున్నారు.

మొత్తం ఉద్యోగాలను మూడు గ్రూపులుగా విభజించారు.

గ్రూప్-ఏ: అసిస్టెంట్ రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్)-1 (డిప్యుటేషన్ ప్రాతిపదికన రెండేళ్లకు ఎంపిక చేస్తారు), టెక్నికల్ ఆఫీసర్-1, సెక్యూరిటీ ఆఫీసర్-1

గ్రూప్-బీ: సెక్షన్ ఆఫీసర్-2, జూనియర్ సూపరింటెండెంట్-7, జూనియర్ ఇంజినీర్ (సివిల్)-1, జూనియర్ స్పోర్ట్స్ ఆఫీసర్-1. జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-6

గ్రూప్-సీ: జూనియర్ అసిస్టెంట్-12, జూనియర్ టెక్నీషియన్-10

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు...

● **జూనియర్ సూపరింటెండెంట్:** మాస్టర్స్ డిగ్రీ, అడ్మినిస్ట్రేటివ్/ ఫైనాన్స్/ అకౌంటింగ్/ లీగల్/ ఆడిట్/ స్టోర్స్ అండ్ పర్చేజ్ రంగంలో మూడేళ్ల అనుభవం. లేదా డిగ్రీ, సంబంధిత రంగంలో నాలుగేళ్ల ఉద్యోగానుభవం. వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం.



● **జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్:** బీఈ/ బీటెక్/ ఎంసీఏ/ ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్)/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సంబంధిత రంగంలో రెండేళ్ల అనుభవం. లేదా బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్)/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ బీసీఏ, సంబంధిత రంగంలో నాలుగేళ్ల ఉద్యోగానుభవం. వెబ్ టెక్నాలజీస్, అడ్మినిస్ట్రేషన్, కమ్యూనికేషన్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, వెబ్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలు ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.

● **జూనియర్ అసిస్టెంట్:** డిగ్రీ, ఎంఎస్-వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ పరిజ్ఞానం ఉండాలి.

● **జూనియర్ టెక్నీషియన్:** కెమికల్/ సివిల్ బ్రాంచితో బీఈ/ బీటెక్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో ఎంఎస్సీ/ ఎంసీఏ. లేదా బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)/ బీసీఏ.

వయసు: జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ ఇంజినీర్, జూనియర్ స్పోర్ట్స్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్‌లకు 35 ఏళ్లు, జూనియర్ టెక్నీషియన్ పోస్టుకు 32 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ-ఎన్‌సీఎల్‌లకు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ, బీ, సీ పోస్టులకు వరుసగా రూ.500, 300, 200. ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగులు/ మహిళలు/ దివ్యాంగులు/ ట్రాన్స్‌జెండర్లకు ఫీజు లేదు.

వేతన శ్రేణి: గ్రూప్-ఏ పోస్టులకు నెలకు రూ.56,100-1,77,500. గ్రూప్-బీ పోస్టులకు నెలకు రూ.47,600-1,51,100. గ్రూప్-సీ పోస్టులకు నెలకు 25,500-81,100.

ఎంపిక ఇలా: గ్రూప్-ఏ పోస్టులకు.. స్క్రీనింగ్ టెస్ట్/ ఇంటర్వ్యూ లేదా రెండూ నిర్వహించవచ్చు. గ్రూప్-బీ, సీ పోస్టులకు.. ఆబ్జెక్టివ్ బేస్డ్ టెస్ట్, రాత పరీక్ష (డిస్క్రిప్టివ్), స్కిల్ టెస్ట్/ ట్రేడ్ టెస్ట్ ఉంటాయి. రాత పరీక్ష, ఇంటర్వ్యూల వివరాలను అభ్యర్థి ఈమెయిల్‌కు తెలియజేస్తారు. వెబ్‌సైట్‌లోనూ అందుబాటులోనూ ఉంచుతారు.

● ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసేవారు.. ప్రతి పోస్టుకూ వేర్వేరుగా దరఖాస్తు నింపి.. ఫీజు చెల్లించాలి.

● ధ్రువపత్రాల పరిశీలన/ రాత పరీక్ష/ ఇంటర్వ్యూ సమయంలో ‘నో అబ్జెక్షన్ సర్టిఫికెట్’ను సమర్పించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.08.2025

వెబ్‌సైట్: https://www.iittp.ac.in/recruitment

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్

సంస్థ: యాడ్‌వర్‌గో ప్రై.లి.
నైపుణ్యం: మార్కెటింగ్
స్టైపెండ్: రూ.7,000-26,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 16
☛ https://shorturl.at/nOkWm

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: డెలిమేట్ నైపుణ్యాలు: అడోబ్ ప్రీమియర్ ప్రో, క్రియేటివ్ థింకింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 20
☛ https://shorturl.at/1zfmI

ఇన్‌సైడ్ సేల్స్

సంస్థ: టీచ్ మవెన్ నైపుణ్యాలు: అడాప్టబిలిటీ, కన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, నెగోషియేషన్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సేల్స్
స్టైపెండ్: రూ.20,000-27,000
☛ https://shorturl.at/vfBVh

ఫ్లట్టర్ డెవలప్‌మెంట్

సంస్థ: అప్టాగ్రిమ్ కన్సల్టింగ్ ప్రై.లి. నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, డార్ట్, ఫ్లట్టర్, రెస్ట్ ఏపీఐ స్టైపెండ్: రూ.13,000-15,000 ☛ https://shorturl.at/JamvN

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: రిక్వెస్ట్ ఐటీ సపోర్ట్ నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, క్లయింట్ రిలేషన్‌షిప్, కంప్యూటర్ స్కిల్స్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మార్కెటింగ్, సేల్స్, తెలుగు మాట్లాడటం, వెబ్ డెవలప్‌మెంట్ స్టైపెండ్: రూ.15,000-25,000 ☛ https://shorturl.at/JVKrf

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 18

గుంటూరులో

ఫైనాన్స్

సంస్థ: వీకే హోల్డింగ్స్
నైపుణ్యాలు: ఫైనాన్షియల్ అనలిటిక్స్, ఇన్వెస్టింగ్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 23
☛ https://shorturl.at/FhJ94

ప్రకృతి విధ్వంసంతోనే ప్రకోపం!

విచ్చలవిడిగా రోడ్లు, పర్యాటక భవనాల నిర్మాణాలు • అడవుల నరికివేత • ధరాలీ వరద విలయంపై నిపుణుల విశ్లేషణ

హిమాలయ పర్వత సానువుల్లో ప్రకృతి విధ్వంసమే విపత్తులకు కారణమవుతుందా.. విచ్చలవిడిగా రోడ్లు, పర్యాటక భవనాల నిర్మాణం.. అడవుల నరికివేత ఆ ప్రాంతాలను కోలుకోలేని దెబ్బతీస్తుందా.. స్థిరంగా ఉండని నదీ తీరాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకోవడం విలయాలకు దారితీస్తోందా.. అంటే అవుననే అంటున్నారు పర్యావరణ నిపుణులు.



కేదార్‌నాథ్ నుంచి ధరాలీ దాకా..

2004లో వచ్చిన సునామీ తర్వాత దేశంలో అతి పెద్ద వరద విలయం కేదార్‌నాథ్‌లో 2013లో చోటుచేసుకుంది. కేదార్‌నాథ్‌లో 24 గంటల్లో 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతోపాటు మంచు కరగడంతో ఒక్కసారిగా వరద విరుచుకుపడింది. ఫలితంగా చోరాబరి సరస్సుపై ఉన్న డ్యాం కొట్టుకుపోయి 5,700 మంది మరణానికి కారణమైంది. అప్పటి నుంచి గత 12 ఏళ్లుగా హిమాలయాల్లో తరచూ విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయి.

✦ 2019 ఆగస్టు 18వ తేదీన మేఘ విస్ఫోటంతో తికోచి, మాకుడి గ్రామాలను వరద ముంచెత్తింది. ఈ ఘటనలో 19 మంది మరణించగా.. 38 గ్రామాలపై ప్రభావం పడింది.

✦ 2021 ఫిబ్రవరిలో మంచు చరియలు విరిగిపడి రోంటి గాడ్‌లో వరదతోపాటు రాళ్లు కొట్టుకొచ్చాయి. దీనివల్ల చమోలీలో రెండు జల విద్యుత్తు ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. 84 మృతదేహాలు లభించగా.. 204 మంది ఆచూకీ దొరకలేదు.

✦ 2022 ఆగస్టులో మేఘ విస్ఫోటంతో వచ్చిన ఆకస్మిక వరదల కారణంగా.. మాల్‌దేవ్‌తా-సాంగ్-బల్దీ నది ఉప్పొంగి.. మాల్‌దేవ్‌తా పట్టణాన్ని ముంచెత్తింది.

చమోలీ విపత్తుతో పోలిక

మంగళవారం ధరాలీలో వచ్చిన ఆకస్మిక వరద.. 2021లో చమోలీ విపత్తును పోలి ఉంది. వర్షపాతం ఒక్కటే కారణం కాదని, మరిన్ని కారణాలున్నాయని నిపుణులు అంటున్నారు.

✦ 2010 తర్వాత ఉత్తరాఖండ్‌లో అతి భారీ వర్షపాతం నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

✦ 2020 నుంచి 23ల మధ్య విపత్తుల డేటాను విశ్లేషించగా.. ఉత్తరాఖండ్‌లో 183 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇది కేవలం రుతుపవనాల కాలంలోనే కావడం గమనార్హం. ఈ విపత్తులకు.. 34.4 శాతం కొండచరియలు విరిగిపడటం, 26.5 శాతం ఆకస్మిక వరదలు, 14శాతం మేఘ విస్ఫోటాలు కారణమయ్యాయి.

✦ 2022 జనవరి, 2025 మార్చి మధ్య డేటాను విశ్లేషించగా.. 13 హిమాలయ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 822 రోజులపాటు అతి ప్రమాదకర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. దీనివల్ల 2,863 మంది ప్రాణాలు కోల్పోయారు.

మానవ ప్రమేయం వల్లే..

మానవ ప్రమేయంవల్లే ఇటువంటి భారీ విపత్తులు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో నియంత్రణ లేకుండా విచ్చలవిడిగా రోడ్లు నిర్మిస్తున్నారని, భవనాలను కడుతున్నారని, అడవులను నరుకుతున్నారని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యాటకుల కోసం చేపట్టిన నిర్మాణాలూ విధ్వంసానికి కారణమవుతున్నాయని అంటున్నారు. ఇంకా నదీ తీరాల్లో నివాసాల ఏర్పాటూ ప్రమాదకరమేనని చెబుతున్నారు.

✦ కేదార్‌నాథ్, చమోలీ, జోషిమఠ్, సిరోబా గడ్, క్వారబ్, యమునోత్రి విపత్తులు ఉత్తరాఖండ్‌ను అగాధంలోని నెట్టాయని, ఈ ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి ఆ రాష్ట్ర చరిత్రను మార్చలేదని పర్యావరణ ఉద్యమకారుడు అనూప్ నైతియాల్ అభిప్రాయపడ్డారు.

✦ ఉత్తర కాశీ విపత్తు.. గ్లోబల్ వార్మింగ్, రుతుపవనాల అతి స్పందన, అభివృద్ధి పేరుతో జరుగుతున్న అశాస్త్రీయ, అస్థిరమైన నిర్మాణాల కారణంగానేనని వాతావరణ ఉద్యమకారుడు హర్జీత్ సింగ్ పేర్కొన్నారు.

అతివృష్టి, కొండచరియలే కాదు..

హిమాలయ రాష్ట్రాల్లో విపత్తులకు అతి వృష్టి.. కొండచరియలు విరిగిపడటమే కారణం కాదు. హిమనీనదాల్లో అనూహ్య వాతావరణ మార్పులు, హిమ ప్రాంతాల్లోని సరస్సులు ఉప్పొంగడమూ కారణమేనని నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాఖండ్‌లో 1,260 హిమ సరస్సులున్నాయి. ఇందులో 13 ప్రమాదకరమైనవని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఎంఏ) వెల్లడించింది. వీటిలో 5 సరస్సులు మరీ ప్రమాదకరంగా ఉంటాయని తెలిపింది. మంచు కరిగినప్పుడు ఇవి సమీపంలోని ప్రాంతాలపై విరుచుకుపడుతుంటాయి.

శాటిలైట్ చిత్రాలతో నిర్ధారణ

అధిక వర్షంతోపాటు మంచు రాశులు అకస్మాత్తుగా విచ్ఛిన్నం కావడంవల్లే ధరాలీ విపత్తు సంభవించినట్లు భూ విజ్ఞాన శాస్త్రవేత్త ఇమ్రాన్ ఖాన్ వెల్లడించారు. ఏకంగా 360 మిలియన్ క్యూబిక్ మీటర్ల శిథిలాలు ఒక్కసారిగా కూలినట్లు వివరించారు. ధరాలీ సమీపంలో భారీగా మంచు రాశులు (గ్లేసియర్ డిపాజిట్లు) గుర్తించినట్లు తెలిపారు. ఇమ్రాన్ ఖాన్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్న శాటిలైట్ చిత్రాల ప్రకారం.. ధరాలీ గ్రామానికి సుమారు 7 కిలోమీటర్ల ఎగువన, సముద్ర మట్టానికి 6,700 మీటర్ల ఎత్తులో ఒక మంచు రాశి ఉంది. మంగళవారం అధిక వర్షపాతం నమోదైంది. ఈ వర్షంవల్ల ఉపరితల ప్రవాహం పెరిగి మంచు రాశులు విచ్ఛిన్నమయ్యాయి.

- ఈనాడు ప్రత్యేక విభాగం



దిల్లీలో బుధవారం జరిగిన తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటు సభ్యురాలు మహువా మొయిత్రా, బీజేడీ మాజీ ఎంపీ పినాకి మిశ్రల వివాహ విందులో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా, ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే తదితరులు

నిజాయతీపరులైన అధికారులకు 'సెక్షన్ 17ఏ'తో అభయం

• సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

దిల్లీ: అవినీతి కేసుల్లో ప్రభుత్వ అధికారులపై దర్యాప్తు చేపట్టాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్ నిర్దేశిస్తోందని, అధికారులు నిర్భయంగా పరిపాలన సాగించేట్లు చూడటానికే 2018లో సవరణ ద్వారా దీన్ని పొందుపరచినట్లు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. 17ఏ రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఇప్పటివరకూ 60 శాతం ఫిర్యాదులపై దర్యాప్తునకు అనుమతి మంజూరు చేసినట్లు కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. ఫిర్యాదులపై దర్యాప్తునకు ఎందుకు అనుమతించినదీ లేదా నిరాకరించినదీ కారణాలు తెలుపుతున్నామనీ, దీనిపై ఫిర్యాదుదారు కోర్టుకు వెళ్లవచ్చనీ ఆయన వివరించారు. కాగా, ఒక అధికారిపై అవినీతి ఆరోపణ వచ్చినపుడు దానికి బలమైన ఆధారాలు ఉన్నదీ లేనిదీ ప్రాథమిక దర్యాప్తులోనే తెలిసిపోతుందని పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తెలిపారు. నిజాయతీపరులైన అధికారులను ఇలాంటి వేధింపులకు గురిచేయడమెందుకని ధర్మాసనం ప్రశ్నించింది. నిజాయతీపరులైన అధికారులు తమ విధినిర్వహణను కొనసాగించగలగాలనీ, అదే సమయంలో అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలనీ ధర్మాసనం పేర్కొంది. ఈ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.

పురుషులకు, మాకు ఒకటే ప్రమాణాలా!

• సమానత్వ సూత్రానికి అది విరుద్ధం
• సుప్రీంకోర్టుకు తెలిపిన మహిళా సైన్యాధికారులు

దిల్లీ: భారత సైన్యంలో శాశ్వత కమిషన్ (పీసీ) కోసం ఎంపిక నిర్వహించే సమయంలో పురుషులను, మహిళలను ఒకే గాటన కట్టడం సరికాదని షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) మహిళా అధికారులు సుప్రీంకోర్టుకు తెలిపారు. ఎస్‌ఎస్‌సీ కింద ఎంపికైన తమకు శాశ్వత కమిషన్ నిరాకరించడంపై వీరు వేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం బుధవారం విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపిస్తూ.. "శాశ్వత కమిషన్ ఎంపికకు రెండు అసమాన, విభిన్న తరగతులను (మహిళా అధికారుల, పురుషాధికారులు) కలపడం. ఒకే అర్హతా ప్రమాణాలు, కటాఫ్ మార్కులను నిర్ణయించడం సమానత్వ సూత్రానికే విరుద్ధం" అని తెలిపారు. ఈ కేసులో వాదనలు గురువారం కూడా కొనసాగనున్నాయి.

డీఎంకే ఎమ్మెల్యేలపై కేసుల ఉపసంహరణ వివరాలివ్వండి

• తమిళనాడు సర్కారుకు సుప్రీం ఆదేశం

దిల్లీ: డీఎంకేకు చెందిన ప్రస్తుత లేదా మాజీ మంత్రులు, శాసనసభ్యులపై క్రిమినల్ దర్యాప్తునకు అనుమతినిచ్చిన ఉదంతాలను, వారిపై నమోదైన కేసులు ఉపసంహరించుకున్న సందర్భాలను తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు బుధవారం తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. అదనపు సీనియర్ అడ్వొకేట్ జనరల్ కోరిన మేరకు ఈ అంశంపై అఫిడవిట్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి రెండు వారాల సమయం ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. కొందరు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యుల ప్రాసిక్యూషన్‌కు గతంలో ఇచ్చిన అనుమతిని తదనంతరం రాజకీయ కారణాల రీత్యా దర్యాప్తు సంస్థలు ఉపసంహరించుకున్నాయని పేర్కొంటూ న్యాయవాది కురుప్పయ్య గాంధీ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరుపుతూ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ తంతు ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితం కాలేదని, దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అభిప్రాయపడ్డారు. కోర్టు ఈ అంశంపై తదుపరి విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది.

సీనియర్ న్యాయవాదుల అత్యవసర విచారణ విజ్ఞప్తులను అనుమతించబోను: సీజేఐ గవాయ్



దిల్లీ: తమ కేసులను అత్యవసరంగా విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాదులు కోరడాన్ని ఈ నెల 11 నుంచి అనుమతించబోనని, అలా అయితేనే జూనియర్లకు కూడా అవకాశం వస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం స్పష్టం చేశారు. ఏ విషయాన్ని కూడా సీనియర్ న్యాయవాదులు ప్రస్తావించకూడదనే భావన అందరిలో ఉందన్నారు. ఈ విధానం కనీసం తన కోర్టులో అయినా అమలు కావాలని, ఇతర న్యాయమూర్తులు కూడా పాటించాలనే విషయాన్ని వారి ఇష్టానికే వదిలేస్తున్నానన్నారు.

లైసెన్సు లేకుండా శస్త్రచికిత్సలు.. ఇద్దరు వైద్యులపై కేసు నమోదు

థానే: నవీ ముంబయిలోని ఓ ప్రముఖ కంటి ఆసుపత్రిలో లైసెన్సు లేకుండా శస్త్రచికిత్సలు చేసిన ఇద్దరు వైద్యులపై బుధవారం కేసు నమోదైంది. గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి మధ్య వీరిద్దరు శస్త్రచికిత్సలు చేసిన ఐదుగురి కళ్లకు తీవ్రంగా ఇన్ఫెక్షన్ సోకింది. దీంతో బాధితులు వాశీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో మహారాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నుంచి లైసెన్సును పునరుద్ధరించకుండానే ఆపరేషన్లు చేశారని గుర్తించిన పోలీసులు ఈ ఇద్దరు వైద్యులపై కేసు నమోదుచేశారు.

భారత్‌పై పాక్ అక్కసు.. కశ్మీర్‌పై మళ్లీ అదే పాట

ఇంటర్నెట్‌డెస్క్: జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దై ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కశ్మీర్ అంశంపై మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు కశ్మీర్ ప్రధాన కారణమని మరోసారి నోరు పారేసుకున్నారు. శాంతిస్థాపన కోసం 2019లో భారత ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేయడంపై అక్కసు వెళ్లగక్కారు. ఈ విషయంలో భారత్ ఏకపక్షంగా చర్యలు తీసుకుందంటూ నిందలు మోపారు. ఈ సమస్యకు న్యాయపరమైన పరిష్కారానికి తమ విదేశాంగ విధానం కట్టుబడి ఉందంటూ మళ్లీ పాత పాటే పాడారు. మరోవైపు పాక్ ఉప ప్రధాని ఇశాక్‌దార్ ఓ ర్యాలీలో మాట్లాడుతూ.. తాము పొరుగుదేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటున్నామన్నారు. ఘర్షణల కంటే దౌత్యాన్నే ఇష్టపడతామంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఎవరైనా దురాక్రమణలకు పాల్పడితే గట్టిగా బదులు ఇచ్చేందుకు తమ సాయుధ దళాలు తగిన సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ సహా పలు ప్రావిన్స్‌లలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం గమనార్హం.

నేను మోదీకి ఫోన్ చేస్తా

• ట్రంప్‌నకు బ్రెజిల్ అధ్యక్షుడి సమాధానం



బ్రసీలియా: 'సమస్యల పరిష్కారంపై చర్చల కోసం ఎప్పుడైనా కాల్ చేయొచ్చు' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆఫర్‌ను బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తిరస్కరించారు. ట్రంప్ చర్చలకు సిద్ధంగా లేరని.. ఆయనకు, రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు తప్ప మోదీ, జిన్‌పింగ్ సహా ఇతర దేశాధినేతలు ఎవరితోనైనా ఫోన్‌లో మాట్లాడుతానని లూలా డా సిల్వా బుధవారం వెల్లడించారు. బ్రసీలియాలో డిసిల్వా మాట్లాడుతూ "మా ప్రయోజనాలను కాపాడుకొనేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలు అన్ని అవకాశాలనూ వినియోగిస్తాం. విదేశీ వాణిజ్యాన్ని బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అమెరికాలో కొత్త ప్రభుత్వం రాగానే.. దేశీయ కంపెనీలకు కొత్త అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం" అని లూలా డా సిల్వా పేర్కొన్నారు. ఈ ఏడాది బ్రెజిల్‌లో కాప్ 30 సదస్సు జరగనుంది. విభేదాలను పక్కనపెట్టి ఈ కార్యక్రమానికి ట్రంప్‌ను ఆహ్వానిస్తానని డిసిల్వా చెప్పారు. కాగా, తన మిత్రుడు, మాజీ అధ్యక్షుడు జైరో బోల్సొనారోపై బ్రెజిల్ ప్రభుత్వం దర్యాప్తు చేపట్టడాన్ని ట్రంప్ తప్పు పట్టారు. బ్రెజిల్‌పై అత్యధికంగా 50 శాతం సుంకాలు విధించారు. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

రష్యా నుంచి అమెరికాకు దిగుమతులా.. నాకేమీ తెలియదు

• ట్రంప్ వ్యాఖ్యలు



న్యూయార్క్/వాషింగ్టన్: రష్యా నుంచి తమ దేశం యురేనియం, ఎరువులు, రసాయనాలు దిగుమతి చేసుకుంటున్న విషయాన్ని గురించి తనకేమీ తెలియదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యాతో అమెరికా వాణిజ్యం కొనసాగిస్తోందంటూ భారత్ చేసిన ఆరోపణపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ పై విధంగా స్పందించారు. అమెరికా, ఈయూలు రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తూ తమను వారిస్తున్నాయని, ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయని భారత్ ఘాటుగా విమర్శించిన సంగతి తెలిసిందే.

పుతిన్‌తో ట్రంప్ దూత భేటీ

మరోవైపు ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ బుధవారం మాస్కోలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యారని క్రెమ్లిన్ వెల్లడించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం విరమించే ఒప్పందం విషయంలో పుతిన్‌కు ట్రంప్ విధించిన గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.


'మాగా' ఉద్యమానికి వారసుడు వాన్స్

• ట్రంప్ ప్రకటన



న్యూయార్క్: దేశాన్ని గొప్పగా మార్చేందుకు తాను చేపట్టిన ఉద్యమానికి వారసుడు దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని తాను భావిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మేక్ అమెరికా గ్రేట్ ఎగెయిన్ (మాగా) అన్న నినాదంతో ప్రారంభించిన ఉద్యమంలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా చేరవచ్చని ఆయన అన్నారు. 'మాగా' ఉద్యమానికి వారసుడెవరంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ విధంగా బదులిచ్చారు. "అప్పుడే వారసుడెవరన్న విషయంపై మాట్లాడటం సరికాదు. అయితే వాన్స్ చాలా బాగా పనిచేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో ఆయనే ఇష్టుడు అని ట్రంప్ పేర్కొన్నారు.

ప్రపంచానికి హిందూత్వ అవసరం ఉంది: మోహన్ భాగవత్



నాగ్‌పుర్: ప్రస్తుత ఘర్షణపూరిత ప్రపంచంలో హిందూయిజం అవసరం ప్రపంచానికి ఉందని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "హిందూత్వం వైవిధ్యాలను అంగీకరిస్తుంది. అది ఒక మతం కాదు, ఓ సార్వత్రిక విశ్వాసం, మానవత్వం, ప్రకృతితో మమేకమైన జీవన విధానం. ఈ మతం దేవుడి పట్ల మన విధులనే కాదు, సమాజం విషయంలో బాధ్యతలనూ బోధిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించగలిగే జీవన విధానాన్ని హిందూత్వం నేర్పుతుంది" అని తెలిపారు.

జైపుర్ ఆస్పత్రిలో వృద్ధురాలి గుండెకు కొత్తతరహా శస్త్రచికిత్స

• దేశంలోనే ఇది ప్రప్రథమం

జైపుర్: దేశంలోనే మొట్టమొదటి ఎలక్ట్రోసర్జికల్ వాల్వ్-ఇన్-వాల్వ్ మిట్రల్ శస్త్రచికిత్సను జైపుర్‌లోని రాజస్థాన్ ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించారు. శ్రీనగర్‌కు చెందిన 74 ఏళ్ల వృద్ధురాలికి గతంలో రెండు వాల్వులను మార్చడానికి ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్స జరిగింది. కానీ మిట్రల్ వాల్వ్ సరిగా పనిచేయకపోవడంతో ఆమెకు మళ్లీ గుండెలో సమస్య తలెత్తింది. మిట్రల్ వాల్వ్ గుండెలోని నాలుగు వాల్వులలో ఒకటి. అది గుండెలోని ఎడమ కర్ణికను ఎడమ జఠరికతో కలిపే ద్వారం. ఊపిరితిత్తుల నుంచి ఆమ్లజనియుత రక్తం మిట్రల్ వాల్వ్ ద్వారా ఎడమ జఠరికలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి ఆ రక్తం బృహద్ధమని ద్వారా శరీర భాగాలకు ప్రసరిస్తుంది. మహిళ పెద్ద వయసు, బలహీనత వల్ల ఆమెకు గుండె శస్త్రచికిత్స చేయడం కుదరదని దిల్లీ, శ్రీనగర్ వైద్యులు చెప్పారు. దాంతో జైపుర్‌లోని రాజస్థాన్ హాస్పిటల్‌ను ఆశ్రయించగా, ఆధునిక ఎలక్ట్రోసర్జికల్ ప్రక్రియ ద్వారా చికిత్స చేశారు. ఈ పద్ధతిలో ఛాతీని శస్త్రచికిత్సతో తెరవకుండానే మిట్రల్ వాల్వును తెరచి కొత్తది అమర్చినట్లు ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ రవీంద్ర సింగ్ రావు వివరించారు. ఈ ప్రక్రియను బ్యాట్ మ్యాన్ ప్రొసీజర్ అంటారు. మిట్రల్ వాల్వులోకి ప్రవేశపెట్టే బెలూన్ బ్యాట్ మ్యాన్ ముసుగులా ఉండటమే దీనికి కారణం.

20 లక్షల మందిని అన్నార్తుల్ని చేసిన ఇజ్రాయెల్

• 'మండలి' భేటీలో సభ్యదేశాల ఆందోళన



ఇజ్రాయెల్ క్షిపణి దాడి కారణంగా గాజాలో ధ్వంసమైన ఆసుపత్రి

న్యూయార్క్: హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ దేశ పౌరులు సజీవ అస్థిపంజరాలుగా మారారని, వారి విడుదలకు చొరవ చూపాలని ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని కోరింది. మంగళవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఇజ్రాయెల్ తన డిమాండ్‌ను "మండలి" ముందు ప్రస్తావించింది. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలకు ఆహారం అందించకుండా చిత్రహింసల పాలు చేస్తున్నారని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోన్ సార్ అన్నారు. అయితే ఇజ్రాయెల్ 20 లక్షల మంది పాలస్తీనియులు ఆకలితో అలమటించేలా చేసిందని, ఇప్పటికే అక్కడ వందకు పైగా ఆకలి చావులు సంభవించాయని భద్రతా మండలి సభ్యదేశాలు పేర్కొన్నాయి. ఇజ్రాయెలీలైనా, గాజా వాసులైనా సాధారణ పౌరులపై జరుగుతున్న దాడులన్నిటినీ ఖండిస్తున్నామని ఐరాసలో పాలస్తీనా దేశ శాశ్వత పరిశీలకుడు రియాద్ మన్సూర్ అన్నారు. ఇజ్రాయెల్ గాజా ప్రాంతంలో 20 లక్షల మందిని బందీలుగా మార్చి వారందరూ ఆకలితో అలమటించేలా చేసిందని ఆయన అన్నారు. ఆక్రమిత పాలస్తీనా ప్రాంతం నుంచి సాధారణ ప్రజానీకాన్ని బలవంతంగా ఖాళీ చేయించడం ద్వారా ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని గ్రీస్ దేశ ప్రతినిధి అన్నారు. గాజా ప్రజానీకానికి మానవీయ సాయం అందేలా ఇజ్రాయెల్ తక్షణ చర్యలు తీసుకోవాలని స్లోవేనియా ప్రతినిధి పేర్కొన్నారు. గాజా సంక్షోభానికి దశాబ్దాల ఆక్రమణే కారణమని సోమాలియా ప్రతినిధి అన్నారు. ప్రత్యేక పాలస్తీనా దేశ ఏర్పాటే ఇజ్రాయెల్ దీర్ఘకాలిక భద్రతకు హేతువు కాగలదని బ్రిటన్ ప్రతినిధి బార్బరా వుడ్‌వార్డ్ అభిప్రాయపడ్డారు. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని తక్షణం అమలు చేయాలని చైనా కోరింది. అధ్యక్షుడు ట్రంప్ గాజాలో తాండవిస్తున్న ఆకలిని గుర్తించారని, అమెరికా అక్కడి పౌరులకు సాయం అందించేందుకు కృషి చేస్తోందని అమెరికా రాయబారి డొరోతీ షెయా అన్నారు.

గాజాలో ఆహారం కోసం ఎగబడ్డ సమూహంపై కాల్పులు

• మరో 38 మంది మృతి

డెయిర్ అల్ బలా: గాజాలో ఆహారం కోసం ఎగబడిన జనసమూహాలపై బుధవారం జరిగిన కాల్పుల్లో కనీసం 38 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఆహారం రవాణా చేస్తున్న ఐక్యరాజ్య సమితి వాహన సముదాయాల వద్ద, గాజా మానవీయ సంస్థ (జీహెచ్‌ఎఫ్) ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ఈ సంఘటనలు జరిగాయి. జనసమూహాలు తమ బలగాల దిశగా భీతిగొలిపే రీతిలో దూసుకు రావడంతో హెచ్చరిక రూపేణా మాత్రమే కాల్పులు జరిపామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

ఝార్ఖండ్‌లో ఎదురుకాల్పులు.. మావోయిస్టు అగ్రనేత మృతి

గుమ్లా: ఝార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో బుధవారం ఓ మావోయిస్టు మృతిచెందాడు. అతడిని పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా గ్రూపునకు చెందిన అగ్రనేత మార్టిన్ కెర్కెట్టాగా గుర్తించారు. మార్టిన్‌పై రూ. 15 లక్షల రివార్డు ఉంది. అతడిపై ఏడు జిల్లాల్లోని పోలీస్‌స్టేషన్లలో దాదాపు 72 కేసులు ఉన్నాయి. కామ్‌డారా ఠాణా పరిధిలోని చంగబాది ఉపర్టోలీలో మంగళవారం సోదాలు నిర్వహిస్తుండగా భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరిగాయని అధికారులు తెలిపారు. కాల్పుల సమయంలో మొత్తం నలుగురు మావోయిస్టులు ఉన్నారని, తప్పించుకున్న ముగ్గురికి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.



దాదర్‌లో కబూతర్‌ఖానా వద్ద గుమికూడిన నిరసనకారులు

కబూతర్‌ఖానాపై టార్పాలిన్‌ను తొలగించిన నిరసనకారులు

ముంబయి: మహారాష్ట్రలోని దాదర్‌లో కబూతర్ ఖానా(పావురాల దాణా కేంద్రం)ను మూసివేయాలన్న బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు దానిపై బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) కప్పిన టార్పాలిన్‌ను నిరసనకారులు బుధవారం తొలగించారు. అడ్డుకున్న పోలీసులతో వారు ఘర్షణకు దిగారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ముంబయి సబర్బన్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. పావురాల విసర్జితాల కారణంగా శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ ఇటీవల హైకోర్టు ముంబయిలోని పలు కబూతర్‌ఖానాలను మూసివేయాలని ఆదేశించింది. పావురాలకు ఆహారం ఇవ్వడం పవిత్ర సంప్రదాయంగా భావించే జైన సమాజం దీన్ని తీవ్రంగా వ్యతిరేకించింది.

హెలికాప్టర్ కూలి ఇద్దరు ఘనా మంత్రుల మృతి

అక్రా: ఘనా దేశ రక్షణ మంత్రి ఎడ్వర్డ్ ఒమానే బొవామా, పర్యావరణ మంత్రి ఇబ్రహీం ముర్తలా ముహమ్మద్‌లు బుధవారం హెలికాప్టర్ కూలిన ఘటనలో మృత్యువాతపడ్డారు. వీరితోపాటు మరో ఆరుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఉదయం 9 గంటల 22 నిమిషాలకు దేశ రాజధాని అక్రా నుంచి బంగారు గనులకు ప్రసిద్ధమైన ఒబువాసి పట్టణానికి బయలుదేరింది. తర్వాత కొంత సేపటికే రాడార్ పరిధి నుంచి మాయమైంది. ప్రమాదానికి కారణాలేమిటన్నది వెంటనే తెలియరాలేదు.

ఆక్సిజన్ ప్లాంట్‌లో పేలుడు.. ఇద్దరి మృతి

చండీగఢ్: పంజాబ్‌లోని మొహాలిలో ఓ ఆక్సిజన్ ప్లాంట్‌లో బుధవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ఫేజ్ 9లో ఉన్న ఫ్యాక్టరీలో ఉదయం 9 గంటల ప్రాంతంలో ట్రక్కులోకి సిలిండర్లను ఎక్కిస్తుండగా అందులో ఒకటి పేలినట్లు అధికారులు పేర్కొన్నారు. పేలిన సిలిండర్‌లోని కొంతభాగం దాదాపు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న కంబాల గ్రామంలో పడినట్లు స్థానికులు తెలిపారు.

చైనాలో గన్యా.. 7 వేల కేసులు నమోదు

తైవాన్: చైనాలోని దక్షిణ ప్రాంతంలోని గ్వాంగ్‌డాంగ్‌లో ప్రావిన్స్ ఫోషన్ నగరంలో గన్యా వైరస్ వ్యాప్తి చెందుతోంది. బుధవారం నాటికి 7,000 కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో వీధుల్లో నీరు నిలిచిన చోట క్రిమి సంహారక మందులను అధికారులు పిచికారీ చేయించారు. దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రోన్లను ఏర్పాటు చేశారు. ఖాళీ సీసాలు, పూలకుండీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తీసివేయని వారికి 10,000 యువాన్ల జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.

భూ కేటాయింపుల విధానం అమలుపై పునస్సమీక్ష

- జిల్లా కలెక్టర్ల అధికారాల పెంపునకు సుముఖం
- లీజుకు మాత్రమే భూములు ఇవ్వాలని ప్రతిపాదన
- 2012 నాటి విధానంలో మార్పులు, చేర్పులు ఖాయం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వశాఖలు, ప్రైవేటు, భారీ పరిశ్రమలకు ప్రభుత్వ భూముల కేటాయింపుల విధానాన్ని ప్రభుత్వం పునస్సమీక్షిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో రూపొందించిన భూ కేటాయింపుల విధానం.. మారిన పరిస్థితులకు తగ్గట్లు లేదన్న ఉద్దేశంతో మార్పులు చేయాలని యోచిస్తున్నారు. 2012 నుంచి 2025 ఏప్రిల్ వరకు 1,490 సంస్థలకు ప్రభుత్వం 1,82,270 ఎకరాలు కేటాయించింది. ఇందులో పరిశ్రమలశాఖకు 64,788 ఎకరాలు ఇచ్చారు. భవిష్యత్తులో భూముల కొరత ఏర్పడకుండా ఉండేందుకు భూములను విక్రయించకుండా.. లీజు ప్రాతిపదికనే ఇవ్వాలన్నదానిపై చర్చిస్తున్నారు.

బ్యాంకురుణాలు రావట్లేదు

పరిశ్రమలకు కేటాయించే భూముల వివరాలను నిషిద్ధ జాబితాలో ఉంచడంతో వాటిపై బ్యాంకురుణాలు రావట్లేదు. నాటి పరిస్థితులకు అనుగుణంగా పొందిన భూములను ప్రస్తుత అవసరాలకు తగ్గట్లు వినియోగించలేకపోవడంతో మార్పుచేర్పులకు అవకాశమివ్వాలని పరిశ్రమల వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యా సంస్థలు, ఆసుపత్రులకు కేటాయించిన భూములకూ ఈ సమస్య ఉంది. దీంతో కేటాయింపులు జరిగి 20 ఏళ్లు దాటినవాటిని నిషిద్ధ జాబితా నుంచి తప్పిస్తే ఎలా ఉంటుందన్నదానిపై చర్చలు సాగుతున్నాయి. నామమాత్ర చెల్లింపులతో ప్రభుత్వం నుంచి భూమి పొంది పదేళ్లు దాటితే... ప్రస్తుత మార్కెట్ విలువలో 50% తీసుకుని శాశ్వతంగా భూమిని అప్పగించడం పైనా పరిశీలిస్తున్నారు.

◆ ప్రభుత్వం నుంచి మార్కెట్ విలువ ప్రాతిపదికన కొన్ని సంస్థలు కొన్న భూములనూ నిషిద్ధ జాబితాలోనే చూపిస్తున్నారు.

◆ గుర్తింపు పొందిన పార్టీలకు భూములు ఎలా కేటాయించాలన్నదానిపై నిర్దిష్ట విధానం లేదు. ఇకపై పార్టీలకు భూములు కేటాయించాలంటే సాధారణ పరిపాలన శాఖ (పొలిటికల్) నుంచి ప్రతిపాదనలు తెప్పించాలని భావిస్తున్నారు.

◆ ప్రస్తుతం జిల్లా కలెక్టర్లకు పదెకరాలు లేదా రూ.50లక్షల విలువైన భూమిని కేటాయించే అధికారం ఉంది. రూ.కోటి విలువైన భూమిని ప్రభుత్వశాఖలకు కేటాయించే అధికారాన్ని జిల్లాల కలెక్టర్లకు అప్పగించాలని చూస్తున్నారు.

◆ పరిశ్రమల శాఖకు ఉచితంగా భూములిస్తున్నారు. అయితే.. ఆ భూముల సద్వినియోగం, తద్వారా వస్తున్న ప్రయోజనాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరగట్లేదు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

కడప-బెంగళూరు లైన్ నిర్మాణానికి ఏపీ రూ.1,163 కోట్లు చెల్లించాలి

ఈనాడు, దిల్లీ: 'కడప-బెంగళూరు (266 కి.మీ.) రైల్వే లైన్ నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా కింద ఇంకా రూ.1,163 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2,706 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ లైన్ నిర్మాణ వ్యయాన్ని 50:50 మేర పంచుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. ఈ ఏడాది మార్చి వరకు రూ.358 కోట్లు ఖర్చయింది. ప్రస్తుతానికి కడప-పెండ్లిమర్రి సెక్షన్ (21 కి.మీ.) ప్రారంభమైంది. ఇప్పటివరకు ఏపీ ప్రభుత్వం తన వాటా కింద చెల్లించాల్సిన రూ.1,353 కోట్లకుగాను రూ.190 కోట్లు డిపాజిట్ చేసింది. ప్రాజెక్టు వేగంగా పూర్తిచేయడానికి మిగిలిన వాటా చెల్లించాలి. 2021 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఈ మార్గంలో కొత్త ఎలైన్‌మెంట్‌ను సూచించింది. దాని ప్రకారం ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ-శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం (105 కి.మీ.) మధ్య కొత్త ఎలైన్‌మెంట్ సర్వేకు అనుమతులు మంజూరు చేశాం' అని రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ చెప్పారు. బుధవారం లోక్‌సభలో తెదేపా ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెన్నేటి కృష్ణప్రసాద్, వైకాపా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానం ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో తగ్గిపోతున్న చెరకు సాగు

ఆంధ్రప్రదేశ్‌లో చెరకు సాగు విస్తీర్ణం ఏటా తగ్గిపోతోందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీలు బైరెడ్డి శబరి, కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు బదులిచ్చారు. 'గత ఐదేళ్లలో రాష్ట్రంలో చెరకు సాగు విస్తీర్ణం 72% మేర తగ్గింది. దిగుబడి పరిమాణం దాదాపుగా యథాతథంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వర్తింపజేస్తున్న చెరకు గిట్టుబాటు ధరనే ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమేమీ ప్రత్యేకంగా స్టేట్ అడ్వైజ్డ్‌ప్రైస్‌ను అమలు చేయడంలేదు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలు 2024-25లో రూ.28 కోట్లమేర ఉన్నాయి' అని కేంద్ర మంత్రి వివరించారు.

రాష్ట్రంలో చెరకు సాగు పరిస్థితి ఇదీ

సంవత్సరం	సాగువిస్తీర్ణం (వేల హెక్టార్లు)	ఉత్పత్తి (లక్షల టన్నులు)	హెక్టారుకు దిగుబడి (టన్నులు)
2020-21	54.94	41.99	75
2021-22	47.9	31.31	77
2022-23	32.0	24.31	78
2023-24	27.48	19.40	77
2024-25	15.39	11.71	76

అయిదేళ్లలో ఏపీలో 115 ప్రభుత్వ, 941 ప్రైవేటు పాఠశాలలు తగ్గాయి

రాజ్యసభలో కేంద్ర మంత్రి జయంత్ చౌధరి వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఏపీలో అయిదేళ్ల కాలంలో 115 ప్రభుత్వ, 941 ప్రైవేటు పాఠశాలలు తగ్గాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి బుధవారం రాజ్యసభలో తెలిపారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. 2019-20లో 16,173 ఉన్న ప్రైవేటు స్కూళ్ల సంఖ్య 2023-24 నాటికి 15,232కి, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 45,115 నుంచి 45,000కి తగ్గాయని వెల్లడించారు.



అశ్వారావుపేట మీదుగా సత్తుపల్లి వైపు వెళుతున్న వెన్నెల

సామాజిక చైతన్యమే లక్ష్యంగా సైకిల్ యాత్ర

తెలంగాణలోని కామారెడ్డి జిల్లా సోమవారంపేటకు చెందిన బాణోతు వెన్నెల తెలుగు రాష్ట్రాల్లో 54 రోజులుగా సైకిల్‌యాత్ర చేస్తూ మహిళా సాధికారత, సీటుబెల్టు, శిరస్త్రాణంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు వచ్చారు. "నేను డిగ్రీ వరకు చదువుకున్నా. హైదరాబాదులో జూన్ 14న ప్రారంభించిన సైకిల్ యాత్ర అక్టోబరు ఒకటి నాటికి కామారెడ్డిలో ముగుస్తుంది. బుధవారం నాటికి నా యాత్ర 2,388 కి.మీ. సాగింది" అని వివరించారు. – న్యూస్‌టుడే, అశ్వారావుపేట

పెద్దిరెడ్డి కుటుంబ కంపెనీలోకి మద్యం ముడుపుల సొమ్ము ఎంతొచ్చింది?

- సంస్థ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈడీ శివారెడ్డిని విచారించిన సిట్

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సంస్థ పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ చెవిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివారెడ్డి బుధవారం సిట్ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఖాతాలోకి మద్యం ముడుపుల సొమ్ము ఎంతొచ్చింది? అని అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. సంస్థ లావాదేవీలపైనా ప్రశ్నించినట్లు తెలిసింది. వారు మాత్రం తమకు ఏమీ తెలియదని, లెక్కలన్నీ చార్టర్డ్ అకౌంటెంట్లకు మాత్రమే తెలుస్తాయని వివరించినట్లు తెలిసింది. తాము ఆ సంస్థలో ఉద్యోగులం మాత్రమే అని చెప్పారు. పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఖాతాల్లోకి మద్యం ముడుపుల సొమ్ము బదిలీ అయిందని ఎంపీ మిథున్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ (డిస్టిలరీ) వ్యాపార పునరుద్ధరణ, అభివృద్ధి పేరుతో అరబిందో గ్రూప్ ద్వారా రూ.45 కోట్ల రుణం ఇప్పించారని, మద్యం ముఠాలో భాగస్వాములైన వారందరికీ నగదు రూపంలో ముడుపులు చెల్లించాలనేది దీని వెనక ఒప్పందమని తేల్చింది. ఇందులో భాగంగానే రూ.5 కోట్లు పీఎల్ఆర్ ఖాతాల్లోకి జమ చేయించారని, దీనిపై రచ్చ జరగడంతో హుడ్‌వింక్ అనే సంస్థ ఖాతాకు బదిలీ చేయించారని వివరించింది. తర్వాత ఆ మొత్తాన్ని నగదు రూపంలో తీసుకున్నారని దర్యాప్తులో సిట్ గుర్తించింది.

మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లోనే డీఎంఎఫ్ నిధులు ఖర్చు చేయాలి

నిబంధనల సవరణ

ఈనాడు, అమరావతి: జిల్లా ఖనిజ నిధి (డీఎంఎఫ్)తో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని, ఈ నిధులు ఇతర ప్రాంతాలకు కేటాయించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు.. తదితరాలకే ఖర్చు చేస్తుండగా, ఇకపై వ్యవసాయ అనుబంధ రంగాల్లోనూ వెచ్చించేందుకు అవకాశం కల్పించింది. డీఎంఎఫ్‌లో పలు సవరణలు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

◆ ఇప్పటి వరకు మైనింగ్ లీజు వద్ద నుంచి నేరుగా ప్రభావితమయ్యే ప్రాంతంగా.. 10 కి.మీ. వరకు పరిగణనలోకి తీసుకుంటుండగా, దాన్ని 15 కి.మీ.కు పెంచారు.

◆ పరోక్షంగా ప్రభావితమయ్యే ప్రాంతం 15 కి.మీ. వరకు ఉండగా, దీన్ని 25 కి.మీ.కు పెంచారు.

◆ ఓ మైనింగ్ ప్రాంతం నుంచి ప్రభావిత గ్రామం పక్క జిల్లాలో ఉన్నప్పటికీ దానికి కూడా డీఎంఎఫ్ నిధులు ఖర్చు చేయాలి.

◆ ప్రభావిత ప్రాంతాల్లో పనులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి.

◆ నేరుగా ప్రభావితమయ్యే ప్రాంతాల్లో ఉండే వృద్ధులు, వికలాంగులకు ఈ నిధులతో వ్యక్తిగతంగా కూడా సహాయం చేయొచ్చు.

◆ డీఎంఎఫ్ గవర్నింగ్ కౌన్సిల్‌కు కలెక్టర్ మాత్రమే ఛైర్మన్‌గా ఉండాలి. ఇందులో ఇప్పటివరకు రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యులుగా ఉండగా, ఇకపై లోక్‌సభ సభ్యులకు కూడా అవకాశం కల్పించారు.

◆ డీఎంఎఫ్‌తో చేపట్టిన పనుల పర్యవేక్షణకు జిల్లాలో సీనియర్ అధికారితో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేయాలి.

◆ రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ నియమించాలి.

టెక్ హబ్‌లకు ఎకరం 99 పైసలు

- 'ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్ పాలసీ 4.0'కు ఆమోదం
- రాయితీపై భూములు పొందేందుకు నిబంధనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటు చేసే టెక్ హబ్‌లకు భూముల కేటాయింపు ద్వారా ప్రోత్సాహకాన్ని అందించేందుకు 'ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్ (లిఫ్ట్) పాలసీ 4.0' ను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని కింద పెట్టుబడులు పెట్టే సంస్థలకు ఎకరం 99 పైసల చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. భూములు పొందినప్పటి నుంచి నిర్దేశిత అనుమతులతో ఆయా సంస్థలు నిర్మాణాలను ప్రారంభించాలన్న నిబంధనను విధించింది. రాష్ట్రంలోని మౌలిక సదుపాయాలు.. మానవ వనరులను వినియోగించుకునేందుకు వీలుగా పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం పేర్కొంది. బెంగళూరు, హైదరాబాద్, గురుగ్రామ్ వంటి టైర్-1 నగరాల్లో భూముల ధరలు పెరిగి..సంస్థలకు పెట్టుబడుల భారం పెరిగింది. ఈ దృష్ట్యా పెట్టుబడులకు ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్న వారిని ఆకర్షించాలన్నదే పాలసీ ప్రధాన లక్ష్యమని తెలిపింది. బుధవారం మంత్రిమండలి పాలసీని ఆమోదించింది.

భూముల రాయితీకి..నిబంధనలు

ఐటీ/ఎలక్ట్రానిక్స్ సంస్థలు: ఫార్చ్యూన్/ఫోర్బ్స్ ర్యాంకింగ్‌లో గత 3 ఏళ్లలో లిస్టింగ్..కనీసం ఒక బిలియన్ డాలర్ల మార్కెట్/వార్షిక ఆదాయం ప్రాధాన్యత. 3 ఏళ్లలో కనీసం 3 వేల మందికి ఉపాధి.. ఎకరానికి సగటున 500 ఉద్యోగాలు కల్పించాలి.

గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ): గత మూడేళ్లలో కనీసం 2 వేల మందికి ఉపాధి..ఎకరానికి సగటున 500 మందికి ఉద్యోగాలు ఇచ్చి ఉండాలి.

ఐటీ పార్క్ డెవలపర్లు: కనీసం 10 లక్షల చదరపు అడుగుల వాణిజ్య కార్యాలయ స్థలాన్ని అభివృద్ధి చేసిన సంస్థలకు ప్రాధాన్యత. ప్రతి ఎకరానికీ కనీసం లక్ష చ.అ. నిర్మించాలి.

జీసీసీ డెవలపర్లు: కనీసం 50 శాతం స్పేస్‌ను ఐటీ సంస్థలకు విక్రయించాలి.

పశు సంవర్ధకశాఖ డైరెక్టర్‌గా దామోదర్ నాయుడు పునర్నియామకం

ఈనాడు, అమరావతి: పశు సంవర్ధకశాఖ సంచాలకుడిగా డాక్టర్ టి.దామోదర్ నాయుడు పునర్నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే హోదాలో పనిచేస్తూ దామోదర్ నాయుడు గత నెల 31న పదవీ విరమణ చేశారు. అయితే ఆయన సేవలను మరో ఏడాదిపాటు కొనసాగిస్తూ మళ్లీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

అమిత్‌షాకు పవన్‌కల్యాణ్ అభినందనలు

ఈనాడు, అమరావతి: కేంద్ర హోం మంత్రిగా అత్యధికంగా 2,559 రోజులు పని చేసి రికార్డు సృష్టించిన అమిత్ షాకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో ఓ సందేశం ఉంచారు. "జనాభా 140 కోట్లు దాటిన భారత్ వంటి దేశంలో అంతర్గత భద్రత అత్యంత సవాల్‌తో కూడిన బాధ్యత. అమిత్ షా భారత్‌ను అత్యంత భద్రమైన దేశంగా మలిచారు. శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగనీయకుండా ఆర్టికల్ 370 ఎత్తివేయడం ఆయన నాయకత్వ పటిమకు, రాజనీతిజ్ఞతకు నిదర్శనం" అని కొనియాడారు.

అప్పట్లో ఇతర రాష్ట్రాల్లో యూనిట్ ధర ఎంత?

- అఫిడవిట్ దాఖలు చేయాలని సెకికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీ ప్రభుత్వానికి యూనిట్ ధర రూ.2.49 చొప్పున 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరాకు ఒప్పందం చేసుకునేనాటికి ఇతర రాష్ట్రాల్లో ధర ఎంత ఉందో చెప్పాలని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి)ను హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టంచేసింది. ప్రతిపాదిత యూనిట్ ధరను ఆమోదిస్తూ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఇచ్చిన ఉత్తర్వులను తమ ముందు ఉంచాలని సూచించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. సెకి నుంచి యూనిట్ ధర రూ.2.49 చొప్పున 7,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలుకు వైకాపా ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఒప్పందం, దానిని విద్యుత్ నియంత్రణ మండలి నిర్ధారించడాన్ని సవాల్ చేస్తూ సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెదేపా సీనియర్ నేత పయ్యావుల కేశవ్‌లు గతంలో హైకోర్టులో పిల్స్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'యూనిట్ ధర మార్కెట్లో తక్కువగా ఉండగా రూ.2.49గా నిర్ణయించారు. గుజరాత్ ప్రభుత్వానికి రూ.1.99కే సరఫరా చేస్తున్నారు. సెకితో ఒప్పందం తర్వాత రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా రాష్ట్రానికి విద్యుత్ సరఫరాలో నష్టం జరుగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా ప్యానళ్ల తయారీ, విద్యుత్ సరఫరాకు కలిపి ఒకే టెండర్ నిర్వహించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలకు ఉపాధి, తక్కువ ఖర్చుతో విద్యుత్ లభించేది' అన్నారు.

◆ రాష్ట్రప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. యూనిట్ ధరను ఎక్కువకు కొంటున్నారనే కారణంతో పిటిషనర్లు అప్పట్లో వ్యాజ్యాలు వేశారని చెప్పారు. అంతిమంగా సెకి నిర్ణయించిన యూనిట్ ధర 2.42కి ఏపీఈఆర్‌సీ ఆమోదం తెలిపిందన్నారు. ఆ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే పిటిషనర్లు సవాల్ చేసుకోవాలన్నారు. సెకి తరఫు న్యాయవాది అనుశ్రీ వాదనలు వినిపిస్తూ.. యూనిట్ ధర రూ.2.42 చొప్పున 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరాకు ఒప్పందం జరిగిందన్నారు. ఆ సమయంలో ఇతర రాష్ట్రాల్లో యూనిట్ ధర రూ.2.52 నుంచి 2.61 మధ్య ఉందన్నారు. వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు సమయం కోరారు.

'సంధ్య థియేటర్' ఘటనలో పోలీసుల నివేదికపై ఎన్‌హెచ్ఆర్‌సీ అసంతృప్తి

ఆరు వారాల్లోపు నివేదిక ఇవ్వాలని సీఎస్, సీపీకి షోకాజ్ నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో తెలంగాణ పోలీస్‌శాఖ ఇచ్చిన నివేదికపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విషయమై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పెద్దఎత్తున జనం గుమిగూడిన సందర్భంగా తగిన భద్రతను కల్పించడంలో పోలీస్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. అప్పటి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని ఎందుకు ఆదేశించకూడదో తెలపాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో నిష్పాక్షిక విచారణ జరిపి ఆరు వారాల్లోపు నివేదిక సమర్పించాలని పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది.

అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన 19న

ఈనాడు, అమరావతి: కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీలో భాగంగా ఇటీవల నిర్వహించిన పరీక్ష ద్వారా ఎంపికచేసిన అభ్యర్థుల అర్హతల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 19న జరగనుంది. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యాలయంలో జరగనున్న పరిశీలన ప్రక్రియ పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ నుంచి బియ్యం, వడ్లు సరఫరా చేయండి

- ఆ రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫిలిప్పీన్స్ వ్యవసాయ మంత్రి వినతి

ఈనాడు, దిల్లీ: రాబోయే సంవత్సరంలో ఫిలిప్పీన్స్‌కి 20 లక్షల టన్నుల బియ్యం, వడ్లు అవసరమని, ఆమేరకు సరఫరా చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని ఫిలిప్పీన్స్ వ్యవసాయశాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో సమావేశమయ్యారు. తెలంగాణ బియ్యం నాణ్యత బాగున్నాయని, అక్కడి నుంచి బియ్యం, వడ్లను దిగుమతి చేసుకోవాలని ఆసక్తితో ఉన్నామని ఫ్రాన్సిస్కో పేర్కొన్నారు. అందుకు ఉత్తమ్ సుముఖత వ్యక్తం చేశారు. తెలంగాణ బియ్యం నాణ్యతను అభినందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ-ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది చివర్లో రాష్ట్రంలో పర్యటించాలని ఫ్రాన్సిస్కోను ఆహ్వానించగా... తమ దేశానికి రావాలని ఉత్తమ్‌ని ఆయన కోరారు. తెలంగాణ నుంచి మొక్కజొన్న దిగుమతి చేసుకోవడానికీ ఫిలిప్పీన్స్ వ్యవసాయ మంత్రి ఆసక్తి చూపారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



ఫిలిప్పీన్స్ వ్యవసాయ మంత్రితో ఉత్తమ్

ముప్పా సురేష్ ముందస్తు బెయిల్ కేసు వేరే ధర్మాసనానికి బదిలీ

ఈనాడు, దిల్లీ: ప్రకాశం జిల్లా తెదేపా నాయకుడు వీరయ్యచౌదరి హత్యకేసులో నిందితుడిగా ఉన్న ముప్పా సురేష్‌బాబు ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను వేరే ధర్మాసనానికి బదిలీ చేయాలని జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. బుధవారం ఈ కేసు విచారణకు వచ్చిన సమయంలో ధర్మాసనంలో సభ్యులుగా ఉన్న జస్టిస్ మసీహ్ 'నాట్ బిఫోర్ మీ' అని చెప్పడంతో కేసును ఆయన సభ్యుడిగా లేని మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని జస్టిస్ దీపాంకర్ దత్త ఆదేశించారు. తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేయడంతో సురేష్‌బాబు సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ఎనిమిది మంది పుర కమిషనర్ల బదిలీలు, నియామకాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఎనిమిది మంది పురపాలక కమిషనర్లను ప్రభుత్వం బుధవారం బదిలీ చేసింది. అదే విధంగా పోస్టింగ్ కోసం వేచి ఉన్న వారిని వివిధ ప్రాంతాల్లో నియమించింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న అదనపు సంచాలకులు ఎస్.రవీంద్రబాబుని రాష్ట్ర పురపాలక కమిషనర్ కార్యాలయంలో నియమించారు. రాయచోటి కమిషనర్‌గా జి.రవిని నియమించి అక్కడి కమిషనర్ ఎన్.వాసుబాబుని నెల్లూరు నగరపాలక సంస్థ టీపీఆర్వోగా బదిలీ చేశారు. పి.భవానీప్రసాద్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శిగా ఎల్.సురేశ్‌ని నియమించి సెలవులో ఉన్న అక్కడి కార్యదర్శి ఎంవీ లక్ష్మిని రాష్ట్ర పురపాలక కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. టీటీ రత్నకుమార్, డి.కొండయ్య, బి.ప్రహ్లాద్‌లను సాలూరు, ప్రొద్దుటూరు, కదిరి పురపాలక కమిషనర్లుగా నియమించారు. ఈ మూడు చోట్లా కమిషనర్ల పోస్టులు కొద్ది కాలంగా ఖాళీగా ఉన్నాయి.

మహిళలకు ఆర్టీసీ బస్సు స్టీరింగ్!



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో శాశ్వత ప్రాతిపదికన మహిళలకు వేల సంఖ్యలో డ్రైవర్ పోస్టులు కేటాయించినప్పటికీ వివిధ కారణాలతో ఎవరూ ముందుకురావడం లేదు. ఆ లోటును భర్తీ చేసే ప్రయత్నాలను ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. వారికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించేందుకు సిద్ధమవుతోంది.

ఆర్టీసీ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఆ ప్రకారం కండక్టర్ల దగ్గర్నుంచి.. వివిధ స్థాయుల్లో మహిళలు గణనీయ సంఖ్యలోనే ఉద్యోగాలు చేస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి మూడు రీజియన్లకూ ఆర్ఎంలుగా మహిళలే ఉన్నారు. అయితే..15 వేలకు పైగా ఉన్న రెగ్యులర్ డ్రైవర్ పోస్టుల్లో..33 శాతం రిజర్వేషన్ ప్రకారం ఐదు వేల మంది మహిళా డ్రైవర్లు ఉండాలి. డ్రైవింగ్‌లో శిక్షణ లేకపోవడం సహా వివిధ కారణాలతో వారు ముందుకురాకపోవడంతో ఆయా పోస్టులు పురుషులకే పరిమితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ నేర్చుకునేందుకు ముందుకొచ్చే మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), 'మెవో' స్వచ్ఛంద సంస్థతో ఎంవోయూ కుదుర్చుకుంది. 'ఆ ప్రకారం హకీంపేటలో, సిరిసిల్లలో మహిళలకు ఉచితంగా శిక్షణ అందిస్తాం. ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. శిక్షణ పూర్తయిన తర్వాత సంబంధిత విద్యార్హత ఉన్న వారికి ఆర్టీసీలో డ్రైవర్లుగా నియమిస్తాం. మిగిలిన వారికి ఐటీ కంపెనీల ప్రాంగణాల్లో బస్సు డ్రైవర్లుగానూ అవకాశాలు లభిస్తాయి' అని అధికారులు చెబుతున్నారు. మహిళలు డ్రైవర్లుగా ఉంటే బస్సుల్లో భద్రత వాతావరణం మెరుగవుతుందని సర్కారు భావిస్తున్నట్టు తెలిపారు.

పారిశ్రామిక కాలుష్యం.. క్షీణిస్తున్న భూగర్భ జల నాణ్యత

- విశాఖపట్నంలో ఎన్‌జీఆర్ఐ పరిశోధనలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: పారిశ్రామిక ప్రాంతాల్లో భూగర్భ జల నాణ్యత తగ్గుతోందని భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) పరిశోధకులు తమ అధ్యయనంలో గుర్తించారు. వర్షాకాలానికి ముందు, తర్వాత నీటి నమూనాలను పరిశీలించగా 22 నుంచి 27% వరకు భూగర్భ జలాలు సాగుకు అనుకూలంగా లేవని, తీర ప్రాంతాలు, థర్మల్ ప్లాంట్ల సమీపంలో కాలుష్యం ఎక్కువగా ఉంటోందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిపిన ఈ అధ్యయనానికి ఎన్‌జీఐఆర్ పరిశోధకులు ఈశ్వర వెంకట రవి కిశోర్ వేమన, రామ్మోహన్ కురకల్వ అధ్యక్షత వహించారు. వర్షాకాలానికి ముందు 75, తరువాత 72 నీటి నమూనాలు సేకరించి.. పీహెచ్, ఎలక్ట్రికల్ కండక్టివిటీ (ఈసీ), కరిగిన ఘనపదార్థాల మోతాదును (టీడీఎస్)ను పోర్టబుల్ మల్టీమీటర్‌తో పరీక్షించారు. ఇందులో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్, సల్ఫేట్ వంటి మూలకాలు ఉన్నట్లు గుర్తించారు. పారిశ్రామిక కాలుష్యంతో భూగర్భ జలాల్లో లవణీకరణ, ఇతర రసాయన సంబంధిత మలినాలు పెరిగినట్లు స్పష్టమైంది. వ్యవసాయానికి వాడే పురుగుమందులు, ఎరువులు, మానవ కార్యకలాపాలు ప్రభావంతో నైట్రేట్ కాలుష్యం వానాకాలంలో అధికంగా కనిపించినట్లు పరిశోధకులు తెలిపారు.

ఆరోగ్యంపై ప్రభావం: నీటి నాణ్యత తగ్గిపోవడంతో భూమిలోకి నీరు ఇంకే సామర్థ్యం కోల్పోతుంది. కొన్ని మూలకాలు అధిక సాంద్రతలో ఉండటం వల్ల నీరు విషపూరితమై ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.

మీడియా అక్రెడిటేషన్స్ రూల్స్-2025కు ఆమోదం

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న మరికొన్ని నిర్ణయాలు..

- కాంప్రిహెన్సివ్ ఏపీ మీడియా అక్రెడిటేషన్ రూల్స్-2025కి మంత్రివర్గం ఆమోదం. రాష్ట్ర రాజధాని, ప్రచురణ కేంద్రాలు, జిల్లాల్లో అక్రెడిటేషన్ల జారీకి అనుమతి. అక్రెడిటేషన్ కమిటీల్లో జర్నలిస్ట్ సంఘాలకు చోటుకల్పిస్తారు. నెలలో కొత్త అక్రెడిటేషన్ల జారీ. సోషల్‌మీడియాపై కూడా పాలసీ తీసుకురావాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని సీఎం ఆదేశించారు.
- ఏపీఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్.. పునరుద్ధరించిన పంపిణీరంగ పథకం (ఆర్‌డీఎస్ఎస్)ను సకాలంలో అమలు చేసేందుకు వీలుగా తీసుకునే రుణానికి ప్రభుత్వ హామీకి అనుమతి. ఎస్పీడీసీఎల్ రూ.3,544.57 కోట్లు, సీపీడీసీఎల్ రూ.1,029.37 కోట్లు రుణంగా తీసుకునేందుకు అనుమతి.
- పారిశ్రామిక క్లస్టర్లు, పార్కులకు భూసేకరణ, వాటిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.7,500 కోట్ల రుణ సమీకరణకు ఏపీఐఐసీకి ఆమోదం. దీనికోసం ఎస్పీవీ ఏర్పాటుకు అనుమతి.
- ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు ఎస్‌బీఐ, యూబీఐ నుంచి రూ.900 కోట్ల క్యాష్ క్రెడిట్ పరిమితిని వినియోగించుకుంది. ఇప్పుడా సంస్థ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ గ్యారంటీకి అనుమతి.
- చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం తమ్మిగానిపల్లిలో 81.22 ఎకరాల ప్రభుత్వభూమిని పారిశ్రామికవాడ ఏర్పాటుకు ఏపీఐఐసీకి ఉచితంగా బదలాయించేందుకు ఆమోదం.
- తిరుపతి గ్రామీణ మండలంలో ఏపీటీఏ భూమిని తితిదే భూమితో మార్పిడి చేసి, పేరూరులో 25 ఎకరాలు వైష్ణవి ఇన్‌ఫ్రా వెంచర్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

ఐదు కోర్టుల్లో అసిస్టెంట్ పీపీలు

పుట్టపర్తి, మొవ్వ, గన్నవరం, గాజువాక, తిరుపతి కోర్టుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ఐదు అసిస్టెంట్ పీపీ పోస్టుల మంజూరు.

- సీపీఐ (మావోయిస్టు), దాని ఫ్రంట్ సంస్థలు అయిన రాడికల్ యూత్‌లీగ్, రైతుకూలీ సంఘం (గ్రామీణ పేదల సంఘం), రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, సింగరేణి కార్మిక సమాఖ్య, విప్లవ కార్మికసమాఖ్య, ఆలిండియా రివల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్, రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఆర్‌డీఎఫ్)పై నిషేధం మరో ఏడాది పొడిగింపు.